# బిడ్డల శిక్షణ

చలం

దేశి ప్రచురణ

IPLA123B175

# బిడ్డల శిక్షణ

చలం

*

దేశి కవితా మండలి
విజయవాడ - 2

A

దేశీ ప్రచురణ
ద్వితీయ ముద్రణ
ఫిబ్రవరి — 1958
రెండు రూపాయలు
దేశీప్రెస్, విజయవాడ.



సంపాదకులు:

బొందలపాటి శకుంతలాదేవి

శివరామకృష్ణ

B

# విషయసూచిక:

—:o:—

తలిదండ్రులు
శరీరం
ఏడుపు
అలవాట్లు
శిక్ష
ఆట
పెద్దవాళ్ళు
సేవా - ఆర్డరా
భయం
నీతి
వ్యక్తిత్వం
స్వార్థం
అబద్ధం
సానుభూతి
విద్య
సృష్టిజ్ఞానం
పసిపిల్ల
ఆఖరిమాట
దొంగలున్నారు జాగ్రత్త
పెళ్ళిముస్తాబు
పుట్టినపండుగ
వినాయకచవితి
డబ్బు

c

చలం రచనలన్నీ
పదునాలుగు సంపుటాలలో
సంపుటి : 5 రాపాయలు

D

# మొదటి మాటలు

ఈ పుస్తకంలో వ్రాసిన యీనూతన విధానంలో చాలాభాగము నేను కనిపెట్టిందికాదు. ఎన్నేళ్ళో శ్రమపడి యెందరెందరో మహామహులు ఆచరణలో పెట్టి నిర్ధారణచేసిన పద్ధతుతుల్ని నేను చదివి, వాటి శ్రేష్టత్వాన్ని గ్రహించి, నాకు వీలైనంత వరకు ఆచరణలో పెట్టి, అనుభవానికి తెచ్చుకున్నాను. నేను పూర్తిగ ఈ పద్ధతుల్ని అనుష్టానములో పెట్టలేక పోయినాను. దానికి పరిస్థితులు చాలవరకు కారణము. కాని ఈ పద్ధతులు వుత్త 'థియరీ' కావనిన్నీ సంపూర్ణంగా ప్రత్యక్షరమూ, ఆచరణలో 'పెట్టడానికి వీలు వుందనిన్నీ యీ పద్ధతులవల్ల పిల్లలు పూర్వము కన్న చాలా బుద్ధిమంతులూ, ఆనందవంతులూ, కాగలరనిన్నీ నా అనుభవంవల్ల తెలుసుకున్నాను.

దీనిలో వ్రాసిన పద్ధతులకు కారణాలు వ్రాయాలంటే చాలా శాస్త్రం వ్రాయవలసి వుంటుంది. చాలామందికి దాంట్లో అభిలాష వుండదని నేను ఆ ప్రయత్నం చెయ్యలేదు.

ఈ పుస్తకంలో చెప్పినవి, సాధారణ (జనరల్) పద్ధతులు. మార్గంలో పెట్టడానికి సూచనలు. ప్రత్యేకంగా ప్రతిశిశువునుపట్టీ పరిస్థితులను పట్టీ యెప్పటి కప్పుడు, యెవరికివారు యోచించుకొని మార్పులను చేసుకోవాలి.

మనుష్య స్వభావాన్ని అభివృద్ధి పరిచేందుకు బాల్యమొక్కటే తగిన వయస్సు. అప్పుడు గనుక బిడ్డను తగిన శిక్షణలో వుంచితే ఆ బిడ్డ పెద్దదైనప్పుడు, యిప్పుడు ప్రజలకు వుండేమూఢత్వమూ, భయమూ, గలిగి వుండక, వున్నతురాలవుతుంది. ఆ నైసర్గిక స్వభావౌన్నత్యాన్ని బిడ్డలకు యివ్వగలిగితే, యింక చట్టాలవల్లా సంస్కారంవల్లా బోధన వల్లా, కలిగించడానికి ప్రయత్నించే మార్పులు, యేశ్రమా లేకుండానే ప్రజలలో తటస్థిస్తాయి.

వారు స్వంతంగా జీవనభారం సమర్థించుకునే శక్తి కలిగిందాకా, పిల్లలకు తలిదండ్రులు చేసే సహాయం శిక్షణ. జంతువుల్లో, పక్షుల్లోకూడా శత్రువుల నించి తప్పించుకోడమూ, యెగిరి ఆహారం సంపాయించు కోడమూ మొదలయినవాటి విషయమై శిక్షణ కొంతవరకూ వుంటుంది. పొట్టపోసుకోవడం మాత్రమే అయితే మనుష్యులు తమ పిల్లలకైనా యెక్కువ శ్రద్ధతీసుకోనక్కర్లేదు. కాని రానురాను లోకం చాలా విషయాల్లో 'కాంప్లెక్సు' అవుతోంది. చక్కగా తెలివిగా, యెదిగి వృద్ధి పొందాలంటే, పిల్లలకి చాలా శ్రద్ధతో యిచ్చిన జ్ఞాన సంపన్నమైన శిక్షణ అవసరము. అందువల్లనే సృష్టి, సంఘము, మనుషుల్లో పిల్లలను చాలా కాలం పెద్దవారిమీద ఆధార పడేట్టు యేర్పాటు చేశాయి. గుర్రపు పిల్ల తల్లిమీద ఆర్నెల్లుఆధారపడితే మనుషుల్లో తల్లిమీద పిల్ల యిరవై ఏళ్ళాధార పడుతోంది. లోకమింత విషమ సమస్యా భూయిష్టం కాకముందు, పిల్లలు చిన్న వయసులోనే స్వతంత్రులయ్యేవారు. పదహారేళ్ళకు రాజ్యాలేలే వారు. కాని యిప్పుడు లోకం మారిన కొద్దీ వయసులో ఆలస్యమైతేనే గాని, సమర్థులు గావటంలేదు. చేతులకి బలం రాగనే వ్యవసాయానికై రైతు కొడుకు తయారవుతాడు. ప్లీడరుకొడుకు యిరవైయేళ్ళు దాటితేనే గాని ప్లీడరీ చెయ్యలేడు. ఇప్పటి పరిస్థితుల ప్రకారం పట్టణాల్లో ధనార్జనకూ, జీవయాత్రలో విజయానికీ, కుయుక్తులూ, వక్రవర్తనలూ, అవసరం. పరిస్థితులకు అనుకూలంగా మారని ప్రిన్సిపుల్సు పిల్లకుచిన్నప్పుడే నేర్పడంవల్ల, జీవితంలో ఫెయిల్ అయిన కుర్రవాళ్ళు అనేకమంది వున్నారు. కనుక లోకపు అవసరాల్ని గుర్తెరిగి, దేనికోసం తమ కుర్రాళ్ళని తయారు చెయ్యబోతున్నారో ముందే నిర్ణయించు కోవాలి. ధనమూ మర్యాద ఆర్జించి సుఖపడేందుకా, సద్గుణాలు, ఆశయాలు పెట్టుకొని పోరాడేందుకా, రసికుడు కావడానికా, యీ విషమ ద్వంద్వాన్ని సమన్వయం చేసే మార్గముందా, అని.

సరయిన శిక్షణ యివ్వాలంటే శిశువుపుట్టగానే శిక్షణ మొదలు పెట్టాలి. ఆలస్యంగా మొదలుపెట్టినకొద్దీ కష్టమౌతుంది. పుట్టిన నిమిషం నించీ శిశువులోఅభ్యాసా లేర్పడతాయి. సరైన అభ్యాసా లివ్వకపోతే దురభ్యాసా లలవాటవుతాయి. కాని అభ్యాసాలు లేకుండా మాత్రం బిడ్డ

వుండదు. బిడ్డకు రెండున్నర సంవత్సరాల యీడు వొచ్చిందాకా జాగ్రతగా శిక్షణ యిచ్చారంటే యింక స్థిరంగా జీవితమంతా వుపయోగ పడగల ప్రవర్తన యిచ్చారన్నమాటే. కాని మొదటి మూడు సంవత్సరాలు వృథా చేశారా యింక వారి పని చాల కష్టమౌతుంది. అప్పటికీ కొంత ప్రయత్నం చెయ్యవచ్చును. కాని యేశిక్షణయినా ఆరేళ్ళ లోపునేగాని పైన లాభంలేదు. మొదటి శిశువును సరైన శిక్షణలో పెడితే తరవాత పుట్టే శిశువు విషయమై కష్టపడ నక్కర్లేదు. మొదటి శిశువుకు శిక్షణలేకుండా చేశారా తరవాత శిశువుల శిక్షణ కష్టమౌతుంది. దీనికి చిన్నపిల్లలు పెద్ద పిల్లల్ని అనుకరించే గుణమే కారణము.

ఈ పద్ధతుల్ని ఆచరణలో పెట్టడం సులభంకాదు. ఈపుస్తకం చదువుతో వుంటేనే అర్థమౌతుంది. తలిదండ్రు లెంత శ్రమపడాలో, అంత శ్రమ పుచ్చుకొనేవారు అరుదు. రోగంవచ్చిన తరువాత మందుపుచ్చుకునే వారేకాని, రాకండా జాగ్రత పుచ్చుకొనే వారు కొద్ది. అట్లానే బిడ్డఅల్లరి దైన తరవాత, ఆబిడ్డ అల్లరివల్ల బాధపడి దండనవల్ల అణచటానికి ప్రయత్నించి, బిడ్డకీ తమకీ శ్రమ కలగజేసు కుంటారుగాని ఎంతిచెప్పినా ముందుఅల్లరి స్వభావం బిడ్డకి కలగకుండా జాగ్రత పడరు.

ఈ విధంగా శిక్షణ పొందిన పిల్లవాడు తలిదండ్రులకు కలిగించే శ్రమకంటె, యీశిక్షణకోసం పెద్దవారు పడవలసిన శ్రమచాల తక్కువ. అదిగాక అశ్రమవల్ల పెద్దవారికి బాధ। యీ పిల్లలు శ్రమపడితే పెద్ద వాళ్ళు యిచ్చే శిక్షణవల్ల పిల్లలకి బాధ. మొదటనే ప్రయత్నించి కొంత కాలం యీ పద్ధతిని ఆచరణలో పెడితే తరవాత ఆశ్రమలన్నీ వుండవు.

"పిల్లలికి శిక్షణ యివ్వాలి. వాళ్ళ పురోభివృద్ధి బాధ్యత మనది. దానికోసం ముందు మనం శిక్షణని నేర్చుకోవాలి" అని తెలుసుకోవాలి పెద్దవారు. తమకు యెట్లాతోస్తే ఆవిధంగా చెయ్యడం యిప్పుడు జరుగు తున్న పని. పిల్లని కనడం చాతకావడంచాత పెంచడంకూడా చాతనయిం దనే ప్రజల ఉద్దేశ్యం. లాయరు కావడానికి, డాక్టరు కావడానికీ కష్టపడి చదువుతారు. నేర్చుకుంటారు. కాని శిశువు నిర్మలాంతఃకరణం మీ[illegible] అధికారం చలాయించడానికి అందరూ పెద్దవే. దిక్కులేలిన ఒక పి[illegible] తమ అధికారంకింద దొరికిందికదా అని, దానిమీద ఆజ్ఞలుపెట్టి. తిని,

సకల బాధలూ పెట్టే తలిదండ్రుల నేకులున్నారు. తమకోపాలు, ద్వేషాలు, లోభాలు పిల్లమీద చూపుతారు అనేకులు.

రెండోది బిడ్డల చేష్టల్ని నిదానించి, పరీక్షించి వారి కేవిధమైన శిక్షణ మంచిదో, యెప్పటి కిప్పుడు నిర్ణయించుకుంటూ వుండాలి.

మూడోది, బిడ్డపైని ప్రేమకలిగి వుండాలి. ప్రేమ ప్రయత్నిస్తే వచ్చేది కాదు. కాని మొత్తానికి మనకన్న, మనసౌఖ్యాలకన్న, బిడ్డనీ, బిడ్డ అభివృద్ధినీ, యెక్కువ చూసుకోవాలి. సాధారణంగా తలి దండ్రులకి బిడ్డలమీద ప్రేమకన్న, సెన్టిమెన్టు యెక్కువ. క్రమమైన శిక్షణకు సెంటి మెంటు ముఖ్యవిరోధి. "వీరు మనపిల్లలే, వీళ్ళకిది చెయ్యాలి, అది చెయ్యాలి, మనం యీమాత్రం చెయ్యకపోతే లోకమేమంటుంది?" అను కుంటారు. తల్లివిధి ఇది కదా. తండ్రివిధి ఇదికదా అని పనులు చేస్తారు. ఆలోచనా, హేతువాదమూ, వివేకమూ, అన్నిటినీ 'సెంటిమెంటు' మింగి గుడ్డిగా పనులు చేయిస్తుంది. కనుక సెంటిమెంటుని చంపుకొని నిజమైన ప్రేమను చాతనైతే అభివృద్ధి చేసుకోవాలి.

కాని మంచి శిక్షణకు వుత్తమ ప్రేమ మాత్రమే చాలదు. ఆ ప్రేమను క్రమమైనమార్గాల వుపయోగించి, బిడ్డక్షేమానికై ప్రయత్నించేది జ్ఞానము. బిడ్డ ఏడ్చినప్పుడల్లా పాలిమ్మంటుంది ప్రేమ. అది అనారోగ్య మంటుంది జ్ఞానము. ఈ జ్ఞానానికి చోటు లేకుండా చేసి తరి మేస్తుంది సెంటిమెంటు. కాని వాస్తవమైన ప్రేమవుంటే, జ్ఞానానికి స్థలముంటుంది. ప్రేమలేకుండా వుత్త జ్ఞానమున్నాచాలను, అప్పుడు యిల్లుహాస్టలు లాగుం టుంది. కాని ప్రేమకన్నా జ్ఞానమే ముఖ్యం. రెండూకలిసి వుండటం అంతకన్నా ముఖ్యం.

ఈ శిక్షణా విధానాన్ని ప్రవేశ పెటాలంటే, పూర్వాచరణంలో వున్న అనేక ఆచారాల్ని వొదులుకోవాలి. శిశువూ, దాని పురోభివృద్ధి మన ఆచారాలకన్న మన సెంటిమెంటుల్సకన్న అధికమని నమ్మి, ఏ యాచారాలు ఆటంకమని తోస్తాయో వాటిని వొదిలి తీరాలి. నవీన శాస్త్ర జ్ఞానమే ప్రాముఖ్యంగా విశ్వసించకపోతే, యీ శిక్షణా విధానాన్ని అను ష్ఠించడంలో అర్థమేలేదు.

V

# తలితండ్రులు

బిడ్డే కలగడం, తల్లికీ, తండ్రికీ ఆత్మాభివృద్ధికి అవసరమని తోచినప్పుడే బిడ్డని పోషించడానికి, బిడ్డకి తగిన శిక్షణ నివ్వడానికి సరైన పరిస్థితులు వున్నప్పుడే, బిడ్డని సృజించుకోవాలి. గుడ్డిగా, అప్రయత్నంగా, తమ వుద్దేశ్యమూ వాళ్ళూ తెలీక, బిడ్డల్ని కని, తమనీ వాళ్ళనీ యీశ్వరుణ్ణీ కర్మనీ తిట్టుకునే స్థితిలో పడడం, బిడ్డని చంపడంకన్న ఘోరమైన కార్యం. వరసగా అంగవికలుల్నీ, పిచ్చివారినీ, రోగిష్టుల్నీ, పుట్టగానే నరకబాధ పడి చచ్చే పిల్లల్ని కంటో, చూస్తో, ఇంకా అజ్ఞానంలో, కీటకాలకన్న హీనంగా పిల్లల్ని పెంచుతో, ఈశ్వరుణ్ణి నిందించే భక్తులూ, పతివ్రతలూ, పూజ్యమాతలూ, వేలకు వేలున్నారు.

చిన్నపిల్లలకు సరైన శిక్షణ యివ్వగలిగిన తలితండ్రులు ఎప్పుడూ సంతోషంగా, దయగా, ఓర్పుగా వుండాలి. అనారోగ్యవంతులు యీ గుణాల్ని కలిగివుండరు. కనక చిరకాలము జబ్బుగా వుండేవారు పిల్లల శిక్షణ బాధ్యత తీసుకోకూడదు.

పుట్టినది మొదలు బిడ్డని యింటికంతకూ ముఖ్యమైన దానివలె, అందరూ దాని సేవకూ, పురోవృద్ధికి జీవిస్తున్నట్టు భావించుకోవడం విధి. బిడ్డ పుట్టగానే తలితండ్రుల జీవితానికి సాఫల్యం కలిగింది. వారి జీవితాలకు అర్థం, బిడ్డని అభివృద్ధిలోకి తీసుకురావడంలో లీనమైపోయింది. కనక వారి శక్తి బిడ్డకోసమే ముఖ్యంగా వినియోగపరచవలసిన ఆవశ్యకత కలుగుతుంది.

పిల్లలు అల్లరి చేసినప్పుడు, విసిగించినప్పుడు, వారిని పెద్దవారు శిక్షించేటప్పుడు, యెప్పుడూ దయగా ఆనందం కనపరచాలి. తీరుబడి

చేసుకుని వారి సంగతి శ్రద్ధగా కనుక్కోవాలి. వాళ్ళ ఆటలూ, ఆలోచనలూ గమనించాలి. వాళ్ళు పలకరించినప్పుడు, ప్రశ్న లడిగినప్పుడు, అల్లరి చేసినప్పుడు శ్రద్ధగా వాళ్ళ అభిప్రాయాలూ, కష్టాలూ, అన్నీ విచారించేందుకు తీరుబడి కలగచేసుకోవాలి. కథలు చెప్పాలి, వాళ్ళతో ఆడుకోవాలి, అనేక విషయాలు తెలియచెయ్యాలి, అలవాట్లు నేర్పాలి, దిద్దాలి. వాళ్ళ విషయం అవసరమైనప్పుడు, అవతల పని యెంత తొందరైనా, మానెయ్యాలి. ఏమన్నా కావాలని అడిగినా, ప్రశ్న లడిగినా, వెంటనే ప్రత్యుత్తర మియ్యాలి. కనక తీరుబడిలేని తలిదండ్రులు, బిడ్డల్ని కనకూడదు.

బిడ్డకి శిక్షణ నియ్యడం ప్రారంభించక పూర్వమే తమ అహంభావాన్ని, తమ ఆధిక్యతని, ఆత్మసుఖాన్ని, అభిమానాన్ని, త్యజించడం మొదటిపని. బిడ్డకోసం అవసరమయిందా, తలిదండ్రులు త్యజించలేని విషయం వుండకూడదు.

ఇంతకాలమూ బిడ్డలు తలిదండ్రులకై త్యజించడం బోధించారు. అది అక్రమమనీ, బిడ్డలు పెద్దవారికై యేమీ త్యజించనక్కర్లేదనీ, పెద్దవారే బిడ్డకై త్యాగం చెయ్యవలసినది విధి అనీ నేను యీనాడు బోధిస్తున్నాను. ఇంత తిండిపెట్టి బొమ్మలు కొనియిచ్చి, బిడ్డల కెంతో సహాయం చేశామని పులికి సంతోషించేవారు పెద్దలు. అనవసరంగా బిడ్డకు హాని కలిగేటట్టు, ముద్దుచూపి, తాము బిడ్డకై సమస్తమూ అర్పించామని లోకమంతా చాటే వారుకొందరు. సర్వమూ బిడ్డకై, అవసరమైనప్పుడు, కాలము, ఆనందము ధనము, బలమూ, అన్నీ యిచ్చివెయ్యడం పెద్దవారి విధి. బాల్యంలో బిడ్డను మాడ్చి, యేడిపించి, ధనమంతా కూడబెట్టి పెద్దవాడైనాక బిడ్డకి ఆస్తిరూపాన యిచ్చే యీ వేనవేలు మూర్ఖులకి, 'మీరు మూర్ఖులు. ఇంత చదువుకున్నా హృదయమూ, తెలివిలేని మొద్దు'లని యెంత చెప్పినా అర్థంకాదు. ఎప్పటికో లోకం తమ అవివేకాన్ని గుర్తించడం ! ఇదంతా

బిడ్డ క్షేమమనే పేరుతో తమ స్వార్థాన్ని సమర్థించుకునే కపటం, అంతే. స్వార్థమంటే తమమీద తమకే అసహ్యం కలుగుతుంది గనక ఆత్మ గౌరవం నిలుపుకోడం కోసం అస్వార్థానికే పవిత్రమైన పేర్లుపెట్టి పేడ కుప్పమీద పట్టుబట్టలు కప్పి తమనీ లోకాన్నీ మోసపుచ్చుకుంటారు.

పిల్లలు తప్పుచేస్తే, పెద్దవారు తమకీ తమ అధికారానికీ ధిక్కారం జరిగినట్టు చూచుకోకూడదు. తండ్రిననీ, గొప్పవాడననీ, లోకమంతా తనని మర్యాద చేస్తున్నదనిన్నీ, మరిచిపోవాలి. పిల్ల దూషించినా, కొట్టినా తనను యితరులముందు అవమానం చేసినా, కోపం తెచ్చుకోకూడదు. తనకి జరిగిన అవమానం సంగతిగాక, పిల్లకి తటస్థించిన ఆ చెడ్డ ప్రవర్తనను గురించి చింతపడి, పిల్లకి స్నేహితులవలె ప్రవర్తించాలి. గొప్పగా భయంకరంగా, అధికారంగా వుండి హడలకొట్ట కూడదు వాళ్ళని. "ఆర్డర్" చెయ్యడమూ, 'చూసుకో నిన్నేం చేస్తానో!' అని వారిని గర్భశత్రువువలె చూడడమూ మంచిదికాదు. వాళ్ళు మంచిగా వుండేందుకై సహాయంచేసే మిత్రులులాగు వుండాలి. తమకేమీ తెలియకపోయినా, అన్నీ తెలిసినట్టూ, లోకానికి సర్వాధికారులైనట్టూ, యెన్నడూ తప్పు చెయ్యని యీశ్వరులమల్లేనూ కనబడక, సహజంగా దయగా వుండాలి. పిల్లల యెడల తాము తప్పుజేస్తే వారి క్షమాపణ అడగాలి.

పిల్లల్లో యే సద్గుణాలు కలగచెయ్యాలనుకుంటారో, ఆ గుణాల్ని పెద్దవారు తాము అలవరుచుకుని, అనుష్ఠించాలి. వారినించి యే చెడు గుణాల్ని మాన్పించాలని వుంటుందో, వాటిని తాము వర్జించాలి. వుత్త బోధనవల్లా, దెబ్బలవల్లా యేమీ లాభంలేదు.

పిల్లల గుణాలూ, అభిప్రాయాలూ, "చేష్టా" అభినివేశాలూ, యెటువంటివో తెలుసుకుని, వాటి ప్రకారం, వాటినే, అభివృద్ధి చేసేందుకు ప్రయత్నించి, వాటి ననుసరించి పెద్దవారు నడవాలి. అంతేకాని తమ

అభిప్రాయాల ప్రకారం పిల్లల స్వభావాలూ ఆశయాలూ యేర్పడాలని నిర్ణయించుకుని, వారి సహజ శక్తుల్ని గుర్తించక, కళ్ళు మూసుకుని, వారిని వొంపుతియ్యడానికి ప్రయత్నించకూడదు. వారి మృదు సహజ స్వభావాలకి యెదురుగా, అడ్డంగా, శిక్షణ నిస్తే, వారికున్న ఉత్తమశక్తులు ధ్వంసమవుతాయి.

బిడ్డమీద దానికోసమే దయగా వుండాలి. అవి బుద్ధిమంతురాలై నంతకాలమూ పెద్దవాళ్ళ ఆజ్ఞల్ని విన్నంతకాలమూ దానిపైన దయా ప్రేమా చూపి, అది తమమాట వినకపోతే దానిపైన ద్వేషం చూపుతారు. పిల్ల పెద్దవారి ఆజ్ఞానుబద్ధురా లెందుకు కావాలి? తన పురోవృద్ధికి. అంతే కాని పెద్దవారిని సంతోషపెట్టి, వారి అధికారపు చలాయింపులు పడేందుకు కాదు. కనక అది తిరగబడి చెడిపోతే విచారం కలగాలి, కాని కోపం రాకూడదు. అది దుర్మార్గురాలైనకొద్దీ, దానిమీద ప్రేమ యెక్కువ కావాలి.

కొందరు పెద్దవారు పిల్లల్ని తమ ఆటవొస్తువుల కింద చూసుకుంటారు. వాళ్ళచేత తమాషాలు చేయించుకోడమూ, బడాయిపడడమూ, లోకంముందు "ఎగ్జిబిట్" చెయ్యడమూ, చేస్తారు. వాళ్ళతో తమాషా మాటలు మాట్లాడతారు. అబద్ధాలూ బూతులూ పలికించుకుని, కొట్టించుకుని నవ్వుతారు. తప్పు.

కొందరు పిల్లలమీద నిష్కారణమైన దయ చూపుతారు. అది నిస్సహాయమై, కష్టంలో వున్నట్టూ, తాము దాన్ని కాపాడుతున్నట్టూ, అది పరిగెత్తకుండా, కాళ్ళూ, చేతులూ కదపకండా, లోకాన్ని చూడకండా, కట్టేసి దానికి పనులన్నీ చేసిపెట్టి, పాడుచేసుకుంటారు.

కొందరు తమ అభిప్రాయాల్ని, తమ కార్యాల్ని, తమ తదనంతరం లోకంలో వ్యాపింపచెయ్యడానికి సాధనా లనుకుంటారు పిల్లల్ని. తాము కోరి, తమ జీవితంలో దేన్ని సఫలం చేసుకోలేక పోయినారో,

ఆ ఆశయాన్ని తమ కొడుకన్నా అతనిజీవితంలో, రియలైట్ చేస్తే చూసి సంతోషించాలని ఆశపడతారు. కొందరు తామెటువంటివారో, అలాగే పిల్లలూ తయారుకావాలని ప్రయత్నం చేస్తారు. కొందరికి కొడుకులు ఉత్తరక్రియలు చేయడానికి, వృద్ధాప్యంలో పోషించడానికి కావాలి. అట్లానే తల్లులకి కూతుళ్లు, తాము మానిన వ్రతాలుచెయ్యడానికీ, సరదాలు తీర్చడానికీ.

కొందరికి పిల్లలంటే అసహ్యం. వారు పుట్టినందుకు కోపం. ముఖ్యంగా ఆడపిల్లలు. అలాంటివారు పిల్లల్ని కనకూడదు. అక్కర్లేక పోతే, పెంపకానికి యెవరికన్నా యివ్వాలి. అక్కర్లేని పిల్లల్ని కనడంకన్న భ్రూణహత్య నయం. పిల్లలు వారి వారి స్వభావాలప్రకారం, వారి యిష్టం వొచ్చిన స్థానం ఆక్రమించుకోవలసిన స్వతంత్ర జీవులనీ, వాళ్ళని పెద్ద వాళ్ళు తమ ఆశయాలకు ఉపయోగించుకో కూడదనీ తెలుసుకోవాలి.

ఈ శిక్షణా విధానం అమలులో పెట్టటానికి తండ్రు లెక్కువ సహాయ పడలేరు. ఇప్పటి సంఘపద్ధతి ప్రకారం మొగవాడు బైట ఆర్జించేవాడు. కనక అతనికి వ్యవధివుండదు. దాయీలి నెప్పుడుకూడా పిల్లల్ని పెంప డానికి వుపయోగించకూడదు. బాగా మంచి విద్యావాసనగలిగి, పిల్లల శిక్ష ణలో తర్ఫీదై, తను పిల్లల్ని కలిగివుండి, దయా, జ్ఞానమూ కల దాయీ యెక్కడోగానిదొరకదు. అట్లాంటివాళ్ళనైనా జాగ్రతగా తల్లులు పరీక్షించి కనిపెట్టేవుండాలి. ఎన్నడూ, వొక్కరోజుకూడా, తాము దగ్గిరలేకుండా, పూర్తిగా పిల్లల్ని నౌకర్ల చేతుల్లో వొదలకూడదు. నౌకరికి పిల్లపైన స్వతంత్ర మిచ్చారా, పిల్లలపాలిటి మృత్యుదేవత లైనారన్నమాట. ఈ నౌకర్లకన్న హానిచేసేవాళ్ళు— పిల్లల ప్రాణాలకి పెనుభూతాల, యిండ్లో వుండే ముసలిబంధువులు—తాత, అత్తా, నాయనమ్మా, అమ్మమ్మా మొద లైనవాళ్ళు- ముఖ్యం ముసలి ఆడవాళ్ళు. వాళ్ళ గాలి సోకిందా, వాళ్ళ

యింటో యే మూలనన్నా వున్నారా, యింక పిల్ల అభివృద్ధి నశించిందన్న మాటే. పాములనుంచీ, సింహాలనించీ, తప్పించినట్టే పిల్లల్ని యీ ముసలి వారినించి తప్పించాలి. బిడ్డ పుట్టకపూర్వమే వీరినందర్నీ, వారెంత మంచి వారైనా సరే, యింటోనించి తరిమెయ్యాలి. ఇంక బిడ్డ యెదుగుతున్నన్నాళ్ళూ, వాళ్ళని యింటో కాలుపెట్టనియ్యకూడదు.

ఈ శిక్షణ నివ్వడానికి వుత్తమురాలు తల్లి. కాని యీ దేశము యిప్పుడున్న స్థితిలో బిడ్డల గర్భశత్రువులు, మృత్యుదేవత లీ తల్లులు. వీళ్ళచేతుల్లో పిల్లల్ని వొదలడంకన్న, పుట్టగానే చంపడం మంచిది. యేమీ తెలీని జడులు, తెలుసుకోడం యిష్టంలేని, అర్థంచేసుకోడం చేత కాని మొద్దులు ప్రస్తుతపు తల్లులు. అనారోగ్యవంతుల్నీ, పశువుల్నీ, బానిసల్నీ, మూర్ఖుల్నీ, తయారుచేసి తరతరాలనుంచి యీ ప్రజల్ని అధమ స్థితిలోకి తోసిందీ, యింకా అనేకతరాలు యిట్లానే వుంచబొయ్యేదీ యీ తల్లులే. మీరు బాగుపడితేనేకాని ఈ మానవకోటికి గతిలేదు. మొదటి రెండు మూడేళ్ళూ యీ తల్లులచేతుల్లో గడిపిన తరవాత ఆ బిడ్డ యెంత గొప్ప పాఠశాలల్లో చదివినా, ఎంత గురువులవద్ద శుశ్రూషపొందినా, ఎంత జ్ఞానాన్ని సంపాయించుకున్నా యేమీ లాభంలేదు. పురుషుడు తన కామంకోసం స్త్రీలను కుక్కలవలె కట్టేసుకున్నాడు. స్త్రీ తన పిల్లల్ని అధములుగా పెంచి, కసితీర్చుకుంటోంది పురుషజాతిమీద.

ఏ విద్యా వాసనలేని పూర్వాచారపు స్త్రీలు యింకా నయం. వారికి ఇంకా (Instincts) 'ఇన్‌స్టింక్ట్సు' చావలేదు. బిడ్డమీద సహజమూ, ఆరోగ్యమూ, ఐన ప్రేమా, బిడ్డ అవసరము గుర్తించే సమర్థతా, సహనమూ, వుంటాయి.

ఈ స్త్రీల నభివృద్ధి చెయ్యడమూ, విద్యా, లోకజ్ఞానమూ, స్వేచ్ఛా యివ్వడమూ, కలలోని వార్త. పైకి బిగ్గిరిగా ఆ మాట లనకూడదు. మతమూ, సాంప్రదాయమూ అడ్డమొస్తాయి. కనక ఈ తల్లుల నించి

పిల్లల్ని తప్పించాలి. యీ తల్లులు బాగా జ్ఞానాన్ని సంపాయించినా, అందరూ పిల్లల్ని పెంచగలిగిన వోర్పునీ, వ్యవధినీ, ఆ పెంచే స్వభావాన్నీ, కలిగివుండరు. కనక అప్పుడూ అట్లాంటివారు పిల్లల్ని తమంతట తాము పెంచరు. కొందరికి వ్యవధివుండదు. ప్రేమ వుండదు. కొందరికి జ్ఞానముండదు. కొందరికి స్వభావ ముండదు. అటువంటివారు పిల్లల్ని కనకూడదు. కంటే కొందరు తల్లుల్ని ఆ విధమైన ఆసక్తి కలవారికి చక్కగా బాలశిక్షణ నేర్పే కాలేజీలలో తయారుచేసి వారిచేత "నర్సరీ" పాఠశాలల్ని పెట్టించి యీడాది నిండగానే పిల్లల్ని పగలంతా వాళ్ళకి పెంపకానికై ఇవ్వాలి శిక్షణకోసం.

తలితండ్రులమీద భక్తీ ప్రేమా పిల్లలకు కలిగేట్టు పెద్దవారు ప్రవర్తించవలసినదే గాని వూరికే బలవంతంచేస్తే వొచ్చేవికావు అవి. చిన్నతనంలో తండ్రులమీద కొంచెం భక్తి వుంటుంది. తల్లిమీద మొదటినుంచీ వుండదు. ఆ తల్లిని ఇంట్లో తిడుతో, ఆమెచేత వెంట చాకిరి చేయిస్తో అధమంగా చూచేవారే తల్లిని తిడుతో ఆమెపిల్లని తాము ముద్దుచేస్తో, ఆ తల్లిమీద పిల్లని భక్తికలిగి వుండమని, వుపన్యాసాలూ పద్యాలూ, చెపితే భక్తికలుగుతుందా? కుర్రవాళ్ళు ముందు తల్లుల్ని నీచంగా చూడడం నేర్చుకుంటారు. తరవాత తక్కిన స్త్రీలనీ, భార్యల్నీ అంత నీచంగానూ చూస్తారు. కొంచెం పెద్దవారుకాగానే, తండ్రి గొప్పతనము అబద్ధమనీ, అధికారం బూటకమనీ తెలుసుకొని తండ్రిమీది భక్తినీ మానుకుంటారు.

ఇదివరకంతా తనకి అంతరాత్మ వేరే లేకుండా భర్తఆజ్ఞే తన విధిగా భార్య యెట్లా లోబడిందో, ఆ విధంగానే పిల్లలుకూడా అంతరాత్మను వేరే లేకుండా, తండ్రి ఆజ్ఞనే పరమ ధర్మంగా వహించడం బోధించారు. తండ్రిఆజ్ఞ అనే పేరుతో పిల్లలు సమస్త ఘోరకార్యాలూ, పాపాలూ, దోషాలూ, విప్లవాలూ, చేసినందుకై పురాణాలు వారిని పొగిడి,

వారికి మహిమలూ, అవతారాలూ, పుణ్యలోకాలూ, ప్రసాదించారు. తండ్రిఆజ్ఞలనే మహానరకాన్నించి పిల్లల్ని తప్పించి, స్వబుద్ధిని ఉపయోగించే శక్తి అభివృద్ధిచేస్తేగాని లోకం బాగుండదు. ఇప్పుడు జరిగే దేమిటంటే, చిన్నతనంలో తండ్రిఆజ్ఞలమీది గౌరవంచేత స్వబుద్ధిని వికసింపచేసుకోక, ధర్మాచరణంలో, నీతిగ్రహణ శక్తిలో, తాత లెట్లాఉన్నారో, ఆ స్థితిలోనే వుంటున్నారు. కాని కొంచెం పెద్దవారుకాగానే, తమ స్వార్థంకోసం ప్రజలు తండ్రులతో ధనముకోసమూ, ఆస్తికోసమూ, తగూలాడి, వారిని వినరాని తిట్లు తిట్టుతోనూ వున్నారు. కాని తండ్రుల్ని బూతులు తిట్టిన మహానుభావులే తండ్రులకి విధేయులుగా వుండనక్కర్లేదని ఇట్లా బోధిస్తే నేను విప్లవంబోధిస్తున్నానని నన్ను దూషిస్తారు, ఎందుకు? తమ పిల్లలు తమని ఎదిరిస్తారని. ఇట్లాంటి తండ్రుల్ని ఎట్లానూ దూషిస్తారు పిల్లలు, నేను వేరే బోధించాలా? వాళ్ళకి కళ్ళులేవూ?

ముఖ్యంగా తలిదండ్రులు కోరేది పిల్లల ప్రేమ. యీ ప్రేమని గురించి పురాణాలనిండా వుపన్యాసాలూ, కథలూ, బోధనలూ, వున్నాయి. పిల్లలు ప్రేమ చూపటంలేదని ప్రతి కుటుంబములోనూ యేడుపులూ వున్నాయి. పిల్లలకు ప్రేమకలిగేటట్లు ప్రవర్తించడం పెద్దవారి విధిగాని, ప్రేమించడం పిల్లల విధి కాదు. ఎందుకంటే, ప్రేమ బలవంతం చేసుకుంటే వొచ్చేదికాదు. ప్రేమించగల వుదార స్వభావాన్ని మనము పిల్లలలో వృద్ధిచెయ్యగలము, అంతే.

తా మిచ్చే తిండికీ, గుడ్డకీ, జాగ్రతకీ, కష్టానికీ, చూపే ప్రేమకీ యెదురు జీతం, ప్రతిఫలం, పిల్లలనుంచి ప్రేమ అంటారు, కాని తలిదండ్రులు యివన్నీ తమకోసం చేస్తున్నారనే సంగతి తెలుసుకునే స్థితిలో పిల్లలు వుండరు. దయ గల తలిదండ్రులు పిల్లలకి రోజూ తాము చేసే వుపకారాన్ని గురించి చెవుల్లో నూరిపోస్తూన్నా, వారు ప్రయత్నించి

ప్రేమను తెచ్చుకోరు. లేక వాళ్ళ మనసు అంత అభివృద్ధి చెందివుండదు. తాము ప్రేమించకపోవడంవల్ల తలిదండ్రులకి కలిగే బాధని పిల్లలు గుర్తించలేరు. తాము చిన్నప్పుడు యెట్లా తలిదండ్రుల్ని ప్రేమించలేదో, వాళ్ల కష్టాలు గుర్తించడం తమ కెంత అసాధ్యమయిందో, పెద్దవాళ్ళు జ్ఞాపకం తెచ్చుకుని, తమ పిల్లల మనసుకూడా అట్లాగేనని అర్థంచేసుకోవాలి.

అదిగాక చాలామంది తండ్రులు పిల్లల జాగ్రత తీసుకుంటారు. కాని వారిపైన ప్రేమ చూపరు. ప్రేమంటే రోజుకు పదిసార్లు ముద్దులాడడం కాదు. పిల్లలు కాంతినీ, ఆకాశాన్ని యెట్లా అనుభవించి ఆనందిస్తారో, అట్లానే పెద్దవారి జాగర్తనూ, దయనూ అనుభవిస్తారు. కొంచెం యెదిగి అర్థమయింతరవాత కృతజ్ఞత చూపుతారు. అంతే. పిల్లలుమాత్రం వాళ్ళతో ఆడుకుని, వాళ్ళ బాధలు తీర్చి, వాళ్ళతో పాటలుపాడి, కథలు చెప్పేవాళ్ళని ప్రేమిస్తారు. కనక పిల్లల ప్రేమ పొందాలంటే తలితండ్రులు వాళ్ళని సంతోషపెట్టే స్నేహితులుగా కావాలి. శిక్షణా, పిల్లల అభివృద్ధీ, అని పేరుపెట్టి పిల్లల్ని కొట్టి, తిట్టి, నీతి వుపన్యాసాలిచ్చి, బాధిస్తోవుంటే, యీ తలితండ్రుల నెవరు ప్రేమిస్తారు? లోపల యెంత ప్రేమ వున్నా, బైటికి వొచ్చేవిమాత్రం, దెబ్బలూ, తిట్లూ; యిష్టం వొచ్చినప్పుడు వూపిరాడని ముద్దులూ ఐతే పిల్లలనించి ప్రేమ యెట్లా వొస్తుంది?

ఇంటికి వొచ్చిన అత్తలమీద, మామలమీద, పినతండ్రులమీద చాలా ప్రేమ చూపుతారు పిల్లలు. యెందుకు? వాళ్ళు కొత్తగనక. తలితండ్రులవలె వాళ్ళు కొట్టరు. కథలతో, పాటలతో, ఆటలతో, పిల్లల్ని సంతోషపెడతారు; మిఠాయిలు కొని యిస్తారు గనుక. అన్నమూ బట్టలూ యిచ్చే తమపైనకంటే, వారిమీదే ప్రేమ చూపుతారే అని తలితండ్రులకి ఆశ్చర్యం. బిడ్డలప్రేమ సంపాయించాలంటే, మార్గమదే!

పెద్దవాళ్లు యెంత దయగావున్నా, బిడ్డప్రేమ చూపకపోతే, అది వాక లోప మనుకోకూడదు.

దాని హృదయం కఠినమూ కాదు, అది దుర్మార్గురాలు కాదు. సాధారణంగా అది తల్లితండ్రుల లోపమే, దాందికాదు. బిడ్డదగ్గిర్నించి ప్రేమ రాకపోతే, తలిదండ్రులు బాధపడతారు. కాని తాము తమ ధర్మాజ్ఞ నెరవేర్చి దానితోనే సంతుష్టిపడడం నేర్చుకోవాలి. పిల్లనిమాత్రం కృతజ్ఞత లేదని, నిందించకూడదు, నిర్బంధించకూడదు.

బాల్యంలో పెద్దవారి యెడల ప్రేమ చూపే పిల్లలు సహితం పదేళ్లు దాటగానే తలితండ్రుల నించి దూరమౌతారు. అది యేమీ దుర్గుణంగా తలచకూడదు. ఆ వయస్సు కది సహజమే.

పిల్లలదగ్గిర్నించి వుత్త ప్రేమ చాలదు యీ తలితండ్రులకి. ప్రేమకి సూచకంగా వారు చెప్పిన మాటల్లా పిల్లలు వినడం కావాలి. అదృష్టవశాత్తూ, పెద్దవారి మాటలు యెదిరించి స్వబుద్ధితో ప్రవర్తించడం పిల్లల స్వభావంలోనే వుందిగాని, అందరు పిల్లలూ తలితండ్రుల ఆజ్ఞల్ని జవదాటకుండా నడుచుకుంటే, అంత నరకంతో సమానమైన ప్రపంచం యింకోటి వుండదు. అభివృద్ధి, మేధాశక్తి అన్నీ నశించి, చిన్నవాళ్ళందరూ, బానిసలూ, అప్రయోజకులూ, ముసలితొక్కులుగా తయారౌతారు. తలితండ్రుల మాట వినడం సుగుణంగా పరిగణించడం పోయి, అదో దుర్గుణంగా చూశేట్టు మారాలి. లోకం బాగుపడాలంటే అదో సుగుణమని బోధించకూడదు. తమకు ధర్మమేదో, న్యాయమేదో, అది ఆచరించాలిగాని, తలితండ్రు లేది చెపితే అది చెయ్యమనడం మూర్ఖం. పిల్లవాడికి స్వబుద్ధి అంకురించి, మంచి చెడ్డ తెలియనంతవరకు, దారి చూపవలసిందే కాని, తరవాత అతని యిష్టాని కతన్ని వదలాలి. తలితండ్రుల మీద అతను ఆధారపడచూచినా, వాళ్ళు వొప్పుకోకూడదు. స్వతంత్ర బుద్ధి పిల్లలకు చాలా విషయాల్లో ఏదో యేడుకి పూర్తి అవుతుంది.

ప్రేమ వున్నా లేకపోయినా పెద్దవారియెడల పిల్లలకు మర్యాద నేర్పాలి. మర్యాద ఒక అలవాటు. అలవాటు నేర్పడం పెద్దవారి విధి, అంతే.

బిడ్డకి తిండి బెట్టి, బట్ట యిచ్చి కాపాడినందుకు పెద్దవారి మాట విని, వారి అభిప్రాయాలనే కలిగి, వారికి సేవచెయ్యాలని పెద్దవారి అభిప్రాయం. చిన్నప్పుడు వింటే చాలదు. తాము కాపాడడం మాని, ఆ బిడ్డే పెద్దవాడై - తమని కాపాడేటప్పుడుకూడా తమ మాట ప్రకారమే నడుచుకోవాలంటారు. తలితండ్రులమీద భక్తి యెన్నటికీ వదలకూడదనీ, వారే ఈ భూలోక దైవాలనీ విధింవారు. ఈ భక్తి తల్లితండ్రుల దగ్గిర ఆగక అత్తలకూ, అన్నలకూ, తాతలకూ, సమస్తమైన పెద్దవారికీకూడా ప్రవర్తింపచేశారు. వయసులో పెద్దవాడైనంతమాత్రాన బిడ్డకు ఆజ్ఞలు పెట్టేవాడైనాడు. పెద్దలమాట యెందుకు బిడ్డ వినాలని అడిగితే, శాస్త్రాల్లోకి వెళుతుంది వాదన. అన్నా, వదినా, అత్తా యెందుకు పూజ్యులంటే, పెద్దవారు గనుక. ఏనుగూ, మర్రిచెట్టూకూడా పెద్దతనాలవల్ల పూజ్యులేనా?

ఇంక తలితండ్రుల సంగతి. ఇక్కడ కృతజ్ఞత అనే గొప్ప కారణం వొకటి చూపిస్తారు. తనని కనమని బిడ్డ తలితండ్రుల్ని బతిమాల లేదు. వారి కామం వారు ఆపుకోలేక - బిడ్డ పుడుతుందనే జ్ఞానమన్నా లేక, కని, "అమ్మా నిన్ను కష్టపడి తొమ్మిది నెలలు మోసి బాధపడి కన్నానే! అందుకని కృతజ్ఞతకలిగి నా మాట వినవే. నీ యిష్టాన్ని చంపుకోవే" అంటుంది తల్లి. తండ్రీ అంతే. ఆ రెండునిమిషాల ప్రజ్ఞకీ, తొమ్మిదినెలలు మొయ్యక యెట్లా తప్పుతుంది? బిడ్డకోసం మోసిందా? "ఈ పాడు కడుపొకటి వొచ్చిం"దని తిట్టుకుంటోనే వుంటుంది.

బిడ్డని కన్నతరవాత పాలుపోస్తారు. తిండి పెడతారు. రోగాలొస్తే విసుకు రానంతవరకు సేవ చేస్తారు, తిట్టుకుంటో. ఎవరికోసం చేస్తారు?

బిడ్డని యీ లోకంలోకి రప్పించినవారు సేవ చెయ్యవద్దూ? తమ విధిని తాము నిర్వర్తించుకున్నందుకు కృతజ్ఞత యెందుకు? బిడ్డకు కృతజ్ఞత సహజంగా కలిగి తలితండ్రుల యెడల ప్రేమచూపితే సరే! కాని పెద్దవారు మాత్రం బిడ్డని కృతజ్ఞత చూపమనడం అన్యాయం, అనవసరం. చూపక పోతే తిట్టడం యీడవడం, మూర్ఖం.

తలితండ్రులమీది భక్తి, యేమాత్రమూ వుండకూడదు, బిడ్డకు. నవజీవనానికి చిన్నమైె లోకానికి యికముందు తోడ్పడబోయే బిడ్డ యెడల పెద్దవారు అతిభక్తిని చూపాలి. నూతన జ్ఞానాన్ని, శక్తినీ సంపాయించి బిడ్డ అభివృద్ధికి తోడ్పడేందుకు ప్రయత్నించాలి.

ఈ తలితండ్రులయెడల భక్తి అనేది పూర్వాచారంమీది భక్తికి మూలం. తలితండ్రులు పాతయుగంవారు, తాతలూ, నాయనమ్మలూ అంతకంటే. కనక వారిని వెనక వొదిలి బిడ్డ ముందుకి చూడాలి. వాళ్ళ అభిప్రాయాలూ, అనుభవాలూ, అన్నీ పూర్వకాలానికి చెందినవి. కనక ముఖ్యంగా వర్జించాలి. అట్లానే తక్కినపెద్దవారన్నా. వారి అభిప్రాయాల్ని, ఆజ్ఞల్ని, అన్నిటినీ ధిక్కరించి, తన స్వంతయోచనలను బిడ్డ అభివృద్ధి చేసుకోవాలి. ఈ పెద్దలమీది భక్తివల్లనే పూర్వశాస్త్రాలన్నా, చీకిన తాటాకులన్నా, పసుపుగుడ్డలన్నా, గడ్డమున్న బైరాగి దొంగలన్నా, ప్రజలకి తెలివిలేని భక్తి కలుగుతోంది. చిన్నతనంనించి అన్ని పూర్వ వాసనలకీ తిరగబడడం బిడ్డకి నేర్పి, యెంత త్వరలో వీలైతే అంత త్వరలో తాము బిడ్డదోవకి అడ్డంగా నిలవక తప్పుకోవడం మంచిది.

ఇట్లా తలితండ్రులు తెలిసీ తెలీకా మూర్ఖంగా పిల్లల్ని బాధలు పెట్టడమూ, గారాబాలు చెయ్యడం, లెఖ్కలేకండా వొదిలెయ్యడం - ఇంక ముందు చెయ్యడానికి వీల్లేదు. బిడ్డల మనోశాస్త్రంలో ఉత్తీర్ణులూ, గొప్ప తల్లులూ, బిడ్డల పాఠశాలలో గొప్ప ఉపాధ్యాయినులూ కలిసి, బిడ్డల్ని ఎట్లా పెంచాలో, కొన్ని సామాన్య నిబంధనలను విధించాలి. వాటి

ప్రికారం నడుచుకునేట్టు ప్రతికుటుంబాన్నీ బలవంతం చెయ్యాలి, ప్రభుత్వం. ఆ విధంగా పెంచడానికి వీలులేని పరిస్థితులున్న కుటుంబాల నించి పిల్లల్ని ప్రభుత్వం తీసుకోవాలి. గర్భిణికాగానే స్త్రీ, అంతకుముందే బిడ్డల్ని జాగ్రత్తతీసుకునే శాస్త్రంలో ఉత్తీర్ణురాలు కాకపోతే, వెంటనే ఆ విషయాలలో తర్ఫీదు కావాలి.

ఇదంతా నేను ఏదో దేశాలు అభ్యున్నతిపొందే ఉద్దేశ్యంతో కాదు వ్రాస్తోంది. నాకు ముఖ్యమయింది బిడ్డ సుఖపడాలి. బిడ్డ కళ్ళనుంచి నీరు రాకూడదు.

# శరీరం

శిశువుకి అన్నిటికన్నా ముఖ్యం శరీరారోగ్యం. ఆస్తికన్న, ధనంకన్న, విద్యకన్న, నీతికన్న, అన్నిటికన్న, ముఖ్యంగా తలితండ్రులు బిడ్డ కియ్యవలసింది ఆరోగ్యం. దీనికోసం ముందు తాము ఆరోగ్యవంతులై వుండాలి. అనారోగ్యవంతులకి బిడ్డల్ని కనే అధికారం లేదు. లోకాన్ని అనారోగ్యవంతులైన సంతతితో నింపేకన్న దేంటోనన్నా పడి చస్తే నయం. అనారోగ్యవంతులు అధమం గర్భనివృత్తి మార్గాలనన్నా అనుస రించితీరాలి. దైవం బిడ్డల్నిస్తున్నాడనీ, వాళ్ళకి రోగాల్ని యిస్తున్నాడనీ, కర్మవల్ల సంభవిస్తున్నాయనీ, మెట్టవేదాంతాలు పలుక్కుంటో, తాము మాత్రం, తమ రాత్రి కర్మల్ని కొనసాగిస్తో, బిద్దకంగా, గుడ్డిగా, మూర్ఖంగా, కీటకాలవలె పిల్లల్ని కంటారు. వాళ్ళు చస్తే యేడుస్తారు. అంతకన్నా సుఖంగా బతకమని జ్ఞానాన్ని బోధిస్తే, సంఘప్రళయమూ, పాశ్చాత్యమూ, భౌతికమూ అని అరిచి, మళ్ళీ తమ పనులు నిశ్చింతగా ప్రారంభిస్తారు. నోరులేని బిడ్డల్ని రోగిష్టులుగా కని, దినదినమూ, వారు పడే వేదనను చూసికూడా, మళ్ళీ అట్లాంటి పిల్లల్ని కనే మూర్ఖులు అనేక వేలు, మనచుట్టూ.

అనారోగ్యంగా పుట్టిన బిడ్డకి ఆరోగ్యం తీసుకురావడం చాలా కష్టం. ఆరోగ్యంగా పుట్టిన బిడ్డనికూడా చాలా త్వరలో రోగిష్టినిగాచేసే మహామంత్రం వుపదేశం పొందారు యీ తల్లులు. ఎంత యీ తల్లులు ఆరోగ్యాన్ని నాశనంచేసినా, బిడ్డ ఆరోగ్యం తిరగబడి మళ్ళీ పాతు కుంటోనే వుంటుంది. ఐనా తమ గాఢప్రేమతో ఆరోగ్యాన్ని సమూలంగా నాశనంచేసి జయిస్తారు తలితండ్రులు.

చిన్నప్పుడు ఆరోగ్యం చెడితే యింక మళ్ళీ కుదటబడదు. మొద టనే పూర్ణారోగ్యముంటే, తరవాత జీవితంలో యెంత అనారోగ్యాన్ని

నిగ్రహిస్తుంది శరీరం. పెద్దవారు శిశు ఆరోగ్యశాస్త్రాలు చదవాలి. వాటి ప్రకారం ఆచరించాలి. శిశుసంరక్షణశాస్త్ర విద్యను తల్లి పొందవుంటేగాని, శిశువును కనడానికీ, పెంచడానికీ, హక్కులేదు.

శరీర విషయమైన పనులు యెంతవరకు శిశువు మనసుమీదా స్వభావంమీదా 'ఇన్‌ఫ్లూయన్సు' కలిగివుంటాయో, అంతవరకే యిక్కడ వ్రాస్తాము. శిశువు ఆరోగ్యశాస్త్రాలు వేరే చదువుకోవాలి తక్కినవిషయాల కోసమై.

శరీర విషయమైన ఆరోగ్యం చాలావరకు అలవాట్లమీద ఆధారపడి వుంటుంది. కనక పుట్టినప్పటినించి, శ్రద్ధతో శిశువుకి మంచి అలవాట్లను స్థాపించాలి. ముఖ్యమైన అలవాట్ల విషయమై వ్రాస్తాను.

## భోజనం

పసితనంలో బిడ్డ పుట్టిన దినంనించి కూడా, సరిగా వేళకు పాలివ్వాలి. ఎంత యేడ్చినా వేళతప్ప కూడదు. చాలాసార్లు యేడుపు, ఆకలి వల్లకాదు. ఆ యేడుపు వినలేక స్తనం నోట్లో పూపివాడకుండా కుక్కి యేడుపు మానుపుతారు. నిజమైన కారణానికై వెతికే వోపికలేదు. రాత్రులు శిశువునోట్లో స్తనం వొదిలి పడుకోడం అసహ్యమూ, తల్లికీ శిశువుకీ అనారోగ్యకరమైన అభ్యాసమూ. చాలా ప్రత్యేకంగా అవసరం కలిగితే తప్ప సాధారణంగా రాత్రి పది దాటింతరువాత శిశువుకి యే ఆహారమూ యివ్వకూడదు. అవసరంలేదు. తల్లి పడుకో బొయ్యేముందు శిశువును లేపి పాలుపడితే చాలు.

అయ్యో ఆకలేస్తోంది, యేడుస్తోంది, అనే పిచ్చి సెంటిమెంటు మానెయ్యాలి.

తల్లి స్తనంలోంచి పాలు తాగడంవల్ల బిడ్డకి ఆకలి తీరడమేకాదు, గొప్ప ఆనందాన్నికూడా ఇస్తుంది. తల్లికికూడా అంత ఆనందమే కలుగు

తుంది కనక తీరికగా కూచుని పాలివ్వాలి. మాతా శిశువులమధ్య జరిగే యజ్ఞంలాగువుండాలి. తల్లిస్తనాలతో బిడ్డని కులాసాగా ఆడుకోనివ్వాలి. ఆ పాలివ్వడంమీదనే దృష్టినిలిపి ఆనందాన్ననుభవించాలి తల్లి. పోత పాలు పట్టేప్పుడుకూడా, ప్రేమచూపాలి తల్లి.

తల్లివద్ద పాలు ఉన్నప్పుడు, తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమైన ఆహారం. తల్లిపాలమీద బిడ్డకి జన్మహక్కు వుంది. ఏ కారణంవల్లనూ ఆ హక్కు తొలిగించడానికి తల్లికి అధికారంలేదు. తల్లిపాలు తాగని పిల్లలలో కొన్ని శాశ్వతమైన భావలోపాలు ఏర్పడవొచ్చు.

స్తనంపాలు తాగడం బిడ్డ తొమ్మిదో నెలనే తప్పించాలి. ఒక్కసారిగాకాక నెమ్మదిగా తప్పించాలి. పోతపాలు రుచిగా వుండాలి. బొమ్మలు, మిఠాయిలూ యిచ్చి మనసు మళ్ళించాలి. ప్రేమను అధికంగా చూపాలి. స్తనాలకి చేదుమందులురాసి తప్పించడం చాలా హాని

భోజనంచేసే యీడొచ్చినప్పుడు, అన్నం కలిపి తినిపించకూడదు. బిడ్డ ఆకలి ప్రకారం దాన్నే తిననియ్యాలి. భోజనాల మధ్య శిశువు యేమీ తినకూడదు. యెవరన్నా యేమన్నా యిచ్చినా, భోజన సమయానికది దాచుకోవాలి. కంచంముందు కూర్చుని తినక, తాత్సారంచేస్తో, ఆడుకోనియ్యకూడదు.

పిల్ల అన్నం తినకపోతే ఆదుర్దా పడకూడదు. జబ్బువల్ల తినకపోతే, చికిత్స చెయ్యాలి. పెంకెతనంవల్లనైతే మాట్లాడకండా వూరుకోవాలి. బతిమాలకూడదు. ఆదుర్దా, జాలి చూపకూడదు. ఒకసారి వొద్దన్న తరవాత అడిగినాకూడా మళ్ళీ అన్నానికి కూచోనియ్యకూడదు. మరీ పశ్చాత్తాపపడితే ఒకటి రెండుసారులు వొప్పుకోవచ్చును.

## విరోచనం

పిల్లలకి ఆమదం పట్టకూడదు. నృష్టే శ్రద్ధతీసుకుంటుంది విరోచనం చెయ్యడానికి. తల్లిపాలు తాగే బిడ్డకి ఏ జబ్బులూ రావు. ఆ విష

యంలో మూడో నెలనించి కొంచెం, టొమాటో, నారింజ, కమలా, మొదలైన పళ్ళరసాలుపడితే, విరోచనబద్ధకం పోతుంది. ఆరోగ్యమైన పిల్లలకు ఒకే సమయాన విరోచన మౌతుంది. సరిగా కాలానికి అలవాటు చెయ్యాలి, ఆ సమయాన బట్టమార్చడమో, పక్కమార్చడమో, కూర్చోపెట్టడమో, ఒక మార్పు గుర్తుగా చెయ్యాలి.

కొంచెం పెద్దయినతరవాత ఒకటో యేటినించి పిల్లలు, భోజనం దగ్గిరా, ఒక సమయమూ, స్థలమూ లేకండా బైటికి వెడతారు. దానికి ఒక ప్రత్యేక స్థలము వుండాలి. ఒక కాలం వుండాలి.

కాని కూడని స్థలాల బైటికివెడితే పిల్లని అదరకొట్టకూడదు. కొత్తచీరమీదగాని, విస్తరిలోగాని, జరీదుగల పరుపుమీదగాని ఎక్కడైనాసరే. నెమ్మదిగా వూడుకోవాలి. 'అరేరే!' అని కేకవేస్తో, అరుస్తో, పిల్లని తోసేసి క్రిందపడవేసి, తిట్టి, కొట్టి కసితీర్చుకునే మహాసూతలు యీ పుణ్యదేశంనిండా కొల్లలుగా ఉన్నారు.

మలాన్ని, అసహ్యంగా, సిగ్గుపడవలసిన పదార్థంగా, ఆ పనిని అసహ్యంగా, భయంగా, చెయ్యకూడదు. అన్నిటివలెనే అదీ సహజం. ఆరోగ్యంగా, సంతోషంగా చేసేట్టు నేర్పాలి. అది శరీరానికి సుఖమిచ్చే ఒక అనుభవం. భోజనమూ, దొడ్డీ, సంభోగమూ — ఈ పనుల్ని, తొందరలో, చీదరలో, ఏదో కూడని పనులలాగు, వాటిల్లో సౌఖ్యాన్ని అనుభవించకండా చెయ్యడంవల్లనే జనులకి ఇన్ని నరాలబాధలు.

దొడ్డికివెళ్ళే బిడ్డనిచూసి, ఎవరిలోనూ, ఏ పరిస్థితులలోనూ విసుక్కోకూడదు. సిగ్గుపడకూడదు. తనలోపలినించి ఆ పదార్థాన్ని రప్పించాననే గర్వమూ సంతోషమూ వుంటాయి పిల్లకి. దాన్నెప్పుడూ అభ్యంతరపరచకూడదు. దొడ్డినీ, మూత్రాన్నీ, ఆపుకోవలసిన పరిస్థితిలో ఎప్పుడూ బిడ్డని ఉంచకూడదు.

కొందరు పిల్లలు పెద్దవారైనా, ఇంకా రాత్రులు పక్కలో ఉచ్చ పోసుకుంటారు. దీనికి అనేక కారణాలున్నాయి. రాత్రులు భయం, తలి దండ్రుల అశ్రద్ధ.... కొంత కారణం. కొందరు పిల్లలలో వారి శరీర తత్వాన్నిపట్టి అది అవసరం. కారణం కనపడితే దాన్ని తొలిగించాలి. నిద్రముందు వుచ్చ పోయించాలి. పిల్ల మేల్కొలిపినప్పుడు నిద్రలేవాలి పెద్దవారు. మానమని బిడ్డని ప్రోత్సహించి, ఎందుకు అట్లా జరుగుతోంది బిడ్డ చెప్పగలదేమో చూడాలి. ఈ విధాల మాన్పలేకపోతే వూరుకోవాలి. తిట్ట కూడదు, వెక్కిరించకూడదు, శిక్షించకూడదు. బలవంతంగా మాన్ప డానికి ప్రయత్నించారా, బిడ్డకి శాశ్వతమైన హాని జరగవచ్చు.

## నిద్ర

శిశువుని సరియైన కాలానికి పడుకోపెట్టాలి. వుయ్యాల వుపయో గించకూడదు. జోల పాడకూడదు. వేరే పక్క వుండాలి పిల్లకి, పుట్టి నప్పటినుంచి. మూడో నెలనించి వేరే గదిలో పడుకోపెట్టాలి, పరజా లన్నా అడ్డముండాలి. దీపం వుంచకూడదు.

పడుకోడమూ, నిద్రా, ఒకటిగా అలవాటు యేర్పరచాలి. పక్కని చూడగానే శిశువుకి నిద్ర జ్ఞాపకం వొచ్చేట్టు చెయ్యాలి. నిద్ర సమయంలో తప్ప ఆ పక్కమీద పడుకోనియ్యకూడదు.

పిల్ల నిద్రపోకపోతే, యేమీ ఆదుర్దా చూపకూడదు. సరైన కాలానికి పక్కమీద శిశువును వొదిలి రావాలి: నిద్రపోనీ, పోకపోనీ.

## బట్టలు

వీలైనంతవరకు బట్టలు వెయ్యడం మాని పిల్లల్ని మొండిమొలతో వొదిలేసి తిరగనియ్యాలి. చలిలోనూ, బైటికివెళ్ళేప్పుడూ వెయ్యవొచ్చు. చలికికూడా క్రమంగా శరీరాన్ని అలవాటుచేసి వొదిలెయ్యాలి, బిడ్డ చలేస్తోందన్నదాకా బట్టలు వెయ్యనక్కర్లేదు. కొంతవయసు వొచ్చేప్పటికి

పిల్లలు సిగ్గుపడి బట్టలు కావాలంటారు. అప్పుడు వెయ్యవొచ్చు. అప్పుడు కూడా యెంత కొంచెం వేస్తే అంత మంచిది. సిగ్గుబిళ్ళలూ, గోచీలూ తప్పు. ప్రత్యేకం ఆ అవయవాలు మాత్రం కప్పడం మంచిదికాదు. బట్టలు వేసుకున్నా, అవి సంఘ నిర్ణయప్రకారం వేసుకుంటున్నారేగాని, స్వభావ సిద్ధమైన అవయవాలలో యేమీ తప్పువుండడంవల్ల కాదనీ, వాటిల్లో సిగ్గూ, పాపమూ లేవనినీన్ని, వాటిని దాచడం అవసరంలేదనీ, వాటిని దాచడమే దుస్తుల వుద్దేశ్యంకాదనీ, పిల్లలకు చెప్పాలి. పరాయి వాళ్ళ పిల్లల్ని, మొండిమొలతో వున్నావేం! అని వెక్కిరించనియ్య కూడదు. ఎవరు వెక్కిరించినా లక్ష్యం చెయ్యకపోవడం పిల్లలకి నేర్పాలి.

బట్టలు వీలుగానూ వుపయోగంగానూ వుండేట్టు బుద్ధినుపయోగించి కుట్టాలి. ఫాషన్లూ అందాలూ ముఖ్యంగా చూసుకోకూడదు. బట్టలు పిల్లలు తమంతట తామే వేసుకునేందుకు వీలుగా వుండాలి. వెనక గుండీలూ, హుక్కులూ, మానాలి.

ఆడపిల్లలకీ మొగవాళ్ళకీ ఒకేమోస్తరు బట్టలే వెయ్యాలి. జుట్టు మొదలైనవీ ఒకే మోస్తరుగానే వుంచాలి. పిల్లలకు స్వతంత్ర బుద్ధికలిగి తనకి తాను బట్టల విధమూ జుట్టు విధమూ నిర్ణయించుకోగానే, బిడ్డ యిష్ట ప్రకారమే వుంచుకోనియ్యాలి. పెద్దవా రడ్డపెట్టకూడదు. "గిరజాలు వొద్దు, నేను క్రాపు పెట్టుకుంటా" నంటే సరే ననాలి. ఆ బాధ్యతంతా బిడ్డదే; పెద్దవారు వహించకూడదు. క్రాపుకి డబ్బుకావాలంటే, వుంటే యియ్యవచ్చు, లేకపోతే, "మనం క్రాపుకి డబ్బు యిచ్చుకునేటంత భాగ్యవంతులముకాదు. నీకు డబ్బు రాగానే క్రాపుచేయించుకో" అనాలి. పట్టుచొక్కా లడిగినా అంతే, "నేను పెద్దజుట్టు పెంచుకుంటా" నంటే "పెంచుకో, కాని ఆ జుట్టు దువ్వుకోడం, మొదలైన పనంతా నువ్వే చూచుకోవాలి" అనాలి. అది అందవికారమైన బట్టలూ, వేషాలూ వేస్తే

వుంటే దానికి అందమైన మార్గాలు చూపించాలి. కాని బలవంతం చెయ్య కూడదు. యెక్కడికన్నా వెళ్ళేప్పుడు "అట్లాంటిది మర్యాద కాదు. కనక నిన్ను నాతో తీసుకు వెళ్ళడానికి వీలులేదు" అనవొచ్చు. కాని కారణం నిజమైనది ఐవుండాలి. పిల్లల్ని ఏడిపించి పెద్దవారి వ్యూహాలకు లోబరచుకోడానికి ఆ మాట లనకూడదు.

పిల్లలకి యిష్టంలేనిది బలవంతంగా బట్టలు వెయ్యడం నగలు పెట్టడం చాల ఘోరం. ముఖ్యంగా తమ కులాసాకోసం తమ గొప్ప కోసం, పిల్లలకి బలవంతంగా అలంకారాలు చెయ్యరాదు. గొప్ప ఖరీదు గలవి వేసినా, "జాగ్రతగా వాడుకో" అని చెప్పవొచ్చు: కాని అతని ఆటకు అవి భంగంకాకూడదు. ఆటలాడి చింపితే శిక్షించకూడదు. నగలు పారేస్తే కోపం చెయ్యకూడదు. అసలు నగలు పెట్టనేకూడదు. బలవంతంగా ముక్కులూ, చెవులూ కుట్టి బిడ్డను బాధపెట్టడం హింస అని తెలియని మూర్ఖులు వేనవేలు.

నగలూ బట్టలూ వేసి పిల్లవాడికి తన అందంలో, తన బట్టల గొప్పతనంలో గర్వం కలగచెయ్యకూడదు. అట్లాచేస్తే బట్టలవల్ల గొప్ప తనం నిర్ణయించడం అలవాటు అవుతుంది. ఇంకొకరికన్న తాను బట్టల వల్ల అధికుడ ననుకోనీయకూడదు, అతని అందాన్ని పొగడకూడదు.

"టేస్టు" నేర్పాలిగాని, అందంలో అహంభావం తెప్పించకూడదు.

## శుభ్రం

పుట్టినప్పటినించికూడా సరైనవేళకి స్నానమూ, వొంటిని శుభ్రంగా వుంచడమూ శ్రద్ధవహించాలి.

బిడ్డ కొంచెం పెద్దదికాగానే పళ్లు తోముకోడం అలవాటుచెయ్యాలి. ప్రతిరోజూ పెద్దవారితో ఆటగా పళ్ళుతోమిస్తే అదే అలవాటైపోతుంది.

తనే స్నానంచెయ్యడం త్వరలో పిల్లకి నేర్పాలి. యే విధంగా నీళ్ళు పోసుకోవాలో నిర్ణయించుకోడం ఆమెకి స్వతంత్రముండాలి.

యిష్టంలేంది తలంట్లు పోసి యేడిపించకూడదు. బిడ్డ అపరిశుభ్రమవు తుందని బిడ్డ ఆటల్ని అభ్యంతరపెట్టకూడదు. స్వేచ్ఛగా బురదలో నీళ్ళలో, మన్నులో, యిసికలో ఆడనివ్వాలి. జుట్టు, బట్టలు, అన్నీ పాడైనా సరే, యెన్నిసార్లయినా సరే, విసుక్కోక, కోప్పడక, పిల్లల్ని శుభ్రంచెయ్యాలి. వాళ్ళనే శుభ్రం చేసుకోమనాలి.

ఈ అలవాట్లన్నీ బిడ్డకి తెలీకండానే యుక్తవయసులోనే మొదలు పెట్టి స్థిరపరిస్తే, తరవాత పోవాలన్నా పోవు. కాని యీ అలవాట్లు స్థిర పరిచేప్పుడు బిడ్డకి కష్టమేమాత్రమూ కలగనీకూడదు,

మురికి ఐనప్పుడల్లాతనే శుభ్రపరచుకోడమూ, వొంటిమీద అపరి శుభ్రం సహించకపోవడమూ, తన శరీరంమీదా, దాని నిర్మలత్వంమీదా గౌరవమూ, బిడ్డకి నేర్పాలి. వూరికే సూచిస్తే చాలు, బిడ్డ తెలుసు కుంటుంది. నోట్లోనూ. ముక్కుల్లోనూ వేళ్లు పెట్టినప్పుడు కడుక్కో డమూ, ముక్కు కారుతోవుంటే తుడుచుకోడమూ, మొదట్లోనే అలవాటు చెయ్యాలి. యీ విధమైన అలవాట్లవల్ల బిడ్డ శరీరారోగ్యానికే గాక, నైతికారోగ్యానికి చాలా సహాయం కలుగుతుంది.

## వ్యాయామం

మొదటినెల దాటగానే పిల్లని మంచాల్లోను, తొట్లలో వుంచడం మాని చాపేసి కింద స్వేచ్ఛగా వుంచాలి. మన్నూ హానికరమైన వస్తువులూ దూరంచెయ్యాలి. యెత్తుకోకూడదు. యెత్తైనవాటిమీద పడుకోపెట్ట కూడదు. రాత్రులైనా సరే, బిడ్డకి ప్రత్యేకం యెత్తుతక్కువ మంచం వేయడం విధి.

రోజూ పొద్దునా, సాయంత్రము, మొదటినెలనుంచీ, బిడ్డని వూరి బైటికి షికారు తీసుకువెళ్ళడంవల్ల చాలా ఉపయోగం కలుగుతుంది. బిడ్డ స్వేచ్ఛగా ప్రాకడానికీ, నడవడానికీ, యిల్లంతా తిరగడానికీ

యేమాత్రమూ అభ్యంతరం వుండకూడదు. పైగా వుత్సాహంగా ఆడుకుని అల్లరిచేసేట్టు మాటలతోనూ, బొమ్మలతోనూ ప్రోత్సహించాలి పెద్దవారు. నిర్జీవంగా, బద్ధకంగా, బిడ్డ వుండనేకూడదు. నిచ్చనలూ, కర్రలూ కొయ్యగుర్రాలు మొదలైనవి శరీరవ్యాయామానికి తోడ్పడతాయి. ఇంకా పెద్దయిన తరవాత బిడ్డకి, తక్కిన బిడ్డల జతచేసి, రోజంతా, ఆటలతో, పాటలతో, గంతులతో, అరుపులతో, గోలతో, సంతోషంగా కాలం గడపనివ్వాలి.

# ఏడుపు

బిడ్డకి మాటలురాకముందు యేడిస్తే, యేడుపుకి కారణం తెలుసుకోవాలి. కారణంలేకుండా యేడుస్తోవుంటే, అలిసి వూరుకున్నదాకా యాడవ నియ్యాలి. యెత్తుకోకూడదు. బిడ్డవేపు చూడకూడదు, మాట్లాడకూడదు. బిడ్డకి యేదన్నా అవసరముంటే ఆ సహాయంచేసి వూరుకోవాలి.

పిల్లల్ని యెన్నడూ యెత్తుకోకూడదు. వొళ్ళల్లో కూచోపెట్టుకో కూడదు. బిడ్డనే చూస్తో, దానికేంకావాలో అని ఆదుర్దాపడుతో, దానికి పాటలు పాడుతో కనిపెట్టుకుని కూచోకూడదు. జబ్బుగావున్నాసరే, బిడ్డ స్వేచ్ఛగా, స్వతంత్రంగా, ఒంటిరిగా ఆడుకోవాలి, నిద్రపోవాలి. బిడ్డతో పెద్దవాళ్ళు మాట్లాడ్డానికీ ఆడుకోటానికీ ప్రత్యేకం వేళ వుంచుకోవాలి, పెద్దవారికి తీరుబడి అయ్యేవేళ.

తలితండ్రులకి యింక తనే గొప్ప అని, యింక తను లేకపోతే వాళ్లు బతకరనీ, తను బాధపడితే వాళ్ళూ బాధపడతారనీ, తను వాళ్ళని యేడిపించగలననీ, ఆడించగలననీ బిడ్డకు అభిప్రాయ మేర్పడకండా జాగ్రతపడాలి, పిల్లలకొరకై బాధ్యతా, కష్టమూ పడాలి. కాని అట్లా ఆదుర్దాపడుతున్నామనే సంగతీ, వాళ్ళసుఖం తమకి చాలా ప్రాముఖ్య మనీ పిల్లలకు తెలియనీయకూడదు. పిల్లల్ని మోసపుచ్చాలనికాదు. ఆదుర్దా వున్నా కనపరచవొద్దని అభిప్రాయం.

బిడ్డ ఏడిస్తే ఆ యేడుపుతో పెద్దవాళ్ళకేమి జోక్యం లేనట్లుండాలి. యేడుస్తో యేదన్నా అడిగితే, "అది యిచ్చేవాణ్ణేకాని, నువ్వు యేడుస్తో అడిగావు కాదూ అందుకని వీల్లేదు" అనాలి. బిడ్డ యేదన్నా కోరితే, వీలైనంతవరకు కోరిక నెరవేర్చాలి. కాని వీల్లేక నిరాకరించిన తరవాత, యెంత యేడ్చినా, మొత్తుకున్నా, గొంతుక చించుకున్నా, నిరాకరణాన్ని మానకూడదు.

ఏడుపు విషయమై పెద్ద సెన్టిమెన్టు వుంది మనుషులకి. వూరికే అడిగితే, ముందు యివ్వరు. యేడుస్తో అడిగితే, యింకా మారాంపడితే, అప్పుడు యిస్తారు. కొడతారు, తిడతారు, చివరికి యిస్తారు. దానితో బిడ్డ నేర్చుకుంటుంది, యేడిస్తే తప్ప తనకి కోర్కెలు సాగవని. మొదట యేడ్చినప్పుడే పట్టుగా కోర్కె నిరాకరించి స్థిరంగావుంటే, యేడుపువల్ల లాభంలేదని తెలిసేట్టుచేస్తే, బిడ్డకు ఆ అలవాటు పోతుంది.

యేడుపుని భరించలేరు మనుషులు. దేనికై బిడ్డ యేడుస్తోందో అది తీర్చలేకపోతే వూరుకోమనడమో తిట్టడమో కొట్టడమో యేదో చెయ్యకండా వూరికే వుండలేరు.

పసితనంలో బిడ్డ యేడుపుకి కారణం వుంటుంది. ఆ కారణం తెలుసుకునే తెలివివుంటే తెలుసుకుని ఆ బాధని నివృత్తిచెయ్యాలి, లేకపోతే వూరుకోవాలి. అంతేగాని అరవకూడదు. తిట్టకూడదు ఎత్తుకోకూడదు. ఎత్తుడుమరిగి చాలసార్లు యేడుస్తారు. ఏడిపించి యేడిపించి యెన్నడూ యెత్తుకోక ఆ యేడుపు అలవాటు మాన్పాలి. కడుపు నొప్పితో అజీర్ణంతో పొట్ట వుబ్బి యేడుస్తూవుంటే దయగలతల్లులు పాలుపడతారు. ఆ తీపికి పాపం బిడ్డ వూరుకుంటుంది అప్పటికి. ఆ తల్లులకి తెలివిలేదు. సంఘం తెలివి నివ్వదు, తండ్రులకి పట్టదు. ఇట్లాంటి క్రూరహత్య స్వంత పిల్లలకి జరుగుతోనే వుంటుంది. ప్రతిదినమూ యీ తండ్రిగారుమాత్రం పంజాబు హత్యలకీ, బెంగాలు వరదలకీ ధనం పోగుచేస్తూనో శిశుఆరోగ్యవారం మీటింగులు చేస్తూనో వుంటారు. ఆ భార్యకి మాత్రం తెలివి తెప్పించలేదు, తన అధికారం చలాయించలేదు. ఆ భార్యని అంత మూర్ఖంగా వుంచకపోతే లేచిపోతుందని భయం.

ఇంక కొంచెం పెద్దయినాక పెద్దల మనసులు కరిగించి తమ కార్యాలు కొనసాగించుకోవాలని పిల్లలు ఏడుస్తారు. ఏడుపు మంత్రం పారినకొద్దీ ఇంకా ఏడుస్తారు. ఈ యేడుపే బాగా అలవాటై పెద్దవాళ్ళై,

ఆడవాళ్ళు పెనిమిటి దగ్గిర యేడుస్తారు. మొగవాళ్ళుకూడా లోకంలో తమకి కావలసిందంతా దొరకనప్పుడు అందరితోనూ మాటలతో చెప్పుకుని యేడుస్తో లోకానికంతా దానికి బాధ్యత కలిగినట్టు అందర్నీ తిడతారు. తమతో సానుభూతిని చూపలేదని పోట్లాడే వాళ్ళూ, తగాదాలవాళ్ళూ, సణుగుళ్ళవాళ్ళూ, వీళ్ళందరూ చిన్నప్పుడు యేడుపుకి అలవాటుపడ్డ బిడ్డలే. అంతా తమకే కావాలని యెవరికీ పంచక దాచుకునే భాగ్యవంతులూ, తమకు లేదని యీర్ష్యతో యేడ్చే బీదవాళ్లూ, లేని జబ్బులతో బాధపడి వుత్తగోలలుపెట్టేవాళ్ళూ, అందరూ చిన్నప్పటి యేడుపు గొట్లే.

ఇంటో యేడుపనేది వినపడకండా చెయ్యడం పెద్దవాళ్ళ ముఖ్యమైన విధి. యేడుస్తోవుంటే మాట్టాడకండా వొదలడమూ, బిడ్డ కొంచెం పెద్దదికాగానే యింటో యాడవనీక దొడ్లోకిపోయి యెవరికీ వినపడకండా యేడ్చి రమ్మనడమూ, చెయ్యాలి. దెబ్బతగిలినాసరే అంతే. యాడపడం అసహ్యమైనపని అనిన్నీ, యింక తప్పనిసరి ఐనప్పుడు యితరులకి కనపడకండా చెయ్యవలసిన పని అనిన్నీ, నేర్పాలి.

ఒక్కొక్కప్పుడు బిడ్డ రోషంతో పెద్దయేడుపు ప్రారంభించి హడావిడిచేస్తుంది - చాలా స్వల్పకారణాలకి. గోలపడకండా, బిడ్డని స్వేచ్ఛగా ఏడ్చి చల్లారనియ్యాలి, ఏమీ మాట్లాడవద్దు. బిడ్డవంక చూడవొద్దు. కాని మీరు ఆ కోపాలు అంగీకరించినట్టు వుండవద్దు.

# అలవాట్లు

మనుష్య జీవితం అలవాట్ల సమూహం. దేహశుచీ, అశుచీ, నీతీ, అవినీతీ సర్వమూ చాలవరకు అలవాట్లే. నీతిమంతులమనే వాళ్ళందరూ అలవాట్లకు దాసులే. ప్రొద్దున్నే చన్నీళ్ళస్నానం అలవాటైతే, ఆ అలవాటు లేనివారికి ఆ స్నానం చెయ్యడం యెంత కష్టమో, ఉన్నవారికి స్నానం మానడం అంత కష్టమే. బూతుమాట అలవాటైనవారికి మానడం యెంత కష్టమో, అలవాటు లేనివారికి ప్రయత్నించినా, అవి వుచ్చరించడం అంతకన్న యెక్కువ కష్టం. అబద్ధమూ నిజమూ కూడా యిట్లానే అలవాట్లు. యెంత ప్రయత్నించినా మనిషిని చంపగలరా? దయార్ద్ర హృదయులైనా వాళ్ళకి అలవాటుగనక సిపాయిలూ రాజులూ యుద్ధంలో శత్రువుల్ని చంపుతారు. కనక అలవాట్లమీద జీవితమంతా దాని గొప్ప తనమూ అల్పత్వమూ ఆధారపడివుంది. చిన్నప్పుడయ్యే అలవాట్లింక యెన్నటికీ పోవు, మంచికీ చెడ్డకీకూడా.

పూర్వజన్మనించి గుణాల్ని మనం తెచ్చుకుంటున్నామనే వేదాంతం నిజమైనా కాకపోయినా, పిల్లల శిక్షణ విషయమై దాన్ని మరిచిపోవాలి.

శ్రమపడి బిడ్డలకు మంచి గుణాలే అలవాటుచేసి, దుర్గుణాల్ని నివారించి, నేర్చుకునే దుర్గుణాల్ని పోగొట్టగల శక్తి తమలో వుందని పెద్దవారు నమ్మాలి. పుట్టేప్పుడే 'పూర్వజన్మకర్మ ప్రకారం ఏవో గుణాలతో పుడతారు. వాటిని మార్చడం యీశ్వరుడితరం కాదనే కర్మవేదాంతం వాదించినా, దానిప్రకారం నడచుకునే మూర్ఖుల్ని చూడ లేము. అట్లానే నమ్మితే యీ పుస్తకం చదవనూ అక్కర్లేదు. బిడ్డల యెడల శ్రద్ధతీసుకోనూ అక్కర్లేదు. బిడ్డల్ని బాగుచేస్తామనుకుని వారిని కొట్టేప్పుడూ తిట్టేప్పుడూ ఆ వేదాంతాన్ని మర్చిపోతోనేవున్నారు. కర్మ

సిద్ధాంతంలోనైనా మనిషికి జరిగే కష్టసుఖాలు శాసింపబడతాయన్నారు గాని, అతని గుణాలు నిర్ణయింపబడతాయనలేదు. సుఖదుఖాలు పూర్వ జన్మ కర్మప్రకారం కలిగినా వాటిని అనుభవించేపద్ధతి, వాటివల్ల పాఠాల్ని నేర్చుకుని బాగుపడడమూ, వాటివల్ల నాశనముకావడమూ, మనిషిగుణాల మీద, స్వభావంమీద, ఆధారపడివుంటుంది. అలవాట్లద్వారా ఆ గుణాల్ని పెద్దవాళ్ళు చాలవరకు బిడ్డలో ఏర్పరచగలరు.

ఆదిగాక మనిషిబుద్ధి యెప్పుడూ చెడువేపే లాగుతుందనీ, యెంతో ప్రయత్నంమీదగాని, యేన్నోదెబ్బల వల్లగాని, బిడ్డల్ని మంచితోవకి తీసుకురాలేమనీ, మనుష్యులు పాపంలో పుట్టారనీ, సంసారం పాప భూయిష్టమని, కోర్కెలు తుచ్ఛమని, బిడ్డ యెప్పుడూ దుర్మార్గానికే ప్రయత్నిస్తుందని, బోధించే తుచ్ఛశాస్త్రాలను తగలవెయ్యాలి. మనుషుల స్వభావం గుర్తెరగని మూర్ఖులు, తమ యింద్రియాన్ని నిగ్రహించుకోలేని రోగిష్టులు, దుర్మార్గులు వ్రాసిన తప్పుడు వ్రాతలవి. బిడ్డల స్వభావ మెప్పుడూ సన్మార్గానికే ప్రయత్నిస్తుంది. దుర్మార్గమని తెలీక బిడ్డ పొరబాటుపడుతుంది. ఆ పొరబాటు ప్రేమతో దిద్దడం పెద్దవారివిధి. అలవాట్లవల్లనే చెడుమార్గా లేర్పడతాయి. ఆ చెడు అలవాట్లేర్పడకండా పెద్దవారు సహాయం చెయ్యగలరు. చెయ్యడం వారివిధి.

బిడ్డకి మంచిఅలవాట్లను కలగచేస్తే వాళ్ళకి చెడ్డపనులు చెయ్యడం కష్టమౌతుంది. చెడ్డ అలవాట్లను బిడ్డలకు రానిచ్చినా, వాళ్ళని వుపేక్ష చేసినా, మంచిపనులు వారికి కష్టమౌతాయి. పిల్లల్నిపెంచడం చాతగాక, అలవాట్లని దిద్దడానికీ అలవరచడానికీ బద్ధకపడి, ఏదో పూర్వజన్మ ప్రకారం కాలక్రమంగా జరుగుతుందని నల్లమందు వేదాంతాన్ని నమ్మి, కొత్త జ్ఞానమంటే వులికిపడుతో లోకమిట్లా పడివుంది.

బిడ్డని కవీశ్వరురాలో, శూరురాలో, ఆరోగ్యవంతురాలో, నీతి వంతురాలో, చేసేశక్తి పెద్దవారిలో కొంతవరకన్నా వుంది. ఆ శక్తి

వున్నా లేకపోయినా, బిడ్డమాత్రం దుర్మార్గురాలూ, అవివేకీ, నిష్ప్రయోజకురాలూ, ఐతే, ఆ తప్పిదం చాలావరకు తలితండ్రులది.

తప్పుదుదోవలకీడ్చే యింద్రియాల్ని మనోబలంచాత శమదమాల చాత, కట్టేసి, మంచిమార్గాని కీడ్వాలనే వేదాంతం శుద్ధఅబద్ధం, ఋషులు చెప్పనీ, వారి తాతలుచెప్పనీ. ఇంకా అలవాట్లు యేర్పడని విషయాలలో యింద్రియాలు బుద్ధిని యీడుస్తాయి. అలవాటు యేర్పడ్డవిషయాలలో యీడవ్వు. పొద్దున్నే సిగరేట్ కాల్వమని, ఆ అలవాటున్నవాణ్ణి యింద్రియాలు యీడుస్తాయి. అందర్నీ యీడుస్తాయా? అట్లానే పొద్దున్నే టెన్నిస్ ఆడడం అలవాటున్నవాణ్ణి ఆడమని యీడుస్తాయి. లేవగానే పళ్ళుతోముకోడానికి శమదమాలు వుపయోగించాలా? కనపడ్డ మనుషుల ముక్కులు కొయ్యకండా మనం యేం నిగ్రహ ముపయోగించాలి! ఆ అలవాటున్నవాళ్లు వుపయోగించాలి ఆ నిగ్రహం. ప్రతిపనికీ, గుణానికీ, యింద్రియాలిట్లా యీడుస్తోవుంటే యింక మనుషులెవరికీ వేరేపని వుండదు, తమ యింద్రియ వాంఛలతో నిగ్రహాన్నీ శమదమాల్ని వుపయోగించి, పోట్లాడడం తప్ప. ప్రతినిమిషమూ చూసిన మిఠాయి తినాలనీ, అందర్ని తన్నాలనీ, దొంగిలించాలనీ, స్త్రీల నెత్తుకుపోవాలనీ తోస్తో వుంటే బతకడమెట్లా? మంచిత్రోవల మంచిపనులుచేసే అలవాట్లులేని వాళ్ళని యీడుస్తాయి యింద్రియాలు. రాత్రి పదిగంటలకి నిద్ర అలవాటున్నవాడు పడుకుంటాడు, ఆ అలవాటులేనివాడు, ఆ అలవాటుని చెరుపుకున్నవాడూ, నిద్రరాక యేంపని చెయ్యాలా అని ఆలోచిస్తాడు. చదువుకునే అలవాటున్నవాడు చదువుకుని ఆరోగ్యం చెడకొట్టుకుంటాడు. తాగేవాడు తాగి ఆ అలవాటు వృద్ధిచేసుకుని పాడౌతాడు. కనక మంచి పనులకంటే చెడ్డపనులు చెయ్యటం సులభమని బోధించే వేదాంతం శుద్ధఅబద్ధం. మానవస్వభావం, ముఖ్యంగా చిన్నపిల్లల స్వభావం, యెప్పుడూ సన్మార్గము వేపే ప్రయత్నిస్తూ వుంటుంది. కాని పరిస్థితుల

వల్ల కలిగిన, చెడుఅలవాట్లనించి తప్పించుకోలేక, తంటాలుపడుతో వుంటుంది. చెడు అలవాట్లు కలవాడికి మంచిపనులు చెయ్యటం యెంత కష్టమో, మంచిఅలవాట్లు కలవాడికి చెడ్డపనులు చెయ్యడం అంతేకష్టం.

అలవాట్లు లేనివాడు, యీ ప్రలోభనాలతో పోట్లాడి తనకున్న శక్తిని వృధాచేసుకుని అలిసిపోతాడు. మంచి అలవాట్లున్నవాడికి పాడు కోర్కెలు ఆ విషయాలు కలగనే కలగవు. యుద్ధమే అనవసరం.

పెద్దవారు నేర్పినా నేర్పకపోయినా పుట్టిన నిమషాన్నించి పిల్లకి అలవాట్లేర్పడుతోనే వుంటాయి. మంచివాటిని ప్రవేశపెట్టకపోతే చెడ్డవి అలవాటవుతాయి.

ఒకటే పనిని చాలసార్లు వరసగా చెయ్యడంవల్ల అలవాటు యేర్పడుతుంది. కనక అవసరమైన అలవాట్ల నేర్పరచడానికి, ఆ పనుల్ని ఒకేస్థలంలో ఒకే కాలంలో, ఒకటే వేళకు ఒకటేమోస్తరుగా బిడ్డచేత వరసగా చేయిస్తోవుండాలి. బిడ్డకు బుద్ధితెలియకముందే, శరీరంవిషయ మైన అలవాట్లన్నీ యేర్పడిపోవాలి. పళ్ళుతోముకోడం, స్నానం, బట్టలు, మాటలు, శుభ్రత, నిద్ర, మొదలయినవన్నీ, బిడ్డకు బుద్ధితెలిసింతరవాత వూరికే మాటలుచెప్పి వూరుకుంటారు కొందరు, "ధైర్యముగావుండు," "నిజముచెప్పు" అని చెప్పి పెద్దవారు వూరుకుంటే, అలవాటు యేర్పడదు. కనక లాభమేమీలేదు. సరైన కాలానికి పెద్దవారు దగ్గిరవుండి ఆ పని పిల్లవాడు చేసేట్టుచూడాలి. తెలీకపోతే నేర్పాలి. పొళ్ళు తోముకోడం, జుట్టు దువ్వుకోడం, భయపడకుండా వుండడం, మర్యాదగా మాట్లా డడం, సహనం అన్నీ చేసి చూపి నేర్పాలి. ఆ పని బాగా అలవాటయిం దాకా ఒకసారికూడా చేయించడం మానకూడదు. అలవాటయింతరవాత అప్పుడప్పుడు తమాషాకీ, అవసరాన్నిపట్టి మాననియ్యవొచ్చు. రాత్రి తొమ్మిదింటికే నిద్రపొయ్యే అలవాటేర్పడనంతకాలమూ, ఒక్కరోజూ తొమ్మిదింటికి పడుకోకండా వుండనియ్యకూడదు. అలవాటేర్పడ్డతరవాత

యెప్పుడన్నా నాటకానికో తమాషాకో, మేలుకోనియ్యవచ్చు, కాని యిట్లా చాలసార్లు మేలుకోనిస్తే మళ్ళీ ఆ అలవాటే తప్పిపోతుంది. మంచిఅలవాట్లు యేర్పరచడానికి పెద్దవాళ్లు బిడ్డతోకలిసి శ్రమ తీసుకోవాలి గాని, వుత్తఆజ్ఞలవల్ల, నీతిబోధలవల్ల, పురాణపఠనంవల్ల, చివాట్లవల్ల, దెబ్బలవల్ల, యేమీ లాభంలేదు. బిడ్డకి నీతిఉపన్యాసాలిస్తే పురాణాలవలె, తనూ శుష్క-నీతివచనాలను బోధించడం నేర్చుకొంటుంది; తన ప్రవర్తన మాత్రం దిద్దుకోదు. లోకం పుట్టినప్పణ్ణించి, యిప్పటివరకు, నీతులు వినడంవల్ల, పురాణాలు చదవడంవల్ల, ఒక్కరూ బాగుపడలేదు. లక్షలకొద్ది దొంగలు తయారైనారు. చివాట్లవల్ల, దెబ్బలవల్ల, బిడ్డ తన అలవాట్లను పెద్దవారిదగ్గిరనించి దాచుకుంటుంది. నిర్మూలం చేసుకోదు. ఈ లోకంలోవున్న భీరులు, పెద్దవారి దెబ్బలవల్ల తయారైన పెద్ద మనుష్యులే.

చెడుఅలవాట్లు యేర్పడ్డప్పుడు వాటిని ఒకటితరవాత ఒకటి మెల్లిగా పోగొట్టాలి, తొందరపడకూడదు. అసలు జాగ్రతగా పెంచితే, చెడు గుణాలు అలవాటు కానేకావు. అయినప్పుడు వూరికే "యీ గుణం పోగొట్టుకో, ఆ గుణం పోగొట్టుకో" అని ఆజ్ఞపెడితే లాభంలేదు. బిడ్డ బలహీనత్వాన్నీ, ఆ అలవాటు యెందుకు యేర్పడ్డదో ఆ కారణాన్నీ తెలుసుకుని, బిడ్డతోకలిసి పెద్దవాళ్ళుకూడా ఆ చెడ్డఅలవాటు పోగొట్టడానికి ప్రయత్నించాలి. పోగొట్టే బాధ్యత పెద్దవారిది, బిడ్డదికాదు. సంతోషంగా దయగా, తమాషాగా, ఆటలాడుతున్నట్లు, చెడ్డఅలవాట్లని తొలిగించాలి. ఒక వారమో యెంతో గడవుపెట్టాలి ఆ అలవాటు పొయ్యేందుకు. నోట్లో వేళ్లు పెట్టుకోడం మాన్పించాలంటే—"యిది అసహ్యం, మనం ఒకవారంలో యీ పని మానెయ్యడం నేర్చుకోవాలి!" అని బిడ్డతో అనాలి. వేలు పెట్టుకున్నప్పుడల్లా 'వేలు' అని జ్ఞాపకంచేస్తో వుండాలి. వారంలో పోకపోతే, "యింకా పోలేదు. నువ్వు మర్చిపోతున్నావు,

జ్ఞాపకముంచుకునేందుకు వొక పద్ధతి కనిపెడదాం, యీసారి వేలు పెట్టుకున్నప్పుడు, నేను 'వేలు' అంటాను. అప్పుడు నువ్వు గోడ నొకసారి తాకుతోవుండాలి." అని బిడ్డతో చెప్పాలి. మూడోవారం వొక గుంజీ తియ్యాలి. అప్పుడప్పుడు ఆ గుంజీపని పెద్దవాళ్ళుకూడా చెయ్యాలి. ఎందుకంటే, ఆ పనిని బిడ్డకు శిక్షలాగు కనపడనియ్యకూడదు. అప్పటికి పోకండా వుండవు చెడుఅలవాట్లు. కావలిసే బిడ్డ చేస్తున్నట్టుంటే, అదొక జబ్బులాగు చూడాలి. తరవాత శిక్ష అవసరమౌతుంది. బిడ్డ కావలసి ఆ అలవాటును పట్టుకుని వేళ్ళాడుతోందన్నమాట.

మంచి అలవాటు కావాలంటే, ఆ పనులకి పర్యవసానంగా బిడ్డకి సుఖం కలిగించేట్టువుండాలి - పళ్ళు తోముకోడానికి మంచి tooth-paste, లేక పెద్దవాళ్ళు మెచ్చుకోడం, లేక పాలూ, పళ్ళూ, చెడ్డఅలవాట్లు పోగొట్టాలంటే, బాధాకరమయిన పర్యవసానాలు కల్పించాలి. అలవాటు ఏర్పడుతోవుంటేనే, ప్రయత్నించి మంచిఅలవాటును ఏర్పరుచుకుంటున్నామనే జ్ఞానమే సంతుష్టినిస్తుంది బిడ్డకి.

అలవాటు పోగొట్టుకోడంలోనూ, కొత్త అలవాటు చేసుకోడంలోనూ బిడ్డలోంచి విరోధం బైలుదేరకూడదు. విరోధం బైలుదేరడం కన్న చెడుఅలవాటు వుండడమే మంచి. అలవాటులేకపోవడమే నయం. బిడ్డే ఉత్సాహంచూపాలి. బద్ధకల అయిష్టం చూపిందా, పెద్దవారు తమ ప్రయత్నమే మానుకోవాలి.

తలితండ్రులు బిడ్డపైన ప్రేమా దయా కనపరుస్తోవుంటే బిడ్డ తప్పకండా చెప్పినమాట వింటుంది. కాని సకాలంలో దురలవాటుని గుర్తించి నిర్మూలంచెయ్యాలి. ఆలస్యంచేస్తే ముదురుతుంది. బిడ్డల చెడు అలవాట్లని పోగొట్టే ప్రయత్నంచేస్తో, పెద్దవాళ్ళు తమ చెడుఅలవాట్లని అట్లానే వుంచుకుంటే, బిడ్డకి అది అన్యాయంగా కనపడుతుంది. కనక పెద్దవాళ్లకూడా తమ అలవాట్లని యిట్లానే పోగొట్టుకుంటో వుండాలి.

బిడ్డకి రెండున్నర సంవత్సరాలు వొచ్చినప్పుడు అలవాట్లలో వుండేసూత్రాలు వొక్కొక్కటే తెలియచేసి, ఆ సూత్రానికై ప్రయత్నించమనాలి. అన్నంముందు చేతులు కడుక్కోడం మొదలైన అలవాట్లకు శుభ్రమనే సూత్రం చెప్పాలి. అట్లా చెపితే తక్కిన విషయాల్లో ఆ 'ప్రిన్సిపిల్ని' బిడ్డ వర్తింపచేసుకుంటుంది.

# శిక్ష

అల్లరికీ, తిరగబాటుకీ, కోపానికీ, చిరాకుకీ, అసంతుష్టికీ, వీలులేని పరిస్థితులలో పిల్లల్ని పెంచాలి. అందరూ దయగా నవ్వుతో ప్రేమతో వుంటే పిల్ల అల్లరి చెయ్యదు. అల్లరి, పెంకితనమూ, ఏ కారణాలవల్ల కలుగుతాయో ఆలోచించి వాటిని తొలిగించే ప్రయత్నం చెయ్యవలసి వుంటుంది. బిడ్డ 'టెంపరమెంట్' కనిపెడితేనేగాని శిక్షణ కష్టమవుతుంది. ఒక్కొక్కప్పుడు వొంట్లో కులాసాగాలేక, బిడ్డ అల్లరి చేస్తుంది. మాటల్లో ఆ సంగతి చెప్పలేకపోతుంది. అట్లాంటిది పెద్దవారు కనిపెట్టాలి.

బిడ్డతో మాట్లాడేటప్పుడు తాము గొప్పవారైనట్టూ అది క్షుద్రురాలైనట్టూ చూడకూడదు. ఆ బిడ్డ తమతో సమానంగా పెద్దదైనట్టే, పెద్దవారితో యెట్లా మాట్లాడతారో అట్లానే, బిడ్డతోకూడా గౌరవంగా, స్నేహితులతో మాట్లాడినట్లే మాట్లాడ్డం అలవాటు చేసుకోవాలి. బిడ్డ మన స్వాధీనంలో వుందికదా, అనే అభిప్రాయంతో ప్రవర్తించకూడదు. బిడ్డ చెప్పింది శ్రద్ధగా వినాలి. దాని 'ఫీలింగ్సు' యెట్లా వుంటాయో అని ఆలోచించాలి. దాని అభిప్రాయాలకూ, ఇష్టానిష్టాలకూ, తగిన విలువ నివ్వాలి. అది తెలియపరచలేని భావాలూ, కష్టాలూ, కనిపెట్టాలి. దయా సానుభూతి కలిగి వుండాలి. బిడ్డ అల్లరిచేస్తే దాన్ని యెట్లానన్నా అణిచి నిర్మూలం చెయ్యాలని విరోధివలె ఢీకొని, "నీ శక్తి యెక్కువో నా శక్తి యెక్కువో, చూడు. నిన్ను మాన్పించలేనా ? నేనెంతవాణ్ణో నీకేం తెలుసు ?" అనేట్లు ప్రవర్తించకూడదు. యేమీ చేతకానివాడు కూడా, అందరిచాతా తిట్లు తినేవాడుకూడా తన భార్యమీద బిడ్డలమీదా అధికారాలు చేసి, యిష్టం చెలాయించి బలవంతాలుచేసి, దెబ్బలు కొడతాడు. బిడ్డ యెందుకు అల్లరి చేస్తోందో, దాని యిబ్బంది యేమో అర్థం చేసుకోవాలి.

అది కావలసి అల్లరి చెయ్యదనీ, అది సదుద్దేశ్యంతో చేసినపని పెద్దవారి తెలివితక్కువవల్ల, పరిస్థితులవల్ల అల్లరిగా మారుతోందనీ, దాని అల్లరికీ పెద్దవారే బాధ్యులనీ విశ్వసించి, అది అల్లరి చేసినప్పుడల్లా పెద్దవారు తమ శిక్షణావిధానాన్ని తమ వివేకాన్ని సహనాన్ని పరీక్షించుకుని, లోపాల్ని కనిపెట్టడం మంచిది. కాని బిడ్డలో లోపాలకోసం వెతకడం పొరబాటు. ఈ సమస్యలు వొచ్చినప్పుడు తమమాట మీరిందే అనే అహంభావం మాని వోపికపట్టి, శ్రద్ధవహిస్తే, తరవాత చాలా యిబ్బందులు తప్పిపోతాయి.

అన్నిటికన్నా ముఖ్యవిషయం. పెద్దవారు బిడ్డని ఆజ్ఞలుపెట్టి చేయిస్తున్నట్టూ బలవంతం చేస్తున్నట్టూ వుండకూడదు. బిడ్డ తనంతట తన యిష్టప్రకారమే తనని తనే అదుపులో పెట్టుకునేట్టు ప్రోత్సహించాలి. అందులోనే వుంది తెలవంతా, నేర్పరితనమంతా. బిడ్డ శిక్షణ అంతా ఆటలాగుండాలి. చీట్లాడుతున్నారు. రంగుకి రంగు వెయ్యాలి అనే నియామకముంటుంది. తమంతట తామే వొప్పుకుంటారు ఆ నియామకానికి ఆడేవాళ్ళు. ఆ నియామకాలకి లోబడేందుకు యెవరన్నా బలవంతం చెయ్యాలా? ఆ నియామకాలు ఆడేవాళ్లు యేర్పరచుకున్నవే. అవి వుంటేనేకాని ఆట సంతోషమేలేదు. ఇంటో శిక్షణా అంతే. పెద్దవాళ్లూ చిన్నవాళ్ళూ కలిసి కొన్ని నియామకాలు యేర్పరచుకుంటారు. చిన్నవాళ్ళు నియామకాలు మరిచిపోతారు. గనక పెద్దవాళ్లు జ్ఞాపకం చేస్తారు. అంతే.

చాలమంది అనుకోడం యేమిటంటే-పిల్లలబుద్ధి యెప్పుడూ అల్లరి వేపూ దుర్మార్గానికీ యీడుస్తూ వుంటుందనిన్నీ పెద్దవాళ్ళు దెబ్బలతోనూ చివాట్లతోనూ వాళ్ళని సరైన మార్గాన వుంచాలనీ. కాని నిజం ఆలోచించి చూస్తే, పిల్లలకి అల్లరి చెయ్యాలని వుండదు. వాళ్ళకీ మంచివాళ్లుగానే వుండి సుఖపడాలనే వుంటుంది. దెబ్బలూ చివాట్లూ వాళ్ళకి రుచించవు.

పెద్దవాళ్ళని యేడిపిస్తే వాళ్ళకేమీ సంతోషం లేదు. కాని వాళ్ళకి ప్రవర్తించవలసిన మార్గం తెలీక యెట్లా తమ శక్తుల్ని అభివృద్ధి పరుచుకోవాలో అర్థంగాక, పెద్దవాళ్ళ ఆజ్ఞలూ యిబ్బందులూ స్పష్టంకాక, తటపట పడతారు. అదిగాక, పెద్దవాళ్ళలో విశ్వాసం పోయినప్పుడు, పెద్దవారి ప్రేమమీద సందేహం కలిగినప్పుడూ, బిడ్డకి వాళ్ళని యేడిపించాలని కోర్కె కలుగుతుంది.

అల్లరి పనులవల్ల కలిగిన ఆనందంకన్న వున్నతమైన ఆనందమిచ్చే కార్యాలున్నాయని చూపడం పెద్దవాళ్ళ విధి. పెద్దవాళ్ళ ఆజ్ఞలకన్న అయిష్టంకన్న దెబ్బల భయంకన్న బలంగల అమోఘాలైన మహాశక్తులు బిడ్డల్ని అనేక కార్యాలకి పురిగొల్పుతో వుంటాయి. ఆ శక్తులు మంచివి; గొప్పవి, అవసరమైనవి. కాని అవి సరైన మార్గాల నడవకపోతే, బిడ్డకీ, ఇతరులకూ క్షోభ కలిగిస్తాయి. వాళ్ళ అల్లరికంతా అదేకారణం. పెద్దవాళ్ళు యెంత వాటిని నిర్మూలం చెయ్యాలని చూసినా, అవి నిర్మూలం కావు. బిడ్డే నిర్మూలమౌతాడు మధ్య. ఆ శక్తుల్ని, అర్థంచేసుకుని వాటిని క్రమమైన మార్గాల ప్రవహింపచెయ్యడం పెద్దవారి విధి. పిల్లలపనులు అల్లరి కాకుండా చేసుకోడం పెద్దవారి తెలివిలో వుంది. బైట బంతులెగరేస్తే ఆట. ఇంటో యెగరేస్తే అల్లరి. అంతే భేదం. బిడ్డని యేంచేపినా సరే, బంతు లెగరెయ్యడం మానదు. బంతు లెగరెయ్యనిపిల్ల పనికిమాలినది. బంతు లెగరెయ్యకుండా అదిమితే, బిడ్డ పనికిమాలినదౌతుంది. కనక బైటనే బంతు లెగరేసేట్టుగా బిడ్డని శిక్షణలో వుంచడమే నేర్పరితనం. ఒకపనే ఒకవిధంగా చేస్తే మంచిది; ఇంకొకవిధంగా చేస్తే అల్లరి అవుతుంది. బిడ్డ చేసేపని అల్లరిగా పరిగణించడానికి పెద్దవారి తెలివితక్కువ ముఖ్యకారణం.

క్రమమైన శిక్షణకి ముఖ్యం సరైన అలవాట్లు. మంచి అలవాట్లని చేశారా, ఇంక అల్లరి లేదన్నమాటే. ఇంకా అలవాట్లుగా యేర్పడని

కొత్త విషయాలు బిడ్డ యెదుగుతున్నకొద్దీ సంభవిస్తో వుంటాయి. ఆ కోర్కె లన్నిటినీ బిడ్డ అణుచుకోవాలని పూర్వాభిప్రాయం. తంతామనే భయంవల్ల బిడ్డల్ని సాధిస్తారు. కాని అది సరైన మార్గం కాదు. ఆ కోర్కెలు అక్రమమైనవైతే, అవి అణుచుకోడంవల్ల ప్రస్తుతం కష్టం కలిగినా, ముందు సుఖం కలుగుతుందని బిడ్డలు నేర్చుకునేట్టు చెయ్యాలి. ఆ భవిష్యత్సుఖం కోసం యీ వర్తమాన సౌఖ్యాన్ని బిడ్డ వొదులుకోవాలి. ఎవరన్నా తినడానికి పళ్ళిస్తారు. అప్పుడే అవి తినక భోజనందాకా దాచుకోడం అలవాటు చేసివుంటే, దాచిపెట్టుకుంటుంది; అప్పుడే తింటామనే అల్లరి వుండదు. ఆ అలవాటు యేర్పడి వుండకపోతే "భోజనంలో కలిపి తింటే, యింకా బాగుంటుంది. అప్పుడు చాలా తినవొచ్చు. ఇప్పుడు తింటే అజీర్ణం" అని తెలియచేసి, ఆ కోర్కెని అణుచుకోడం నేర్పాలి. అలవాటు ఐన విషయంలో పెద్దవారి జోక్యమే అఖ్ఖర్లేదు; బిడ్డే సరిగా చేస్తుంది. కనక మంచి అలవాట్లని వృద్ధిచెయ్యడమూ, చెడు అలవాట్లని తప్పించడమూ ముఖ్యమైన పని.

పుట్టిన ఆర్నెల్ల లోపున బిడ్డ అల్లరి యెరగదు. కనక ఆ వయసు లోపల శిక్షలు వుండవు. అంతకన్న చిన్నవయసులో కూడా, బిడ్డల్ని కొట్టే మాతృదేవతలు లేకపోలేదు. బిడ్డ కొంచెం గుర్తించడం తొమ్మిదో నెల నించి మొదలు. అప్పుడు చెడ్డపని చేసినప్పుడు పెద్దవారి ముఖంలో అయిష్టమూ, మంచిపనికి సంతోషమూ కనపరిస్తే చాలు.

సంవత్సరం నిండితేనేకాని, తప్పు చేసిందని బిడ్డపైన పూర్తిగా కోపం చూపకూడదు. ఒకసారి కోపం చూపి వూరుకోవాలిగాని, అదే పనిగా పీడించకూడదు.

ఎప్పుడూ ప్రేమగా సంతోషంగా, స్నేహంగా పిల్లయడల, వుంటే కొంచెం కష్టం. కోపం, విచారం, విముఖత్వం చూపితే చాలు; అంత కన్న శిక్ష అఖ్ఖర్లేదు. సాధించడం, పిసినించడం, తృణీకరించడం,

వెక్కిరించడం, ఇవేమీ యేమాత్రమూ పనికిరావు. కోపం చూపేప్పుడు కంఠం హెచ్చించకూడదు. సాధారణమప్పటికన్న తగ్గించాలి.

శిక్షించే పరిస్థితులూ, శిక్షించే 'ఎట్మాస్ఫియర్' వుండనీకూడదు.

బిడ్డ తప్పు చేస్తే, కోపం తెచ్చుకోకూడదు. పెద్దవారు ఆ పనిని తమ యడల అపరాధంగా చూసుకోకూడదు. తమ ఆధిక్యత మరిచిపోవాలి. బిడ్డ యేంచేసినాసరే కోపం తెచ్చుకోకుండా తమని తాము శిక్షణలో పెట్టుకోవాలి. కోపంపోతేగాని శిక్ష కూడదు. ఎప్పటిప్రేమ బిడ్డమీద కలిగింతరవాత విచారించాలి ఆ తప్పు. అల్లరి అవస్థలో బిడ్డ పడ్డదే అని జాలీ ప్రేమా కలగాలి, జబ్బుగావున్న బిడ్డమీద కలిగినట్టే. బిడ్డకి అధైర్యమూ భయమూ కలగచెయ్యకూడదు. స్నేహమూ సానుభూతి చూపాలి. వాని స్థితిలో తామున్నట్టుగా పెద్దవారు యోచించుకుని, బిడ్డ యెందుకా అల్లరి చేసివుంటుందో యోచించాలి. ఒకవేళ తన 'యిన్‌స్టింక్ట్సు' వల్ల అట్లా చేసిందేమో! బిడ్డ బైటతిరిగివొచ్చినందుకు కొట్టేవాళ్ళున్నారు. సృష్టిలో తిరగాలని కొందరూ, స్నేహితులమీది ప్రేమచేత కొందరూ, యింటివద్ద పరిస్థితులు బావుండక కొందరూ, తన ఆటశక్తుల్ని వుపయోగపరుచుకునేందుకు కొందరూ, బైటికివెడతారు పిల్లలు. ఈ సంగతు అర్థంచేసుకోక, వాళ్ళని దండించడం అన్యాయం. దెబ్బలన్నా తింటారుగాని వెళ్ళడం మానరు. ఆ యిన్‌స్టింక్టు, అంత బలమైనది. పిల్లని తనకి లోబరుచుకుని ఆడిస్తుంది. ఆకలిగొన్నకుక్క యెన్నిదెబ్బలన్నా తింటుంది గాని, అన్నంవెతకడం మానుతుందా? బిడ్డఅల్లరి తన 'యిన్‌స్టింక్టు'ప్రకారం చేస్తే, దాన్ని యింకో అపాయంలేని మార్గాన తిప్పడానికి ప్రయత్నం చెయ్యాలి. బిడ్డ బైటికెడితే యెందుకు శిక్ష బిడ్డకి? అపాయం కలుగుతుందని, కనక అపాయం కలగకుండా యెవరినన్నా వెంట పంపాలి, లేకపోతే, యింటిదగ్గిరే బిడ్డని ఆకర్షించేందుకు ఆటలు కల్పించాలి. 'బిడ్డ యిన్‌స్టింక్టు' కారణం కాకపోయిన విషయాల్లో, పిల్లని నెమ్మదిగా పిలిచి,

యెందుకు చేసిందో అడగాలి. అల్లరిపని చెయ్యగానే పిలవాలి. ఆలస్యం చేయకూడదు. 'యింకా అల్లరి యెక్కువై యీసారిచేస్తే చూద్దాంలే' అని వూరుకోకూడదు. ప్రేమతో అడిగితే చెప్పుతుంది. చాలసార్లు దానికే తెలీదు. అప్పుడు కొంచెం ప్రశ్నలువేసి దాని మనసు దానికి తెలియ చెయ్యాలి; అది చేసినపని యెందుకు తప్పో, ఆబిడ్డే చెప్పేట్టు చెయ్యాలి; కాని వాదన పెట్టుకోకూడదు.

'యిన్‌స్టింక్టు' మంచిత్రోవల మళ్ళించే మార్గం ఆలోచించాలి. కత్తెరతో పంచలు కత్తిరించాడు. 'యెందుకు కత్తిరించావు?' అని అడిగితే అతనికే తెలియకపోవొచ్చు. కత్తెర వుపయోగించాలనే చేతి దురద సహజం. కనక కాయితాలిచ్చి, పిచ్చిబట్టలనిచ్చి, పంచల్నివొదిలి, వాటిని కత్తిరించమనాలి. బిడ్డ బియ్యం పారపోశాడు. యెందుకు? చీమలకనో ఆటకనో అంటాడు. 'అట్లా పారపొయ్యకూడదు. పెద్దవారి నడిగి, కొంచెంగా తీసుకువెళ్ళవొచ్చు' అనాలి. బియ్యం విలవ తెలియచెయ్యాలి.

పెద్దవాళ్ళుచెప్పినా, తనుచేసినపని యెందుకు తప్పో తెలుసుకోకపోతే పెద్దవాళ్ళ మాట విని తప్పుని వొప్పుకుని, ఆ పని చెయ్యననాలి.

ఇంకో కొత్తఅల్లరిచేస్తే, మళ్ళీ యింతే. కాని చెయ్యనన్నపని మళ్ళీ చేసిందనుకో. దానికి మూడే కారణాలు:

1. మరిచిపోవడం.
2. చాతగాకా, నిశ్చయశక్తి లోపంచేతా.
3. నిర్లక్ష్యంవల్లా.

యే కారణమో అడిగి తెలుసుకోవాలి. కారణం పెద్దవాళ్ళు బిడ్డకి సూచించకూడదు. మరిచిపోవడమైతే, యీసారి మరిచిపోకుండా జ్ఞాపకం ముంచడానికి, యేదో వొకమాట, 'మరిచిపోను,' మొదలైనవి అనడమో, రెండునిమిషాలు వూరికే నుంచోడమో, యీసారి చేస్తాననిపించాలి. పాఠం మరిచిపోయినట్టే ఆబిడ్డ తనకి వుపయోగకరమైన పని మరిచిపోయినట్టే

వుండాలి. మిఠాయి తినడం మరిచిపోయినట్టే, అంతా ఆటగా ఉండాలి. శిక్షగా కనపడకూడదు. జ్ఞాపకముండడానికి యేంచేస్తుందో బిడ్డచేతే చెప్పించాలి. బలవంతంలాగుండకూడదు. బిడ్డే తనకి తాను శిక్ష విధించుకోడం చాలా వుత్తమమైన పద్ధతి.

తక్కిన రెండుకారణాలూ బిడ్డ తను అర్ధంచేసుకొని చెప్పలేదు. కనక పెద్దవారే అర్ధంచేసుకోవాలి.

బలహీనత్వంచాత లోబడితే, దానికికారణ మాలోచించాలి. చక్కెర తింది. యిదివరకు తిననంది, మళ్ళీ తింది. ఎందుకు ? తినాలనిపించింది. దానికి శిక్షలేదు. భోజనంలో మిఠాయిపెట్టాలి. యింకా తినడం మానలేదు. ఇంకా చక్కెర తినాలనే వుంది. అది ఆరోగ్యంకాదు. కనక నిగ్రహించుకోవాలి. కనక చక్కెరతినేబుద్ధి పుట్టినప్పుడు పెద్దవాళ్ళదగ్గిరికి వొచ్చి చెప్పాలి. పెద్దవాళ్ళు యింక వెగటుపుట్టేట్టు బాగా తినిపించడం ఒకమార్గం, కొంచెం కొంచెం తగ్గించి పెట్టడం రెండోది. నిగ్రహించుకోవాలని చెప్పి, నిగ్రహం క్రమక్రమంగా నేర్పాలి. "నీకు యీ పని చెయ్యకండా వుండడం చాతకావటంలేదు. కనక నేను సహాయంచేస్తాను. మనిద్దరమూ కలిసి యీ కోర్కెని నిగ్రహించేశక్తిని తెచ్చుకోవాలి" అనాలి. నిగ్రహించుకోవలసిన కారణం చెప్పాలి. 'చక్కెర తినడం అనారోగ్యం. కనక మితం నేర్చుకోవాలి. లేకపోతే అంత చక్కెర కొనడానికి డబ్బులేదు, కనక నిగ్రహం నేర్చుకోవా'లని బోధించాలి.

నిర్లక్ష్యంవల్ల చేస్తే భయపెట్టాలి. కొంచెం కోపం చూపడం అన్నిట్లోకి గొప్పశిక్ష. అంతకన్న యేమాత్రమూ భయపెట్టకూడదు. ఆ పని మళ్ళీచేస్తే, బిడ్డ తను నిర్ణయించుకున్న శిక్షని తా ననుభవించాలి. ఒకపూర మానడమో, కొంచెం ఒకమూలనుంచుని ఆలోచించడమో, మొదలైనవి.

బిడ్డ చెయ్యకూడనిపని చేసినప్పుడు సహజంగానే శిక్ష కలిగేట్టయితే ఆశిక్ష కలగనియ్యాలి; పెద్దవారికి ఆయాసమే వుండదు. ముందుమాత్రం

'వారన్' చెయ్యాలి. 'ఆ బండమీద కాలు జారవొచ్చు, వెళ్ళకు' అంటారు. వినక బిడ్డ వెడతానంటే, ఆపనక్ఖర్లేదు. వెళ్ళనియ్యాలి. పడితే పడుతుంది. అదే శిక్ష. రోడ్డుమీదవాళ్ళ నెవరినన్నా బిడ్డ తిడుతుంది. ఇతరులను తిట్టడం మంచిపనికాదని చెప్పవొచ్చు? కాని ఆమాట వినక తిడతానంటే 'తిడితే వాళ్లు కొట్టవచ్చు' అనాలి. కాని అడ్డపెట్ట నక్ఖర్లేదు. వాళ్ళొచ్చి ఒకవేళ పెద్దవాళ్ళతో చెపితే, 'ఆబిడ్డ మామాట వినలేదు. మీరే శిక్షించండి' అనాలి.

క్రమంగా పెంచిన బిడ్డ అలివిగాని అల్లరి యెన్నడూ చెయ్యదు. చాలా పెంకెతనమూ, దూకుడూ, తిరగబాటుచేస్తే, గదిలోకిపోయి గ్రహం వొదిలింతరవాత రమ్మనాలి. వెళ్ళకపోతే పంపాలి. అసలు భక్తిగలిగి యేమాత్రము శిక్షణలో పిల్లపున్నా వెళ్ళనను. వెళ్ళనన్నా, కోపం కనపరచకూడదు. 'నీకీ దుర్గుణం పోవాలి, తప్పదు. యిదే చికిత్స మందు' అనాలి. బిడ్డకేదో జబ్బుచేసినట్టూ, పెద్దవాళ్ళు దానికి ప్రేమతో మందులిస్తున్నట్టుండాలి. బిడ్డకేదో అల్లరిఆపద కలిగినట్టూ, అది యింకా ఆ ఆపదలో పడిపోకండా పెద్దవాళ్ళు కాపాడడానికి ప్రయత్నంచేస్తున్నట్లుండాలి. యిట్లా చెయ్యడంవల్ల తలితండ్రులపైన బిడ్డకి విరోధం కలగదు, కురుపులేస్తే, కోసి బాధకలిగించినట్టే.

అందరితో అన్నం తినకపోవడం యింకోశిక్ష. కాని యీ పద్ధతిని చాలా సకృతుగా వాడాలి.

'యీసారి యిట్లాచేస్తే, నిన్ను యీప్రకారం శిక్షిస్తానంటే, అట్లాగే శిక్షించితీరాలి. బెదిరించేప్పుడే ఆలోచించి తగిన శిక్షతోనే బెదిరించాలి. మాట నిర్లక్ష్యంచేసి, ఆ తప్పే చేస్తే, ఆశిక్షని విధించితీరాలి. వీపు బద్దల కొడతానంటే బద్దలుకొట్టి తీరాలి. 'ఆ శిక్షభయంవల్ల బిడ్డ ఆ అల్లరిపనిని మానేస్తుందిలే. పెద్దశిక్షతో వూరికే బెదిరిస్తేనేం? ఆ శిక్షే అవసరముండ

దని' ఆశపడి, అలివికాని శిక్షలతో, అన్యాయమైన శిక్షలతో బెదిరించ కూడదు.

బిడ్డచేసిన అల్లరికి 'ప్రపోర్షనేట్' గా వుండాలి శిక్ష, ఆ పిల్లచేసిన పనుల పర్యవసానాలపైన ఆధారపడకూడదు. అగ్గిపుల్లతో ఆడడం తప్పే ఐతే, ముందే ఆ ఆటని ఆపాలి. కాని ఆదేప్పుడు బద్ధకించి వూరుకుని, తీరా యేదన్నా తగలపడితే మాత్రం, అప్పుడు శిక్షించకూడదు. పిల్ల కర్రతో ఆడుతున్నంతసేపూ వూరుకుని, కర్రతగిలి అద్దం పొరపాటున బద్దలైతే, కర్రతో ఆడినందుకు శిక్షించకూడదు.

గదిలోకి పంపడంకన్న, కొంచెం అవమానించడంకన్న, యెక్కువ శిక్ష యెప్పుడూ వుపయోగించకూడదు. సరిగా మొదటినించి శిక్షణలో వుంచితే యీ శిక్ష అవసరమే వుండదు. కాని యెంతచెప్పినా, అనాదిగా వొస్తున్న శిక్షలూ, తిట్లూ, దెబ్బలూ యిప్పుడు మానెయ్యమంటే పెద్దలు మానరు. దెబ్బలు చాలా సులభమైన పద్ధతిగా కనపడతాయి. అదిగాక కొట్టకండా పెంచేపద్ధతి కొత్తది. భూతాల్ని, భూకంపాల్ని చూస్తే ఎంత భయమో కొత్తపద్ధతుల్ని చూస్తే అంతభయం ప్రజలకి, యేమో! దెబ్బలు లేక పిల్ల చెడిపోతే? యింతేగాక, తిట్టే, కొట్టే, అలవాట్లో పడతారు పెద్దవాళ్ళు, కోపం రాగానే పిల్లవాడి వీపుమీద చెయ్యిజాడిస్తేనే గాని వూరుకోలేరు. లేకపోతే చెయ్యితిమ్మిరి వొదలడమెట్లా? బూతులు తిట్టాలి. లేకపోతే నాలికదురద యెట్లా వొదులుతుంది? బిడ్డ ఆ పనులేం, ఆనార ణాల వల్లనే చేస్తే ఎన్నితన్నులు! కోపం అణుచుకోవడం యెంతశ్రమ! యెందుకదంతా? యిష్టంవొచ్చినన్ని తన్నులు తినేందుకు నోరులేని, దిక్కుమాలిన పిల్లలు చేతికింద వున్నారుగా! అదిగాక దెబ్బలెంత సులభ మైన పద్ధతి! అల్లరిచేసినకొద్దీ బాదితే, యెవరికోసం వూరుకుంటుంది పిల్ల పైగా యీ దెబ్బలు పిల్ల వుపయోగార్థమేనని సంతుష్టి. ఈ తలిదండ్రు లకి చాలమందికి ప్రేమవుంటను. పుత్ర 'సెన్టిమెంటు'వున్న ప్రేమంతా

తమమీదనేగాని, బిడ్డలమీద ప్రేమవున్నదనడం శుద్ధఅబద్ధం. ప్రేమలేదని వాళ్ళకే తెలీదు. ప్రేమలేదని యెవరన్నా అంటే వాళ్ళు రాక్షసులలాగు కనపడతారు.

శాస్త్రాలతోనూ, పురాణాలతోనూ, కథలతోనూ, నీతుల్తోనూ, బోధించి, పూజించిన, తలిదండ్రులకు బిడ్డలమీద వుందనే ప్రేమకన్న అబద్ధం యింకోటిలేదు. నిజమైనప్రేమ యెప్పుడూ, ఇతరుల సౌఖ్యానికై ప్రయత్నిస్తుంది. ఆ సౌఖ్యంకోసం ఏ త్యాగాన్నైనా చెయ్యడానికి వెను తియ్యదు. నిజమైనప్రేమేవుంటే, యిన్నివందల సంవత్సరాలనించి బిడ్డల్ని కొడుతోనే వుంటారా ? బిడ్డల్ని కొట్టడంవల్ల తలిదండ్రులకి బాధ కలుగు తోందా ? కొట్టడం తప్పనిసరి అయిందికదా, అని దుఃఖపడుతున్నారా ? కొట్టకండా వీలులేదా, అని వుపాయాలు వెతుకుతున్నారా !

బిడ్డని కొట్టడంవల్ల పెద్దవారికి ఆనందం కలుగుతుంది. కొట్టాలనే వాంఛ వారి మనసుల్లో వుంది. కోపంరాగానే యితరులని కొడితే మళ్ళీ కొడతారు. దిక్కుమాలిన బిడ్డ మళ్ళీ కొట్టలేదు. కొట్టాలనే దుర్వాంఛవల్ల బిడ్డల్ని బాదే వుపాధ్యాయు లున్నారనేసంగతి విద్యాధికారులు వొప్పుకొని, కొట్టకూడదని శాసించారు. అట్లానే కొట్టేసంతోషంకోసం, తమకోపాన్ని తీర్చుకునేంధుకు; కసితీర్చుకునేందుకు సమస్తమైన విద్యాధికులు, జ్ఞాన సంపన్నులు, దయామయులు, పుణ్యాత్ములైన తండ్రులందరూ బిడ్డల్ని బాదుతున్నారు, వొళ్లతెలీక. ఈ ఘోరకార్యంలోవుండే యీ నీచత్వము, యీ పశుత్వం బయలుపడుతుందేమోనని, ఈ క్రూరదండనలకి, శిక్షణా, దయా, ప్రేమా, మాతృప్రేమా, అని పవిత్రమైన పేర్లుపెట్టి సమర్థించు కుంటారు. దెబ్బలు లేకపోతే చెడిపోతారని తమ మనసుల్ని తామే మోసపుచ్చుకుని సుఖిస్తారు.

బిడ్డ చచ్చింతరవాత కాని ఆ ప్రేమ బైటపడదు. ఆదుర్దా, 'సెంటి మెంటు' బిడ్డద్వారా తమ స్వలాభాన్ని తీర్చుకునే వాంఛా, వుంటాయి

వాటినే ప్రేమ అనుకుంటారు. ప్రేమవున్నవాళ్లు బాదరు. కోపమేగాదు వాళ్ళకి, దెబ్బలుకొట్టడం పశుత్వం, స్వరక్షణార్థంతప్ప యెవరినన్నా సరే, చెయ్యిచేసుకునేవాళ్లు కుమ్ముకునే పశువులకన్న అధమం. అందులో దిక్కు లేక అసహాయులై, సంపూర్ణ విశ్వాసంతో పెద్దవారిమీద ఆధారపడ్డ పిల్లల్ని కొట్టేవారంత పరమనీచులెవరూ వుండరు. ప్రేమవల్లకాదు కొట్టేది. వాళ్ళతెలీనికోపం, అహంభావం, వీటివల్ల కొడతారు. కొట్టడంవల్ల పెద్ద వారిలో క్రూరత్వం వృద్ధి అవుతుంది. అదిగాక వారికి తెలీకండానే పెద్ద వారికి ఈర్ష్యవుంటుంది, మనం దెబ్బలతో పెరిగామే, దెబ్బలు లేకండా మన పిల్లలెందుకు పెరగాలి అని.

తరతరాలనించీ వొస్తో, తమ తండ్రినీ తాతనీ, ముత్తాతనీ, తమనీ వుద్ధరించిన యీ సనాతనాచారమైన దెబ్బల్ని వొదిలి, యీ కొత్తకిరస్తానీ పద్ధతుల్లో ప్రవేశిస్తే యే దేవుళ్ళకి కోపమొస్తుందో, యేం అశుభమవుతుందో, బిడ్డ చెడిపోతాడో!

పిల్లలకి, తలిదండ్రులకీ ఏ విశ్వాసమూ స్నేహమూ వుండడం అతిముఖ్యమో, అవి యీ దెబ్బలతో నశిస్తాయి. అంతటితో శిక్షావిధాన మంతా మట్టితో కలుస్తుంది.

బిడ్డలోవుండే దృఢత్వమూ, ధైర్యము, శ్రద్ధ, చచ్చి "కొట్టొద్దు, కొట్టొద్దు" అని కాళ్ళుపట్టుకుని యేడ్చే నీచజీవిగా తయారౌతుంది, దెబ్బ కొడితేగాని చెప్పినమాటవినదు. కోమలత్వమూ, 'డెలికెసీ' దయా పోయి క్రూరజీవి అవుతుంది. పెద్దదైనా దెబ్బలనేటప్పటికి దడిసి, లొంగి పోతుంది. పిరికిదవుతుంది. తనూ యితరుల్ని కొడుతుంది. యీ యుద్ధాలూ, హత్యలూ, అన్నీ చిన్నప్పుడు దెబ్బలుతిన్న పిల్లలవల్లనే జరుగు తున్నాయి.

కనక కొట్టడమనేదీ తిట్టడమనేదీ శిక్షణావిధానంలోంచి తీసేస్తేనే గాని లాభంలేదు. బిడ్డని కొట్టారా, మళ్ళీ బిడ్డలవాత వెంటనే దెబ్బలు తినాలి. కొట్టడం తప్పని వొప్పుకోవాలి.

# ఆట

పిల్లల ఆటలకి యెన్నడూ యే వయసులోనూ, ఆటంకం చెయ్య కూడదు. ఒకటిన్నర సంవత్సరం వొచ్చేవరకూ పిల్లలు వాళ్ళంతట వాళ్ళే వొంటరిగా ఆడుకుంటారు. పెద్దవాళ్ళు వూరికే వాళ్ళని వూసుకుని యెత్తుకుని, ఆడించి పాడుచెయ్యకపోతే చాలు. ఎన్నడూ బిడ్డని అనవ సరంగా ఆడించడం బాధించడంకూడదు. బిడ్డవంక చూడక, మాట్లాడక ఆడుకోనివ్వాలి.

పసితనంలో ఆడుకోడానికి సామాగ్రి యేమీ అక్కర్లేదు. కాని నాల్గు నెలల నించి బిడ్డకి బొమ్మల సరదాయెక్కువ. ఏడాదినించి బిడ్డ వస్తువులతో. ఆదేపనిగా వాటిని ఉపయోగిస్తూ ఆడుతుంది. బిడ్డ అడగ్గానే యియ్యడానికి వీలైన వస్తువల్లా ఇవ్వాలి. ఇవ్వడానికి వీల్లేనివైతే, ఖరీదు వైతే, అట్లాంటివే చవకవి చేయించీ, వంటవస్తువు లడిగితే అట్లాంటివే పిడతలిచ్చీ, కలం కాయితా లడిగితే పనికిరానివియిచ్చీ, చాకులవంటి అపాయకరమైనవి అడిగితే, అపాయం కలగకండాచేసి, యిచ్చీ, బిడ్డని సంతుష్టిపెట్టాలి. తెగని కత్తులూ, మందులేని పిప్పుపుల్లలూ, ఖరీదులేని పుస్తకాలూ మొదలైనవి. బిడ్డకు యెట్లాంటి వొస్తువులమీద అభిలాషో కనిపెట్టి అవి యివ్వాలి. నీళ్ళమీద యిష్టమైతే, యింటోనీళ్ళు పారపొయ్య వద్దనిచెప్పి, వేరే కుండలో దూరంగా నీళ్లుంచి ఆడుకోమనాలి. బురద యిష్టమైతే అది యిచ్చి ధూరంగా ఆడుకోమనాలి. అగ్గిపెట్టె యిష్టమైతే, బట్టలు తీసేసి తగలపడేవి యేమి లేకుండాచూసి ఆడుకోమనాలి.

పెద్దవాళ్ళవొస్తువులు ఆటకి యివ్వకూడదు. యిస్తే పాడుచేసినా వూరుకోవాలి. ఒక్కొక్కప్పుడు పిల్లలు వాళ్ళ ఆటలతో పెద్దవారికి యిబ్బంది కలుగజేస్తారు. అప్పుడైనా ఆ యిబ్బంది తప్పే విధం ఆలో

చించాలి. కాని, పిల్లల్ని ఆట మానమనకూడదు. మధ్యాహ్నం పెద్ద వాళ్ళు నిద్రపొయ్యేటప్పుడు డబ్బా కొడితే, దూరంగా కొట్టుకోమనాలి.

బిడ్డ ఆట నెన్నడూ అభ్యంతరపరచకూడదు. ఏదో వొకటి తన చేతులతో చెయ్యాలనే అణచరాని గొప్ప ప్రోద్బలం బిడ్డని ఆడిస్తో వుంటుంది. ఆ వుత్సాహం ఆ మహాశక్తిని యెట్లాగో వొకలాగు బిడ్డ వుపయోగించకండా వుండలేదు. కదలకండా విగ్రహాల్లాగు కూచోలేడు. కనక యిట్లా వొస్తువులిచ్చి ఆ శక్తిని సరియైన మార్గాల ఉపయోగించక పోతే యేదో ఒక వక్రమార్గాన అది వ్యయంచేస్తారు. పెద్దవారు వస్తువులు యివ్వకపోతే పెద్దవారి వస్తువుల పాడుచేస్తారు. దానికి పిల్లల్ని శిక్షించడం అన్యాయం. ఆ శిక్షవల్ల అనేక దుర్గుణాలు కలుగుతాయి. అమూల్యమైన ఆటశక్తి చచ్చిపోతుంది. ఈ పనులు వారిచే చేయించే సహజశక్తి ముందుముందు మేధాశక్తిగా ప్రయోజక శక్తిగా మారుతుంది. బలవంతంగా బిడ్డని ఆటలనించి బంధించాడా బిడ్డ యెదిగినకొద్దీ మొద్దవుతుంది. బిడ్డ సోమరిగా పెద్దవారి పనులలో కలవ కూడదు. 'ఏం చెయ్యను? ఏం తోచడం లేదు.' అనే స్థితికి రాకూడదు, పిలిచినా పలకనంత ఆసక్తితో పొద్దస్తమానం ఆడాలి.

బిడ్డకు ఆటలకై సామానుల్ని విరివిగా యివ్వాలి. గొప్ప ఖరీదైన వొస్తువులూ బొమ్మలూ అక్కర్లేదు. వాటిని కొంచెం దాచి తమాషాకి వాటిని చూపాలి. అద్దాలబీరువాలో అందానికి వుంచాలి. అంతేకాని రోజూ ఆడుకునేందు కియ్యకూడదు. కొయ్యముక్కలు, పిడతలు, గిన్నెలు, యిసిక, మన్ను, నీళ్ళు, కాయితాలు, అట్టలు, గుడ్డపీలికలు, పూసలు, యివ్వాలి. కొన్ని వస్తువులతో బిడ్డ యేదోచేసి ఆడుకునేట్టుండాలి గాని, ఆ బొమ్మ యేహో చేస్తోవుంటే, బిడ్డ వూరికే కూచుని ఆనందించేట్టు వుండకూడదు. కీ యిస్తే తమాషాచేసే రైళ్ళు, బొమ్మలూ వృధా. పైగా బిడ్డమనోవృద్ధికి చెరుపు.

కొంచెం పెద్దది కాగానే, తక్కిన పిల్లలతో కలిసి తన ఆటవస్తువుల్ని బిడ్డ తనే తయారు చేసుకోవాలి. యిళ్లు, మంచాలు, చొక్కాలు, పరుపులు, గూళ్ళు, బుట్టలు, పడవలు మొదలైనవి. సీమసున్నమిచ్చి బల్లమీద, నేలమీద బొమ్మలు గీయించవొచ్చు. మళ్లు తవ్వించడం మొక్కలు నాటించడం, నీళ్ళు పోయించడం, దూడలకీ పావురాలకీ కోళ్ళకీ మేత వేయించడం చెయ్యవొచ్చు. వంటలో సహాయం చేయించుకోవొచ్చు. యిదంతా ఆటగా చేసినప్పుడే పిల్లలు సంతోషంగా చేస్తారు. వాళ్లు ఆటగా చేసేపనే, బలవంతంగా చెయ్యమనగానే వాళ్ళకి కష్టమవుతుంది. వూరికే వొస్తువుల్నిచ్చి, ప్రోత్సాహం వాళ్ళకే కలిగేట్టు చెయ్యాలి. పెద్దవాళ్లు చేసి చూపించి ప్రోత్సాహం కలిగించవొచ్చు. ఆటలరూపాన యింటికి, కావలసిన పనులన్నీ చేయించుకోవచ్చు. వాళ్ళతో కలిసి పెద్దవాళ్ళు అప్పు డప్పుడు ఆడాలి. కాని వాళ్ళయిష్టాలు చూస్తో వాళ్ళ ఆజ్ఞలకు లోబడి ప్రవర్తించాలి ఆటల్లో, పెద్దవారు.

యిట్లా ఆడవలసిందేగాని, బిడ్డ తాను చేసికోగలిగిన పనికాని ఆట గాని వొక్కటీ పెద్దవాళ్ళు చేసిపెట్టకూడదు. కంచాలు పెట్టుకోవడం, అన్నం వడ్డించుకోడం, నీళ్ళు పోసుకోడం, బట్టలు వేసుకోడం, మొదలైనవన్నీ వాళ్ళే చేసుకోవాలి. ఆటల్లోకూడా బిడ్డలకి కొత్తవుత్సాహం కలగడానికి వాళ్ళకి చాతకాని పనులకు మార్గంచూపి వాళ్ళని చెయ్యమనాలి. ఆ పనులు సరిగా చెయ్యలేకపోయినా బిడ్డే చెయ్యాలి. నౌకర్లూ, ముసిలమ్మలూ, సహాయం చేస్తో సోమరిగా పెరిగిన పిల్లలంత నిష్ప్రయోజకులెక్కడా వుండరు.

పిల్లకి మూడేళ్ల వొచ్చేటప్పటికి తల్లితోపాటు యింటిపనులన్నీ చేస్తో తోడ్పడాలి బిడ్డ. తల్లి ఇంటిపనులు చేస్తో బిడ్డని వెంటతిప్పుకుని తనతో పనులు ఆటవలె చేయించుకోవాలి. దీనికి చాలా తెలివీ, ఓర్పూ, నేర్పూ కావలసి వుంటుంది. పెద్దవారికి సహాయం చెయ్యాలనే విధికింద

గాక, ఆటలకింద అలవాటైపోవాలి. ఆటలలో వుపయోగించే ప్రోద్భ లాన్నే యీ పనులకు మళ్ళించేట్లు చెయ్యడమే తెలివి. అన్నిపనులూ పెద్ద వాళ్ళచేత చేయించుకుంటో, తాముమాత్రము సహాయం చెయ్యని బిడ్డలు చాలా దౌర్భాగ్యులు. కాని పని చెయ్యమని బిడ్డని నిర్బంధించకూడదు.

## తక్కిన పిల్లలు

బిడ్డకి రెండేళ్ళు రాగానే స్నేహితులు కావలసివొస్తారు. నేర్పరి తనమూ, పనివాడితనమూ, సంపాయించాలనీ, లోకంలో తాను అనేక పనులుచేసి, శక్తిసంపాయించాలనీ, గొప్పతనాన్ని పొందాలనీ వుంటుంది. బిడ్డకి యీ సహజవాంఛని సాఫల్యపరచుకునేందుకు, అనేకమంది పిల్లలతో కలిసి ఆటలు ఆడడం ముఖ్యం. తాము రాజులైనట్లూ, వీరులైనట్లూ, రైలుయింజనులైనట్లూ, రాక్షసుల్నీ, పర్వతాల్నీ సాధించినట్లూ, ఆటలు కల్పించి ఆడుకుంటారు. పెద్దవారుకూడా యింకా వారికి భావనా శక్తి తోడ్పడించి మాయకథలను కల్పించి బిడ్డల్ని ఆడించాలి. అందరూ కలిసి ఆట వొంతెనలూ, గోతులు, చెట్లు, కంచెలు, కాలువలు చెయ్యడం, చిన్న నాటకాలు, పాటలు, తమాషాయాత్రలు, మొదలైనవి ఆడడం మంచిది.

ఒకటిన్నరయేడు వొచ్చినప్పటినించి మూడేళ్ళు వొచ్చిందాకా పిల్లలకి వాళ్ళకంటే కొంచెంగా పెద్దపిల్లలతో స్నేహం అవసరం. వాళ్ళని అనుకరించి చాలా జ్ఞానాన్ని సంపాయిస్తారు.

మూడేళ్ళనించి ఆరేళ్ళదాకా వాళ్ళకంటె చిన్నపిల్లల స్నేహం అవసరం. చిన్నవాళ్ళతో మెలగడంవల్ల కొన్ని సుగుణాలు అలవడతాయి.

చిన్నపిల్లల్ని గొప్పచేసి, వాళ్ళని పెద్దపిల్లల్ని ఏడిపించేట్లు చెయ్య కూడదు. పెద్దపిల్లల్ని కొట్టినా, వాళ్ళజోలికిపోయినా, ఆ పెద్దపిల్లలు చిన్న పిల్లల్ని తన్నవొచ్చు. కాని కారణం లేకండా బాధించకూడదు. పెద్ద

పిల్లలచేత, ఆటల్నీ, బొమ్మల్నీ చిన్నపిల్లలకోసం బలవంతంగా త్యాగం చేయించకూడదు.

నాలుగేళ్ళనించి సమానవయస్కులు అవసరం, కనక పిల్లల్ని ఆ వయసునించి బడికిపంపాలి. చాలా బలహీనులూ, గొప్ప మేధాశక్తి వంతులూ, భయస్థులూ తప్ప తక్కిన పిల్లలందరూ బడికి వెళ్ళితీరాలి. పరాయిపిల్లలు యింటికి వచ్చినప్పుడు తమపిల్లల్నీ వాళ్ళనీ సమానంగా చూడాలి పెద్దవారు. దయగా ప్రేమగా ప్రవర్తించాలి. యే పిల్లలయడల నన్నా తాము నిర్దయగా ప్రవర్తించవలసివొస్తే, తమ పిల్లలకు ఆ నిర్ద యకు కారణం చూపాలి పెద్దవారు. తన ఆటవొస్తువులూ, తిండివస్తువులూ తక్కిన పిల్లలతో విరివిగా పంచుకునేటట్టునేర్పాలి, బలవంతంగా పెద్దవారు పంచకూడదు. పంచడం మంచిదనిచెపుతోవుండాలి. పెద్దవారు తమవాటిలో యితరుల కివ్వాలి. పిల్లచేత యితరులకి బలవంతంగా యిప్పించడం కంటె, స్వార్థంగా పిల్లల్ని వుండనియ్యడమే మంచిది. తమకన్న చిన్న పిల్లలకి సహాయపడేట్లూ, వాళ్ళజాగ్రత తీసుకునేట్లూ, ప్రేమించేట్లూ బాధ్యత వహించేట్లూ నేర్పాలి.

వీలైనంతవరకు పిల్లలపోట్లాటలు పిల్లల్నే తీర్చుకోనివ్వాలి. ప్రయత్నపూర్వకంగా పెద్దపిల్లలు చిన్నపిల్లల్ని యేడిపిస్తేనేగాని, పెద్ద వాళ్లు జోక్యం కలిగించుకోకూడదు, క్షమార్పణనేర్పాలి. "నన్నుకొట్టింది" అని ఫిర్యాదుచేస్తే, "పోనీలే, వూరుకోరాదూ! దాన్నేమన్నా చేస్తే నీకేం లాభం? నువ్వు వూరుకుంటే అది యీ సారి యేమీచెయ్యదు" అనాలి. క్షమించి వూరుకోడం, గౌరవం, ధర్మం అనాలి. ఆ విషయమై కథలు చెప్పవొచ్చు. కొట్టిన బిడ్డని ఆ పని తప్పని గట్టిగా ఖండించాలి. కాని దెబ్బలుతిన్న బిడ్డ, ఇన్నిచెప్పినా తాను వూరుకోనంటే పెద్దవారు అడ్డపడి వూరుకోపెట్టకూడదు. కలియపడతానంటే కలియబడనివ్వాలి. కొట్టినబిడ్డని శిక్షించమంటే ఆ బిడ్డచేత క్షమాపణ అడిగించాలి. అదీ తృప్తికాకపోతే

దెబ్బలుతిన్న బిడ్డచేత, అన్నిదెబ్బలూ కొట్టించాలి. ఆ కొట్టినబిడ్డ పరాయి బిడ్డ అయి చిక్కకపోతే, ఆ బిడ్డని ఇంటికి రానీకూడదు. తమబిడ్డని ఆ బిడ్డతో ఆడవొద్దని సలహాయివ్వాలి. సలహావినక ఆడితే, యీసారి అబిడ్డ కొడితే, పెద్దవారి బాధ్యతలేదు. కలిసి కోర్టుగాచేసి శిక్ష వేయించాలి, క్రమంగా పిల్లలు వారిపోట్లాట పిర్యాదుల్ని పెద్దవారిదగ్గిరికి తేకుండా, వాళ్ళే తగూలు తీర్చుకునేట్టు న్యాయమూ, అన్యాయమూ, క్షమార్పణా, యీ ఉద్దేశ్యాలు నేర్పాలి. పిల్లలు ఫిర్యాదుతీసుకొస్తే తప్పు, వాళ్ళ పోట్లాటల్లో పెద్దవారు జోక్యం కలుగచేసుకో కూడదు. కాని పోట్లాటల్లో కర్రలూ, రాళ్ళూ వుపయోగించడమూ, అపాయకరమైన దెబ్బలు తగిలించుకోడం యివి చెయ్యనీకూడదు. ఒకపిల్ల వోడింతరవాత యింకా కసి కొద్దీ రెండోపిల్ల కొడుతోవుంటే అడ్డంపెట్టాలి. అట్లాంటిపనికి ఆ బిడ్డ సిగ్గుపడేట్టు చెయ్యాలి. కొట్టుకోడం పశుత్వమని చెప్పుతో పెద్దవారు తామెవరినీ కొట్టక మార్గం చూపాలి.

కొందరు పిరికిపిల్లలుంటారు. బలమున్నాసరే, యీడున్నాసరే పోట్లాడరు. తన్నులుతిని, పెద్దవాళ్ళతో చెప్పుకుంటారు. అట్లాటివాళ్ళకి పౌరుషమెక్కించి,స్వరక్షణను నేర్పాలి. పౌరుషమెక్కిందాకా, దెబ్బలు తిననియ్యాలి, "నీకు చాతనైతే కొట్టు, చాతకాకపోతే దెబ్బలు తిను" అనాలి. బాధ కలిగించి భయం పోగొట్టాలి. మరీ ఇంకా చచ్చుగా దెబ్బలకి లోబడుతోవుంటే, జోక్యం కలుగచేసుకుని ఆపాలి. కొట్టేవాళ్ళని మాత్రం నిస్సహాయుల్ని కొట్టినందుకు సిగ్గుపడేట్టు చెయ్యాలిసిందే.

కొట్టుకోడం, పోట్లాడడం, పిల్లలకుఅవసరం. ఆ సహజకార్యాన్ని ఆపినట్టయితే అక్రమమార్గాల అల్లరిచేస్తారు,కనక యిష్టంవొచ్చినట్టు తగూలాడనియ్యాలి, కొట్టుకోనివ్వాలి. గట్టిగా కొట్టుకుంటున్నా అడ్డుపెట్టకూడదు, బాగా పోట్లాడే పిల్లలే యెక్కువ స్నేహపాత్రులవుతారు. పోట్లాటపోగానే,

పోట్లాట ఆపితే హృదయంలో కోపం మండుతో వుంటుంది. అది అనారోగ్యం.

పెద్దవారే మాత్రమూ పక్షపాతం చూపకూడదు. తమపిల్లల్లోనైనా సరే, ఇతరులలోనైనా సరే, ఒకపిల్లతోచేరి మాటలని రెండో వారిని బాధపెట్టకూడదు. అతనెంత దుర్మార్గుడైనా సరే.

పెద్దపిల్లలు చిన్నవాళ్ళని వెక్కిరించినా, కొట్టినా, యేడిపించినా కఠినంగా శిక్షించాలి. బాగా కోపం చూపాలి. పెద్దపిల్లలు, చిన్నవాళ్ళని బెదిరించి, లంచాలిచ్చి, యేడిపించి, వాళ్ళచాత అల్లరిపనులుచేయించి, తాము తప్పుకుంటారు. పెద్దపిల్లల చెడ్డసలహాలు వినవద్దనీ, వాళ్ళేమన్నా చేస్తే తమతో చెప్పమనీ వాళ్ళబెదిరింపులకు దడవవొద్దనీ, చిన్నవాళ్ళతో చెప్పాలి. పెద్దపిల్లల్ని శిక్షణలో పెట్టాలి.

ఒకబిడ్డ ఇంకో బిడ్డ చేసిన చెడ్డపనిని తెలుసుకుంటాడు. ఆ పని సంగతి పెద్దవారితో చెబుతానని బెదిరిస్తో, ఆ రెండోబిడ్డని తనకి బానిసని చేసుకుంటాడు. అట్లాంటివి గమనించాలి. ఆ సాడీచెప్పే బిడ్డని శిక్షించాలి. ఆ తప్పుకు యీ రెండోబిడ్డని ఏమీ శిక్షించకూడదు.

పిల్లలు చెడ్డసావాసాలుచేస్తే వొద్దనాలి. కాని బలవంతంగా మాన్ప కూడదు. యెప్పుడూ చెడ్డగా ఆ స్నేహితుల్ని గురించి మాట్లాడుతో వుండకూడదు. క్రమంగా యితరమైనపనులూ, కొత్త స్నేహితులూ, కల్పించి ఆ సావాసాలు తప్పించాలి.

# పెద్దవాళ్లు

పెద్దవారిస్నేహితులూ బంధువులూ, యింటికి చూడ్డానికి వొస్తో వుంటారు. వాళ్ళలో చాలమందికి పిల్లలపైన నిజమైన సరదా వుండదు. అటువంటి వారినించి పిల్లల్ని దూరంగా వుంచాలి. ముద్దుకదా అని, పిల్లల్ని వాళ్ళనెత్తిన రుద్దకూడదు.

వాళ్ళలో కొందరు పిల్లల్ని చూస్తే సరదా లేకపోయినా, మర్యాదకి వున్నట్లు నటిస్తారు. మర్యాదకోసం. పిల్లల్ని వారినించి తప్పించెయ్యాలి. పిల్లలకి వీరు శత్రువులు.

పిల్లలమీద వాస్తవమైన యిష్టమున్న వారితో పిల్లల్ని స్వేచ్ఛగా తిరగనియ్యాలి. వారితో వాళ్ళయిళ్ళకు కొంతకాలం పిల్లల్ని పంపుతో వుండవొచ్చు. కాని యీ సహవాసంవల్ల తామిచ్చే శిక్షణకు భంగం కలగకండా విరుద్ధమైన అభిప్రాయాలు పిల్లలు నేర్చుకోకుండా జాగ్రత తీసుకోవాలి. మంచిఅలవాట్లేర్పడ్డ తరవాత పంపవొచ్చు.

కొందరికి పిల్లల్ని యేడిపించడం, విసికించడం, సరదా. కొందరికి అతిముద్దుతో పిల్లల కిష్టంలేకపోయినా, కష్టపెట్టడం సరదా. వీళ్ళు పిల్ల అభివృద్ధికి విషతుల్యులు. వారెంత గొప్పస్నేహితులైనా, దగ్గిరబంధువులైనా వెంటనే వారినించి పిల్లల్ని తప్పించాలి. పిల్లలకి యిష్టంలేనిది ప్రశ్నలు వెయ్యనీకూడదు. వాళ్ళ ఆటవస్తువులతో జోక్యం కలిగేసుకోనీకూడదు పిల్లలకి యిష్టమైనా, చివరికి తల్లితండ్రులుకూడా పిల్లల్ని నలపడమూ, అతిముద్దు చెయ్యడమూ, పనికిరాదు. వారుకాని యెవరుకాని పిల్లని అందమైనదనీ, తెలివైనదనీ, భాగ్యవంతురాలనీ పొగడకూడదు.

పిల్లలకు మర్యాద నేర్పాలి. ఇంటికి వొచ్చినవాళ్ళయెడల వాళ్ళు మర్యాద చూపడం ఒక అలవాటు. కనుక పెద్దవారు శ్రద్ధతీసుకొని ఆ

అలవాటు నేర్పాలి. ఏమిచెయ్యాలో యెట్లా మాట్లాడాలో చూపాలి. అంతే గాని మర్యాదగా వుండమని ఆజ్ఞాపించడంవల్ల లాభంలేదు. అమర్యాద కార్యాలను ఆటలరూపంగా పోగొట్టవొచ్చు. ఇంటికివొచ్చినవారిని స్నేహితులను సంతోషపెట్టాలనే ఆసక్తి బిడ్డలకి వుండాలి - కాని హీనిసత్వం కూడదు. తన మర్యాదను కాపాడుకోవాలి బిడ్డ.

ఇంటికి వొచ్చినవారు బిడ్డలయెడల అమర్యాద చూపినా, బిడ్డ అమర్యాదగా ప్రవర్తించకూడదు. మర్యాద యితరులకొరకు కాదు. తమ ప్రవర్తన సరిగావుండడమే ముఖ్యోద్దేశము. తాముమాత్రము, ఏ పరిస్థితులలోనూ తమసహజ ఔదార్యాన్ని విడనాడకూడదనిన్నీ, మర్యాదను మీరకూడదనిన్నీ చెప్పాలి.

కాని పిల్లలు అమర్యాదస్తులయెడల అమర్యాద చూపితే తలితండ్రులు అభ్యంతర పెట్టకూడదు. కాని మర్యాదచూపడమే ఆదర్శమని మాత్రం తమప్రవర్తనవల్ల పెద్దవారు చూపాలి. పిల్లలకి నిష్కారణంగా కొందరిమీద అయిష్టం కలుగుతుంది. అటువంటివాళ్ళతో బిడ్డ మాట్లాడనంటే, మాట్లామని పెద్దవాళ్ళు నిర్బంధించకూడదు. కాని మాట్లాడితే బిడ్డ మర్యాదగా మాట్లాడాలి. లేకపోతే దూరంగా వుండవొచ్చు. ఆ అతిథులుకూడా యిష్టపడని పిల్లలజోలికి పోకూడదు, ఒక్కొక్కప్పుడు పిల్లలు కొందరియెడల అమర్యాద చూపుతారు. తలితండ్రులు దానికి పిల్లల్ని శిక్షిస్తారు. కాని ఆ స్నేహితులు రహస్యంగా పిల్లల్ని యెప్పుడో యేడిపిస్తో వుండడమే కారణం. కనక తలితండ్రు లటువంటి విషయాలు కనుక్కుంటో వుండాలి. దయగా పిల్లల్ని పిలిచి అడగాలి.

అప్పుడప్పుడు యీ పిల్లలే కొత్తవాళ్ళని యేడిపించి విసికిస్తారు. మర్యాదవల్ల ఆ కొత్తవాళ్ళు వూరుకోవొచ్చు. తలితండ్రు లది కనిపెట్టి పిల్లల్ని ఆ కొత్తవారి యిష్టప్రకారం శిక్షించుకోమని వాళ్ళతోనే చెప్పాలి. వాళ్ళు శిక్షించనివారైతే పిల్లల్ని దూరంగా పంపాలి. కొత్తవాళ్ళు పిల్లలూ సమానంగా పోట్లాడుతోవుంటే, పెద్దవారి జోక్యం అనవసరం.

పెద్దవాళ్ళు మాట్లాడేచోట పిల్లలు అల్లరిచేస్తే దూరంగా పంపాలి. కొత్తవాళ్ళెవరన్నా రాగానే పిల్లలుకూడా గుమికూడే అలవాటు మాన్పాలి. పిల్లల్నికూడా పెద్దవాళ్ళదగ్గిరే కూచోమని బలవంతంచేసి, వాళ్ళు అల్లరి చేస్తే శిక్షించడం తప్పు.

ఇంటికివొచ్చే ప్రతివారినీ, పెద్దవాళ్ళు సమానంగా చూడాలి. స్నేహ తారతమ్యమే గౌరవతారతమ్యాన్ని కలిగించే ప్రధానసూత్రంగా వుండాలి. కులమూ, లింగమూ, భాగ్యమూ, మొదలైన భేదాలన్నీ యేమాత్రమూ గౌరవిషయంలో పాటించకూడదు.

స్నేహితులూ, బంధువులూ, వారిగుణాలూ, చర్యలూ, బిడ్డముందు ఖండించరాదు. మనుషుల్నిగురించి చెడ్డగా మాట్లాడడం మానాలి; ముఖ్యంగా స్కాండల్సు.

బాలుడి వేషభాషలూ, పనులూ, ఆచారాలు లోకంతోబాటుగా అంద రికీ నమ్మతమయేట్టు వుండాలి. అందరికీ వికృతంగానో, వినోదంగానో, నూతనంగానూ, విరుద్ధంగానూ కనపడనీకూడదు. లోకంమీద తృణీకార భావమూ అసహనమూ నేర్పకూడదు. కాని బిడ్డ కావలిసి తాను విరుద్ధంగా నడుస్తానని, తెలిసి పట్టుబడితే, పెద్దవారు అభ్యంతర పెట్టకూడదు.

కాని బిడ్డ తననడవడిని లోకాభిప్రాయంమీద ఆధారపెట్టుకోకుండా వుండడం నేర్పాలి. లోకాన్ని ప్రేమించాలి గాని, లోకం తప్పుమార్గంలో వుందని విశ్వసించినప్పుడు, నిర్లక్ష్యంగా, తిరగబడాలి. తన అంతరాత్మకి తోచినట్టు చేసితీరాలి. ఎవరేమన్నాసరే, వొచ్చేకష్టాలనూ, నిర్లక్ష్యంగా, సంతోషంతో, ధైర్యంతో భరించాలి. కాని ముఖ్యవిషయాల్లో తిరగబడ్డా, సాధారణవిషయాల్లోలోకంతోస్నేహంగావుండడానికేప్రయత్నంచెయ్యాలి.

కాని లోకానికీ, స్నేహితులకీ భయపడనేకూడదు. లోకంతో కలిసి మెలిసి, వారిప్రకారం నడుచుకోవలసిందేగాని, లోకం వెక్కిరిస్తుందనీ. తననడవడిని ఖండిస్తుందనీ, భయపడి, తనకి న్యాయమూ, సత్యమూ అని తోచినదానిని బిడ్డ వొదులుకోకూడదు.

# సేవా - ఆర్డరా

బిడ్డకి ప్రతినెలా 'పాకెట్ మనీ' కొంతడబ్బు యివ్వాలి. అది యెంతో కుటుంబస్థితివల్లా, బిడ్డవయసుతోనూ మారుతుంది. బిడ్డ అల్లరి చేసినా, పనిచెయ్యకపోయినా, వొస్తువులు పాడుచేసినా, ఆ డబ్బు తగ్గించ కూడదు. ఆ జీతం బిడ్డ తన యిష్టంవొచ్చినట్టు వుపయోగించుకోవచ్చు. కాని అనారోగ్యాలు, హానికరాలూ, ఐన పదార్థాలూ కొనడానికి వుపయోగించకూడదు ఆ డబ్బుని. ఆ డబ్బుని వీధిలో పారేసినా, అందరికీ మూర్ఖంగా పంచిపెట్టినా వూరుకోవాలి. కాని మళ్ళీ యెక్కువ డబ్బులు మధ్యమధ్య యివ్వకూడదు. దాచుకుని వుపయోగించుకునే పద్ధతి నేర్చుకోవాలి బిడ్డ. దురుపయోగపరచి నష్టపడ్డప్పుడు ఆ విషయం మనసుకి నచ్చచెప్పాలి. "చూశావా ఆ డబ్బంతా ఒకసారే తగలేశావు. దాచుకుంటే యిప్పుడు పిల్లంగోవి కొనుక్కోవచ్చునుకదా!" అనాలి.

డబ్బులు బిడ్డచేతికిచ్చెయాలి, దాచిపెట్టమంటే, దాచాలి. మళ్ళీప్రతి నిమిషం అడగనియ్యకూడదు. అడిగి తీసుకునేందుకు వేళలుండాలి.

కాని వూరికే డబ్బు అయిపోతుందే అనే కాపీనంతో డబ్బు దాచుకోడం పెద్దవారు 'ఎన్కరేజ్' చెయ్యకూడదు. తెలివిగా వుపయోగకరంగా ఖర్చుపెట్టడం నేర్పాలి. గాని దాచుకోడం కాదు. వొస్తువులు కొనయ్యాలి బిడ్డకి, కాని ప్రియంగా కొంటున్నప్పుడు బిడ్డ యెట్లా మోసపోతోందో చూపాలి. సరిగా, సరైన ధరలకు కొనడం తెలుసుకునేట్టు చూపాలి. పెద్దవారు ధనంవిలువా, దానిసద్వినియోగమూ నేర్పడం ముఖ్యోద్దేశం. వూరికే కూడపెట్టడమూ పనికిరాదు; బుద్ధిలేక ఖర్చుపెట్టడమూ మంచిది కాదు.

బిడ్డ యింటోపనికి సహాయం చెయ్యాలి. ఆపని మూడు విధాలు;

1. ప్రేమతోచేసే సహాయం: మూడేళ్ళురాగానే తమ సహాయార్థం పనిచెయ్యమని బిడ్డని అడగవొచ్చు. కాని బిడ్డ చెయ్యనంటే బలవంత పెట్టకూడదు. బిడ్డ ఆడుకోవుండగా 'కిస్టప్పు' చేసి పిలువకూడదు.

"నామీద ప్రేమ లేదా! పని చెయ్యకపోతే నీమీద కోపమొస్తుంది. నీతో మాట్లాడను" అనకూడదు. బిడ్డ పనిని ఆనందంతో ప్రేమతో చెయ్యాలి. ఏదన్నా ఎక్కువపని వొచ్చినప్పుడు, ఆసంగతిచెప్పి, బిడ్డ సహాయం అడిగితే బిడ్డ తప్పకుండా వొప్పుకుంటుంది. స్నేహితుల్ని సహాయం అడిగినట్లే, వారు సహాయం చెయ్యకపోతే బలవంతం చెయ్యగలమా? వారికి సహాయం మనం మానేస్తాము. అట్లానే బిడ్డ పెద్దవారికి సహాయం చెయ్యకపోతే, దానికి సహాయగుణం నేర్పడానికై పెద్దవారు పిల్లకి గాలిపటాలూ, నాటకాలూ, మొదలైన వారిఆటల్లో, సహాయం నిరాకరించవొచ్చు. బిడ్డ భయపడి సేవచేస్తోందీ, ప్రేమతో చేస్తోందీ కనిపెట్టాలి. పెద్దవారు సోమరిగా కూచుని బిడ్డని నౌకరుకింద ప్రయోగించుకోకూడదు. తమ పనిని తామే చేసుకోవాలి. బిడ్డల నుంచి నీళ్ళిమ్మనీ, విసరమనీ, కాళ్ళుపట్టమనీ అడిగిచేయించుకుంటారు. కాని బిడ్డఅడిగితే "నువ్వు చేసుకోలేవా? చేతులులేవా?" అంటారు. అది అన్యాయం. పెద్దవారికి చిన్నవారు సేవచెయ్యాలనే ఉద్దేశం నశించాలి. అందరూ పరస్పరసహాయం చేసుకుంటో, ఒకయింటో వుండే సమానస్కులైన స్నేహితులనుకోవాలి. అవసరమైతే అన్నివేళల ఒకరికొకరు సమానమైన సహాయం చేసుకోవాలి. అవసరం లేకుండా ఒకరిమీద యింకోరు అధికారంచేసి సేవచేయించుకోకూడదు.

"మేము బిడ్డకి వొండటంలేదా, పెంచడంలేదా" అంటారు పెద్దవారు. బిడ్డని కన్నందుకు ప్రతిఫలాపేక్ష లేకండా పెద్దవారు చెయ్యవలసిన విధి అది. అందుకోసం బిడ్డని సేవచెయ్యమనడం తప్పు. తాము

చేసుకోగలిగినవన్నీ చేసుకుని అవసరమైనప్పుడు, బిడ్డలనించి పని తీసుకోవొచ్చు.

2. విధిగా చేసేపని: యిది ఒకయింటో తనుకూడా 'మెంబరై' నందుకు, అందరివలెనే తనూ విధిగా చెయ్యవలసిన పని. వయసునూ తీరికనూపట్టి దీనిపరిమితీ, దీనివిధమూ మారుతోవుంటాయి. అది యెట్లా చెయ్యాలో నేర్పాలి. అది చేసే సమయం నిర్ణయించాలి. యీ పని చెయ్యకపోతే ఆపనికి సంబంధించిన హక్కులు పోతాయి. కూరలు తరగడంపని బిడ్డదై, తరక్కపోతే కూర తినడానికి వీల్లేదు.

3. కూలికి చేసేపని : బిడ్డకి డబ్బు కావలసినప్పుడు, పెద్దవారికి కావలసినపని చేసిపెట్టి, డబ్బు సంపాయించుకునేందుకు వీలువుండాలి.

# భయం

భయం పిల్లలకు సహజం కాదు. ఇతరులనించి నేర్చుకుంటారు. ముఖ్యంగా తలితండ్రులూ, దాదులూ, ముసలివాళ్ళు, అన్నలూ అక్కలూ కారణం. ఈ చిన్నప్పటి భయాలమూలంగా జీవితమంతా పిరికివారై బాధపడడమే కాకండా, క్రూరులౌతారు. బిడ్డలలో యింత సామాన్యంగా వుండేదీ, పాడుదీ, బిడ్డని జీవితమంతా యింతగా బాధపెట్టేదీ నిర్మూలించడానికి కఠినమైనదీ యింకో గుణంలేదు. కనక బిడ్డ భయం నేర్చుకోకండా మొదటనే చాలా జాగ్రత్త తీసుకుని, భయం నేర్చుకున్న వెంటనే తలెత్తకండా చంపి, లేకండా చెయ్యాలి. యితరులకి సిగ్గుపడీ, భయపడీ, బిడ్డభయాన్ని అణుచుకునేట్లుగా కాక, అసలు భయమే లేకండా వుండాలి. తన పెద్దవారిని తలితండ్రుల్ని చూసినా భక్తివుండాలి గాని భయం వుండకూడదు.

పిల్లలకి భయంలేకండా వుండాలంటే ముందు పెద్దవాళ్ళు తమ భయాల్ని వొదులుకోడమూ మనసులోంచికూడా భయాల్ని తరిమెయ్యడమూ తప్పదు. దెయ్యాలు, రైళ్ళు, దొంగలు, పోలీసులు, అధికార్లు, డాక్టర్లు, పీళ్ళు, నిప్పులు, పాపాలు, కర్మాలూ, యీ భయాల్ని తామేకాక, యింటో బిడ్డలతో కలిసే మనుషులనించి వొదిలించాలి. భయం లోపల వుంచుకుని బిడ్డకి ఆ భయంవుందని బిడ్డకి తెలియకండా ప్రవర్తించడం అసాధ్యం. భయాలు వొదులుకోని ముసలమ్మలుమొదలైన వాళ్ళని తరిమెయ్యడం తప్పనిసరి. చచ్చేముసలమ్మ యెక్కువా? సూరేళ్ళు ఎదక వలసిన బిడ్డ యెక్కువా?

బూచి మొదలైన మాటలు అని బిడ్డని దడిపించకూడదు. పెద్దవాళ్ళు బిడ్డ యేమయిందో అని భయపడి ఆ భయం బిడ్డలో ప్రవే, పెద

తారు. తమకి ఆ భయం కలిగించినందుకు బిడ్డని కొడతారు. బిడ్డ బావి దగ్గిరగా, రైలుదగ్గిరగా వెడితే భయంకొద్దీ బిడ్డని దండిస్తారు.

దెయ్యాలు, బూచులు, నరకం, పాపం, యిలాంటివన్నీ శాస్త్ర రీత్యా అర్ధంచెప్పినట్లయితే భయంపోతుంది. వురుమూ, మెరుపూ, సుడి గాలీ, చీకట్లో చప్పుళ్ళూ, గ్రహణాలూ, మొదలైనవి అర్ధంతెలీగానే, వాటిభయం పోతుంది. తెలియరాని భయమంతా, అజ్ఞానంవల్ల కలిగిందే నని బిడ్డకి తెలియచెయ్యాలి.

శిక్షలతో దడిపించి బిడ్డని పెద్దవాళ్ళకు భయపడేట్టు చెయ్య కూడదు. యితరుల కోపానికీ, శిక్షకికూడా దడవనక్కర్లేదు. యెవరిదన్నా వొస్తువు బిడ్డతాకితే "వాళ్ల కోప్పడతారు-తాకకు" అనక, "యింకొకరి వస్తు వులు వాళ్ళ అనుజ్ఞలేనిది తాకడం మర్యాదకాదు. వాళ్ళకి ఇష్టం వుండక పోవొచ్చు" అనాలి. వూరికే బిడ్డలపైని కేకలు వేసేవారుంటారు. "వారి కదోవిధమైన జబ్బు; దానికి దడవకూడ"దని చెప్పాలి.

దేన్నన్నాచూపి బిడ్డ భయపడుతూవుంటే ఆ భయం రూపుమాపే దాకా పెద్దవారూరుకోకూడదు. ఆ వొస్తువుని బిడ్డ భయపడనంత దూరాన వుంచి క్రమక్రమంగా దగ్గిరికి తీసుకెళ్ళి మెల్లిగా బిడ్డకి అలవాటు చెయ్యాలి. ఆవొస్తువును బిడ్డనించి తప్పించనూ కూడదు, బిడ్డమీద ఒక సారిగా వెయ్యనూకూడదు.

బిడ్డకు బిచ్చగాడి సంచిసిచూస్తే భయమనుకోండి. అప్పుడు బిచ్చ గాడి సంచిని విప్పిచూపి, బిడ్డచేతే దాంటో వొస్తువులు తీయించి, బిచ్చ గాడిచేత బిడ్డలతో దయగా మాట్లాడిస్తేసరి-దానికి ఆభయం పోతుంది. ఆ భయం పూర్తిగా పోయిందాకా ఆ వొస్తువును క్రమక్రమంగా చూపు తోనే వుండాలి. బిడ్డ భయపడుతో వుంటే, బలవంతంగా భయంకలిగించే వొస్తువు దగ్గిరికి లాక్కెళ్ళకూడదు. ఆ వొస్తువును మీదపడెయ్యకూడదు. అసలు పెద్దవాళ్ళు యెప్పుడో ఆ సంచివిషయం భయపెట్టకపోతే, బిడ్డకి

భయం కలగనేకలగదు. ఈ భయాలు పోగొట్టడం చాలాముఖ్యం. కనక పెద్దవారు చాలా శ్రద్ధ వహించాలి. ఈ చిన్నభయాలే ముందు ముందు చాలా విపరీతమైన భయాలకు మూలకారణాలు. పెద్దవారు తాము భయము చూపక, దయగా నవ్వేస్తే చాలాభయాలు పోతాయి.

భయపడ్డ మనేదానికి బిడ్డ సిగ్గుపడాలి. కాని ఆ సిగ్గువల్ల భయం పోవాలిగాని, సిగ్గుపడి భయాన్ని దాచుకోకూడదు. బిడ్డ ధైర్యం చూపినప్పుడు పెద్దవారు 'ఎప్రీసియేషన్' చూపాలి. వూరికే తన భయాలతో బాధలతో, పెద్దవాళ్ళ సానుభూతిని చూపుతో వుండాలనే ఆశని బిడ్డనించి తొలగించడం ముఖ్యం. దెబ్బతగిలి బాధపడితే, వోర్చుకోవాలని చెప్పాలిగాని బిడ్డతోకూడా పెద్దలు అబ్బోఅని అధైర్యపడకూడదు. బిడ్డ బాధపడుతున్నంతసేపూ పెద్దలు వెంట బాధపడుతో వోదారుస్తో కూచోకూడదు. వోదార్పులు పూర్తిగా అన్నివిషయాలా మానాలి. బాధపడే బిడ్డకై పెద్దవాళ్ళ హృదయాల్లో బాధవుంటుంది. కాని కనపరచకూడదు. బిడ్డ తనే యేడ్చుకుని, తనే మాన్పుకుని తిరగాలి. "యింతేనా ? దీనికే యేడుస్తారా? లే. పరిగెత్తు" అనాలి. దెబ్బకికట్టూ అదీ కట్టవలసివస్తే, డాక్టరు కట్టినట్టు కట్టేసి, పోయి ఆడుకోమనాలి. ఆ దెబ్బ మరిచిపోయేటట్టు ఆట కల్పించవొచ్చు. ఆ బాధతో బిడ్డ యేడ్చినా, న్యూసెన్సు కాకండా వేరే యెక్కడన్నా యాడవాలి. పెద్దవాళ్ళకి దెబ్బతగిలినా, తేలుకుట్టినా, అంతే. బిడ్డని 'చూడమ్మా, నాకెంత దెబ్బతగిలిందో! నాకెంత జబ్బుచేసిందో!' అని జాలి పొందించి ప్రేమ లాగాలని ప్రయత్నించకూడదు. బిడ్డకి జబ్బుగా వున్నా అంతే. మందిచ్చి, వొచ్చెయ్యాలి. దగ్గిరకూచోడం, ఆదుర్దాపడడం యెత్తుకోడం, చాలాతప్పు.

భయంలేకండా పనిచేసే అవసరంగల పనులు భయం పోగొడతాయి. బైస్కీలెక్కడం, పట్టాలమీద నడవడం, దూకడం, చెట్లెక్కడం, యీదడం, ఎక్సరేజి చెయ్యాలి. భయం పోగొట్టడానికి ఇవి మంచివి.

కాని పిల్లల్నికొట్టే బడికి పంపితే భయాలెక్కువౌతాయి. మంచిబళ్లో పిల్లలభయాన్ని తక్కిన పిల్లలు ఒక్కనిమిషంలో పోగొడతారు. ఆ పిల్లలు వెక్కిరిస్తారనన్నా భయాలు వొదిలించుకుంటారు.

ఆడపిల్లలకీ యింతే, ఆడవాళ్లు భయపడడం సహజమనీ అందమనీ చెప్పి, సిగ్గూ, పాతివ్రత్యమూ, యీ పేర్లతో, భయాలు స్త్రీలకినేర్పి వారిని తమ అధీనం చేసుకున్నారు మొగవాళ్ళు. మాటల్లోకూడ 'ఆడదానిమల్లే భయపడతావేం ?' అంటారు. అవన్నీ నశింపచెయ్యాలి.

పెద్దవారియెడల దేవుళ్ళయెడల గురువులయెడల నరకంయెడల భర్త యెడల పాపంయెడల వున్న యిప్పటి భయమంతా, భక్తిగా మారనన్నా మారాలి, పోనన్నా పోవాలి. ఈ చిన్నప్పటి భయాలే, లోకంలోని, యీ మూర్ఖానికీ, బానిసత్వానికీ, క్రూరత్వానికీ, కారణం. కనక భయాలను నిర్మూలం చెయ్యగలిగితే ప్రపంచం యింతకన్న చాలా ఆరోగ్యవంత మౌతుంది. ప్రజలస్వభావాలు యింతకన్న చాలా ఔన్నత్యాన్ని పొందుతాయి.

భయంవల్లనే అనేక నీచత్వాలు జరుగుతాయి. తిట్లని, దెబ్బల్ని, దెయ్యాల్ని, ఆపదల్ని, రోగాల్ని, అధికారుల్ని, చావుని, పోలీసువాళ్ళని, నరకాన్ని, కాషాయ బట్టల్ని, పెద్దగడ్డాల్ని, పెద్దకోట్లను, కర్రల్ని అరుపుల్ని, తలగుడ్డల్ని దేన్నిచూచినా భయమే. ఎన్నడూరాని జరగని ఆపదలు వొచ్చినట్టే తలచుకుని భయాలతో వొణుకుతో, ఏడుస్తో జీవితం గడిపేవారు వేనకువేలు. కొత్తమార్పు, కొత్త అభిప్రాయం అనగానే గజగజ వొణికేవాళ్ళు కోట్లకొలది. కొన్నిపిట్టల అరుపులు, చీకటి, పురుగులు, గాలి, వీటిని చూసికూడా భయమే. భయంతోతప్ప నీతినీ, సన్మార్గాన్నీ, బోధించడం చాతకాని అవివేకులు తెచ్చిపెట్టిన అనర్థం, యిదంతా. నరకమూ భయంకరమైన దేవతలూ, కసితీర్చుకునే దెయ్యాలూ, యిదంతా వాళ్ళ జాడ్యపు మెదడులో పుట్టిన కుళ్ళే.

బిడ్డల్ని శిక్షణలో పెట్టడం చాతగాక పెద్దవారు భయాలు నేర్పుతారు. అదుగో "బూచి" అనేది ముఖ్యం. దొంగలు, టీకాలు, పోలీసులు, దెబ్బలు, బిచ్చగాళ్ళు, పిల్లి, వీటినన్నిటిని ఉపయోగిస్తారు, పిల్లల్ని పూరుకోపెట్టేందుకు. అదిగో "బూచి" అన్న ముసిలమ్మనల్లా విచారణ లేకండా వురితియ్యాలి, యీ లోకం బాగుపడాలంటే. ప్రభుత్వంవారా పని చెయ్యకపోతే, వూరివారన్నా, వాళ్ళని వూళ్ళోంచి తరిమెయ్యాలి.

శిక్షణకోసం పెద్దవారు పిల్లల్ని దెబ్బలతో కేకలతో భయపెడతారు. అది యింకో తప్పు. శిక్షణ ఆటవలె జరగాలి. ఆజ్ఞలతో జరగకూడదు. బిడ్డకి పెద్దవారిని చూసినా సుతలామూ భయం వుండకూడదు. పెద్దవారి మీది చిన్నప్పటి భయమే పెద్దయినా బిడ్డని బానిసగా మారుస్తోంది. ముఖ్యం దెబ్బల భయం.

ఈ భయాలు ముఖ్యంగా ఆడపిల్లలకి యెక్కువ. ఎందుకు ప్రపంచజ్ఞానమే తక్కువగనక. గ్రహణాలూ, తోకచుక్కలూ, చీమలూ రైళ్లూ అన్నీ భయాలే. ఇవన్నీ నిర్మూలమైతేగాని దిక్కు, సౌఖ్యమూ వుండవు ప్రజలకి.

అదిగాక, బిడ్డలక్షేమం కోసం పెద్దవారు తమభయాలనన్నిటినీ బిడ్డకి ప్రసాదిస్తారు. రైలొస్తూవుంటే, పదిగజాలదూరానికి బిడ్డని లాగడం, కాలవనీళ్ళలో కాలుపెట్టనీకపోవడం, అగ్గిపుల్లగీస్తే యిల్లు తగలపడ్డట్టు అరవడం, చీకటిలో వెడితే ఆదుర్దాపడడం, పక్కల్లో పడుకోపెట్టుకోడం, తిండి తినకపోతే, యేడిస్తే, ఆదుర్దాపడడం; జ్వరం రాగానే, వేలుతెగగానే బిడ్డచచ్చినట్టు యేడవడం, యివన్నీ పెద్దవారిలో దుర్గుణాలు.

బిడ్డ యేవొస్తువన్నా పాడుచేస్తున్నా, యేదన్నా అపాయంలోకి వెడుతున్నా, చప్పున పెద్దవారు అరిచి, బిడ్డనిహడలకొట్టకూడదు. ముందు పెద్దవారు తమభయాన్ని ఆదుర్దాని అణుచుకుని తీరాలి.

# నీతి

బిడ్డను నీతి ప్రపంచంలో పెంచాలి. అవినీతి, దుర్మార్గమూ, వక్రత్వమూ దూరాన వుంచడంవల్ల, నీతియుక్తమైన అలవాట్లేయేర్పడతాయి. బిడ్డకు ప్రలోభనము కలిగే పరిస్థితులూ, చెడ్డపనులు చెయ్యవలసిన అవసరమూ సాధ్యమైనంతవరకు కలగచెయ్యకూడదు. శిక్షిస్తారనే భయం లేకపోతే అబద్ధమాడదు. అడిగింది యిస్తే దొంగిలించదు, అట్లానే.

బిడ్డ దుర్మార్గంగా మొదట్లో ప్రవర్తించినప్పుడు, యెప్పుడూ ఖండించకూడదు. ఎందువల్ల అట్లా చేస్తోందో నిదానించి చూడాలి. ఆతప్పు పని ఏదో పొరపాటులాగు చూడాలిగాని పాపమనీ ఘోరమనీ, చూపువల్ల మాటవల్ల తెలియచెయ్యకూడదు. తలితండ్రుల్ని పడకగదిలో రాత్రుల చూసి, అది తాముకూడా ఆడేవాళ్ళన్నారు పిల్లలు. అది ఘోరంగా అనుకుని దండించారా, బిడ్డకి ఆ అలవాటు తప్పకుండా యేర్పడిందన్న మాటే. దండనవల్ల యేమీ లాభంలేదు. దేవుడికి కోపమనీ, నరకమనీ బెదిరించి బిడ్డ ఏపనిచేసినా, బిడ్డనే బెదరకొట్టకూడదు.

"ఇట్లా చేశావేం? ఛా! అట్లాకాదు." అనాలి. ఎట్లానో చెప్పాలి, చూపాలి, అంతే. "ఇంత ఘోరం చేశావే!" అని పెద్దవారన్నారా, "నేనేకదా యింత ఘోరం చెయ్యగలిగాను! చాలా గొప్పదాన్ని. మళ్లీ గొప్పతనం వహిద్దా"మను కుంటుంది బిడ్డ. నరకం, పాపం చెప్పి బెదరకొట్టారా, వాటిసంగతే ఆలోచించుకుని, భయపడి, భయపడి, ఆ అలవాటులోనే పడుతుంది. చెడ్డపనులనుంచి మనసు తప్పించాలి; వాటిని చేసే అవసరాన్ని తొలిగించాలి.

బిడ్డకి నీతి నేర్పాలని ప్రయత్నించే పెద్దలు బిడ్డ స్వభావంలో విశ్వాసముంచడం చాల అవసరం. బిడ్డ యెప్పుడూ మంచిగా వుండడానికే

ప్రయత్నిస్తుంది. దుర్నీతి అనగా, అల్లరనగా, నీతీ మంచితనమూ, లేని లోపమని గ్రహించాలి పెద్దవారు. చెడ్డతనము, మాయ అశాశ్వతము. బిడ్డ తన శక్తిలో తాను విశ్వసించాలి. అందుకోసం పిల్లలతో మంచి గుణాల సంగతే మాట్లాడాలి.

"నువ్వు చెడ్డవాడివి. అల్లరి వాడివి. దొంగవు." అనకూడదు. "అది మంచివాడు చేసేపనికాదు. నువ్వు మంచివాడివి" అనాలి. 'నీకర్మం నీ గుణమే అట్లాంటిది' అని అధైర్య పెట్టకూడదు. యెన్నిసార్లు తప్పు పని చేసినా, బిడ్డ ఆపనికన్న అతీతుడని తెలుసుకొని "ఈసారి ప్రయత్నించు, తప్పదు. నువ్వు సన్మార్గానికి రాగలవు" అనే ధైర్యమూ విశ్వాసమూ ఇవ్వాలి. తప్పుపని చేస్తే, పెద్దవారు ఆశ్చర్యపడి 'యిదేమిటి యింత పొరపాటు చేశావు? నీవంటిది చేసేపని కాదే!' అనాలి.

బిడ్డలను సన్మార్గంలో వుంచాలని, ఇతరులతో పోల్చి, 'చూడు సోమనాధం యెంత మంచివాడో.' అనకూడదు. 'ఇట్లాచేస్తే అందరూ నవ్వరూ ? అందరూ యామనుకుంటారు ?' అని బిడ్డ ప్రవర్తన ఇతరుల అభిప్రాయంమీద ఆధారపరుచుకోవడం నేర్పడం చాలాతప్పు. ఈ అలవాటువల్లనే, యీ కాలపు ప్రజలు, స్వంత అభిప్రాయాలనేవేలేక, నీతికి దుర్నీతికీ విచక్షణను ఎరుగనే ఎరుగక, తక్కినవారు మంచిదనేదాన్ని తాము అనుసరిస్తో, అంతరాత్మల్ని చంపుకుని తిరుగుతున్నారు. బిడ్డ అట్లాంటి అవస్తలో పడకుండా కాపాడడం తలితండ్రుల విధి. తనకు మంచిదని తోచడం చాతనే, తన స్వబుద్ధిని వుపయోగించి తన నడవడిని నిర్ధారణ చేసుకోవాలి బిడ్డ.

చివరికి 'నాన్నకి కోపమొస్తుందమ్మా' అని కూడా అనకూడదు. ఆపనిమీద విశ్వాసంచేతనే చెయ్యడం నేర్పాలి బిడ్డకి. సత్పురుషులనూ, సదాశయాలనూ, సత్కథలనూ సన్మార్గాలను చెప్పి చూపాలి. కాని వాటి ప్రకార మాచరించాలని బలవంత పరచకూడదు.

ఉదాహరణం:— ఇతరులతప్పుల్ని క్షమించడం వుత్తమగుణమని చెప్పాలిసిందే. యింకొక పిల్ల కొట్టినప్పుడు క్షమించమని చెప్పాలి. కాని క్షమించి తీరాలని బలవంతం చెయ్యకూడదు. బలవంతంగా సన్మార్గం లోకి తిప్పడంకంటే దుర్మార్గంలో వుండనిస్తే మంచిది. సన్మార్గాన్ని బిడ్డకి అన్‌కాన్షస్‌గా, అలవాటు చెయ్యాలి. కాని బిడ్డ స్వభావం దుర్మార్గానికి యీడ్చినప్పుడు పెద్దవారు సన్మార్గంలోకి బలవంతపరచకూడదు. బిడ్డకి దుర్మార్గానికి స్వేచ్ఛనిచ్చి, అది మనస్ఫూర్తిగా సన్మార్గాన్ని ప్రేమించి అదే యిష్టపడి ధర్మ మాచరించేట్టు చెయ్యాలి.

వూరికే వుత్తధర్మాలను బోధించి వుపన్యాసా లియ్యకూడదు. ఆటల మూలకంగా అలవాట్లు నేర్పరచి, దురలవాట్లను తొలిగించి, కొంచెం పెద్దదికాగానే ఆ అలవాట్లలోవుండే ధర్మాలను తెలియచెయ్యాలి. తప్పు చేసినప్పుడు అదెట్లాతప్పో చూపాలిగాని, వుత్తప్పుడు తప్పుల సంగతి బోధిస్తూ కూచోకూడదు. తప్పుచేస్తే ఆ తప్పుసంగతే మాట్లాడాలి గాని, అదే సమయమని సమస్త ధర్మాలూ, బిడ్డ యెప్పుడో చేసిమరిచిన దుర్మార్గాలూ యేకరు పెట్టకూడదు.

పెద్దవారు బిడ్డకి బోధించేదానికి వ్యతిరిక్తంగా తామే నడుచు కున్నారా. యీ నీతి శిక్షణఅంతా సంపూర్ణంగా వృధా. బిడ్డని వ్యయం చెయ్యవొద్దని పెద్దవారు డబ్బు వ్యయంచేస్తే, అబద్ధమాడవద్దని బిడ్డని శిక్షించి తామే అబద్ధమాడితే, [బిడ్డతోనైనాసరే యితరులతో నైనాసరే] అసలు బిడ్డకి నీతి శిక్షనివ్వడం వొదులుకోడం మంచిది. బిడ్డ పెద్దవారిని అప్పుడు కపటులని అన్నాలనుకోదు. తనకో నీతిచట్టమూ పెద్దవారికోనీతి చట్టమూ యేర్పరచుకున్నారనే కోపమన్నా కలిగివుండదు. పెద్దవారుచేసే పనులన్నీ పిల్ల తప్పకుండా కనిపెట్టగలదు. దానికి తెలీదనుకోడం గొప్ప పొరపాటు. దుర్నీతిపరురాలే గాక, ఒకటి బోధించి ఒకటిచేసే కృత్రిము రాలుగా తయారవుతుంది, యింక తప్పనిసరైనప్పుడు "నేను అబద్ధా

లాడతాను. చెడ్డవాణ్ణే; లోకంలో విధిలేక వొచ్చింది; అంతకన్న నాకు చాతకాలేదు. కాని అది మంచిపనికాదు. నువ్వు నాకన్న మంచివానివి కావాలి" అని పెద్దవాళ్ళు అనడం కొంతవరకు పనిచెయ్యవొచ్చు.

ఒకవేళ బిడ్డ లౌకికులాలు కావాలనీ, ప్రపంచంతోబాటు అబద్ధాలూ, దొంగతనాలూ, మోసాలూ, వీలైనప్పుడల్లా, యితరులు పట్టుకోకండా చెయ్యవొచ్చుననీ పెద్దవారి అభిప్రాయమైతే, అట్లానే బోధించాలిగాని, అలివిగాని ఆదర్శాలను బోధించకూడదు.

వీలైనంత గొప్ప ఆదర్శాలను తమప్రవర్తనవల్ల పిల్లదృక్పథంలో వుంచాలి. పెద్దవారు వాటిననుష్ఠించడానికి ప్రయత్నించాలి. అపజయం పొందితే అపజయం వొప్పుకుంటో వుండాలి.

లోకంలో ఆచరణలో వున్నవాటికన్న వున్నతాదర్శాలను బోధిస్తే పిల్ల వ్యర్థులాలు కావొచ్చు; కాని లోకంలోని, సాధారణ మనుష్యజీవనుల వలె నిరర్థకంగా బతికి డబ్బు సంపాయించి, కీర్తిపొందడంతో సంతుష్టి పడడంకంటే, యీ గొప్ప ఆదర్శాలతో అపజయం పొందడమే వుత్తమం.

# వ్యక్తిత్వం

ఇతరుల పొగడ్తలకుగాని. హాస్యానికిగాని, నిందలకుగాని, లక్ష్యంచెయ్యక పిల్ల తనకు మంచిదని తోచిన పనులనే చెయ్యడం నేర్వాలి. మరీ చిన్నతనంలో యేవిషయంలోనూ బిడ్డకు స్వతంత్రాభిప్రాయాలు వుండవు. అప్పుడు పెద్దవారి అభిప్రాయాల ప్రకారమే బిడ్డని వుంచవొచ్చు. కాని రెండోయేడు వొచ్చేప్పటికే బిడ్డకి స్వతంత్రాభిప్రాయాలు బైలుదేరతాయి. అప్పుడు వీలైనంతవరకు బిడ్డ తనస్వంత అభిప్రాయాల ప్రకారమే నడుచుకునేట్టు చెయ్యాలి. అవి తప్పూ హానికరమూ ఐనాసరే. పెద్దవారు తమ అభిప్రాయాలనూ అనుభవాలనూ, పిల్లతో చెప్పాలి. కాని అది వాటిప్రకారం వుండడానికి వొప్పుకోకపోతే వూరుకోవాలి; దాన్ని బలవంతం చెయ్యకూడదు. లోకం అభిప్రాయాలనుకూడా లక్ష్యపెట్టవొద్దని సలహా యివ్వాలి. బిడ్డ చీమల్ని చంపుతోంది. పెద్దవారు అభిప్రాయం ప్రకారం చంపడం మంచిదికాదని చెప్పవొచ్చు. "పాపం, వాటికి యెంతనొప్పి!" అనవొచ్చు. "యెందుకు చంపుతావు? చంపితే నీకేం లాభం?" అని అడగవొచ్చు. పెద్దవారు తమ అభిప్రాయాలకు కారణాలు చెప్పవచ్చు. బిడ్డతో, 'ఆర్గూ' చెయ్యాలి. కాని చంపవొద్దని ఆజ్ఞాపించకూడదు. మాట వినకపోతే శిక్షించకూడదు. తన అభిప్రాయం మార్చుకునే సంగతి బిడ్డకే వొదలాలి. అభిప్రాయం మారితేనేగాని, యితరుల కొరకుగాని, తలిదండ్రుల కొరకుగాని ఆచరణ మార్చుకోవొద్దని సలహా యివ్వాలి. బిడ్డ చీమల్ని చంపుతోవుంటే, యితరులు "తప్పు తప్పు" అంటారు. కాని వాళ్ళమాటల్ని నిర్లక్ష్యంచేసి చంపమని చెప్పాలి. యితరులు బిడ్డజోలికివస్తే పెద్దవారడ్డపడాలి. ఈ లోపల చీమలు చస్తున్నాయే అంటే, చీమల ప్రాణాలమీద యీ పెద్దవారిని యెవరన్నా కావలి

పెట్టారా ? ఇంకో స్నేహితులు చంపుతోవుంటే ఏంచేస్తారు ? మత విషయమై, నీతి విషయమైనాకూడా యింతే. వినాయకపూజ చెయ్యనని పిల్లవాడంటే, లేక మసీదుకు వెడతానంటే, వద్దనడానికి పెద్దవారికి అధి కారంలేదు. యితరుల మాటల ప్రోద్బలంచాత చేస్తున్నా, పెద్దవారు తమ వేపు ప్రోత్సహించవలసిందేగాని, అడ్డపెట్టకూడదు.

చేసిన కార్యంవల్ల వొచ్చే ఫలితాన్ని అనుభవించడమే బిడ్డకి శిక్ష. యింటోకి వొచ్చిన స్నేహితుల్ని అల్లరి చేస్తాడు. వారు పెద్దవారి అతి థులగనక, పిల్లవాణ్ని తల్లితండ్రులు లాటంకపెట్టవొచ్చు. వీధిలో మనుష లతో తగూలాడతాడు. వాళ్ళే తంతారు; సరిపోయింది. వాళ్లువొచ్చి పెద్ద వారితో చెపుతారు. పిల్ల యేదో తెలీక చేశానంటే సర్దివెయ్యవొచ్చు. కావలసి అది సరైన కార్యమనుకుని చేశానంటే, "సరే మీయిష్టం. దాన్నేమన్నాచెయ్యండి" అని ఆకొత్తవాళ్ళతో అనాలి. కాని కొన్ని విష యాల్లో యిట్లా ఆగి ఆలస్యం చెయ్యడానికి వీలుండదు. విషంత్రాగి చూస్తా నంటాడు, యితరుల తల బద్దలుకొట్టడమో, యిల్లుకి నిప్పంటించ డమో చేస్తూవుంటే అడ్డుపెట్టితీరాలి. కాని వీలైనంతవరకు అతనికి స్వేచ్ఛ నివ్వవలసిందే.

బిడ్డ తండ్రిమాట వినక యేదన్నా పనిచేస్తే, నీపట్టుగెలుస్తుందో, నాపట్టు గెలుస్తుందో చూద్దాం. అనేట్టుచేసి, అతని నిశ్చయశక్తిని ధ్వంసం చెయ్య చూడకూడదు. అప్పటి కాపనిని చెయ్యనిచ్చి, ఆపని అలవాటు కాకండా, దానిని మాన్పడానికి వేరేమార్గా లాలోచించాలి, వేరేపనులు కల్పించాలి.

బిడ్డవొస్తువులూ, అతని అవసరాలూ, అతనిపనులూ, అన్నీ దాన్నే నిర్ణయించుకో నియ్యాలి. ఏ విషయమన్నా "యేంచెయ్యాలి?" అని పెద్దవారి నడిగితే, 'నువ్వే యోచించుకో' అనాలి.

తనకి స్వతంత్రముందికదా అని బిడ్డ యితరుల స్వతంత్రాని కడ్డం రాకూడదు. వొచ్చాడా బిడ్డ స్వాతంత్రం ఆ నిముషానికి తీసెయ్యవొచ్చు.

పెద్దవారికాలమూ, సౌఖ్యమూ, వారిపనులూ, వీటిలో జోక్యం కలగ చేసుకుని, వారిని యిబ్బంది పెట్టడానికి బిడ్డ కేమాత్రమూ అధికారంలేదు. బుద్ధి తెలిసినప్పటినించీ, బిడ్డ తనొక వ్యక్తినవీ, తనకు యింటో తక్కినవారిమల్లేనే, రైట్సు వున్నాయనీ, కాని యితరులస్వేచ్ఛని ఆటంకపరచడానికి తనకి, 'రైట్' లేదనిన్నీ తెలుసుకోవాలి. ఇప్పుడేమిటంటే, పురుషుడికి సర్వాధికారమూ, తరవాత యెదిగిన కుర్రవాళ్ళకీ, తరవాత తల్లికీ, చివరికి కూతుళ్ళకీ యీప్రకారం తారతమ్యం వుంటోంది. ఇట్లాంటి అధీనతనించి స్త్రీలూ, పిల్లలూ, తిరగబడాలి. ఇప్పుడు స్త్రీలకూ పిల్లలకు అన్యాయం జరుగుతోందా అనేప్రశ్న అక్కర్లేదు. ఇట్లాంటి బేధాలుఅనారోగ్యం. ఇల్లు ఒక కోఆపరేషన్. అందరికీ సమానమైన రైట్సువుండి అందరూ కలిసివుండే సహకార సంఘంలాగుండాలి.

ఇప్పుడు సాధారణంగా కొన్నియిళ్ళల్లోనూ, కొంతకాలం బిడ్డ చాలా ఘనంగా చూడబడి పెద్దవారిమీద సర్వహక్కులనూ చలాయించడమో, లేక పెద్దవారి కారణమూ అర్ధమూలేని ఆజ్ఞలకిలోబడి, తుచ్ఛ జీవనం గడపడమో సంభవిస్తోంది.

పిల్లలకు అర్ధహీనమైన గుడ్డి విధేయత నేర్పకూడదు. పిల్లలకి పెట్టే ఆజ్ఞలు యెందుకు అవసరములో యెప్పటికప్పుడు వారికి తెలియచేస్తో వుండాలి. యెవరిఆజ్ఞను ప్రశ్నించడానికి వీల్లేదో అట్లాంటి అధికారివలె గాక ఒక ఆటలో అధికారాన్ని తక్కినవారు అనుజ్ఞచేత పొందిన నాయకుడివలె వుండాలి, తల్లిగాని తండ్రిగాని. అందరూ కలిసి కుటుంబనిర్వాహకం చెయ్యాలి గనుకనూ, ఒకరు నాయకత్వం వహించకపోతే యీ సంచారలీల జరగదు గనకనూ, అనుభవశాలియైన జనని నాయకురాలై

నట్లుంచాలి. ఇంటినియమాలు పిల్లలేగాక పెద్దవారూ పాటించాలి. బిడ్డ టోపీ కొనిపెట్టమంటే అనవసరమని చెప్పి, తండ్రి తను అనవసరంగా సిగరెట్లు కాల్చకూడదు.

పొద్దస్తమానం 'అదిచెయ్యకు, చప్పుడు చెయ్యకు, అబల్ల ముట్టుకోకు. అట్టాకూచో.' అనే ఆజ్ఞలతో బిడ్డప్రాణాలు తియ్యకూడదు. బిడ్డ చేస్తున్న అక్రమమైనపనులు చూసి, జ్ఞాపకముంచుకుని, సరైన అలవాట్ల ద్వారా దానికి తెలీకండానే దానితో చెప్పకండానే వాటిని కుదర్చాలి. బిడ్డ చీమిడి వొంటికి రాసుకుంటో వుంటే అట్లారాసుకో వొద్దని చెప్పి ప్రయోజనం లేదు. చేతిరుమాలిచ్చి దాంతో తుడుచుకునే అలవాటు నభివృద్ధి చెయ్యాలి.

తప్పుఆజ్ఞ పెట్టినప్పుడు బిడ్డని క్షమాపణ వేడుకోవాలి. "చలిగా వుంది. బైటికి వెళ్ళకు" అని బిడ్డ నన్నతరవాత చలిగా లేదని తెలిస్తే తన పొరపాటుని వొప్పుకోవాలి తల్లి.

యిట్లా బిడ్డకి నీతిని నేర్పడం సులభమైన పనికాదు. సదా సాధ్యం కాదు, అప్పుడప్పుడు కఠినంగా ఆజ్ఞ పెట్టవలసి వొస్తుంది. కాని సాధ్యమైనంతవరకు యీ పద్ధతుల్ని అవలంబించాలి.

# స్వార్థం

స్వార్థం ఒక బలీయమైన "యిన్‌స్టింక్టు". అది జీవితానికి చాలా అవసరం కూడాను. అది మితిమీరనూ కూడదు, నశించనూకూడదు. బొమ్మలూ ఫలహారాలూ, సౌఖ్యాలూ అన్నీ, తనకే కావాలని అనుకోడం బిడ్డకి సహజం. పెద్దవాళ్ళు తన సంగతే చూడాలనీ, తననే ప్రేమించాలనీ, అంటుంది. తనకి అన్నీ కావాలనుకోడం తప్పుకాదు. కాని యితరులకి కూడా వుంటే వోర్చలేకపోవడం, యితరులవీ తనవీ, అన్నీ, తనవీ కావాలనుకోడం, యితరులతో పంచుకోలేకపోవడం. యివితప్పు. తాననుభవించడంకోసం బిడ్డ సౌఖ్యమూ, వొస్తువులూ కోరడం యే మాత్రమూ తప్పుకాదు. తనను నిరాకరించుకుని, తృణీకరించుకునే వేదాంతం ఆత్మనాశనానికి హేతువు. తను అనుభవించాలి, ఆనందించాలి. కాని యితరుల అనుభవం, ఆనందం, ఆప్తి, తనకి కావాలనీ, వారికి వుండకూడదనీ కోరకూడదు.

బిడ్డలోవున్న స్వార్థాన్ని చంపకూడదు. అది సహజం; వుపయోగకరం; అసలది చావదు. దాన్ని చంపాలని బిడ్డని శిక్షిస్తే, అది యెక్కువవుతుంది. స్వార్థం జీవనశక్తి; అది నశిస్తే మనుష్యశక్తి నశించిందన్నమాటే. స్వప్రేమని సంకుచితంగా వున్నదాన్ని, యితరులయెడల విస్తీర్ణత పొందేట్లు చెయ్యాలి. ముందు యితరుల యడల బిడ్డ జరపవలసిన న్యాయమూ, వారి అభిప్రాయాలకూ పనులకూ స్వాతంత్ర మివ్వడమూ, నేర్పాలి. ఎంతవారిలోకూడా స్వప్రేమ చావదు. ఆ ప్రేమ యెంత అధికంగా వుంటే అంత గొప్పవారవుతారు. క్రమంగా ఆ స్వప్రేమలో యితరుల్ని చేర్చుకోవాలి. వారివారి స్వభావాన్ని, శిక్షణనూపట్టి, లోకంలో కొంత కొంత భాగాన్ని ఆ ప్రేమ విశాలత్వంలోకి చేర్చుకుంటారు.

కొందరు తమ కుటుంబాన్ని మాత్రమే, కొందరు తమ వూరివాళ్ళనే, కొందరు తమ సరిప్రాంతాన్నే, కొందరు తమ దేశాన్నే, యీ విధంగా ప్రేమిస్తారు. కనక ఆ ప్రేమను ఎక్కువచేసి విస్తీర్ణమయ్యేట్టు చెయ్యాలి.

ముందు తనను ప్రేమించుకోనివాడు, లోకంలో యెవరినీ, ప్రేమించ లేడు. ఈ స్వార్థాన్ని చంపాలని పెద్దవారు ప్రయత్నించడంవల్లనే చివరికి బిడ్డ తన సౌఖ్యాన్నికూడా కోరుకోడం, అనుభవించడం చాతగాక, యే డబ్బునో మర్యాదనో యితరుల అభిప్రాయాన్నో, తన దృష్టిలో నిలిపి, ఆ క్షుద్రపదార్థంకోసం, తన ఆనందాన్నంతా ధ్వంసం చేసుకుంటుంది. సౌఖ్యపడే వాడెప్పుడూ, ఇతరులను ద్వేషించడు. యితరులమీద యీర్ష్య పడడు. అన్ని సౌఖ్యాలూవుండి, అనుభవించడం చాతగాక, లేనిదాని కోసం యేడ్చేవాళ్ళనీ, తమకు లేనిదాన్ని దేనినో కలిగివున్నవాళ్ళని చూసి యేడ్చేవాళ్ళనీ చూస్తోవుంటాము అనేక మందిని. వూరికే సంపాయిస్తో, కష్టపడుతో, చీదరించుకుంటో, తిట్టుకుంటో, చివరివాకా సంపాయించి, అనుభవించడం తెలీక, అట్లానే చచ్చేవాళ్ళని చూస్తున్నాము.

కనక ముందు తనకి వున్నదానిని తన ఆనందంకోసం వుపయోగించుకోటం నేర్పాలి. బిడ్డదికాని దొంగ ఆదర్శం బిడ్డముందు పెట్టడం వల్లనే ఇన్ని అనర్థాలు సంభవిస్తాయి.

జీవితానికి మూలసూత్రం ఆత్మానందం. ఆ ఆనందాన్ని సంపాయించుకోడం నేర్పాలి. ఇతరులకి కష్టంకలిగించకండా తనకి అనారోగ్యం కాకండా ఆనందం సంపాయించే నేర్పుని నేర్పాలి. తరవాత క్రమంగా తన సంగతి మరిచిపోయి ఆటలలో, పాటలలో, సంస్థలలో కలిసి సంపాయించగల ఆనందాన్ని, యితరులకి ఆనందం కలిగించీ, కష్టంతొలగించీ తెచ్చుకునే ఆనందాన్నీ, తన ఆనందాన్ని త్యజించడంవల్ల కలిగే ఆనందాన్నీ బిడ్డకు రుచిచూపవొచ్చు. కాని కొందరు బిడ్డలు ఎన్నడూ అట్లాంటి ఔన్నత్యాన్ని నేర్చుకోరు; చాలమంది పెద్దలకి నేర్పడమూ చాతకాదు;

ముందు ఈ పెద్దలకి అర్థమైతేగా! అట్లాంటప్పుడు ఆ బిడ్డకి సుఖంగా తను అనుభవించడం నేర్పడం మంచిది. కాని తమకీ, బిడ్డకీ కూడా చాత కాని ఆదర్శం ప్రయత్నించి బోర్లపడడం అనర్థకం. అట్లాంటి ప్రయత్నం వల్లనే, తమకి చేతగాని ధర్మాలను అందుకోవాలనీ, ఆదర్శాలన్నీ తనలో వున్నట్టుగా నటించాలనే ప్రయత్నంవల్లనే, ప్రజలు యితరులకి ఆనంద మివ్వటంలేదు సరికదా, తామూ అనుభవించే శక్తిని పోగొట్టుకున్నారు.

చుట్టూ, ప్రతిచోటా, ఆనందంవుంది. అనుభవించడమే చేతకాదు ప్రజలకి.

ముందు బిడ్డకు యివ్వవలసిన హక్కులు పెద్దవారివ్వాలి. వారు స్వార్థం త్యజించాలి. ముఖ్యంగా బిడ్డ విషయమై, తన హక్కుల్ని అనవసరంగా త్యజించకుండా బిడ్డ అనుభవించడం నేర్పాలి. పెద్దవారు పిల్లల్నందర్నీ, తమవారినీ, యితరుల్ని సమానంగా చూడాలి. ఒక ఆటవస్తువుగాని, వుయ్యాలగాని, తినే వొస్తువుగాని వుంటే, అందర్నీ వరస ప్రకారం, ఆడించి యితరులతో ఆనందం సమానంగా బిడ్డ పంచుకోడం నేర్పాలి. తమ హృదయంలోంచి కూడా పెద్దవారు భేదబుద్ధిని తరిమెయ్యాలి.

అవసరమైనప్పుడైనా త్యాగం చెయ్యమని బిడ్డని బలవంతం చెయ్యకూడదు. త్యాగం చెయ్యమని బిడ్డకు బోధించనుకూడా కూడదు. త్యాగం మంచిదేకాని నేర్పడంవల్ల వొచ్చేదికాదు. అది సహజంగా నిర్వ్యాజంగా వొస్తుంది. నేర్పితే వొచ్చేది కృతకబలవంత త్యాగం. నిజమైన త్యాగం యేమిటంటే, క్షుద్రసౌఖ్యాన్ని ఉన్నత సౌఖ్యంకోసం త్యజించడం; తను బొమ్మతో ఆడుకుంటే వొచ్చే ఆనందాన్ని, యితరులా బొమ్మతో ఆడుకుంటే తనకు కలిగే ఆనందంకోసం త్యజించడం. కనక ఆ ఉన్నతానందాన్ని ప్రేమించే శక్తినియ్యాలి; ఆ అలవాటుని కలగ

చెయ్యాలి. జాలి, సానుభూతి, ప్రేమ నిష్పక్షపాతం, యివి నేర్పాలి. అప్పుడు యితరులకోసం బిడ్డ త్యజిస్తాడు.

కాని బలవంతంగా పెయ్యిసార్లు తనంతటే త్యజించేట్టు చేసినా, త్యాగం అలవాటుకాదు. పైగా యెవరికైనా త్యాగం చేసిందో బిడ్డ వారి మీదా, త్యాగం చేయించిన వారిమీదా క్రోధం అభివృద్ధి అవుతుంది. బలవంతంచేసి చందా లాక్కుపోతే, ఆ చందా తీసుకున్న వాళ్ళమీదా, చందా పోగుచేసినవాళ్ళమీదా యెంత కోపంవొస్తుంది? ప్రాణాలు తీసే బిచ్చగాడిమీద యెంతద్వేషం ప్రజలకి?

అనవసరంగా బాధపడమని ప్రోత్సహించడం, దేహాన్నిగాని, మనస్సునిగాని, శుష్కశ్రమలో డిసిప్లినులో పెట్టడం తప్పు. యే గొప్ప భావానికో, ఆదర్శానికో, శ్రమా, బాధా నిగ్రహమూ ఉపయోగించి సౌఖ్యాన్ని త్యాగం చెయ్యడం మంచిదే. కాని వాటిమీద వాస్తవమైన ప్రేమవల్ల బిడ్డకాత్యాగం సహజంగారావాలి. కనక నేర్పవలసింది ప్రేమ; శుభ్రంగా లోకంలోని సౌఖ్యాలన్నీ అనుభవించడం. నిర్జీవవైరాగ్యం ఆరోగ్యకరంగాదు. ఉన్నతాదర్శంకోసంకాక, అర్థవిహీనంగా దేన్నీ త్యజించనక్కర్లేదు. అనేక విధాలైన పుత్సాహాలు, భక్తులు, ఆనందాలు, అభినివేశాలు, ఆదర్శాలు కల్పించి, వాటితో బిడ్డని ఐక్యంచేసి, తన స్వలాభాన్ని మరిచిపోయి, ఆసంస్థలలో, 'మూవ్‌మెంట్సు'లో, తన బడికోసం, స్నేహితులకోసం, ఆటలకోసం, దేశంకోసం, సంఘంకోసం, సేవనించి ఆనందాన్ని పొందేట్టు చెయ్యాలి. లోకాన్ని దానితోవన చావనిమ్మని ముక్కుమూసుకుని తన ఆత్మముక్తిని కోరేవాడికన్న స్వార్థపరుడెవ్వడు లేడు.

ప్రతి మనిషికిన్నీ ప్రతి కార్యానికీ, ఉద్దేశ్యం తనకి ఆనందం కలగచేసుకోడం. ఎంత బోధించినా, యెంత బాధించినా, ఆ వుద్దేశ్యాన్నుంచి యెవరూ తప్పించుకోలేరు. దుష్టకార్యాలు చేసేవారూ, తమ

సౌఖ్యాన్ని యితరుల సౌఖ్యాన్ని ధ్వంసం చేసేవారూ, తమని తామే బాధ పెట్టుకునేవారూ, అందరూ ఆనందంకోసమే వెతుకుతున్నారు. కాని ఆ ఆనందాన్ని పొందేవిధం తెలీక, మూర్ఖంవల్ల యీ బాధలలో పడతారు. ముఖ్యమైన తప్పులు రెండు. ఆ నిమిషానకలిగే ఆనందానికిలోబడి ముందు గొప్ప బాధలను తెచ్చుకోడం. తనకి జబ్బు చేస్తుందని తెలిసికూడా తిని, చాల రోజులు బాధపడడం. రెండో తప్పు తనకు నిజమైన ఆనందం కలిగించుకోడం వదులుకుని, తను ఆనందంగా వున్నట్టు ఇతరులకు అభిప్రాయం కలిగించడానికి సకల బాధలూపడడం. ఉదాహరణం—మర్యాద కోసం, భేషజంకోసం ప్రజలు పడేబాధలు. ఈ రెండు తప్పులు చెయ్యకండా వుంటే ప్రపంచం చాలా బాగుపడుతుంది.

బిడ్డకి తాత్కాలికమైన సౌఖ్యాలనూ, నీచమైన సౌఖ్యాలనూ త్యజించి వున్నతానందాన్ని పొందే మార్గంచూపాలి. దీనికి ఒకటేవిధం; ఉన్నతానందాన్ని పొందగలశక్తి నివ్వడమే. అంతవరకు బిడ్డ తన చేతిలోని ఆనందాన్ని త్యజించదు. సృష్టిలోని సౌందర్యాన్నీ, గొప్పభావాల ఔన్నత్యాన్నీ, ఇతరులమీది ప్రేమను, వీటిలోని ఆనందాన్ని అనుభవించే శక్తి కలగచేసినప్పుడే బిడ్డ తాను ఇతరులను బాధపెడితే కలిగే ఆనందాన్నీ, యీర్ష్యవల్లా, అన్యాయంవల్లా స్వార్థాన్ని మాట్లాడ్డంవల్లా యింద్రియ లోలత్వంవల్లా కలిగే ఆనందాన్ని త్యజిస్తుంది. వున్నతానందం నేర్పకండా, వ్యర్థంగా త్యజించడంవల్లా, ప్రేమ లేనివారికి త్యాగం చెయ్యమనడంవల్లా ఉద్దేశ్యం లేకండానే, అనుభవించకండా యింద్రియాల్ని కట్టుకోమనడంవల్లా; బిడ్డజీవితం వ్యర్థమూ, శూన్యమూ, అర్థవిహీనమై, కోపమూ, ద్వేషమూ, యీర్ష్యా యెక్కువవుతాయి. ఈ అందమైన ప్రపంచమంతా, ప్రపంచంతోవుండే వుత్సాహమూ, ధర్మమూ, ఆనందమూ, బిడ్డవిగా చెయ్యాలి; యీ లోకానికి యువరాజై పుట్టినట్టుండాలి. ప్రజలనూ, సృష్టినీ, జీవితాన్నీ ప్రేమించి అనుభవించాలి.

ఇంకా గొప్పతనాన్ని పొంది లోకాన్నంతా తన ఆలింగనంలోకి తీసుకోవా లనే ఆశ ఉన్నతం కావాలి. అంతేగాని, ఇదంతా మాయఅనీ, తనకేమీ సంబంధం లేదనీ, తొరగా వొదులుకోవాలనీ, సంకుచిత స్వార్థంగా, అంధంగా, తనదోవన తనుబతికే పందికొక్కుగా వుంచకూడదు బిడ్డని. బడీ, పిల్లలతో ఆటలూ, ప్రయాణాలూ, మీటింగులూ, ప్రజాసేవా, దేశ సేవా, యివన్నీ యీ పద్ధతికి సహాయభూతాలు. ప్రస్తుతం వూరికే పుస్త కాలు చదివించడమూ, స్కూల్లో పడేసి నూరడమూ చేస్తో, తనపొట్టకి తాను సంపాయించుకోడమనేది ఒకటే ఆదర్శంగా వుంచడమూ, లేక పోతే త్వరలో పెళ్ళిచేసి, కుటుంబాన్ని పోషించమనడమూ అన్యాయం.

—•••—

# అబద్ధం

మొదట బిడ్డకి నిజానికీ అబద్ధానికీ భేదం తెలీదు. కనక తనకి తోచిం దల్లా మాట్లాడుతుంది. అట్లాంటప్పుడు వూరుకోవాలి. దాని మాటల్లో అబద్ధాలు యెత్తి చూపనూ కూడదు; 'ఎన్కరేజ్' చెయ్యనూ కూడదు. చాలాసార్లు బిడ్డ తన భావనాశక్తినుపయోగించి, కథలలాగు, జరగనివన్నీ జరిగినట్టే మాట్లాడుతుంది. అప్పుడూ వూరుకోవాలి. యిట్లాంటిమాటలు మరీయెక్కువై, అయిదారేళ్ళు వొచ్చినా మాట్లాడుతో, నిజం మాట్లాడ వలసి నప్పుడు కూడా ఆమాటల్లో బిడ్డ తప్పించుకొంటోవుంటే, పెద్ద వారు 'కాజుఅల్'గా మామూలుగా "అట్లాఐతే, యిట్లా అంటావేం! నువ్వు సరిగ్గా చూడలేదు. సరిగా చెప్పటంలేదు" అనాలి. బిడ్డ కావలసి అబద్ధంచెప్పినట్లున్నప్పుడు కూడా! మొదట్లో, "అట్లా అనాలని యిట్లా అన్నావా? సరిగ్గా మాట్లాడకపోతే నాకెట్లా తెలుస్తుంది? జ్ఞాపకంలేదా? యీసారి జ్ఞాపకముంచుకో" అనాలి. అబద్ధం చెప్పిందని అనకూడదు, వీలైనంతవరకు.

బిడ్డ అబద్ధాలాడడం కలిగించే పరిస్థితులన్నీ తప్పించాలి; అబద్ధా లాడ వలసిన అవసరం కలిగించకూడదు. శిక్షిస్తారనే భయమే అబద్ధాలకు ముఖ్యకారణం, ప్రేమవల్ల పాలించేచోట నిజంచెప్పడానికి భయముండదు. అబద్ధాలకి శిక్షిస్తే యింకోసారి పెద్దవారు కనుక్కోడానికి వీలులేకండా అబద్ధాలాడడం నేర్చుకుంటుంది. అబద్ధాలాడే పరిస్థితులను కలిగించిన తప్పు పెద్దవారు వారిదిగా తీసుకొని, శిక్షణా పద్ధతుల్ని సవరించుకోవాలి.

ఎప్పుడైనాసరే పూర్తిగా బిడ్డమాట నమ్మాలి. అనుమాన పడ కూడదు. 'అబద్ధం. నాకుతెలుసు, నేను చూశాను' అని గదమాయించ

కూడదు. సంపూర్ణంగా బిడ్డతప్పు తెలిస్తేనేగాని: బిడ్డని అబద్ధమాడా వన కూడదు. యెంతవరకూ బిడ్డమాట నమ్మితోనే వుండాలి.

అన్నిటికన్న ముఖ్యం పెద్దవారబద్ధాలాడకూడదు; ముఖ్యంగా బిడ్డతో, అది దేన్నిగురించి అడిగినా, స్పష్టంగా సరిగా వున్నదున్నట్టు నిజం చెప్పెయ్యాలి. బిడ్డ కళ్ళర్లేని విషయమైతే "నేను చెప్పను" అనాలి. అతనికర్ధంకానిదైనా బిడ్డ ప్రశ్నిస్తే చెప్పాలి. కాని వూరికే జోక్యంలేని విషయాల బిడ్డని ప్రశ్నలు వెయ్యనియ్యకూడదు. కాని పెద్ద వారు స్వలాభంకోసం, బిడ్డకు సంగతులు చెప్పకంశా దాచడంకాని, అబ ద్ధాలు చెప్పడంకాని కూడదు. బిడ్డ తను యెట్లాపుట్టిందో లేక తను జంతు వుల్లో చూసిన విషయాలు అడిగినా పెద్దవారు యేమీ తడుముకోకండా నిజం చెప్పాలి. మతమూ దేవుడూ, దెయ్యాలూ, స్వర్గమూ, చావూ పాపమూ, వీటిని గురించి అడిగినా, పెద్దవారు యెట్లా నమ్ముతున్నారో అట్లా స్పష్టంగా బిడ్డతో చెప్పాలి. ముందు పెద్దవారు తమ అభిప్రాయా లెటువంటివో నిశ్చయించుకోవాలి. చాలమందికి వాళ్ళ అభిప్రాయాలు నిశ్చయంగా వాళ్ళకే తెలీవు.

బిడ్డతో మాట్లాడేప్పుడు భద్రంగా మాటల విలవ తెలుసుకుని, మాట్లాడాలి. చీకట్లో తిరిగితే తేళ్ళు కుడతాయి అనకూడదు. కుట్టవొచ్చు అనాలి. బహు, మహా, యిట్లాంటివి జాగ్రతగా వుపయోగించాలి. నిజంగా అట్లా ఆకలేస్తేతప్ప నాకు చచ్చేటంత ఆకలేస్తోంది అని అనకూడదు. బిడ్డనీ అనకూడదు. యేదన్నా బిడ్డకు యిస్తాననకముందు, చేస్తాననక ముందు బాగా ఆలోచించుకుని అనాలి. అన్నారా, మాట నిలబెట్టుకోవాలి. నిలబెట్టుకోలేకపోతే, కారణం బిడ్డకి తెలియచెప్పాలి. బిడ్డని శిక్షిస్తానని బెదిరిస్తే, శిక్షించితీరాలి. బిడ్డపడ్డప్పుడు నేలని కొడతాలే. అని నేలకి దెబ్బ తగులుతుందనే అబద్ధాలుకల్పించి మోసపుచ్చకూడదు.

...—...

# సానుభూతి

బిడ్డ స్వతస్సిద్ధంగా తనదగ్గిరవారిని ప్రేమిస్తుంది. కాని బిడ్డ సహజంగా ప్రేమించనివారి మీదికికూడా బిడ్డ ప్రేమని విస్తీర్ణింప చెయ్యడానికి ప్రయత్నించాలి. అనాథలు, బిచ్చగాళ్ళు, యింటికివొచ్చిన కొత్తవారు, వీరందరితోను బిడ్డకి స్నేహంచేసి, వారికి సంతోషం కలగజేసేప్రయత్నం చేయించడం మంచిది. ఇతరజాతులు, ప్రజలు, ఇతరకులాలు, బీదలు, వారి వేషభాషలు, కష్టాలు, వీటినిగురించి కథలు చెప్పాలి. వాళ్ళవేషాలు వేయించి బిడ్డచేత ఆడించాలి. ఎప్పుడూ గొప్పవాళ్ళూ, రాజులసంగతే గాక, అధములూ, దురదృష్టవంతులూ అనుకునేవారి సంగతికూడా విస్తారంగా మాట్లాడడం వుత్తమం. తనధనాన్ని, సౌఖ్యాన్ని, ఆటవస్తువులను, లేని వాళ్ళకి యిచ్చి వారి ఆనందంవల్లా, తాను ఆనందపడేవిధం నేర్పాలి. ఇతరుల దుఃఖాన్ని, బాధని తొలగించడం కర్తవ్యమనీ, తను ఎవరికీ, దేనికీ బాధను కలిగించకూడదనీ, బిడ్డకి పెద్దవారు తమ ప్రవర్తనవల్లనే చూపగలరు. కథలూ, నాటకాలూ ఒకసాధనం. అంతేగాని వుపన్యాసాలు వ్యర్థం.

ఇతర ప్రాణులమీద గౌరవం కలిగేట్టుకూడా చెయ్యవొచ్చు. వాటి జీవనం, వాటి ఆనందం, వాటి ఆహారవాంఛ, యివన్నీ కథలలో నాటకాలలో బిడ్డకి తెలియచేసి, పావురాలు, పిల్లులు, కుక్కలు, చాపలు, మొదలైనవాటిని పెంచడానికిచ్చి, వాటిమీద ప్రేమ నభివృద్ధిచెయ్యవచ్చు. కాని యే జంతువుల్ని బంధించకూడదు, బాధించకూడదు. అనవసరంగా చంపవలసి వొచ్చినప్పుడు (నల్లులు, తేళ్ళు మొదలైనవాటిని) బిడ్డకి కారణం చెప్పాలి. మృగాల్లో, కీటకాల్లో, తల్లులు, బిడ్డలకోసం యెంత పాటుపడతాయో, ఒకచిన్న పువ్వుకోసం, గడ్డిపరకకోసం, సృష్టియెంత ప్రయత్నిస్తుందో, జాగ్రత తీసుకుంటుందో చూపాలి.

---

# విద్య

బాల్యంలో పాఠశాలకు వెళ్ళకముందూ వెళ్ళేప్పుడూ కూడా, వుపాధ్యాయుడికన్నకూడా, తలిదండ్రులు బిడ్డకు జ్ఞానాభివృద్ధి చెయ్యగలరు. విద్య అనగా, చదవడమూ వ్రాయడమూ అనీ, పరీక్షలు ప్యాసుకావడమనీ, వుద్యోగాలు చెయ్యడమూ, అనే అభిప్రాయాలు పెద్దలకూ, బిడ్డలకూ పోవాలి.

బిడ్డ ప్రతివస్తువునీ పరిశీలించేందుకు వీళ్ళు కలగచెయ్యాలి. పరిశీలించాలనే కుతూహలం స్వతస్సిద్ధంగానే వుంటుంది బిడ్డకి; దాన్నిచంపక వుంచేవాలు. షికార్లు రైళ్ళమీదా, బళ్ళమీదా, పడవలమీదా ప్రయాణాలూ; ఫ్యాక్టరీలూ, మ్యూజియంలూ, పట్టణాలూ, చూడడమూ, యివన్నీ చాలా మంచిది. మృగాల్నీ మొక్కల్నీ పెంచేట్టు చెయ్యాలి. యేది చూడాలని పిల్ల అభిలాషపడ్డా, వీలుకలగచేసి యింకా ప్రోత్సహించి, బిడ్డ కెటువంటి వస్తువులలో, ప్రదేశాల్లో యిష్టమో కనిపెట్టి అటువంటివన్నీ చూపాలి.

సంగతుల్ని బిడ్డంతట బిడ్డనే తెలుసుకోనియ్యాలి; పెద్దవారు చెప్పకూడదు. బిడ్డ అడిగితే, వీలైన సంగతులన్నీ "నువ్వేచూడు. తెలుసుకో" అనాలి. యింక బిడ్డతెలుసుకోలేనివైతే, బిడ్డ ప్రయత్నించి తెలుసుకోకపోతే, చెప్పాలి. బిడ్డజ్ఞానంకోసం అపాయకరమైన పనులైనా చెయ్యనియ్యాలి. బాధకలిగేవైతే, బాధకలుగుతుందని ముందు చెప్పటం విధి, అప్పుడూ తనే చూస్తానంటే, చూడనియ్యాలి, వేడిదీపం తాకుతానంటే కాలుతుందనిచెప్పి, అయినా తాకుతానంటే తాకనిచ్చి తీరవలసిందే.

ప్రకృతిశాస్త్రం (సైన్సు)లో బిడ్డకు విశ్వాసం కుదర్చాలి. ప్రతిదీ మనుషులు తెలుసుకోగలరని, ప్రత్యక్షంగా ఎక్స్పెరిమెంటువల్ల గాక

మూర్ఖంగా నమ్మాలని అనే సంగతుల్లో చాలా అబద్ధాలుంటాయని బిడ్డకి తెలియచెప్పడం మంచిది. శాస్త్రిలూ, మనుషులూ, చెప్పడంవల్లగాక, తనంతట తానుచూచి, స్వబుద్ధితో విచారించి తెలుసుకునే అభ్యాసాన్ని కలగచెయ్యాలి. పెద్దవారు యేదోసంగతిచెప్పి, తాము చెపుతున్నారు గనక, నమ్మమని బిడ్డననగూడదు. తలిదండ్రులు చెప్పినా, నమ్మక, తానే స్వబుద్ధి నుపయోగించే అలవాటు వీలైనంతవరకెక్కువ చెయ్యాలి.

బిడ్డ ప్రశ్నలు వేస్తుంది. ఒకటే అడగడం; కాని విసుక్కోకూడదు పనిగావుంటే యిప్పుడు చెప్పననాలి, చెప్పను పొమ్మనకూడదు. పెద్ద వాళ్ళకెట్లా సరైన జవాబు పెద్దవాళ్లు చెపుతారో, అట్లానే చెప్పాలి బిడ్డలికి కూడా. తమకి తెలీకపోతే పెద్దవాళ్ళు తెలుసుకొని చెప్పాలి. కాని బిడ్డ తనంతట తాను తెలుసుకోగల విధంవుంటే, పెద్దవారు చెప్పకూడదు. మార్గంచూపి వదలాలి. పెద్దవాళ్ళకి తెలీకపోతే, తెలీదనాలి. కాని అబద్ధం జవాబు చెప్పకూడదు. బిడ్డ పనిలేకండా ఆసక్తిలేకండా వేసే సోమరి ప్రశ్నలు 'ఎన్కరేజ్' చెయ్యకూడదు. 'నువ్వే చెప్పు జవాబు' అనాలి.

లోకంలోని దారిద్ర్యమూ, మూర్ఖమూ, మోసమూ, కఠినత్వమూ, అన్నీ బిడ్డకు తెలిసేట్టు, పెద్దవాళ్ళు చూపనక్కర్లేదు. బిడ్డ అడిగితేమాత్రం వాటిసంగతి స్పష్టంగా తెలిసేట్టు చెప్పాలి. ఆ చెడుగు [ఈవిల్]శాశ్వతం కాదనీ, దాన్ని తొలగించడానికి వీలుందనీ, యీశ్వరుడో, మాయో, కర్మమో దానికి కారణమైనా కాకపోయినా, మనుషులు ప్రయత్నించి పోరాడి, దాన్ని నిర్మూలం చెయ్యగలరనీ, అట్లా చెయ్యడం ప్రతివారి ధర్మమనీ విశ్వసింపచెయ్యాలి. పెద్దవాళ్ళపైన కోపమూ, అసహ్యమూ, లోకువా, కలిగించకూడదు వారు చాతకాక జీవితాన్ని పాడుచేసుకున్న మనుష్యులని నిరూపించాలి.

మృగాలవలె, చెట్లవలె, కథల్లో మనుషులవలె అనుకుని పిల్లలతో పెద్దవారుకలిసి ఆడించడంవల్లా, చిన్న నాటకాలచేతా, పిల్లలభావనాశక్తి అభివృద్ధి చెయ్యవొచ్చు.

పనిలేకండానే మాట్లాడించడంవల్లా, కథలూ, అనుభవాలూ, చెప్ప మనడంవల్లా భాష నభివృద్ధి చెయ్యవొచ్చు. గొప్పకవుల పద్యాలు వప్ప చెప్పేట్టుచెయ్యడం మంచిది. వాళ్ళనే కూచుని చదివి వప్పచెప్పమంటే వప్పచెప్పరు గాని పెద్దవారు ముద్దుగా దగ్గరకూచోపెట్టుకుని పద్యం వొచ్చిందాకా నోటితోచెపితే, సంతోషంగా నేర్చుకుంటారు.

దేశాన్నిగురించి, దేశౌన్నాత్యాన్నిగురించి సంకుచిత అభిప్రాయాల్ని నేర్చుకొనవీగూడదు. దేశంమీదకంటె లోకంమీద ప్రేమ నెక్కువచెయ్యాలి.

తనవారిదే, తనవూరిదే, తనదేశందే గొప్పతన మనమనీ, వారి ఆచారాలన్నీ ఉత్తమాలనీ, ఇతరులవి పనికిరానివనీ బిడ్డ అనుకోకూడదు. నిష్పక్షపాతంగా తనవిగాని, తనవారివి గాని, దేశానివిగాని తప్పుల్ని వొప్పుకోవాలి.

చాప అల్లడం, నూలువొడకడం, తవ్వడం, తోటపనులు, మట్టి పనులు, కాయితపు పనులు, వడ్రంగం, సీమసున్నంతో బొమ్మలు గియ్యడం, సాధన చేయించాలి.

## బడి

పిల్లని బళ్ళో వెయ్యడంతోటే తమబాధ్యత సర్వవిధములా, తీరిందనుకుంటారు. భోజనమూ, బట్టా యియ్యడమూ, రోగంరాకండా చూడ్డము, ఇంతే పెద్దవారు విచారించేది. బడికిపోయి, యేడాదిచివర పైతరగతిలోకి పోతేచాలు. ఈ లోపున బిడ్డ యేంచేస్తున్నదీ, యేం నేర్చుకుంటున్నదీ వారికక్కర్లేదు. ఎట్లానన్నా, బిడ్డ వొకటి యింటోవున్నదని మరిచిపోవడానికే పెద్దల ప్రయత్నం.

బిడ్డని బలవంతపరచి పాఠశాలకు యెన్నడూ పంపకూడదు. ఏడుస్తో బడికిపోయి పండితురాలు కావడంకన్న, చదువులేకండా మూర్ఖ

రాలుగా వుండడం వుత్తమం. కొందరు పిల్లల స్వభావం బళ్ళో శాశ్వతంగా గాయపడుతుంది. చాలా బళ్ళు వున్నతెలివిని చంపే విషశాలలూ, పిల్లల్ని బాధపెట్టే కటిక స్థలాలూ, అనారోగ్యాన్ని అభివృద్ధిచేసే నరక కూపాలై వున్నాయి.

బళ్ళో బిడ్డని ప్రవేశపెట్టిన తరవాత తలిదండ్రులు చాలాసార్లు ఆ బడికి వెళ్ళి చూడాలి. అక్కడ యేంచెప్పేదీ, యెట్లా చెప్పేదీ, బిడ్డల్ని బాధపెట్టేదీ, యివన్నీ జాగ్రతగా పరిశీలించాలి. తమ సలహాలను వుపాధ్యాయుడు వినేట్టు చెయ్యాలి.

బిడ్డని అయిదేళ్ళరాగానే బడికిపంపాలి. ఎందుకు పంపాలంటే—

1. తక్కిన పిల్లలతో స్నేహంచేసుకోడం, ఆడుకోడం, చెయ్యవలసిన వయసుగనుక. అట్లా కలవడంవల్ల చాలా గొప్ప వికాసం కలుగుతుంది బిడ్డకి అన్నివిధాలా.

2. అక్షర జ్ఞానంకోసం. ఇది చాలా అవసరం జీవితానికి.

3. బిడ్డకి తోచడానికి. ఏం పనిలేకపోతే ఇంటిదగ్గిర బిడ్డ 'న్యూసెన్సు' అవుతుంది.

4. ముందు జీవితంలో సంపాయించుకుని పోషించుకునే సాధవం నేర్చుకోడానికి.

కాని ప్రస్తుతపు విద్య బాగాలేదు. బడులు ఘోరంగా వున్నాయి. చాలాకాలం యీ బడులలో చదివితే, బిడ్డకికలిగే లాభాలకన్న నష్టాలు ఎక్కువ కలుగుతున్నాయి. ఆరోగ్యం నశిస్తోంది. మెదడు మందగిస్తోంది. ఏది నమ్ముతున్నదో బిడ్డకేతెలీదు. జీవశక్తీ నిశ్చయశక్తీ ఆనందించేశక్తీ, నశిస్తున్నాయి. మనుషులతో, కుటుంబంతో చక్కగా మెలిగి సౌఖ్యపడే తెలివి అసలు లేకండాపోతోంది. జీవితంలో ముఖ్యమైన ఆనందం, శరీరం వెముకలలోంచి వాస్తోంది. సుఖమైన భోజనం, చక్కని స్నేహం, మనసులో శాంతి, స్త్రీని గొప్పగా అనుభవించడం,

ఆరోగ్యం—ఇవీ ముఖ్యం. ఇట్లాంటి శాంతినిచ్చేవే సరైన విలువలు. ఈ విలువలుపోయి, ధనార్జనా, అధికారం, పలుకుబడీ- ఆస్తీ, కీర్తీ, దర్జా, ఈ విధమైన విలువలు మనసులో స్థిరపడి, వాటి ప్రయత్నంలో ఏ సౌఖ్యములేని అనాధలౌతున్నారు, యీ విద్యావంతులు. ఈ కొత్త విలువలు మనసు పైపైన పనిచేస్తాయిగాని, లోపల ఏమీ సుఖాన్నివ్వవు. అందుకనే అంత అశాంతిగా మిజరబుల్‌గా కనపడతారు యీ చదువుకున్న మనుషులు. బళ్ళోకూడా పరీక్షలనే భూతాలు, ఏమీ ఆటలకీ, విశ్రాంతికీ స్నేహానికీ, అభిరుచులకీ వ్యవధినివ్వక, మనిషిని శరీరం మనసూ హృదయం, పిండి పిప్పిని చేస్తున్నాయి. విద్య అనేపేరుతో ఎందుకూ కొరగాని జ్ఞానాన్ని మనసుల్లో ఎక్కిస్తున్నారు. చాలవరకు అది విష ప్రాయయ మవుతోంది.

ఆరోగ్యమైన శరీరం ఆహారాన్ని ఎంత సహజంగా మధురంగా కోరుతుందో, ఆరోగ్యమైన మనసు అంత ఆతృతతోనూ జ్ఞానాన్ని కోరు తుంది. భోజనశాలకు వెళ్ళడం ఎంతప్రియమో, అంతకన్న ఎన్నోరెట్లు సహజం, సుందరం, కావాలి బడికివెళ్ళడ మనేది. బడీ, పంతులూ, అంటే ఇంత ఘోరమై పోవడం, బిడ్డతప్పు ఏమాత్రమూలేదు। ఎప్పుడు బడికి వెడతానా, అనే ఆత్రుత బిడ్డ కనపరచకపోతే, ఆ బడి విషమన్న మాట ఆ బిడ్డకి.

సాధారణమైన బిడ్డకి, ప్రతిబిడ్డకూ అవసరమయినది, తెలుగు పత్రి కలు చదవగల జ్ఞానము, ఉత్తరాలు వ్రాయగలిగడమూ. చిన్న భాగా రాలు, హెచ్చవేతలు చెయ్యగలిగడమూ, ఇవి నేర్పి తీరాలి లోక వ్యవ హారం కోసం. అవసరమైతే, టీకాలు వేయించినట్టే బలవంతంగానన్నా నేర్పాలి. తక్కిన జ్ఞానం అనవసరం. ఇది సులభంగా తల్లి చెప్పవొచ్చు. ఇంటి దగ్గిర తోచకండా ఉండకండా అతనికి ఏ కర్మాగారానికో పంపి జీతం లేకండా, సరదాఉన్నంతసేపు పనిచేసేట్టు, ఏర్పాటు చెయ్యవొచ్చు.

పొలానికి, తోటపనికి పంపవొచ్చు. అన్నిటికన్నా సరదా, అవుల్నో, గొర్రెల్నో కాయమనటం, వాటిజాగ్రత్త తీసుకోడం, తక్కిన పిల్లలతో స్నేహాలూ అవుతాయి, బైట తిరిగే పిల్లలకి.

ఇంక ముందు జీవితమంటారా, యీ ధనమూ, ఆస్తీ, అధికారమూ సంపాయించేందుకు, పదవులకు పాకులాడే మనుషులు ఎంత సౌఖ్యాన్ని బలి ఇచ్చుకొంటున్నారో తెలిస్తే, తమ పిల్లల్ని ఆ విధంగా ఎన్నడూ ప్రోత్సహించరు. చాలా స్వల్పమైన ధనంతో, మామూలుగా బతకడం తప్పకుండా అలవాటు చెయ్యాలి.

ముఖ్యంగా అంగీకరించవలసింది, ఆనందం బిడ్డకి జన్మహక్కు అని. ఏమాత్రమైన బాధ బిడ్డకి గలగచేసినా, ఆవిద్య బిడ్డకి పడదన్న మాట. ఎక్కువగా సౌఖ్యపడడం నేర్పాలి విద్య. తనభౌతిక అవసరాల్ని తగ్గించుకోడం, అంటే Luxuries వొదులుకోడమూ, పని తక్కువగా చేసి, Leisure ఎక్కువగా తెచ్చుకుని, ఆ కాలాన్ని తన సౌఖ్యానికి ఎట్లా వుపయోగించుకోవాలో, నేర్పాలి చదువు.

ఈ పాఠశాలలు ఇప్పుడుచెప్పే తుక్కునంతా చెప్పడం మానెయ్యాలి. టీచర్లు సానుభూతి కలవాళ్ళు, ఉత్సాహవంతులూ, సంతోషం కలవాళ్ళు, తెలివిగలవాళ్ళుగా వుండాలి. పాఠశాలలు గొప్ప మందిరాల మల్లే ఆకర్షకంగా వుండాలి. అంతవరకూ పిల్లల్ని బళ్ళకి పంపమని తలితండ్రులు సమ్మె కట్టాలి. ఇప్పుడు బళ్ళలో చెప్పే విషయాలుగాని, చెప్పే పద్ధతులుగాని, ఏవీ బిడ్డకి ఉపకారం చెయ్యవు. ఘోరమైన అపకారాలు చేస్తున్నాయి. ఆరోగ్యం నశిస్తుంది. తెలివి మందగిస్తుంది. సర్వమైన గొప్ప గుణాలూ మలినమౌతాయి.

ఈ బళ్ళలో చదవడం గొప్ప దురదృష్టం, చదువులేకండా వుండడం గొప్ప అదృష్టం.

ఎందుకూ కొరగాని భావాలతో, ఆచారాలతో, బానిసత్వాలతో, గుంపుని అనుకరించడంతో కుంగి బిగుసుకుపోయే జీవితంలో పడకండా స్వేచ్ఛగా నిర్భయంగా బతకడం నేర్పాలి బిడ్డకి.

ప్రస్తుతం ఏసారమూలేని ధనం తప్ప తక్కిన విలువలేవీ లేకండా ఐపోతోంది లోకం. అధికారం, కీర్తి, యీరెండు ఆ శుష్కమైన ఆ విలువకి తోడ్పడ్డాయి.

గొప్ప కావడం, పైకిపొకడం, Success పొందడం కన్న, Simple గా సుఖపడడంలో వుండే విలువను నేర్పాలి విద్య.

తెలుసుకోడం- జ్ఞానంపొందడం సుఖమివ్వాలి. ఆ సుఖం లేంది విద్య విషతుల్యం.

పనిచెయ్యడం మనిషికి సహజం. పని ఆనందమివ్వాలి. ఆనంద మివ్వని పనిని, జీవితానికి ఎంత అవసరమో అంత కొంచెం చెయ్యడమే తెలివి.

పరీక్షలు గడిచి పైతరగతులలోకి పోతున్నంత మాత్రాన బిడ్డ అభివృద్ధి చెందుతోందనుకో కూడదు, విద్య వుద్దేశ్యంకూడా పైతరగతు లకి పోవడంకాదని బిడ్డా పెద్దవారుకూడా విశ్వసించాలి.

## కథలు

చాలా కథలు చెప్పాలి పిల్లలికి. పెద్దవారికి రాకపోతే, నేర్చుకుని, చదివి, చెప్పాలి. వాళ్ళవయస్సును పట్టి దేవతలూ, రుషులూ, జంతు వులూ, చెట్లూ, తిరిగి మాట్లాడే కథలూ, పురాణకథలూ, మహాపురుషుల జీవిత కథలూ, యెన్నెన్నో చెప్పాలి. చెప్పినతరవాత మళ్ళీ ఆ కథను చెప్పమని బిడ్డను బాధపెట్టకూడదు. బిడ్డ కుతూహల పడితే, పెద్దవాళ్ళు చెప్పిన కథల్నిగాని, తన సొంత కథలనుగాని చెప్పనియ్యాలి. నీతి చెప్పనూ కూడదు, కథకి నీతేమి టని బిడ్డని అడగనూకూడదు. ముఖ్యంగా

దేశంలో వాడుకలోవున్న కథలు చెప్పాలి. అసహ్యమైనవీ, అమితంగా క్రోధమూ, దుఃఖమూ, భయమూ కలిగించే కథలూ చెప్పకూడదు. మంచి కథల్ని బిడ్డలచాత నాటకాలుగా ఆడించవొచ్చు.

పెద్దపిల్లలు చిన్నపిల్లలకి కథలు చెప్పవొచ్చు. బిడ్డకి చదవడం రాగానే చాలా కథల పుస్తాకా లియ్యాలి.

## కళలు

సృష్టితో యెప్పుడూ బిడ్డకి సంబంధముండేట్లు చూడాలి. తోటలూ, గాలీ, పిట్ట్లా, ఆకాశమూ వీటిలో బిడ్డకి ఆనందం కలగచెయ్యాలి. షికార్లు పంపాలి. యింటికి తోటవుంటే, బిడ్డ కిష్టమున్నంతసేపు దాంటోనే వుణ్ణియ్యాలి. పెద్దవాళ్లు అనుభవిస్తో, బిడ్డనీ సృష్టి సౌందర్యాన్నీ, సూర్యోదయాన్నీ, అస్తమయాన్నీ, వెన్నెలనీ, అనుభవించి, ఆనందించి అద్భుతంలో నిండేట్టు చెయ్యాలి. కాని పెద్దవారి ఆనందాన్నీ బిడ్డ కపటంగా 'ఫాషన్'కి తనూ తలతిప్పే ఆపదలో పడకండా కాపాడాలి. దానికి సృష్టి సౌందర్య మర్ధం కాకపోతే వూరుకుంటే మంచిది. కాని సృష్టిని ప్రేమించని బిడ్డ వుండదు లోకంలో.

బాలుడికి యే కళలో యెక్కువ రుచివున్నదో కనిపెట్టి ఆ విధమైన కళావాతావరణంలో పెంచాలి. దేంటోనూ అభిరుచిలేకపోతే వొదిలెయ్యాలి. కాని నేర్చుకోమని బలవంతం చెయ్యకూడదు.

మాటల్లో, చేష్టల్లో, బట్టల్లో, ఉేస్టు అభివృద్ధిచెయ్యాలి. ఏవి అందమైనవో యేవి మర్యాదైనవో తెలియచెయ్యాలి. కాని తన అందమే చూసుకుని కులికేవాణ్ణిగా తయారు చెయ్యకూడదు. పెద్దవారి అభిప్రాయాలే సరైనవని అనుకుని అవే అతను 'కాపీ' చేసేటట్లు చెయ్యకూడదు. ఇతరులెట్లా చేస్తున్నారో చూసి దాన్నికూడా బిడ్డ గుడ్డిగా అనుకరించేట్టు చెయ్యకూడదు. బిడ్డఉేస్టుకి స్వతంత్రముండాలి. జుట్టూ కట్టూ తీరుగా, విదా

వంతులకు, మర్యాదస్తులకు, తగివుండేట్టుగా అలవరచాలి. కాని వాటిని నిర్ధారణచేసిన తరవాత, ఆ జుట్టుసంగతే, వేషం సంగతే, ఆలోచించక బిడ్డ వాటినీ తననీ మరిచిపోవాలి.

బిడ్డని మంచినాటకాలను, బయస్కోపులను సర్కసులను చూడ నివ్వాలి. మంచి సంగీతం విననివ్వాలి. బిడ్డ తన నడవడిలోకూడా, యిది మంచిపనా, అసహ్యమైన పనా, అని ఆలోచించుకోడం మంచిది.

పెద్దవారు తమ చేష్టలను బిడ్డనెత్తిమీద రుద్దకూడదు. తమకు అభిలాష వుందని, బిడ్డకి యిష్టంలేకపోయినా సంగీతము మొదలైనవి బిడ్డని బాధపెట్టి నేర్పేవా రున్నారు.

# సృష్టి జ్ఞానం

స్త్రీ పురుష సంబంధం విషయమై పెద్దవారి నీతీ, ప్రవర్తనా, అభి ప్రాయాలూ, చిన్నప్పుడు నేర్చుకున్న అలవాట్లమీద చాలా ఆధారపడి వుంటుంది. కనక ఆలోచనలలో, పనులలో, బిడ్డకి సరైన అలవాట్లు యేర్పరచాలి. ఈ విషయమై యెవరూ ఆలోచించరు, ఎవరికీ పట్టదు. ఈ సంగతుల్ని గురించి వ్రాయడమూ, మాట్లాడ్డమూ బూతు ఐపోయింది. ముఖ్యంగా తలిదండ్రులు బిడ్డలతో అసలు మాట్లాడరు. కాని యీ జ్ఞానం తక్కువ కావడంవల్లా, మలినం కావడంవల్ల తమ బిడ్డలలో ఎన్ని వక్రత్వాలు, యెంతనష్టం తటస్థిస్తోందో తెలుసుకొన్నట్టయితే పెద్దవారు యెక్కువశ్రద్ధ తీసుకుని తీరతారు.

ముఖ్యంగా జ్ఞాపకముంచుకోవలసింది రెండుసూత్రాలు. ఒకటి- పిల్లలు పెద్దలైనంతవరకు తమ "సెక్సు" జ్ఞాపకంతెచ్చుకోనవసరం లేని పరి స్థితులలో వారిని పెంచాలి. బాలుడనీ, బాలికనీ, మాటిమాటికీ ఆ భేదాన్ని జ్ఞాపకం తెచ్చుకోవలసిన అవసర ముండకూడదు. ఆ భేదమూ, అది యెందువల్ల కలిగిందో, ఆ భేదంవల్ల వారిజీవితంలో భేదమేమిటో వారు యెక్కువగా ఆలోచించకండా వుండాలి. రెండోది - కాని ఆ భేదాన్ని గురించి ఆలోచించి తెలుసుకో ప్రయత్నించారా, పెద్దవారు యేమాత్రమూ సంకోచింపక దాచక స్పష్టంగా చెప్పివెయ్యాలి.

సహజంగా బిడ్డకి తన శరీరంమీద, ప్రేమా, గౌరవమూ, అభి మానమూ వుంటాయి. అవి నశింపకండా చూడడం పెద్దవారి విధి. శరీ రము నీచమనీ, పాపభూయిష్టమనీ, దాని ధ్యాసే పాపమనీ, చెప్పే వేదాం తాన్ని వొదిలి, సృష్టి సౌందర్యమంతా కలసిననిలయము దేహమనీ, లోకం

లోని ఆనందాన్ని అనుభవించడానికి సాధనమనీ, ఈశ్వరుడు (నమ్మక ముంటే) నివసించే గృహమనీ, చెప్పాలి. తన దేహాన్ని యితరులు తాక కండా, ఉపయోగించకండా, బిడ్డ జాగ్రత పడడం నేర్పాలి. శరీరంలో కొన్ని అవయవాలు నీచములనిగాని, అపరిశుభ్రములని కాని, పాపములని గాని, సిగ్గు పడవలసినవీ, దాచుకోవలసినవనిగానీ నేర్పకూడదు. పెద్దవారు తమమాటలవల్ల ప్రవర్తనవల్ల అట్లాంటి అభిప్రాయాలు కలిగించకూడదు. ఈ క్రింది విషయములు జాగ్రతగా గమనించాలి.

1. బంధువులుగాని, ఇతరులుగాని, తలితండ్రులుగాని బిడ్డల్ని ముద్దు పెట్టుకోకూడదు. నలపకూడదు. బిడ్డ ఇష్టపడ్డా పనికిరాదు.
2. ముసలమ్మలు మొదలైనవారు బిడ్డ సృష్టి అవయవాలతో ఆడడమూ వాటిని ముద్దుపెట్టుకోడమూ, బిడ్డ దృష్టిని వాటివేపు మరల్చడమూ, చాలా హానికరమైనవి. అట్లాంటివారిని వెంటనే కర్రతో చావకొట్టినా తప్పుకాదు.
3. బిడ్డని యెన్నడూ యెవరూ కొట్టకూడదు.

దెబ్బలు తినడానికి అలవాటు పడ్డబిడ్డ తనవొంటిమీద అభిమానాన్ని పోగొట్టుకుంటుంది. పరాయివాళ్ళేంచేసినా లొంగిపొయ్యే అలవాటులో పడు తుంది. కనుక దెబ్బలంత హానికరమైన విషయం యింకేదీ లేదు.

4. ప్రత్యేకంగా సృష్టి అవయవాలను దాచే, సిగ్గు బిళ్ళలు, గోచీలు, యేమాత్రమూ పనికిరావు.

మొగపిల్లలకూ ఆడపిల్లలకు ఒకటే విధమైన బట్టలు వెయ్యడం అవసరం; జుట్టు ఒకటేవిధంగా వుంచాలి. ఆడపిల్లలకిమాత్రం ముక్కులు చెవులు కుట్టడం తప్పు. పేర్లుకూడా మొగ ఆడ విచక్షణలేకండా పెడితే మరీ మంచిది.

వీలైనంతవరకు బట్టలులేకండా తిరగనియ్యడమే ఆదర్శంగావుంచు కోవాలి. చలికి తప్ప బట్టలు వెయ్యనక్ఖర్లేదు. బైటికి బిడ్డని తీసికెళ్ళే

టప్పుడు, మర్యాదకోసం, బట్టలు వెయ్యవొచ్చు. బిడ్డకి సిగ్గుతోచి బట్టలు అడిగినప్పుడే బట్టలు కుట్టించడం అవసరం- అప్పుడుకూడా వీలైనంత వరకు బట్టలు లేకండా వుండనియ్యడం మంచిది.

బిడ్డకు తనదేహము పవిత్రమనే అభిప్రాయం స్థిరంగా వుండాలంటే, పెద్దవారుకూడా అమితమైన సిగ్గును కనపరచకూడదు. లోకాచార ప్రకారం దుస్తుల్ని ధరిస్తున్నారే గాని ప్రత్యేకంగా యేమీ దాచడానికి కాదన్నట్లుండాలి. పెద్దవారు బట్టలేకండా వున్నప్పుడు బిడ్డ చూడడం తటస్థిస్తే అమితంగా సిగ్గుపడడం, అరిచి పొమ్మనడం, యేమీ చెయ్యక సహజంగా ప్రవర్తించాలి. బిడ్డ ప్రశ్నలు వేస్తే సిగ్గులేకండా వాస్తవమైన జవాబులు చెప్పాలి; డాక్టర్లు తమ విద్యార్థులకు బోధించినట్లే. ఇట్లాంటి విషయాల్లో తాము సిగ్గుని వదలక బిడ్డలపైన కేకలు వెయ్యడంవల్ల పెద్దలు బిడ్డలకు అమితమైన హాని చేస్తున్నారు.

రెండోయేడు మొదలు ఎనిమిదో యేటి మధ్య చాలామంది పిల్లలు మాస్టర్‌బేట్ చేస్తారు; తొడా తొడా రాసుకోడమూ, కుర్చీలకు రాయడమూ, పెద్దవారివొంటికి రాయడమూ మొదలైనవి. కాని సాధారణంగా యిది పెద్దవారు కనిపెట్టలేరు. కాని కనిపెట్టినట్టయితే యేమీ తెలీనట్టు తాము చూడనట్టు వూరుకోవాలి. చాతనైతే బిడ్డని వేరే పనిలో ప్రవేశపెట్టవొచ్చు. బిడ్డని అందుకని కోప్పడ్డంకాని, అట్లా చెయ్యవొద్దని చెప్పడం గాని, అది చూసి నవ్వడంగాని వెక్కిరించడంగాని పనికిరాదు. ఇంకెవరినీ 'నోటీస్' చెయ్యనీకూడదు. ఎందుకంటే, తానేమి చేస్తోందో బిడ్డకే తెలీదు. దానివల్ల హానీలేదు. ఆ అలవాటు దానంతట అదే పోతుంది. కాని పెద్దవారు అదిరిపడ్డారా, తాము భయపడి అసహ్యపడి బిడ్డని బెదిరించారా, ఇంక అది విషతుల్యమై బిడ్డ సెక్సుజీవితాన్ని నాశనం చేస్తుంది. ఈ అలవాటు కోసం బిడ్డల్ని కొట్టేవారు, కాల్చేవారు మూర్ఖులున్నారు. చెపితేమాత్రం వారువింటారా? అంత ఘోరం జరుగుతో

వుంటే ! అది ఘోరం కాదంటె, అన్నవాడు అవినీతి బోధిస్తున్నాడం టారు. అంతే, బిడ్డని శిక్షించినకొద్ది అలవాటు, అంతకన్న ఘోరమైన అలవాట్లూ యెక్కువవుతాయి. ఇరవైనాలుగు గంటలూ బిడ్డని కనిపెట్టి వుండలేరు గనక శిక్షించి వ్యర్థం. కావి వినరు; ఎంతచెప్పి ఏం లాభం ? చెప్పాలనే యీ వెర్రి యెందుకో తెలీదు.

గట్టిబట్టలు, సృష్టిఅవయవాలకు రాసుకునేవి వెయ్యకూడదు. బిగుతు లాగువంటివీ, గోచీలవంటివీ, మంచిదికాదు.

చిన్నప్పటినించీ, పిల్లలకు శుభ్రమైన అలవాట్లు నేర్పాలి. చన్నీళ్ళ స్నానమూ, గట్టిపడకలమీద నిద్రా, మంచిగాలీ, వ్యాయామమూ, దేహ వస్త్ర శుభ్రతా, సోమరిగా వుండకపోవడమూ మొదలైనవి. స్నానమప్పుడు తక్కిన శరీరంతోపాటు సృష్టి అవయవాలను కడుక్కోడము పెద్దవారు అలవాటు చెయ్యాలి.

చిన్నప్పణ్ణించికూడా బిడ్డయొక్క సృష్టి అవయవాల విషయమై మాట్లాడవలసి వొచ్చినప్పుడూ, వాటికి వైద్యము చెయ్యవలసి వొచ్చి నప్పుడూ, సిగ్గుగాని, హేళనగాని, యేమీ కనపరచక, సహజంగా, చూపులో, మాటలో, పనిలో తక్కినవొస్తువుల యెడల ప్రవర్తించినట్టే ప్రవర్తించాలి. సిగ్గూ అసహ్యమూ, కనపరచకూడదు. వాటిని వాటి పేర్లతో సిగ్గులేకండా సహజంగా మాట్లాడాలి. ఇప్పుడున్న పేర్లు బూతు లుగా పరిణమించాయి గనక కొత్తపేర్లు పెట్టుకుని పెద్దలూ ఆ పేర్లతో వాడుకోవాలి. పిల్లలు తమ అవయవాలతో ఆడుకుంటూవుంటే మాట్లాడ కూడదు, అడుపెట్టగూడదు. పరాయివాళ్ళుకూడా యేమి అనకండా పెద్ద వారు జాగ్రతతీసుకోవాలి. బిడ్డకి బుద్ధితెలిసిన తరవాత అసలు యీ అవ యవాలు, బూతులు అసహ్యాలూ కాకపోయినా, లోకంమాత్రం ఆ విధంగా చూస్తుందనీ, వీటినిగురించి మాట్లాడినా చెప్పుకున్నా మర్యాద అనుకోదని చెప్పవొచ్చు. వాటినిగురించి యింటో స్వేచ్ఛగా మాట్లాడుకున్నా ఇతరు

లతో మాట్లాడకూడదనీ, యితరులు వున్నప్పుడు వాటివిషయం మాట్లాడడం మర్యాదకాదనీ చెప్పాలి.

మూడునాలుగేళ్ళ లోపునే బిడ్డ తనెట్లా పుట్టిందో, కనుక్కోవాలని ప్రయత్నిస్తుంది. తను లోకంలో మృగాలలో, చూసిన విషయమై ప్రశ్నిస్తుంది.

చిన్నప్పణ్ణించీ పిల్లలతో సఖ్యంగావుండి వాళ్ళప్రశ్నలకు తడుముకోకండా జవాబుచెప్పే అలవాటులోవుంటే ఆ ప్రశ్న బిడ్డ తలిదండ్రుల్నే అడుగుతుంది. అప్పుడు సందేహించకండా సిగ్గుపడకండా తడుముకోకండా తక్కిన ప్రశ్నలకు జవాబుచెప్పినట్టే దీనికీ చెప్పాలి. ఎన్నడూ యేమాత్రమూ అబద్ధం చెప్పకూడదు. ఏమడిగినాసరే జవాబుచెప్పాలి. అమ్మ యెందుకు దూరంగా వున్నదన్నా అత్త యెందుకు నెప్పులు పడుతుంది, అన్నా, తమ్ముడు యెట్లా వొచ్చాడు అని అడిగినా, నిజంగా సంగతేమిటో అదే చెప్పాలి. రహస్యమూ, అబద్ధమూ, బిడ్డలు తెలుసుకోకూడదనే వాతావరణమూ యింటోంచి తొలిగించాలి. అంతా సహజమూ, నిర్మలమూ ఆరోగ్యవంతమూ జ్ఞానప్రదంగా వుండితీరాలి.

ఈ విధమైన జ్ఞానం తలిదండ్రుల దగ్గిర్నుంచి బిడ్డ సంపాయించడం చాలా వుత్తమం. తలిదండ్రులూ తక్కిన పెద్దవారూ, యీ విషయమై మాట్లాడరనీ, తను మాటాడితే తిడతారనీ, నిజంచెప్పరనీ ఎప్పుడు బిడ్డకి తోస్తుందో అప్పుడు తన స్నేహితుల్ని వీధులో పిల్లల్ని అడుగుతుంది. తలిదండ్రులు ఒక్కటి గ్రహించాలి. కాని గ్రహించేధైర్యం చాలమందికి లేదు. తాము చెప్పకపోయినంత మాత్రాన, బిడ్డ అంధకారంలో వుండదు. సందేహం కలిగిందా తీర్చుకునేదాకా బిడ్డ నిద్రపోదు—అందులో ముఖ్యంగా ఏదో రహస్యమూ గూఢమూవుంది అనుకుందా, అసలువూరుకోదు. ఎవరినో సగంతెలిసీ తెలీని, బూతుగానూ, వక్రంగానూ చెప్పే వాళ్ళని అడుగుతుంది. వాళ్ళుచెప్పిందే నమ్మి యోచించి తనకు తెలుసు

నని పెద్దవారి దగ్గర్నించి దాస్తో అనారోగ్యం వృద్ధిచేసుకుంటుంది, బిడ్డ కీ సంగతులు తెలుసునని పెద్దవారికి తెలుసు. తనకి తెలుసునని పెద్దవారికి తెలుసునసీ బిడ్డకితెలుసు. కాని యెవరికివారు తెలీనట్లేప్రవర్తించడంమర్యాద అయింది. అయిపోతూంది. పిల్లలయెదట పిల్లలతో బూతులుమాట్లాడే తలిదండ్రులకికూడా ఆరోగ్యంగా యీ విషయాలు మాట్లాడడం సిగ్గు.

కొందరు బిడ్డలు యీ విషయమై తెలుసుకోవాలనే ఆసక్తినికలిగి వుండకపోవొచ్చు. వాళ్ళకికూడా యెనిమిదేళ్ళు రాకపూర్వమే సృష్టిజరిగే విధము తెలీడం ముఖ్యం. క్రమంగా పువ్వులు కాయలయ్యేవిధమూ, జంతువులు బిడ్డల్ని కనేవిధమూచూపి జ్ఞాపకంచేసి మనుష్య సృష్టికూడా ఆ విధంగానేనని చెప్పాలి. ఈ సృష్టి ఆనందాన్ని బిడ్డ అర్థం చేసుకునేట్టు చెయ్యాలి.

సహజమైన యీ విషయాలు, భోజనంవలెనే బిడ్డత్వరలో నేర్చుకోవలసిన జ్ఞానము, మలినమనీ, నిర్మలమైనబిడ్డ నేర్చుకోకూడనివనీ, పెద్దవారి అభిప్రాయం. కాని యెంత దాచినా, బిడ్డదగ్గిర్నించి దాగవనీ సృష్టే బిడ్డకి బోధిస్తుందనీ, ఆ జ్ఞానవాంచ బిడ్డలో స్వభావసిద్ధంగా వున్నదనీ తెలుసుకోరు. ఆ మూర్ఖంవల్ల బిడ్డలో హెక్కడెక్కడ ఆ కోర్కె, ఆ జ్ఞానం సంపాయించాలని ఆశ. చిన్హాలు కనబడ్డా, నిర్మూలం చెయ్యాలని ప్రయత్నిస్తారు. సహజమైన సృష్టివాంఛమీదనే పెద్దఅనుమానం యేర్పడ్డది. అది అసహ్యమూ రోతా అయింది. దానికి సంబంధించిన మాటలన్నీ బూతుమాటలుగా మారాయి. పెద్దవాళ్ళ దెబ్బలూ, తిట్లూ బిడ్డని వక్రమార్గాలకు తిప్పుతాయి. ఏ కోర్కెని నిర్మూలం చెయ్యాలనుకొంటారో, అదే పెద్దవారి మూర్ఖంవల్ల, క్రౌర్యంవల్ల, అసహజమూ మలినమూ ఐన మార్గాల వర్తిస్తుంది. స్వభావానికి వదలక, పెద్దవారు జోక్యం కలగచేసుకొన్న కొద్దీ బిడ్డకి హాని జరుగుతుంది.

పెద్దవారు చూపేకోసమే, అనుమానమే, సిగ్గే, అసహ్యమే, బిడ్డ స్వభావానికి విషతుల్య మవుతుంది.

ఈ జ్ఞానం బిడ్డలకి లేకపోవడంవల్ల, రజస్వలలై హడిలిపోయిన వాళ్ళు, మతిపోయినవాళ్లు, ఆడపిల్లలువున్నారు. గర్భాదానపు గదిలో భయపడి చాలాసంవత్సరాలు బాధపడ్డ వాళ్ళున్నారు. యవ్వనచిహ్నాలు అర్థం చేసుకోని బాలురువున్నారు. వీరు సక్రుతే కావొచ్చు. కాని వొక్కరు ఆ ప్రకారం బాధపడి, స్వభావాన్ని వికృతం చేసుకున్నవాళ్ళున్నా దానికి తలిదండ్రులూ, సంఘమూ బాధ్యులవునా కాదా ?

తలిదండ్రులకూ బిడ్డలకూ నిర్మలమైన విశ్వాస సంబంధం లేకపోవడంవల్ల, వారితో చెప్పుకోడానికి వెరిచి లోపలలోపల కృశించే పిల్లలు ఎక్కడచూచినా ప్రతియింటోవున్నారు. పెద్దవారు పసిపిల్లలమీద జరువుతున్న రహస్యవిషయమైన అక్రమాలు బైటికి రానేరావు. పాప మా బిడ్డ తన తల్లితోకూడా చెప్పుకోదు. ఎందుకు ? సిగ్గు. ఇతరులు కొడితే, తిడితే, చెప్పుకో వొచ్చు. ఈ విషయమై తనకు కలిగేబాధలు బైటికి అనడం అభిమానం. ఎందుకు? బిడ్డలతో యీ విషయమై పెద్దవారు మాట్లాడరు గనుక ! పై పెచ్చు, బిడ్డదే తప్పుగా, దండిస్తారు గనక ! బిడ్డతో స్పష్టంగా చెప్పాలి, వారిమీద అక్రమం జరపజూచే దుష్టులు వుంటారని. అట్లాంటి పరిస్థితులను బిడ్డనించి తొలిగించాలి. బిడ్డ గ్రహించేట్టూ తమతో చెప్పేట్టూ, నేర్పాలి. అంటే యీ విషయమై, అవయవాల ఆరోగ్యం మొదలైనవి స్వేచ్ఛగా సిగ్గుపడకండా మాట్లాడి, బిడ్డని శిక్షించరనే విశ్వాసం కలగచేస్తే అంతా సులభమౌతుంది. ఈ రహస్య వ్యవహారం వల్ల ప్రజలలో అనేక దుర్గుణాలు ఏర్పడుతున్నాయి. కనక యింత ప్రాముఖ్యమిచ్చి చెపుతున్నాను. బిడ్డలు పడే బాధలు పైకి రావటంలేదు.

పిల్లల్ని యే పనులకన్నా (ముఖ్యంగా యీ విషయాల్లో)కోప్పడ్డా, శిక్షించినా, సహజంగా పెద్దవారితో యీ విషయాలు మాటాడం మానే

స్తారు, పిల్లలు పెద్దవారితో చెప్పుకుంటే సానుభూతి తప్ప యిబ్బందేమీ రాదని నిశ్చయంగా వాళ్ళకి తెలిస్తేనేతప్ప వాళ్లు సంగతులు దాస్తారు. బిడ్డ ఎంత తప్పుపని అసహ్యమైనపని చేసినా, పెద్దవాళ్లు వూరుకుని బిడ్డ యింక మళ్ళీ ఆ పని చెయ్యకండా తప్పించుకోడానికి సలహానివ్వాలి; సహాయం చెయ్యాలి. పెద్దవాళ్ళమాటల్లో బిడ్డలకు సంపూర్ణ విశ్వాసం కలగచెయ్యాలి.

తవేంచేసినా పెద్దవారు సహాయం చేస్తారుగాని, కోపం తెచ్చుకోరని బిడ్డకి స్పష్టంగా తెలియాలి, ముఖ్యంగా ఈవిషయాల్లో శిక్షయెప్పుడూ అన్యాయమూ, అనారోగ్యమూ; యీ విషయంలో విషమవుతుంది.

చిన్నప్పటినించీకూడా బిడ్డలకి వివాహాన్ని గురించీ ప్రేమ గురించీ చక్కని నిజమైన అభిప్రాయాలను యివ్వాలి. ఆడపిల్ల పెళ్ళికోసమే పుట్టినట్టూ, ఎవరికో పెళ్ళాంగా పుట్టినట్టూ మాట్లాడకూడదు. ఆమె జీవితం యెప్పుడూ పరాధీనమేనని, పురుషులకు సేవచెయ్యడం ఆమెవిధి అనీ, అన్నలకు, తమ్ముళ్ళకూ, చాకిరీ చేయించరాదు; మాట్లాడితే ఆడపిల్లఅని జ్ఞాపకముంచుకో అనకూడదు. స్త్రీదగ్గిర్నించి విధేయతా చాకిరీ, తీసుకోడం బాలుడి హక్కులైనట్టు నేర్పకూడదు. బాల్యం నించికూడా ప్రచారంలోవుండే, యీ నీచాభిప్రాయాల్ని స్త్రీ పురుషునికి సంతోషమివ్వడానికే పుట్టిందనీ, పురుషుడు స్త్రీల శీలాన్ని వినాశంచేసే వెనుభూతమనీ యీ అభిప్రాయాల్ని ఖండించాలి. పిల్లలకు వారి దేహం మీద, శీలం మీదా అమితమైన గౌరవంవుండాలి. ప్రేమా, ఇతరులని ప్రేమించడం అనే అనుభవం అతి అద్భుతంగానూ వున్నతంగానూ కనపడాలి. వారికి సంపూర్ణంగా ప్రేమిస్తేనేగాని తమమనసు నంతా అర్పిస్తేనేగాని దేహాన్ని స్వాధీనం చేయడం అతినీచమని తెలియాలి. స్త్రీ పురుషులకువుండే యీ అసహజవైరమూ అనుమానమూ బాల్యంనించి తొలగించే ప్రయత్నంచేసి తీరవలిసిందే, బుద్ధివున్న మనుషులందరూ.

పెద్దవారు యీ సంగతుల్ని గమనించాలి, 10 మొదలు 13 ఏళ్ళ వరకు—

1. బిడ్డ ఆరోగ్యకరమూ, సహజమూ ఐన జీవితాన్ని గడపాలి. మంచి వ్యాయామమూ, చన్నీళ్ళ స్నానమూ, ముఖ్యమైనవి.
2. ఈ విషయమై బిడ్డస్నేహితు లెటువంటివారో గమనిస్తో వుండాలి.
3. లోకంలో నీతి అనేదానికి నిజమైన నీతికీ భేదం చూపాలి.
4. బిడ్డల్ని అనేక అభిరుచులతో, అభినివేశాలతో కాలమంతా తీరిక లేకుండా గడిపేటట్టు చెయ్యాలి.

—....—

# పసిపిల్ల

లోకంలోని అన్ని వుద్యోగాలకన్నా పిల్లల్ని ఆరోగ్యంగా కని, ఆరోగ్యంగా పెంచడమనేది గొప్ప వుద్యోగం. ఈ వుద్యోగానికి ఎవరూ జీతమివ్వరు. ప్రజ భర్తద్వారా స్త్రీని పోషిస్తోంది. గర్భం ధరించడం, పిల్లని పెంచడం, వీటిమీద భర్తలకీ ప్రజలకీ మునపటిగౌరవం పోతోంది. స్త్రీకే తన గొప్ప అనుభవంమీద తనకే గౌరవం పోయింది.

బిడ్డ కడుపులో పడ్డది మొదలు బిడ్డకి ఏడాది వొచ్చేవరకూ తల్లిని సుఖంగా వుంచడం ప్రభుత్వబాధ్యత. ప్రతి గర్భంధరించిన స్త్రీ విషయం తెలుసుకుని, పరిస్థితులు సరిగాలేనిచోట, అవసరమైతే ఆమెని బాధ్యత తెలీని, భర్తనించి, బంధువులనించి, అధికార్లనించి, ఎదిగిన పిల్లలనించి తప్పించి, సరైన సంరక్షణ నివ్వవడం ప్రభుత్వం తన ధర్మంగా చూసుకోవాలి.

లోకంలో పిల్లలు లేనివాళ్ళు చాలామంది. ఈ దేశంలో పుట్టిన పిల్లల్ని చేతులారా చంపుకునేవాళ్లు అనేకమంది. ఎట్లాగో ఖర్మంచాలక బతికిన పిల్లల్ని చంపుకుతినేవాళ్ళు అందరూను.

మనుషులకి, ముఖ్యంగా స్త్రీలకి, పిల్లలు పుట్టాలనేకోర్కె చాలా సహజం-ఆ కోర్కె అణచరానిది. పిల్లలు లేకపోతే జీవితం శూన్యంగా కనపడడం చాలా న్యాయం. పిల్లలులేని స్త్రీ జీవితానికి అర్థం కనపడదు చాలామందికి. ఎమోషనల్‌గా స్త్రీ చాలా బాధపడుతుంది. పిల్లలు లేకపోతే కొంతవరకు పురుషుడిలోపం. కనక స్త్రీ తనకి తప్పక పిల్లలు కలగాలంటే, తన పురుషుణ్ణి డాక్టరుచేత పరీక్షచేయించాలి. అంటే స్పెషలిస్టుచేత-యీ మామూలు డాక్టర్లకి ఈ విషయాలు ఏమీతెలేవు. తెలిసినట్టుగా దొంగ కబుర్లూ వేదాంతాలు మాట్లాడతారు, నమ్మకండి. ఈ డాక్టర్లకి చెవిపోట్లకీ, జ్వరాలకీ తప్ప ఇంకవేటికీ మందులు తెలేవు. అవీ మామూలువాటికి

మాత్రమే తెలుసు. మాటలుమాత్రం అన్నీ తెలిసినట్టు మాట్లాడతారు. నమ్మకండి.

సంభోగశక్తి సరిగావున్న పురుషులకికూడా, బిడ్డని పుట్టించేశక్తి కొందరికి వుండదు. సంభోగశక్తి చాలాతక్కువగా వున్నవాళ్ళలో కొంత మందికి బిడ్డల్ని కలిగించగలశక్తి సంపూర్ణంగా వుంటుంది. కాని పిల్లల్ని పుట్టించే శక్తిలేని పురుషులకి చికిత్సచేయగల డాక్టర్లు చాలా తక్కువ. చాలామంది పురుషులకి ఆ లోపం కుదరనూ కుదరదు.

అదిగాక ఏ కారణాలవల్లనో ఒక్కొక్క జత పిల్లల్ని కనలేరు. ఆ భర్తే ఇంకో స్త్రీకీ, ఆ భార్యే ఇంకో పురుషుడికీ పిల్లల్ని కంటారు. కనక తనకి తప్పకండా బిడ్డలు కావాలంటే స్త్రీ పురుషుణ్ణి మార్చుకోవాలి. వీలైతే భర్త అనుజ్ఞ తీసుకుని, వీలులేకపోతే, అనుజ్ఞలేకండానే.

బిడ్డలు లేకపోవడానికి స్త్రీలోపంకూడా వుంటుంది. అదీ డాక్టరువల్ల నయం చేయించుకోవాలి.

స్త్రీ పిల్లల్ని కనితీరాలంటే, దేవుడిఆజ్ఞ నెరవేర్చడానికీ కాదు, లోకం సాగడానికీ కాదు. ప్రపంచాన్ని ప్రజలతోనింపే వేరేపద్ధతుల్ని దేవుడే ఆలోచించుకుంటాడు. లోకం సాగకండా ఆగిపోతే, ఏమీ నష్టం లేదు. ఈ బాధలూ, రోగాలూ, యుద్ధాలూ, తక్కినజీవుల్ని బాధించడాలూ ఆగిపోతాయి.

ఎంతో అవసరం కనపడితేగాని, స్త్రీ బిడ్డల్ని కనకండా వుండ కూడదు. ఏ నీతీ, ఏ ధర్మా, ఏభర్తా, ఆమెని గొడ్రాలుగా వుంచడానికి అధి కారంలేదు. ఆమె జన్మహక్కుకోసం ఆమె యుద్ధంచెయ్యాలి. ఆమె జీవి తానికి సాఫల్యం, అన్ని గొప్ప అనుభవాల్లోకీ, గొప్ప అదృష్టమైన ఆనందమైన అనుభవం బిడ్డని కనడం-పెంచడం.

బిడ్డలు అక్కర్లేనప్పుడు గర్భనిరోధక సాధనాలు వుపయోగించడం న్యాయం. కాని గర్భం కలుగుతుందేమో ననే భయంతో బతకడం

ఘోరం. దివ్యగానంవలె గడపవలసిన సంభోగజీవితం విషతుల్య మౌతుంది. నరాలలో గొప్ప అశాంతీ జాడ్యం బైలుదేరుతాయి. అట్లాంటి భయంలో స్త్రీని వుంచేపరిస్థితిని తీసుకురావడం, ఆ స్థితిలో స్త్రీనివుంచడం, ధీరుడైన ఏ పురుషుడూ చెయ్యతగినపని కాదు.

స్త్రీ అందం పోతుందనీ, తనకి అమర్యాద కలుగుతుందనీ స్త్రీలని ఇట్లా అభ్యంతరాలలో పెట్టి గర్భస్రావాలు చేయించుకోమని బలవంతాలూ భయాలూ పెట్టే స్వార్థం పురుషులలో ఎక్కువవుతోంది.

పెళ్ళికాకుండా బిడ్డని కనడంవల్ల ప్రస్తుతం స్త్రీలకి కలుగుతున్న సాంఘిక న్యాయచట్ట సంబంధ ఆస్తి ఇబ్బందులన్నీ తొలగిపొయ్యే వరకూ స్త్రీలు ఆందోళన చెయ్యాలి.

గర్భం కలిగిందిమొదలు దాన్ని నిలబెట్టుకోవాలి, దానికి తగిన జాగ్రత్త తీసుకోవాలి, కనాలి, బిడ్లని తెలివితక్కువవల్ల చంపుకోకుండా కాపాడుకోవాలి. ఈ విషయంలో కూడా జాతకాలూ వేదాంతం అడ్డం తగులుతాయి. బిడ్డల్ని దేవుడిస్తాడు, బిడ్డల్ని దేవుడే చంపుతాడని నమ్మకం వుంటే, ఈ పుస్తకం వృధాశ్రమపడి చదవకండి. కాని ఆ దేవుడే, ఆ జాతకమే, ఆ ఖర్మే, నాచేత ఈ పుస్తకం వ్రాయిస్తోంది, మీచేత చది విస్తోంది. డాక్టరు రూపాన కుదురుస్తోంది. మీచేత సరైనజాగ్రత్త తీసుకునేట్టు చేస్తుంది. తీసుకోకపోతే మీ బిడ్డని జబ్బుపడేస్తుంది, మీకు శోకం తీసుకొస్తుంది-అంతా ఆ ఖర్మే.

గర్భం జాగ్రత్త తీసుకోడంవల్లా, తగిన జ్ఞానాన్ని పొందడం వల్లా పశ్చిమదేశాల్లో శిశువుల మరణసంఖ్య తగ్గింది. విజ్ఞానం జాతకాలని మారుస్తోంది. ఈదేశంలో పిల్లల్ని పొలాలకీ ఎరువుకు ఉపయోగపడేందుకు కంటున్నారు-వాళ్ళని చంపి పాతిపెట్టి మంచి ఎరువుమన్ను తయారుచేసి.

పిల్లలు ఈ దేశంలో ఎదగకుండా చచ్చిపోతున్నారంటే చాలా సంతోషించవలసిన విషయం. పుట్టిన నిమిషంనించి చచ్చేవరకు ప్రస్తుతం

ఈ దేశంలో, జీవితం దుఃఖమయం, బాధామయం. కనక ఆ జీవుడు ఎంతత్వరలో యీ దేహాన్ని వొదిలిపోతే అంత అదృష్టవంతుడు. పుట్టిన నిమిషానే, మంత్రసాని పెట్టేబాధతో ప్రారంభించి, ముసలమ్మలు, పొరిగింటివారు పెట్టే క్షోభతో మగ్గి, పిల్ల, వొచ్చినదోవనే వెళ్ళడానికి ప్రయత్నిస్తుంది. చర్మం వుడికిపొయ్యే మసిలే నీళ్ళస్నానం, ఆముదం పానీయంతో ప్రారంభమైన ఆహ్లాదకరమైన జీవితం, తల్లిపాల అజీర్ణాలూ, మందులూ, తండ్రి కేకలూ, తరవాత తిట్లూ,దెబ్బలూ, బళ్ళు, చదువులూః ఇవన్నీ వోర్చుకుని గడిచినా, చివరికి సంఘ మూర్ఖ క్రౌర్యంనించి, యీ దేవుళ్ళ భయాలనించి తట్టుకున్నా, ఎదిగిన యువతీ యువకుల్ని సుఖంగా బతకనియ్యగల, ఆర్థికపరిస్థితిలో, తాను మనిషినేనని గర్వంగా బతకగల ఆర్థిక రాజకీయపరిస్థితిలోలేదు దేశం. బీదరికం, నీచత్వం, ట్రగుల్, నిరాశ, అంధకారం వేదాన్తం——ఇవీ జీవితాన్నిపాలించే శక్తులు. కనక త్వరలో మరణంచినవాళ్ళు ధన్యులు. వాళ్ళ పరలోక ప్రయాణానికి సాయంచేసే తలిదండ్రులూ, ఉపాధ్యాయులూ, డాక్టర్లూ, గొప్ప ఉపకార పారీణులు.

కాని ఈ పరిస్థితుల నన్నిటినీ మించి ఎక్కువగా తూగేది తల్లి కడుపు. గొప్పప్రియుణ్ణి పోగొట్టుకున్న స్త్రీకున్నబాధతో సమానము. తన బిడ్డని పోగొట్టుకున్న తల్లిశోకం, ఆమె కన్నీటిని తలుచుకుంటే; పిల్లలు లోకంలో పడేబాధలు, షికారుకిపోకండా, ప్రేమలేఖలు వ్రాసుకోకుండా కూచుని, ఏదో ఎక్కడో, నా మాటలు విశ్వసించే ఏ తల్లికో, ఏ నోరు లేని పిల్లకో సహాయమౌతాయని వెర్రిఆశతో, నమ్మకంతో, ఇట్లావ్రాసే నా నిర్భాగ్య హృదయంలోని వేదన-ఇవన్నీ ఓలెఖ్ఖా ఆమెశోకం ముందు అనిపిస్తుంది.

ముఖ్యంగా ప్రజలు, ఎంత ధీమంతులూ గమనించనిదీ, అన్ని విధాలా గమనించవలసినదీ, ఏమిటంటే, బిడ్డ లోకంలో సుఖపడడానికే

పుట్టిందన్న సంగతి. మనుషుల్ని, ప్రతి మనిషినీ, జీవినీ సుఖపెట్టే ప్రయత్నం బుద్ధికలిగిన వాళ్ళందరూ చెయ్యాలి. లోకంలో ఆ పద్ధతుల మీద మార్పుచెందాలి. మార్పు చెందించాలి. మనిషిని బాధపెట్టే పరిస్థితి, సంస్థ, ధర్మం, ఎంత గొప్పదైనా నిర్మూలం కావాలి. మృత్యువుతప్పదు. అకాలమరణం చాలవరకు తప్పించవొచ్చు. రోగాలు చాలాతగ్గించవొచ్చు. మానసిక బాధల్ని అశాంతుల్ని దూరం చెయ్యవొచ్చు. మనుషులు కల్పించుకున్న బాధలూ, తప్పకుండా నిర్మూలం చెయ్యవలసినవీ—దరిద్రం, విద్య, వివాహం, పనీ, మొదటిది తప్ప తక్కినవి ఏదో ఓ రూపాన, కొంచెంగా, మనుషులకి సుఖాన్నిస్తాయి. అంతవరకే అవి నిలబడాలి. తక్కిన భాగాలు నిర్మూలం కావాలి. పెళ్ళిచేసుకోడం అంటే అర్థం బిడ్డల్ని కనడం, వాళ్ళని పెంచడం, వాళ్ళని, సుఖింపచెయ్యడం, అభివృద్ధి చెయ్యడం—అనే బాధ్యత పెళ్ళిలోనూ, పెళ్ళిలేని సంబంధంకూడా వుందని గ్రహించాలి. నిరోధమార్గాలు ఎంత జాగ్రతగా జరిపినా, తప్పిపోవొచ్చు. బిడ్డలు అఖ్ఖర్లేని వాళ్ళకి గర్భం కలిగితే, అది తగిన డాక్టర్ల చేత తీయించేసుకోడం ఉత్తమం—కనడంకన్న. కాని, ఇది చట్టవిరుద్ధం.

ఇష్టం లేకపోతే బిడ్డని కనఖ్ఖర్లేదు. కాని పొరపాటున పుడుతుందేమో, దానికి సిద్ధంగా వుండాలి. పుట్టాక యింక యావశ్శక్తినీ వినియోగించి దాన్ని సుఖపెట్టాలి, బతికించాలి, తల్లికోసం, బతకాలనే ఆ బిడ్డ ఆసక్తికోసం, వైద్యం, జ్ఞానం, తెలివి, మీకు సాయపడాలి. పశ్చిమ దేశాల్లో సాయపడ్డాయి. మరణసంఖ్య లెఖ్ఖలు, ఎదటనున్నా, జాతకాలూ, కర్మా మాట్లాడుతారు మనుషులు.

ఈ పద్ధతుల్ని అమలులోకి తీసుకొచ్చి, స్త్రీలకి బలవంతంగానైనా సరే జ్ఞానాన్ని శిక్షణనీ ఇచ్చి, కాకపోతే ప్రభుత్వమే యీ తల్లి రాక్షసుల బిడ్డని తీసేసుకుని రక్షించే ప్రయత్నం చేస్తుంది 'సోషలిజం' అంటే ఎంత గొప్ప కృతజ్ఞత కలుగుతుంది నాకూ! ఇంకా ఎప్పుడు వొస్తుందా అని

ఎంత తొందర నాలో! తక్కిన విలువలు ఎంత ధ్వంసం కానీ, ఈ మాత్రం ఏ ప్రభుత్వమన్నా చెయ్యగలిగితే: బలవంతం తప్పు కాని ఇతరుల్ని, ముఖ్యం దిక్కుమాలిన పిల్లల్ని హింసించకండా, పెద్ద వార్ని ఎంత హింసించినా వొప్పుకుంటుంది నా హృదయం.

ఉత్తమ సంతానంకోసం ఏదో ముహూర్తాలు చూడడం మొగ ఆడ బిడ్డల్ని నిర్ణయించుకునే పద్ధతులూ ఇవన్నీ మూర్ఖాలు. ప్రస్తుతం నాకు తెలిసినంతవరకు, గర్భచిహ్నాలు—

1. బహిష్ట కాక పోవడం.
2. రొమ్ములు పెద్దవి కావడం, నెప్పి, మొదటి నెలలోనే కనపడు తుంది. క్రమంగా కొనలు ప్రాముఖ్యతనుపొంది నల్ల బడతాయి.
3. వేవిళ్ళు.
4. మూడో నాలుగో నెలలో పొట్ట ఎదుగుతుంది.
5. నాలుగో నెలాఖరునించి బిడ్డ కదులుతుంది.

కడుపుతోవున్న కాలంలో - సుఖంగా ఆరోగ్యంగా వున్న స్త్రీలూ కాయకష్టపడే మోటువాళ్ళూ ఏ జాగ్రత్తా పడనక్కర్లేదు. సృష్టి చూసు కుంటుంది.

కాని విద్యా నాగరికతా బస్త్రీజీవనం వ్యాపించినకొద్దీ, శరీరంలో బలం తగ్గి, డాక్టరు అవసరం ఏర్పడుతోంది. వేవిళ్ళ రోజులనించి ప్రారంభమై, కాన్పు తరవాత ఒక నెలదాకా—ముఖ్యంగా మొదటి కాన్పుకి—గొప్పవారి ఇళ్ళల్లోనూ, ముసలిస్త్రీలు చుట్టూ చేరి చేసే అల్లరి ఇంతా అంతా కాదు. పిల్లలున్న ఇంటోంచి ముసలివాళ్ళని తరమ మన్నాను. గర్భిణిగా వున్నప్పుడే తరిమేస్తే మంచిది వాళ్ళని. తమ తల్లులూ, అవ్వలూ, సులభంగా పిల్లల్ని కన్నపద్ధతులే, ఈ మనుమరాళ్ళకి కూడా పనికివొస్తాయని వాళ్ళ వుద్దేశ్యం. ఏ మార్పునీ, కొత్త పద్ధతుల్నీ అంగీకరించరు. అవి తప్పకుండా ఆ స్త్రీకేగాక, వంశానికే, ప్రపం

చానికే ఉపద్రవం కలిగిస్తాయని వాళ్ళ వుద్దేశ్యం. తమ పాతపద్ధతుల ప్రకారం, గర్భంపోయినా, తల్లి చచ్చినా, అప్పుడైనా ఆలోచనన్నా కలగదు. దాని ఖర్మమంటారు. వాళ్ళు యీ పద్ధతుల్నే యింకో నిర్భాగ్యురాలిమీద ప్రయోగిస్తారు. ఆగర్భం తెప్పించిన మొగవాడు, గడ్డికి కంతెవేయించిన గాలి ఎంత బాధ్యత వహిస్తుందో అంతే వహిస్తాడు. భార్యనీ, పిల్లల్నీ యీ ముసలమ్మలకి వప్పచెప్పి తనపనినీ, సంపాదనా, క్లబ్బూ, స్నేహితులూ, సినీమాలూ, చూచుకుంటో వుంటాడు. ఇంత డబ్బు ఇంటో పడెయ్యటంతో తన బాధ్యత తీరిందనుకుంటాడు. ఇంటో తగాదా పెట్టాడా, ముసలమ్మలతో, వాళ్ళు పోదులుసుంచే, కాపరం బాధ్యతకూడా తన నెత్తిమీద పడుతుందనీ, తన సుఖాలు పోదులు కోవలసివొస్తుందనీ బెంగ. అందుకనే దిక్కులేని భార్యనీ, పిల్లల్నీ, ఈ రాక్షసులకి వొప్పజెబుతాడు. ఈ ముసలివాళ్ళని నరకవలిసిందే గాని, జ్ఞానంతెప్పిస్తామనుకోడమంత తెలివితక్కువ ఎక్కడా లేదు.

ఆరోగ్యమూ, బలమూ, లేని స్త్రీలు గర్భం మూడో నెలలోపల డాక్టరుకి చూపించుకోవాలి. చివరి నెలలో ప్రతివారమూ డాక్టరుచేత పరీక్ష చేయించుకోవాలి.

1. సుఖరోగాలు.
2. నెత్తురు తక్కువ.
3. మూత్రంలో ఆల్బుమిన్.
4. అవయవాలలో లోపాలు.
5. జాడ్యాలు.

ఇట్లాంటివి తల్లి ప్రాణానికీ, బిడ్డప్రాణానికీ, ఆరోగ్యానికీ, భంగం చేస్తాయి ముందే జాగ్రత్తపడకపోతే. నమ్మకమైన డాక్టరు దగ్గిరికివెళ్ళి ఆమె చెప్పినట్టు అవసరమైతే చికిత్సను పొందాలి.

## గర్భం నెలలలో

1. ఎక్కువ శ్రమఐన పని చేయకూడదు - పెద్ద బరువు లెత్తడం మొదలయినవి.

2. సోమరిగా కూచోకూడదు. మామూలుపని చేసుకోవాలి. ఏ పనీ చెయ్యని స్త్రీలు ఇప్పుడు తమ శరీరం సులభంగా భరించేటంత పనిని ప్రారంభించాలి. శుభ్రమైన గాలిలో తిరగాలి.

3. సంతోషంగా వుండాలి.

4. మంచి పుస్తకాలు చదవడం - మంచి ఆలోచనలు చెయ్యడం - పుట్టబొయ్యే శిశువుకి సహాయం చేస్తాయి అనడం చాలవరకు మూర్ఖంగా తోస్తుంది. ఎక్కడో ఏదోపోలిక కలిగిందని ప్రతివాళ్ళకీ అది బోధిస్తే సాధ్యమయ్యేదీ కాదు, ఉపయోగమూ లేదు.

5. గర్భంమీద దెబ్బ తగలనియ్యకూడదు.

6. వీలైనంతవరకు సంభోగం మానాలి.

7. పెద్ద ధ్వనులు భయాలు కలిగే పరిస్థితులకు దూరంగా వుండాలి.

8. ఎవరన్నా కానుపులూ, ఆ కష్టాలూ మాట్లాడుతో వుంటే, వినకూడదు, ధైర్యముంటే ఆ మాట్లాడేవాళ్ళ నెత్తిమీద పెద్దరాయి విసిరి వెయ్యాలి.

9. భూతాలు, చచ్చిన బంధువులూ, గ్రహణాలూ, ఈ పిచ్చినంతా మనసుకి దూరంగా వుంచాలి.

ముఖ్యంగా ముసిలమ్మలూ, పొరిగింటి స్త్రీలూ, కష్టమైన కాన్పులూ కనలేక చావడాలూ, ఘోరాలు వర్ణించి చెపుతో వుంటారు. స్త్రీ నెప్పులు పడుతో వుంటే, పనిలేక కూచుని, స్త్రీలు ఘోరమైన చావుల్ని వర్ణించుకుంటో వుంటారు. ముసలివాళ్ళని ఇంటో పుణ్ణియ్యావొద్దు. పొరుగు స్త్రీలు ఈ సంగతులు మాట్లాడితే అక్కణ్ణించి లేచిపోవాలి -- తరిమెయ్యాలి తన్ని.

10. బలమైన ఆహారం తినాలి. నారింజపండ్లు, పాలు, ఆకుకూరలు ముఖ్యం.

ఆఖర్న బైట వున్న చివరిరోజునించి దాదాపు 280 రోజులకి కాన్పు వొస్తుంది.

ఆరోనెలనించి రొమ్ములమీద శ్రద్ధతీసుకోవాలి. పొద్దున్న, రాత్రి, నబ్బుతో వేడినీళ్ళతో కొనలు కడగాలి, కొంచెంగా ఆ కొనల్ని ముందుకు లాగి, వేళ్ళసందుల నలపాలి. ఇది ఎవరికి వారే చూచుకోవాలి.

వేవిళ్ళూ, గుండెలో మంటా, నడుంలో నెప్పి, కాళ్ళు తీపులూ, నరాలు లాగడం. కడుపు నరాలు బిగపట్టడం—ఈ బాధలకి డాక్టరునించి చికిత్స పొందాలి.

ఏ నెలలోనన్నా నెప్పులుగాని, రక్తంగాని కనపడితే, గర్భస్రావం కలుగుతోం దన్నమాట. కదలకండా పడుకుని డాక్టరుకి కబురుపంపాలి.

## కాన్పు

ఇదివరకు ఎందుకన్నా మునలమ్మల్ని వెళ్ళగొట్టకండావుంటే, నెప్పులు ప్రారంభం కాగానే వెళ్ళకొట్టండి. గదిలోపెట్టి తాళంవెయ్యండి పాత పద్ధతులు - వూకపొగ, చీకటిగదులు-మూలుగులు-రామనామాలూ అన్నీ ఏం చేసినా చెయ్యకపోయినా, కనే స్త్రీని నరకబాధ పెట్టిస్తాయి. తన బతుకుమీనా, భర్తమీదా పుట్టిన బిడమీదా రోతనీ భయాన్నీ ద్వేషాన్ని కలిగిస్తాయి.

మొదటి నెప్పులు కనబడగానే కొత్తపద్ధతుల్లో తర్ఫీదై, అను భవం గలదీ మంచిదీ సంతోషంగా వుండేదీ ఐన మంత్రసానిని పిలి పించాలి. ఆమె అవసరముంటే డాక్టర్ని పిలిపించాలి.

బిడ్డపుట్టగానే—గోరువెచ్చ నీళ్ళు స్నానం చేయించాలి. మసి నీళ్లు పొయ్యకూడదు. బిడ్డకి ఏమీ తాగించకూడదు. ఆముదం అసలు తాగించ

కూడదు; వొంటికీ తలకీ రాయవొచ్చు. Silver nitrate solution తో కళ్ళుతుడవాలి.

## తల్లి

కన్న తరువాత ఉపవాసా లుండడం మూర్ఖాచారం. జావ, కాఫీ, టీ, రొట్టె— తీసుకోవొచ్చు. కదలకండా పడుకోవాలి. ఆరుగంటల తరవాత బిడ్డకి తన స్తన్యాన్నివ్వవచ్చును. పురిటింటి కిటికీలను ముయ్యకూడదు, మరీ ఎండాకాలంలో మరీ చలికాలంలో తప్ప. మోటు మనుషులు కాన్పు ఐన వెంటనే లేచి పనులు చేసుకుంటారు. నాగరికులు 14 దినాలకన్న ఎక్కువకాలం పడుకుని ఉండనక్కర్లేదు.

పుట్టినప్పటినించీ బిడ్డ జాగ్రత తీసుకోవాలి. ఎన్నివేల సార్లో వ్రాయాలనిపిస్తోంది. ధ్వజస్తంభాలమీద కెక్కి అరవనా-కనపడ్డ ప్రతి స్త్రీతోనూ వెర్రిగా అననా, ఎట్లాఎట్లా, అని వూరికే పెనుగులాడుతుంది, మనసు.

అంత కష్టపడి మీరు కనుకున్న బిడ్డకి మీరు తప్పించలేని బాధలు, లోకం పెట్టేవి, ఆ బిడ్డే తెచ్చుకునేవి, ఎవరివల్లా కాక వాటంతట ఆవే కలిగేవి ఎన్నో లక్షలున్నాయి. కన్న నిమషాన కడుపులోనుంచి తెరలుగా పైకివొచ్చిన ప్రేమని మరిచిపోకండి. బిడ్డని పారెయ్యండి, చంపండి. కాని బాధపెట్టకండి. అందులో ప్రేమపేర, తల్లి ధర్మంకింద గొప్పపేర్లతో బాధించకండి.

లోకంలోకి రాగానే బిడ్డమాంసం వుడికేట్టు పిళ్ళు, నోట్లో మధురమైన ఆమదంతో ఆహ్వానించకండి.

ఈ పుస్తకమంతా అందుకే. బిడ్డల్ని హింసించకండా, వాళ్ళచేత మీరు హింసపడకండా వుండే మార్గం చూపడానికే వ్రాశాను.

అసహాయము, పిచ్చిగా మీవంక సంపూర్ణ విశ్వాసంతో గుడ్లు పైకెత్తి చూచేవాళ్ళు, మీరు ప్రేమతో రక్షిస్తారని నమ్మి మీ యింటికి

వచ్చిన అతిథులు, నోరులేని పసిబిడ్డలు-వాళ్ళని బాధించకండి. మీ పిల్ల కోసం అవసరమైతే, యీ సంసారాల్ని, భర్తని, ప్రియుల్ని, బంధువుల్ని, అన్నిటినీ త్యజించండి. మీ త్యాగంవల్ల మీ బిడ్డనించి మీకేమీ రాకపోవొచ్చు. కాని మీ ప్రేమ, మీ దయ, మీ జ్ఞానం, మీ బిడ్డ జన్మ హక్కు. బిడ్డకన్న ఇతరమైన, బిడ్డకన్న శ్రేష్ఠమైన అవసరాలూ విలువ ఉంటే, బిడ్డని కనకండి.

ఇతరమైన ఆశయాలకి లొంగి మర్యాదలకి, మీ సౌఖ్యాలకి బిడ్డ సౌకర్యాన్ని వొదులుకోవలసి వొస్తే, బిడ్డని కనకండి. గర్భస్రావం, శిశు హత్య—శిశువుని బాధించడంకన్న నయం. వంట తొందరగా కావాలని, భర్తకామం తీర్చాలని, పెద్దల గౌరవాలు నిలపాలని, సినిమాలకి వెళ్ళాలని, పేరంటాలూ, మీటింగులు జరపాలని, బిడ్డల్ని వాళ్ళబాధకి వాళ్ళని వొదిలే మహాతల్లుల్ని చూస్తున్నాను.

ఈ తల్లులు తమ బిడ్డల్ని చూసుకున్నంత నిర్లక్ష్యంతో స్నేహితుల్ని బంధువుల్ని, చూస్తే వాళ్ళు ఆగ్రహపడి మళ్ళీ గడపతొక్కరు. నోరూ కాళ్ళూ లేని దిక్కుమాలిన పిల్ల ఏంచేసినా ఇట్లా వేళ్ళాడుతుంది ఇంట్లో; చావు విముక్తి నిచ్చిందాకా. అప్పుడు ఎంత గొప్పగొప్ప ఆరుపులు, శోకాలు, రాగాలు, కవిత్వాలు, చెప్పుకోడాలు, నలుగురూ గొప్ప చెయ్యడాలు, పిల్లమీది వర్ణనలు- గొప్ప సింపతీలు!

ఎంత క్రూరుడూ, బుద్ధిహీనుడా దేవుడు, యీ తల్లుల చేతికి పిల్లల నిచ్చేందుకు అనుకుంటాను. ఎంత కసి మానవజాతిమీద! ముఖ్యం పసిపిల్లలమీద ఆ దయాసముద్రుడికి! పైగా నోరులేని వాళ్ళని విస్పగోయుల్ని చెయ్యడం! ఎంత కరుణ!

పిల్లలి సౌఖ్యం, పిల్లలి హక్కులు—అనేప్పటికి వెర్రిగా "మీకేకా పిచ్చి? మాకా పిచ్చి?" అన్నటు చూస్తారు మనుషులు,

"ఏదో వాళ్ళని దయగా చూస్తాం. అంతకన్న ఏం చెయ్యాలి ?" అన్నారు లీలగారు. నాలోనించి నా నరాలలో స్పందనాలు వినగలిగిన లీలగారు.

గుండె ఆగింది. ఇంక లోకంలో ఎవరిని నమ్మించగలను ? నేను పడే యీ బాధ, యీ కరుణ, యీ పెనుగులాట ! అంత అబద్ధమా ? నాలో నేనా ? పిల్లలు బాధపడరా ?

ఏ విషయాన్ని జాగ్రత్తగా తూచి, హద్దు లేర్పరిచి, లోకము తెలుసుకునే లీలగారు.

బిడ్డ సౌఖ్యంముందు ఏ ధర్మమూ తృణప్రాయమన్న నా మాట లట్లా చేశాయా ?

అవును, స్త్రీ బాధా, పిల్లలబాధ అనేప్పటికి లోకపు విలువలు తారు మారౌతాయి నాకళ్ళముందు.

తల్లిప్రేమ, విద్య, వివాహం అనే మూడు భూతాలినించి తప్పించు కుంటేనేగాని విముక్తి కనపడదు, పిల్లలజీవితంలో నాకు.

అందువల్లనే యీ కాపరాలన్నా యీ పాఠశాలలన్నా నాకింత కోపం !

ఇదంతా మరీ వెర్రిఅనుకున్నా మీరు, మీకునచ్చినవన్నా అంత వరకన్నా అనుష్టించండి. నన్ను తిట్టండి, తరమండి, కాని మీపిల్లల్ని బాధల్నించి రక్షించండి. ముఖ్యం మీరు వాళ్ళనిపెట్టే బాధల్నించి ఎప్పటి కన్నా ఏ జాతులన్నా, ఏజీవుల్నా తిరగబడి తప్పించుకోగలరు. జ్ఞాపకం తెచ్చుకోండి. పంచముల సౌఖ్యం, హక్కులూ అంటే, బానిసప్రజల దేశస్వతంత్రపు హక్కులంటే, స్త్రీల హక్కులంటే, సమానత్వమంటే, అర్థంగాక, తాగి వొచ్చారని చూసినరోజులు. కాని ఏనాటికో, ఏఉద్బోధన వల్లనో ఏసిగ్గూ బాధా భరించలేకనో, వాళ్ళు ఏనాటికో మీ నెత్తిమీద కొట్టి, మీకళ్ళు తెరవకమానరు. జంతువులుకూడా తమని తాము కాపాడు

కుంటా యోమో। ఏనాటికో తెలివితెచ్చుకుని, జింకలూ, చిలకలూ మీకు చిక్కకుండా ఉపాయాల్ని కనిపెడతాయేమో, ఆవులూ గేదెలూ మీ దొంగ స్తోత్రాలనించి, పాలు పితకడాలనించీ దూరంగా పోతాయేమో। కాని యీ పిల్లలు ఎప్పుడూ సమ్మెకట్టలేరు. తెలివితెచ్చుకోలేరు. ధిక్కరించలేరు. ప్రార్థించలేరు. నోరులేదు, శక్తిలేదు, మీలో అపారమైన విశ్వాసం తప్ప. 'మాకు దయలేదా ? ఇట్లా వ్రాస్తాడు ?' అనుకుంటున్నారు. కాని బిడ్డని మీ సౌఖ్యాలకోసం, మర్యాదలకోసం ఎంత వ్యధపెడతారో ఆలోచించుకోండి.

వూరికే ఏడుస్తారు, మీరుపెట్టే బాధలూ, శిక్షలూ, మీస్వార్ధాలూ, అన్నీ తమ బాగుకోసమేనని నమ్ముతారు. ఈ నిమషం అలిగి, రెండో నిమషం మీదయకోసం దగ్గిరచేరతారు, పాపం ఆ పిల్లలు. వాళ్ళని బాధించినా, మీ భయాలతో, కోపాలలో, వాళ్ళమంచికోసమే నను కుంటారు.

'ఇదివరకంతా పెద్దలకోసం పిల్లల త్యాగంబోధిస్తే, ఇప్పుడు పిల్లలకోసం పెద్దలత్యాగం బోధిస్తున్నారు'- అన్నారు లీలగారు.

నిజమే, ఆత్యాగమూ ఈత్యాగమూ సహజమే. త్యాగందేనికోసం? పిల్లల్ని సృజించిన మనబాధ్యతకోసం, పిల్లలు హింసపడకుండా త్యాగం- పిల్లలు పెద్దల్ని మానుకోలేరు. పెద్దలు పిల్లల్ని తప్పించుకోలేరు. త్యాగం చెయ్యలేనివాళ్ళు కనకండి. మీరు ఆడుకోడానికీ మీ డాబులకీనా పిల్లల్ని కని హింసించడం।

సృష్టి మీలోపెట్టిన దయ సహాయపడకపోతే పిల్లలకింక దిక్కు లేదు. ఆవుని గోమాత అని పూజిస్తో, దాన్ని చంపుతున్నారని మహమ్మదీయుల రక్తాన్నిచవిచూస్తో ఆ ఆవు తనుకన్న దూడకి పాలిచ్చుకోకుండా దాని కళ్ళముందే ఆదూడని కట్టి, ఆదూడకి పాలు రుచిచూపి, లాగేసి, ఓచుక్క మిగలకుండా పాలు పితుక్కోడంలో, సహస్రగోపుల హత్య

గోచరించని మీకు, ఆ అవుబాధ, దూడబాధ, మీమనసులకి తెలీని మీకు, నాగోల వినపడుతుందా ?

ఒక్కటేవిధం. ఏ దయగల సోషలిజమో, ఏ డిక్టేటరో బిడ్డ బాధ పడుతున్నటు తెలిస్తే, తలికం(డ్రుల్ని కొరతవేయించడమో, లేకపోతే బిడ్డల్నందర్నీ ప్రభుత్వమే పెంచడమో చెయ్యాలి. అదొక్కటే మార్గం కనబడుతుంది.

## పెంచడం

1. బిడ్డకి ప్రతిపనీ ఒకటేవేళకు చెయ్యాలి.
2. బిడ్డకి ఏమీ Nervous Excitement లేకండా చూడాలి.
3. శుభ్రమైన గాలి నివ్వాలి.
4. అన్నిపనులలోకీ ముందు బిడ్డపని చూడాలి. బిడ్డపనికోసం అవసరమైతే తక్కినపనుల నన్నింటినీ వొదులుకోవాలి. కాని అవసరంలేందే బిడ్డదగ్గిర కూచోకూడదు. ఎత్తుకోకూడదు. ఆడించకూడదు. దానికీ టైమూ హద్దూ వుండాలి.

పొద్దున్నే పాలు.

దొడ్డి.

బైట గాలికి పడుకోబెట్టడం - ఒక గంట ఇది. ఒక నెల ఎదిగిం తరవాత— గాలుపులూ చలీ, వానా వున్నప్పుడు వరండాలో పడుకో పెట్టాలి.

స్నానం.

10 గంటలకి

పాలు, దొడ్డి, తల్లి ఆడించడం-ఓ పావుగంట నిద్ర.

2 గంటలకి మధ్యాన్నం పాలు,

నిద్ర.

సాయంత్రం బైటగాలికి పడుకోబెట్టడం,
స్నానం.

6 గంటలకి

సాయంత్రం పాలు.
తల్లితో ఆట.
నిద్ర - చీకటిపడకముందే.
రాత్రి పదింటికి పాలు.
దొడ్డి.
నిద్ర.

పాలు:—

మొదట వారమైన తరవాత నాలుగు గంటలకోసారి పాలుపట్టా[illegible]. రాత్రి పదింటినించి తెల్లవారిందాకా ఏ ఆహారమూ అనవసరం. రాత్రి బిడ్డఏడిస్తే, కారణం కనుక్కోవాలిగాని వూరికే పాలుపట్టకూడదు, అవసరమని తోస్తే, దాహమేసిందనుకుంటే, చక్కెరనీళ్ళు పట్టవొచ్చు.

నిద్ర—నిద్రకోసం జోలపాడడం మొదలైనవి ఏమీ చెయ్యనక్కర్లేదు. ఉయ్యాలలో వూపకూడదు. చిన్న మంచమూ జంపకానా [illegible].

బిడ్డ రాత్రులు లేవకూడదు. బిడ్డ లేస్తే బిడ్డకి ఏదో ఇబ్బంది వు[illegible] దన్నమాట. దోమలో, వుక్కో, ఏదో అస్వస్థతో.

స్నానం—ఆరుబైట స్నానం మంచిదికాదు. చలిగాలి [illegible]గలకూడ[illegible]. గోరువెచ్చగా వుండాలి నీళ్ళు. స్నానం ఆహ్లాదకరంగా [illegible]ండాలి [illegible]. సబ్బుతో కడిగితేచాలు. నూనెవదలడానికి మెత్తని సున్ని[illegible]ండి వుపయోగించవొచ్చు. ముందు తలా ముఖం తోమి పొడిగా తుడిచెయ్యాలి. తరువాత వొళ్ళుకడిగి తుడవాలి.

ఆరునెలల తరవాత స్నానం పొద్దున్న చల్లని[illegible]టితోనూ, [illegible] తరవాత రెండుసార్లూ చన్నీళ్ళతోనూ స్నానం చెయ్యించాలి. ఆరునె[illegible]

తరవాత వారానికి రెండుసార్లు తలస్నానం చాలును. యాడాది తరవాత వారానికి ఒకసారి.

ఆరోనెలనుంచి బిడ్డస్నానం సంతోషంగా ఆడుకుంటో నవ్వుతో చెయ్యాలి. యాడాదప్పుడు తనవొళ్లు తోముకోడానికీ తుడుచుకోడానికి ప్రయత్నం చెయ్యాలి.

స్నానం బిడ్డకి సౌఖ్యాన్నివ్వాలి. చాతనైనంతవరకు ఇబ్బంది కలిగించకండా చూడాలి. బిడ్డ ఏడవకండా నీళ్లుపోసుకోడమే ఆదర్శం. "మురికి" అనే పెద్ద చాదస్తం పెట్టుకుని బిడ్డని ఒకచే రుద్దకూడదు. "స్నానం చేయించడం తప్పదు. ఏడవనీ, ఏంచేస్తాం!" అనేవిధంగా వుండకూడదు తల్లిమనసు.

## దొడ్డి:—

ఉచ్చ పోసేప్పుడూ, బిడ్డ దొడ్డికివెళ్ళేటప్పుడూ' బిడ్డని కదిలించకూడదు. విసుక్కోకూడదు. తిట్టకూడదు. తల్లి పట్టుచీరెమీద, అత్త నెత్తిమీదా, తండ్రి ఆఫీసు లాంకోటుమీదా, సోపామీదనైనాసరే, బిడ్డని తటాలున లాగెయ్యకూడదు. నెమ్మదిగా, చిరునవ్వుతో ఎత్తి అవతల కూచోపెట్టాలి.

పాలు తాగగానే దొడ్డికివెళ్ళడం నేర్పాలి. మూడో నెలనించి ఓ గిన్నెలో బిడ్డని ఎత్తిపట్టుకోవొచ్చు, ఎప్పుడూ బిడ్డని అదిలించడం, కోప పడడం చెయ్యకూడదు. ఎప్పుడూ ఆ పనులు సంతోషంవల్లా Encouragement & Praise వల్ల జరపాలి.

బిడ్డకి మూడునెలలు నిండేదాకా గిన్నె వొళ్ళోపెట్టుకుని, బిడ్డని దాంటోకి ఎత్తిపట్టుకోవాలి. బిడ్డకి సుఖంగావుండాలి, ఆ పద్ధతి, అదివొక అలవాటుగా ఏర్పడాలి.

## ఆట :-

మూడో నెలనించి బిడ్డకి గిలకలిస్తే వాటితో ఆడుకుంటుంది. బిడ్డని ఆటలకి వొదలాలి. తల్లిగాని, బంధువులుగాని, పెద్దపిల్లలుగాని, ఆబిడ్డ దగ్గిర కూచోడం, ఆడించడం, నవ్వించడం చెయ్యకూడదు. బిడ్డని ఎత్తుకోకూడదు. ఎత్తుకోడానికి నౌకర్లని పెట్టకూడదు. శుభ్రమైనచోట పడుకోపెట్టి వొదిలేసి ఓకన్ను అటువుంచాలి. అంతే.

## తల్లిపాలు :-

బిడ్డకి తల్లిపాలు జన్మహక్కు. ఏకారణంవల్లా తల్లి బిడ్డకి పాలు ఇవ్వకండా వుండకూడదు. పాలివ్వని తల్లులదగ్గిర్నించి బిడ్డల్ని తీసుకుని రక్షించడానికి ప్రభుత్వానికి శాసనాలువుంటే మంచిది. తల్లిపాలు తాగడం వల్ల బిడ్డకి ఆకలి తీరడమేకాదు; చాలా ఆరోగ్యకరంగా, సంతుష్టికరంగా, సహజమైన ఆహారంతో ఎదగడమేకాదు; తల్లి స్తన్యంతోపాటు, గొప్పసౌఖ్యాన్ని తల్లిప్రేమని, ఏదో చెప్పలేని శక్తిని, బిడ్డ తాగుతుంది. తల్లికి నరాలలో హృదయంలో గొప్పశాంతీ సౌఖ్యం, కలుగుతుంది. పాలివ్వని తల్లులు నరాలఅశాంతికి లోనుకావడం వింతకాదు. కొంతమంది తల్లులకి పిల్లలకి ఇవ్వాలన్నా పాలు లేకపోవడం సర్వసాధారణమౌతోంది. పిల్లకి ఇవ్వడానికి పాలులేనితల్లి, ఇతరవిధాల ఆరోగ్యంగా కనపడ్డా ఆరోగ్యంగా లేదన్నమాట. అసహజమైన జీవితం గడుపుతోందన్నమాట.

బిడ్డకు పాలు యెట్లాపట్టాలో, యెప్పుడు పట్టాలో సహజంగానే తెలుస్తుంది. కాని సహజంగా వుండే తెలివిని యీపనులలో, అవసరాలలో, మర్యాదలలో, భర్తల ఆదర్శాలలో పోగొట్టుకుంటున్నారు తల్లులు. గనక వివేకాన్ని చెప్పించుకో వలసిన గతి పట్టింది ఈ తల్లులకి.

ప్రతిసారీ రెండురొమ్ములూ ఇవ్వాలి పిల్లకి. 15 నిమిషాల తరవాత ఇంకా కుడుచుకోనీకూడదు. కుడుచుకుంటో బిడ్డని నిద్ర పోనీ కూడదు. లేపుతామనే భయంతో రొమ్ముని అట్లావొదిలి వుండకూడదు.

పాలు యిచ్చిన ప్రతిసారీ రొమ్ముల్ని పూర్తిగా ఖాళీ చేసుకోవాలి. బిడ్డ పాలుతాగు తున్నప్పుడే రొమ్ముల్ని పైనించి క్రిందికి చాలామృదువుగా నొక్కుతో పిండవొచ్చు. బిడ్డకి కావలసినకన్న పాలు యెక్కువ వుంటే బిడ్డ తాగడమైన తరవాత పైనించి కిందికి రాస్తో పిండెయ్యాలి. ఇట్లా చెయ్యడం వల్ల ఇంకా పాలు పడతాయి, పాలు తక్కువైనపుడు.

## పాలు పడకపోవడానికి కారణాలు:—

1. ఆదుర్దా - పిల్లకి పాలు సరిపోతున్నాయో లేదో, అనే ఆదుర్దా ఒక కారణం, పాలు యెండిపోవడానికి. సంతుష్టిగా, సంతోషంగా వుండాలితల్లి. చిరాకులూ, Nervous strain and worries పనికిరావు. పోట్లాటలూ; వ్యవహారాలూ, పనీ అన్నీ చెడుగు చేస్తాయి.

2. బలహీనం; వెలుతురు, గాలి, వ్యాయామం, టానిక్కులు అవసరం.

3. చాలాపని, అలసటా.

## ఈ తల్లులు పాలివ్వకూడదు:—

1. క్షయరోగమూ, హృదయరోగమూ, గల తల్లులు.

2. దీర్ఘరోగం కలవారు, వెర్రివారు.

3. రొమ్ముల మీద కురుపులు కలవారు.

4. పాలిస్తే జబ్బుచేసేవారు.

## పాలిచ్చే తల్లి:—

1. మరీ యెక్కువ భోజనము చేయకూడదు.

2. మల బద్ధకము లేకుండా చూసుకోవాలి.

3. పళ్ళు, ఆకుకూరలూ, తినాలి ఎక్కువగా. పాలు, బలమైన ఆహారమూ తీసుకోవాలి. తల్లికి పాలు పడనప్పుడూ, పాలు తక్కువైనప్పుడూ, కారణం తెలుసుకోడానికి డాక్టరుకి చూపాలి. ఆకు కూరలు తినాలి. ఎక్కువగా నీళ్ళు తాగాలి. పాలు తాగాలి, Calcium మందుగా తీసుకోవాలి.

## పాలిచ్చే రొమ్ములు జాగ్రత్త:—

రాత్రంతా రొమ్ముని పిల్ల నోట్లో పెట్టి, వొదిలి నిద్రపొయ్యే తల్లు లంత అవివేకులూ, అసహ్యమైన వాళ్ళూ వుండబోరు. బిడ్డ ఆరోగ్యానికి గాని తల్లి ఆరోగ్యానికి గాని అదేమీ మంచిది కాదు. రొమ్ము అలవాటై బిడ్డ అన్నివేళలా యేడుస్తుంది. అప్పుడు బిడ్డకిదెబ్బలు.

పగలైనా పాలివ్వడం 20 నిమిషాల్లో ఐపోవాలి. వెంటనే తల్లి తన స్తనాన్ని తీసేసుకోవాలి. వేళ కానప్పుడు ఎంత ఏడ్చినా రొమ్ము నింక బిడ్డకి చూపకూడదు.

పాలిచ్చేముందు రొమ్ము చివర్లని నీళ్ళతో కడగాలి. పాలివ్వడం కాగానే పొడిగా తుడవాలి. చివర్లు నెప్పిగా వుంటే నూనెరాయి. పగుళ్ళు కలిగితే బోరిక్ లోషనుతో కడిగి, గ్లిసరిన్ పుయ్య.

రొమ్ముల సంగతి జాగ్రత పడితే పాల నెలలు ఐపోగానే, ముందు మల్లేనే రొమ్ములు అందంగా మంచి ఆకారంగా చిన్నగా అయిపోతాయి.

## దాదులు:—

తల్లిపాలు బిడ్డకు చాలక పోయినపుడే దాదిని పెట్టి ఆ వెలితి భర్తీ చేయించాలి. కాని తల్లిమాత్రం తాను పాలివ్వడం మానకూడదు.

పాలు బాగా వున్నఆమెనూ, పిల్లలమీద దయకలిగిన ఆమెనూ—నమ్మకమైన మనిషినీ కుదర్చాలి. ఆమెనూ, ఆమె బిడ్డనూ ఇంటోనే

ఉంచుకుని భోజనం పెట్టడం తప్పదు. ఆమె బిడ్డకి ఇవ్వగా పాలు మిగిలితేనే, మీబిడ్డకి మీరెంత గొప్పవారైనా మీ బిడ్డమీకు యెంత ముఖ్య మైనా ఆమె బిడ్డకన్న యేమీ యెక్కువని తలుచుకో కూడదు. ఆమె పాలు ఆమెబిడ్డ హక్కు. ధనం ఆశపెట్టి ఆ పాలు మీరు తీసుకోడం దోషం. ఇట్లాంటి అక్రమాలకీ, దూడనోరు కొట్టి గొడ్లపాలు తాగే యీ శాఖాహారుల ఘోర కృత్యాలకి యే యముడూ శిక్ష విధిస్తాడని లేదు శాస్త్రాలలో.

దాది:—

1. అంటురోగాలు లేనిదీ.
2. ఆరోగ్యమైనదీ.
3. యౌవ్వనవతీ.
4. ఆమె శిశువుకి మీ శిశువు వయసే ఐవుండాలి.

## చనుబాలవల్ల బిడ్డకితృప్తి కలగకుండా వుండడానికికారణాలు

1. రొమ్ములు కఠినంగా వుండడం.
2. చాలినన్ని పాలు లేకపోవడం.
3. కుడుచుకోడానికి బిడ్డదగ్గిర శక్తి లేకపోవడం.
4. బిడ్డనోరు పగిలి వుండడం.
5. పదే పదే పాలివ్వడం.
6. రొమ్ము అడ్డమై వూపిరాడక పోవడం.

దాది కుదరక పోతే ఆవుపాలు, మేకపాలు, లేక డబ్బాపాలు Horlicks, Glaxo, Cow & Gate మొదలైనవి.

పిల్లబలంగా వుండి జీర్ణించుకో గలిగితే శ్రద్ధగా తయారుచేస్తే ఆవుపాలే నయం.

ఆవు ఆరోగ్యమైనదిగా వుండాలి. దానికి క్షయలేదని పశువుల డాక్టరుచేత పరీక్ష చేయించి తెలుసుకోవాలి. దాని దూడ పసిదై వుండాలి.

దాని దూడకి చాలా పాలు మిగలాలి. దాని దూడకు రావలసిన పాలను మీపిల్లకి యిప్పించుకోడం అన్యాయం.

ఆవు దగ్గిర నుంచుని శుభ్రమైన మీ పాత్రలో పాలు పిండించుకోవాలి. రెండు పూటలా పేపుగా పాలు తీసుకోవాలి. అంతేగాని పొద్దున్న పిండినపాలు రాత్రీ, రాత్రివి తెల్లవారి పట్టకూడదు. పాలు తెచ్చిన వెంటనే కాగపెట్టాలి. బైట ఒక పెద్ద గిన్నెలో నీళ్ళుపోసి, చిన్నగిన్నెలో పాలుపోసి, ఆనీళ్ళ మధ్య పెట్టి, ఆపెద్ద గిన్నెని పొయ్యిమీద పెట్టి పాలు పొంగేవరకూ ఆనీళ్ళను కాచడంవుత్తమం. పాలను వెంటనే చన్నీళ్ళలో పెట్టి, చల్లార్చాలి. యెప్పుడూ పాలకి, మూత వేసి వుంచాలి. గిన్నెలూ, మూతలూ, సీసాలు. గరిటెలు అన్ని చాలా శుభ్రంగా ప్రతిసారీ తోముతో వుండాలి.

పాలు పిల్లలకు పట్టేముందు ఆవుపాలకి సమంకొలతా బార్లిగింజలు ఉడకపెట్టి తేర్చిన నీళ్ళను గాని సున్నంపీటి తేటను గాని కలపాలి. బూరాచక్కెర ఒక గరిటెడు కలపాలి.

వీలయితే మీగడను ఒక చిన్న గరిటెడూ, చెక్కెర బదులు Lactose, ఒకచిటికెడు Soda Citrate ని కలపాలి.

బార్లీనీళ్ళు. రెండు చిన్న చెంచాల two spoons బార్లిగింజలను (రెండు పెద్దగ్లాసులు) ఒక పైంటు నీళ్ళలో వుడకబెట్టి మూడు వొంతులు మరిగిపోనిచ్చి ఆనీళ్ళని ఉపయోగించుకోవాలి.

## సున్నపు నీరు :—

ఒకకోడిగుడ్డంత శుభమయిన సున్నం ముద్ద ఓ పెద్ద సీసాలో వేసి దానినిండా మరిగిన నీళ్ళను పొయ్యాలి. మర్నాడు పైతేటను ఉపయోగించాలి.

బిడ్డ విరోచనంలో పెరుగు గడ్డలు కనిపిస్తే బార్లీ నీటిబదులు సున్నంనీరే కలపాలి.

విరోచనం ఆకుపచ్చగా వుంటే చక్కెర యెక్కువ వెయ్యాలి. విరోచనం సరిగా కాకపోతే మీగడ చేర్చాలి.

మీగడ యెక్కువైతే, వాంతులు కలగవొచ్చు. విరోచనంలో పెరుకున్న పాలు కనపడతాయి కూడాను. ఈ పాళ్ళలో యే విధమైన హెచ్చు తగ్గులు కలిగినా వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి కలుగుతాయి. అప్పుడు డాక్టరు సలహా తీసుకుని పాలలో మార్పు కలిగించాలి.

ఆవుపాలు పడకపోతే డబ్బాపాలు రెండు రకాలు—

1. పాలు పెరుకో బెట్టినవి.

2. పాల పొడుములు.

రెండో రకం మొదటి దానికన్న మంచిది. ఒక్కొక్క రకం డబ్బాపాలు ఒక్కొక్క బిడ్డకు పడతాయి. పడనప్పుడు, ఆ డబ్బాపాలు ఇంకో రకానికి మార్చాలి. అవి యెట్లా తయారు చెయ్యాలో ఆ డబ్బాల మీద, వాటిచుట్టూ పెట్టే కాయితాల మీద వ్రాసి వుంటుంది.

పుట్టినప్పటి నించీ బిడ్డకి పోతపాలే ఐతే, పాల బుడ్డీలో పట్టవొచ్చును. కొన్నాళ్లు రొమ్ముపాలు తాగిం తరువాత నయ్యేట్టయితే, క్రమంగా ఒక్క పూట పోతపాలతో ప్రారంభించి, క్రమంగా బిడ్డకి, పాలూ, బుడ్డీ అలవాటు చెయ్యాలి.

పోతపాలు పడుతున్నా తల్లి తన సొంత పాలు యిస్తున్నట్టే బిడ్డని యెత్తుకుని పట్టాలి. పాలు యిస్తున్నా, పడుతున్నా, తల్లి ఇంకో పని చెయ్యకూడదు. ఇతరులతో మాట్లాడను కూడా మాట్లాడకూడదు. పూజ అంత భక్తితో చెయ్యాలి. ఇతరులచేత పాలు పట్టించకూడదు. అన్ని పనులకన్న యీపని అధికంగా చూసుకోవాలి. బిడ్డని వెల్లకితలా పడుకో బెట్టి పాలివ్వకూడదు.

పాలు పట్టేప్పుడు తప్ప తక్కినప్పుడు పాలబుడ్డీ బిడ్డకంటి యెదుట ఉంచకూడదు. అప్పటికి అవసరమైన పాలకన్న యెక్కువ తయారు చేసుకోకూడదు. మిగిలిపోతే పారపొయ్యాలి.

## పాల బుడ్డి :

కొమ్ముచెంబులు మొదలైనవి ఉపయోగించకూడదు. గాజువి, పాల బుడ్లు కొనాలి. ప్రతిసారీ ,పాలుపట్టగానే ఎత్తునించి నీళ్ళుపోస్తూ కడిగి, చన్నీళ్ళగిన్నెలో పెట్టి గట్టిగా ఆ గిన్నెకి మూతపెట్టి, పొయిమీదపెట్టి, పది నిమిషాలు ఉడకపెట్టాలి. ఆ గిన్నెని అట్లానే, మళ్ళీ పాలవేళవరకు బుడ్డీతో అట్లానే వుంచాలి. ఆ బుడ్లు శుభ్రంచెయ్యడం నవుకర్లకు వొదలకూడదు. వెడల్పు మూతఉన్న బుడ్లు మంచివి.

## పాల పీకలు :

పీకలోంచి సరిగా పాలువొస్తున్నాయో లేదో చూడడానికి బుడ్డీలో పాలుపోసి కిందికివొంచు. నిమిషానికి 16 బొట్లు కిందికి పడాలి. తక్కువైతే చిల్లులు పెద్దచెయ్యి. ఎక్కువైతే వేరే పీక తీసుకురా. బిడ్డ గట్టిగా కుడుచుకోవాలి. కుడుచుకోవడంవల్ల కలిగేపరిశ్రమ బిడ్డనోటికి అవసరం.

పాలు పట్టగానే పీకల్నితీసి లోపలా బైటా వుప్పుతో రుద్ది కడిగి తుడిచి శుభ్రమైనచోట పెట్టు.

పోత పాలు పోస్తే, ఈ జాగ్రత్తలన్నీ తీసుకోవాలి. ఇవి ముఖ్యం కావనుకునేరు, బిడ్డ ఉండేది , పైగా పోతపాలు పిల్లలకి పడవు అనేటి యీ తండ్రులూ, తాతలు పెట్టే పేడలూ, తద్దినాలు, మడిబట్టలూ, నోముగలూ గొప్ప అర్థంగలవి, డాక్టర్లుచెప్పే యీ పద్ధతులు మూఢమైనవని వారి నమ్మకం.

నియమించుకున్న గంటలమధ్య బిడ్డయేడిస్తే ఆకలిఅనుకోకూడదు. ఏదన్నా కారణం కావొచ్చు. సాధారణంగా అజీర్ణంవల్ల యేడుస్తుంది.

అట్లాంటప్పుడు పాలుపట్టడం విషతుల్యం. వుత్త దాహంవేసికూడా యేడుస్తుంది. అట్లాంటప్పుడు మంచినీళ్ళు పట్టాలి.

బిడ్డ బలవాలని అగేపనిగా పాలుపట్టకూడదు. మధ్యమధ్య తాగుతో, ఆగుతో కాలయాపన చెయ్యకూడదు బిడ్డ, అంతా 20 నిమిషాలలో ఆఖరు కావాలి. పాలు వొంటపడుతోవుంటే బిడ్డ ప్రతివారమూ బరువు హెచ్చాలి. హెచ్చకపోతే వొంట్లో జబ్బో, పాలు తక్కువకావడమో, వొంటికి పడకపోవడమో జరుగుతోందన్నమాట.

ఆరోగ్యమైన బిడ్డ పుట్టినప్పుడు సాధారణంగా 7 1/2 పౌన్ల బరువు వుంటుంది. నెల పూర్తిగా ఐనప్పుడు:— 8 1/2 పౌన్లు.

| | | | |
|---|---|---|---|
| 2 నెలలు | .... | .... | 10 1/4 |
| 3 | .... | .... | 12 |
| 4 | .... | .... | 13 1/2 |
| 5 | .... | .... | 14 3/4 |
| 6 | .... | .... | 15 3/4 |
| 7 | .... | .... | 16 1/2 |
| 8 | .... | .... | 17 1/4 |
| 9 | .... | .... | 18 |
| 10 | .... | .... | 19 |
| 11 | .... | .... | 20 |
| 12 | .... | .... | 21 |

బిడ్డ పుట్టినప్పటి బరువు వంశంమీదా తల్లి ఆరోగ్యంమీదా ఆధారపడి వుంటుంది. పుట్టినప్పటి బరువు వంశంవల్ల హెచ్చుతగ్గులుంటే ఆ హెచ్చుతగ్గులు అన్ని నెలలూ కనపడుతోనే వుంటాయి. బిడ్డ పుట్టినప్పటి బరువులో హెచ్చుతగ్గులు కనపడుతోన్నప్పటికి తల్లి అనారోగ్యం వల్లనైతే, పుట్టింతరువాత బిడ్డజాగ్రత సరిగాతీసుకుంటే, బరువు సరి కావొచ్చు చాలమట్టుకు...

## విరోచనం:

ఏ సహాయం లేకుండానే బిడ్డకి సహజంగా విరోచనం కావాలి. మొదటినెలలో రోజుకి ఆరుసార్లు, తరవాత రోజుకి మూడు విరోచనాలు. విరోచనం కాకపోతే ఆముదం మొదలైన మందులు వాడకూడదు. బిడ్డ తాగే పాలలోనే వుంటుంది మలబద్ధానికి కారణం. మొదటినెల గడచిం తరవాత నారింజరసం పట్టాలి బిడ్డకి. కమలాలూ, టోమాటో పళ్ళరసం, ద్రాక్షరసం వాడవొచ్చు. ఒక చిన్నచంచా రసమూ, ఒక్క చిన్నచంచా నీళ్ళూ, కొంచెం చక్కెరా కలిపి పట్టాలి. ఆరోనెలలో రోజుకి 4 చంచాలు ఇవ్వాలి.

## పాలు తప్పించడం :-

ఆరోనెలనించి బిడ్డని పాలనించి క్రమంగా తప్పించి పదోనెల పూర్తయ్యేలోపల, మొత్తానికి రొమ్ముపాలుతాగడం మాన్పించాలి. ఆటు తరవాత రొమ్ముపాలుతాగడం తల్లికీ పిల్లకీ ఎవరికీ మంచిదికాదు.

అదిగాక ఆటుతరవాత తల్లిపాలతో మాత్రమే బతకలేదుపిల్ల. ఒక్కసారిగా పిల్లని మాన్పించకూడదు.

తల్లి రొమ్ము మాన్పడానికి చేసే వెర్రిప్రయత్నాలన్నీ మానాలి. నాలుగుసార్లు పాలుతాగే బిడ్డకి మూడుసార్లు పాలిచ్చి, ఒకసారి వేరే ఆహారం ఇవ్వాలి. లేకపోతే ముందు వేరే ఆహారమిచ్చి, తరవాత కుతితీరకపోతే రొమ్ము నివ్వాలి. క్రమముగా ఓపికతోచేస్తే, పాలు తప్పించడం కష్టమైన పనికాదు.

తల్లిపాలుగాక వేరే ఆహారం ఇవ్వడం, ఆవుపాలు ఇవ్వడంతో ప్రారంభించవొచ్చు.

బిడ్డ పెరగాలనే ఆత్రుతతో ఎక్కువ ఆహారం పొయ్యకూడదు. బిడ్డ అయిష్టం చూపినప్పుడు ఆహారం బలవంతంగా ఇవ్వకూడదు, బిడ్డ

చిక్కిపోతున్నానరే. ఎక్కువ ఆహారంవల్ల బిడ్డ అమితంగా పెరిగినా, అదొక సుగుణంకాదు. బిడ్డ పెరగటానికికూడా హద్దులు వుండాలి. బిడ్డకి యాడాదిలోపల అన్నం కూరకూడదు.

ఆవుపాల తరవాత 10 దో నెలనుంచి సగ్గుబియ్యం జావ పట్ట వొచ్చు. దాంటో ఎప్పైనా కూరగాయలు ఆకుకూరలు వొండి పిసిచి ఇవ్వ వచ్చును.

బిడ్డని రుచిగల ఆహారాలకి, కారానికి, ఎక్కువ వుప్పుకి అలవాటు చెయ్యకూడదు.

తరవాత బిస్కట్లకి అలవాటుచెయ్యాలి. కాని బిస్కటు తొరలో తినెయ్యాలి బిడ్డ. అట్లా బిస్కటుని చీకుతో బిడ్డ కూచోకూడదు. కూర గాయల బదులు గుడ్లూ మాంసము వుడికించి ఇవ్వవొచ్చును. ఆవుపాలు మాత్రం రోజుకి ఒకసారన్నా ఇస్తోనే వుండాలి. గుడ్లు పాలలో కలిపి ఇవ్వవొచ్చును. రొట్టె పెట్టవొచ్చు.

## తొమ్మిదో నెలలో:

పొద్దున్నే—బిస్కట్టూ, ఆవుపాలూ, 10 గం టలకి- బిస్కట్టు—కందికట్టూ, ఆది అయింతరవాత ఆవుపాలూ.

2 గంటలకు కొంచెంగా వుడికిన గుడ్డు.

సగ్గుబియ్యం జీరా, బిస్కట్టూ లేక రొట్టె,—తేనె, పాలూ, పళ్లూ,

సాయంత్రం 7 గంటలకి—రొట్టీ, పాలు.

రాత్రి—పాలు.

యీ గంటల మధ్య ఏమి పట్టకూడదు. కాఫీ, టీ పట్టకూడదు, బిడ్డ తల్లిపాలు కుడుచుకోడం పూర్తిగా తప్పించగానే-తల్లి తన రొమ్ము లకిపైమీద ఒకగుడ్డ కట్టుకోవాలి. విరోచనాలకి మందు కొంచెం తీసుకోడం

మంచిది. రెండుమూడు రోజులు బాధని ఓర్చుకోవాలి. తరవాత పాలని పిండి పారపొయ్యాలి.

## బిడ్డకి పళ్ళు మొలవడం :

ఏడోనెలలో మొదటిపళ్ళు ప్రారంభించి, చివరివి రెండేళ్ళు నిండేప్పటికి అన్నీ వొచ్చేస్తాయి. మరీ ఆలస్యమైతే తప్పు ఏమీ ఆదుర్దాపడనక్కర్లేదు. బిడ్డని ఆరోగ్యంగా వుంచితే పళ్లువొచ్చేప్పుడు ఏ జబ్బూ చెయ్యదు. ఆ సమయంలో ఏ జబ్బు దేనివల్లచేసినా, పల్లు మొలవడానికే ఆరోపిస్తారు. ఏ జబ్బు చెయ్యకపోతే, అదేదో అనారోగ్యమని భయపడే స్థితికి వొచ్చారు తల్లులూ ముసలమ్మలూ.

## కొన్ని నిబంధనలు :

1. ఆయాల్ని పెట్టకూడదు. పిల్లల్ని ఎత్తుకోడానికీ దానికీ ఎవరినీ నియమించకూడదు. నౌకర్లు వున్నా పని అంతా తల్లిపైన చూస్తోవుండాలి.
2. ఆహారం, ఈగలు వాలకుండా, దుమ్ము పడకుండా వుండాలి. ఈగలు వాలితే పారెయ్యాలి.
3. వండినఆహారం బజారులో కొనకూడదు.
4. రాత్రినిలవ వున్న ఆహారం వాడకూడదు.
5. బాగా కడగంది పళ్లువాడకూడదు.
6. తాగేనీళ్ళు ముందు మరగకాచి, మూతపెట్టి వుంచాలి.
7 బిడ్డకి వీలైనన్ని ఎక్కువనీళ్లు పట్టాలి.
8. కిటికీలు తెరిచి వుంచాలి.
9 బిడ్డ పక్కబట్టలు వారానికి ఒకసారన్నా ఎండలో వెయ్యాలి.
10. బిడ్డని తాకకముందు చేతులు కడుక్కోవాలి.
11. మందు తల్లితప్ప బిడ్డకి ఎవరూ పట్టకూడదు.
12 నోటికిఅయ్యే ఆట వొస్తువులు బొమ్మలు మొదలైనవి ఇవ్వకూడదు.

13. ఆహారమిచ్చిన గంటలోపల స్నానం చేయించకూడదు.

14. బట్టలు వెయ్యకూడదు-చలిలో తప్ప.

15. ఎత్తుకోకూడదు. ఎత్తుకోడానికి నౌకర్ని పెట్టకూడదు. స్వేచ్ఛగా ఆడి దొర్లడానికి పాకడానికి వొదలాలి. బిడ్డకి తెలీకండా ఒక కన్ను బిడ్డమీద వుంచాలి.

16. ప్రతిరోజూ ఓగంట ఎండతగలాలి బిడ్డకి-అంటే నీరెండ.

17. బిడ్డ!కాలం వీలైనంతవరకు ఆరు బైటా. వరండాలలోనూ గడపాలి.

18. బిడ్డకి కుడుచుకోడానికి పాలపీకలూ సూదర్లూ ఇవ్వకూడదు. నోట్లో వేలేసుకునే అలవాటు మాన్పాలి.

19. నగలు పెట్టకూడదు. ఏవీ వొంటికి కట్టకూడదు.

20. బిడ్డని బడాయిగా చూపుకోకూడదు.

21. చివాట్లూ, కోపం, దెబ్బలూ, ఏవీ పనికిరావు. అరవకూడదు.

22. బలవంతం కూడదు.

23. ఎప్పుడూ సంతోషంగా, దయగా, ప్రేమగా వుండాలి.

24. వెక్కిరించడం, అండించడం, నిరసనా, అసహ్యం చూపకూడదు. బిడ్డని ఏవిధానా అవమానించకూడదు.

25. ఋజ్జగించి గొప్పచెయ్యనూ కూడదు.

26. బిడ్డ పాలుగాని భోజనంగాని నిరాకరిస్తే ఎన్నడూ బలవంతం చెయ్యకూడదు.

27. డాక్టరు చెప్పంది ఏమందులూ బిడ్డకి ఇవ్వకూడదు.

28. పిన్నులు ఉపయోగించకూడదు బిడ్డ వొంటిమీద.

## ఏడుపు :-

మరీ నెలలప్పుడు పిల్ల వుత్త వ్యాయామంకోసం ఏడుస్తుంది. అప్పుడు బాగా ఏడవనివ్వాలి.

పిల్లని గారాబం చెయ్యడం, పెద్దవాళ్ళు చుట్టూవుండడం, ఎత్తు కోడం, ఆడించడం అలవాటుచేస్తే, మళ్ళీ వాటికోసం యేడుస్తుంది. అప్పుడా అలవాట్లు సరిచేసుకోవలసి వస్తుంది.

కా ర ణా లు :-

1. బాధ-కడుపులో గాలి, చలి, పుక్క, ఏదన్నాగుచ్చుకోడం. ఆకలి, దాహం, చెవిపోటు, దోమ, నల్లికాటు, మొదలైనవాటివల్ల.

2. పడక సరిగాలేకపోవడం, మలబద్ధకం.

3. భోజనంలో ఎక్కువ తక్కువలు. ఆకలిఏడుపు బిగ్గరగా, 'నా ఏడుపువిను' అన్నట్టుంటుంది.

తనసంగతి చూడకపోతే కోపంతో కూడివుంటుంది ఏడుపు.

పొట్ట గాలిపోసుకుని వుబ్బితే, విడిచివిడిచి ఏడుస్తుంది సన్నగా.

మలబద్ధకానికి కారణాలు :

1. పొట్ట కండరాల బద్ధకం-అట్లాంటప్పుడు సబ్బుముక్కని పుల్ల లాగుచేసి ముడ్డిలో దూర్చాలి.

Liquid Paraffin ఇవ్వవొచ్చు. భోజనంలో ఎక్కువ తక్కువ లికి బూరాచక్కెరనీళ్ళు తాగిస్తే మంచిది.

కడుపునెప్పి ఉబ్బరం :

ముఖ్యమైన కారణం అజీర్ణం. పాలపీకల్ని, ఉత్త పాలబుడ్డిని చీకడానికి ఇయ్యడం ఇంకో కారణం.

చికిత్స:-ముందు బిడ్డని కూచోపెట్టి గానీ పైకెత్తిగానీ పీపు తట్టుతూ వుండాలి. ఒకటొన్సు వేణ్ణీళ్ళని తాగించాలి. వేణ్ణీళ్ళ స్నానం చేయించాలి. ఆహారం ఇవ్వకూడదు.

Dil water లేక Gripe water ఇవ్వవచ్చును. చిటికెడు సోడా వుప్పు నీళ్ళలో కలిపి తాగించవొచ్చును.

కక్కులు :

కొంచెం కొంచెంగా పాలు పైకివొచ్చేస్తే పాలు కొంచెం ఎక్కువగా తాగిందన్నమాట. పుల్లగా వాసన వేసే దోకులు అజీర్ణాన్ని సూచిస్తాయి. పాలలో ఎక్కువనీట్నా బూరా చక్కెరా చేర్చాలి. లేక Fluid Magnesia చేర్చాలి.

చిన్న బిడ్డ గుణం : —

ఇది అజీర్ణం వల్ల కలుగుతుంది. కొంచెం పెద్దపిల్లల్లో పొట్టలో పాములవల్లకూడా కలుగుతుంది. భయంకరంగా కనపడుతుంది గాని, భయం లేదు. వెంటనే డాక్టరుకి కబురుపంపి, వొచ్చేలోపల బిడ్డబట్టలు తీసేసి, వొళ్ళో పడుకోపెట్టుకుని, తలని చన్నీళ్ళలో తడుపుతో వుండాలి.

బిడ్డ తెలివి : -

ఒకటో నెల - తల్లిని గుర్తుపట్టడం - వేళలకి అలవాటు కావడం, చేతుల్లో వేటినన్నా పట్టుకోవడం.

నాలుగోనెల లోపల - ఇంటోవాళ్ళని గుర్తించడం, దగ్గరవొస్తువుల్ని చూసి పట్టుకోడం, కాళ్ళతో గట్టిగా తొయ్యడం. తల నిలపెట్టడం వేళ్ళతో ఆడుకోడం.

ఏడో నెలలోపున- దూరంగా చూడగలగడం, వొస్తువుల్ని పట్టుకుని తాకీ, రుచిచూసీ పరీక్షించడం, దేకడం, కూచుని చుట్టూ చూడడం, నమలడం, చిగుళ్ళతో గట్టిగా కొరకడం; చంబాలోంచి, కప్పులోంచి తాగగలగడం.

పదో నెలలోపల-పిల్లల్ని అనుకరించడం, స్నేహం, విశ్వాసం కనపరచడం, నించోడానికి ప్రయత్నం.

యాడాదిలోపల- ముద్దుమాటలు, ఊహలు, ఆడుకోడానికి సామాను కావలసిరావడం, నడవడం, తనంతట తను చంచాతో తినగలగడం.

ఏణ్నర్ధంలోపల - సహాయం చెయ్యడానికి ప్రయత్నం-బొమ్మల్ని పడుకోపెట్టి ఆడడం, పరిగెత్తడం.

---

# ఆఖరిమాట

ఇప్పుడిప్పుడే ప్రపంచం, బిడ్డలవిషయమై తానునమ్మిన అబద్ధాలనుంచి మేలుకొని పెద్దవారి అంధత్వం వల్ల బిడ్డలకి అన్యాయం జరుగుతోందనీ, బాధకలుగుతోందనీ గ్రహిస్తోంది. తక్కిన ప్రజలవలె బిడ్డ తన బాధల్ని చెప్పుకుని, వాటి నివారణ కోసం ఆందోళన చెయ్యలేదు. కనక పెద్దవారే బిడ్డకోసం శ్రమపడి, వారిజీవితాన్ని ఆనందకరంగానూ ఫలవంతంగానూ చెయ్యాలి.

ఇంతకాలమూ స్త్రీ యెట్లా పురుషుడి ఆస్తిగావుందో బిడ్డకూడా అట్లానేవుంది. ఒక్క చంపడం తప్ప తక్కిన యేబాధలూ తలితండ్రులూ వారు లేనప్పుడు, సవతితల్లులూ, మామలూ అత్తలూ, మొదలైనవారు యేం చేసినా బిడ్డకి నోరెత్తడానికి తెలివీ శక్తిలేవు. ఏడ్చినా వినేవారులేరు.

బిడ్డకి యీ లోకంలో ఆనందం అనుభవించడానికీ సౌఖ్యపడడానికీ హక్కు వున్నదనే సంగతే మరిచి యెంతవరకు పెద్దవారికి సహాయపడగలదనే ఆలోచనతోనే వున్నారు. బిడ్డకి ప్రత్యేక వ్యక్తిత్వమిచ్చి; బిడ్డ వొకరి ఉపయోగం కోసమూ కాదనిన్నీ, తనకోసం తాను జీవించే హక్కును పొందాలనీ మనుషులు గుర్తించాలి. బిడ్డకూడా పెద్దవారివలెనే వివేకము కలదని విశ్వసించి, బిడ్డకి సంపూర్ణమైన బాధ్యతలను యిచ్చినప్పుడే జాతి అభివృద్ధి చెందుతుంది. లోకంలోకి స్వేచ్ఛగా పోనిచ్చి, అన్నీ స్వయంగాచూసి నేర్చుకునేట్టు సహాయం చెయ్యాలి. తన శక్తుల్నీ, పంచేంద్రియాలను, బుద్ధిని వుపయోగించి, సత్యాసత్యాల్నీ, న్యాయాన్యాయాల్నీ, నీతి అవినీతుల్నీ స్వయంగా తెలుసుకునేట్టు వుండాలి. బిడ్డని వీలైనంతవరకు స్వేచ్ఛగావొదిలి పెద్దవారు తటస్థంగా వుండడం మంచిది. అపాయంలోకి తెలివితక్కువగా నడుస్తోందని తోచినప్పుడు తప్ప పెద్దవారు జోక్యం కలుగజేసుకోకూడదు. బిడ్డ చేతిని పట్టుకొని నడిపించి జ్ఞానాన్ని యివ్వడానికి గొప్ప తల్లి ఈ ప్రపంచలో వుంది. పెద్ద

వారు యెక్కువ అదుర్దా పడనక్కర్లేదు. ఏ ఆజ్ఞ పెట్టినా, యే శిక్ష విధించినా, యే జోక్యం కలగజేసుకున్నా ముందు పెద్దవారు తమ ఆత్మపరీక్ష చేసుకుని, బిడ్డ క్షేమంకోసమా, తమ స్వంతక్షేమం కోసమా అని యోచించుకుంటే, బిడ్డలు చాలా సౌఖ్యపడిపోతారు. ప్రేమపేర పెద్దలు బిడ్డలకి చేసే అపచారాలంత ఘోరమైన కార్యాలు యెక్కడా వుండవు.

ఈ పద్ధతులేమీ అమలులో పెట్టకపోయినా, కొన్నిగాని అన్నిగాని ఆచరణలో వుంచినా, బిడ్డని దిద్దాలనుకున్నప్పుడు, బిడ్డ పనులలో సహజమైన ఉద్దేశ్యాలలో, నడవడిలో, జోక్యం కలగజేసుకోవాలన్నప్పుడు, ఏం జోక్యం ఎట్లా కలిగించుకోవాలో నిశ్చయంగా సరైనదేదో అది తెలిస్తేనే జోక్యం కలగచేసుకోవాలి. సందేహం కలిగినప్పుడు, మాట్లాడకుండా వూరుకోడం మంచిది. Impersonal గా చూడలేనప్పుడూ అంతే. 'నేను.' 'నా పెద్దరికం' అని మోహం పని చేసేవానికంటే ఏ శిక్షణా లేకుండా వూరుకోడం వుత్తమం. పెద్దవారి రక్షణా శిక్షణా లేకుండా పెరిగినపిల్లలు చాలా శిక్షణలో వున్న పిల్లలకన్న చాలా వుత్తములుగా తయారౌతారు. ఈ పెద్దవారి చేతులలో, వారి అభిప్రాయాలకీ, ఉద్దేశ్యాలకీ, సాధనాలై వంకర తిరిగిన పిల్లలకన్న, దిక్కులేని అనాథ శిశువులు వారి ఆనందాన్ని వారే వెతుక్కుని సహజంగా జీవిస్తారు. విద్యావంతుల పిల్లలు, ధనికులూ, అధికార్లూ, కీర్తివంతులూ, కావొచ్చు లోకంముందు. కాని వారికి లోపల్నించి సుఖపడి బతకగల శక్తి నశిస్తుంది. చెడిపోతున్నట్టు, కనపడ్డా సరే, బిడ్డని బిడ్డ స్వభావానికి వొదలడం చాలా వివేకమైన శిక్షణ. యితరులు వాళ్ళజోలికి వొచ్చి వంకర్లుతిప్పకుండా వీలైనంతవరకు చూడడమే గొప్ప రక్షణ.

—o—

# అనుబంధం

పిల్లలు సరిగా తెలివిగా ప్రశ్నలు వెయ్యరు పైకి. కాని ఈ ప్రశ్నల వంటి ఆలోచనలు వాళ్ళ మనసులో జరుగుతోనే వుంటాయి ఏదూరంగానో.

ఇంతకన్న చిక్కు ప్రశ్నలు వేసే పిల్లలు లేకపోలేదు.

---

# దొంగలున్నారు జాగ్రత్త

(వ్యవధిలేక ఆమె పిల్లవాడితో మొగవాళ్ళ పెట్టెలో ఎక్కింది. బిడ్డల శిక్షణమీద పుస్తకాలు చదివి, తల్లి తండ్రి పిల్లవాడి ప్రశ్నల్ని నిరుత్సాహ పరచకండా పెంచారు. అతను వాక్యాలు చదవడం అభ్యాసం చేస్తున్నాడు. ఆకాలంలో పెట్టెనిండా మనుషులు.)

కుర్రవాడు: (పెట్టెపైన చూసి)

ద...దె....దేకి సున్నాపెడితే....

తల్లి: (కంగారుడి) సరిగా చూడు. దె....కాదు దొ....

కుర్ర : అవును....దొం....గ....లు....తరవాత ఏమిటి అమ్మా !

తల్లి : న్నారు....

కుర్ర : 'దొంగలున్నారు జాగ్రత'....

మనం....యేరీ దొంగలు ? (చుట్టూచూస్తున్నాడు)

తల్లి : లేరు.

కుర్ర : మరి ఉన్నా రన్నారే!

తల్లి : అంటే, ఉంటారేమో నన్నమాట.

కుర్ర : రాసినవాళ్ళకి తెలీదా?

తల్లి : తెలీదు.

కుర్ర : ఐతే ఎందుకు రాశారు ?

(వ్రాసేవా ళ్ళందరూ తెలిసే వ్రాస్తున్నా రనుకుం టున్నాడు కుర్రాడు. ఇంకా ఆంధ్రపత్రిక చదవలేదు.)

తల్లి : ఉంటే జాగ్రత్తపడమన్నారు.

కుర్ర : వాళ్ళు చెప్పరమెందుకు, మనకి కనపడరూ దొంగలూ!

తల్లి : ఎట్లా కనపడతారూ?

కుర్ర : చూస్తే.

తల్లి : వాళ్ళు అందరిమల్లేనే వుంటారు.

(కుఱ్ఱాడు ఆలోచించాడు, తెలివిగలవాడు గనుక, నల్లగా, బట్టలులేకుండా కోరలతో, గడ్డాలతో ఫిల్ములలో కన్పడే మహాభీషులమల్లే వుండరని తెలుసుకున్నాడు.)

కుఱ్ర : దొంగలూ, షర్టూ, కోటూ వేసుకుంటారు. అవునా ?

(ప్రక్కన కూచున్న పుస్తకాల అధికారిని చూస్తున్నాడు దొంగే నేమోనని, ఆయన గణించిన లక్ష రూపాయాల దొరతనాన్ని ప్రశ్నిస్తున్నట్టు.)

తల్లి : ఆ !

కుఱ్ర : మరి నాన్నకూడా దొంగ కావచ్చు.

తల్లి : దొంగతనం చేసేవాళ్ళు దొంగలు.

కుఱ్ర : దొంగతనం చేశారని ఎట్లా తెలుస్తుంది !

తల్లి : కనుక్కుంటారు.

కుఱ్ర : ఓ చేసినట్టు పట్టుబడ్డవాళ్లు దొంగలా ?

(తల్లి ఆలోచిస్తో వూరుకుంది. ఆమే కాదు. చాలామంది ఆలోచించుకోవాలి.)

కుఱ్ర : ఎందుకు దొంగితనం చేస్తారమ్మా ?

తల్లి : వాళ్ళకి — లేక !

కుఱ్ర : ఎందుకు లేదు ?

తల్లి : వాళ్లు సంపాయించరు.

కుఱ్ర : నువ్వు ఆ నగలు సంపాయించావా ?

తల్లి : తాతయ్య యిచ్చారు.

కుఱ్ర : పోనీ, దొంగలకికూడా ఎవరన్నా ఇయ్యరాదూ ?

తల్లి : ఇచ్చినా పాడుచేసుకుంటారు.

కుర్ర : మనం భద్రంగా దాచుకుంటాం, వాళ్ళు ఖర్చుచేస్తారు. దాచుకోడానికి మిగలదు గావును ! మరి మనకి ఇంత డబ్బు ఎక్కడిది ?

తల్లి : కష్టపడి సంపాయించుకుంటాం.

కుర్ర : దొంగలూ కష్టపడి సంపాయించుకుంటారుగా !

తల్లి : ఏం కష్టం, ఇంకొకళ్ళది తీసుకుంటారు.

కుర్ర : మనకీ ఇంకోళ్ళ దగ్గర్నుంచేగా వొస్తుంది ?

తల్లి : మరి చెప్పకండా తీసుకుంటామా ?

కుర్ర : నాన్న, నా పెనసలు చెప్పకండా తీసుకున్నాదే ?

తల్లి : మళ్ళీ ఇయ్యలా ?

కుర్ర : నేను కనుక్కుని అడిగితే ఇచ్చాడు.

తల్లి : చిన్నపిల్లవాడి వని, .... తన కొడుకుపని ....

కుర్ర : మరి మా నాన్న ఆని జేబులోడబ్బులు నేను తీస్తే కొట్టాదే ?

తల్లి : మరి చిన్నవాడివి ....

కుర్ర : అవును. చిన్నవాళ్లు పెద్దవాళ్ళవి తీస్తే తప్పు. ... పెద్దవాళ్ళు చిన్నవాళ్ళవి తీస్తే తప్పులేదు. .... (ఆలోచిస్తూ) అట్లానే బీదవాళ్లు గొప్పవాళ్ళవి తీస్తే తప్పు, గొప్పవాళ్లు బీదవాళ్ళవి తీస్తే తప్పు లేదు.

తల్లి : దొంగలు మళ్ళీ ఇయ్యరు. అడిగినా సరే.

కుర్ర : విశాలమ్మని 'దొంగముండ నాన్నని ఎత్తుకుపోయిం ద'న్నావు, మళ్ళా నాన్నని మనింటోనే పెట్టేసిందిగా !

తల్లి : ఛీ, వూరుకో.

# పెళ్లి ముస్తాబు

(తల్లి ముస్తాబు చేసుకుంటూ అద్దం ముందు నుంచుంది. పిల్లవొచ్చి చూస్తోంది. తనుకూడా అద్దంలో చూసుకుందామంటే అద్దం అందదు. తల్లి చూసింది.

తల్లి : ఇంకా పింజారిలాగు అట్లానే వున్నావేం, పద....

పిల్ల : పింజారి అంటే యేమిటి అమ్మా ?

తల్లి : పింజారి అంటేనా నీవంటి దరిద్రం మొహం అన్నమాట, వెళ్ళి మొహం కడుక్కో.

పిల్ల : కడుక్కుంటాను గాని, అందరూ నా మొహం నీ మల్లేనే ....

తల్లి : ఇట్లా మాట్లాడుతో ఆలస్యం చేశావా ....

పిల్ల : పెళ్ళి ఎప్పుడు అమ్మా ....

తల్లి : ఇప్పుడే మొదలుపెడుతో వుంటారు.

పిల్ల : ఇప్పుడే నని నీ కెట్లా తెలుసు ?

తల్లి : వాళ్ళు పిలవలేదూ తొమ్మిదింటికని —

పిల్ల : తొమ్మిదయిందని యెట్లా తెలుస్తుంది ? — ఓ, గడియారం లోనా .... (ఆలోచిస్తో) గడియారానికెలా తెలుసో ! (తల్లి మాట్లాడలేదు). పోనీ పదింటికి చేస్తేనేం పెళ్ళి ?

తల్లి : ముహూర్తం మించిపోదూ ?

పిల్ల : ఎక్కడికి మించిపోతుంది ? ముహూర్తం ఎక్కడ వుంటుంది ? (పిల్లల ప్రశ్నలకి జవాబు చెప్పాలని వ్రాసే చలం మొదలైన వాళ్ళని తిట్టుకుంటో)

తల్లి : ముహూర్తం అంటే, మంచిసమయం.

పిల్ల : దేనికి మంచి సమయం .... ఓ పెళ్ళికా .... పెళ్లికేనా, తక్కిన వాటికి ముహూర్తాలు వుంటాయా ?

తల్లి : శుభకార్యాలకి వుంటాయి. (శుభకార్యాలంటే యేమిటని అడుగుతుందనుకుంది. కాని —)

పిల్ల : మంచి సమయమని యెట్లా తెలుస్తుంది? తక్కిన సమయాల కన్నా అది యెట్లా మంచిసమయ మెట్లా అవుతుంది? వాళ్ళు లెక్కలు వెయ్యడమేనా? ఆ సమయంలో ఏమన్నా మంచి వుంటుందా?

తల్లి : ఆ సమయంలో చేస్తే ఆ పెళ్ళి సరిగా జరుగుతుంది.

పిల్ల : ఎవరన్నా చెడ్డసమయంలో చేశారా?

తల్లి : ఎందుకు చేస్తారేం?

పిల్ల : అయితే సరిగా జరగదని ఎట్లాతెలుసు? .... తెలీదా నీకు? మరి మంచిసమయంలోనే చేశారుకదా, కోపల్లి వారి పెళ్ళిలో కొట్టుకున్నారే!

తల్లి : వాళ్ళ ఖర్మం.

పిల్ల : అయితే యింక ముహూర్తం ఎందుకు?

తల్లి : ఏమోనే, ఆ ముహూర్తం పెట్టే బ్రాహ్మల్ని అడుగు.

పిల్ల : మనం బ్రాహ్మలేగా నాన్నహూతా?

తల్లి బ్రాహ్మలు వేరు.

పిల్ల : వాళ్ళెల్లా వుంటారు? మన మల్లే ఉండరా?

తల్లి : వాళ్ల పని అది.

పిల్ల : అసలు బ్రాహ్మలని ఎట్లా తెలుస్తుందమ్మా?

తల్లి : అడిగితే చెపుతారు.

పిల్ల : ప్రతివాళ్ళని అడగాలా? అందరూ బ్రాహ్మలమేనంటే?

తల్లి : అననీతే.

పిల్ల : అంటే ఏం జేస్తావమ్మా.

తల్లి : నే నేం చేస్తానే!

పిల్ల : అసలు బ్రాహ్మలంటే ఏమిటి ?

తల్లి : ఆదో కులం.

పిల్ల : కుల మంటే ?

తల్లి ; కుల మంటేనా — అదేమో నాకు తెలిదు.

పిల్ల : నీకు కులం వుందిగా !

తల్లి : వుంటే ?

పిల్ల : మరి తెలీదంటావేం ? కులం ఎక్కడ వుంటుంది ?

తల్లి : ఎక్కడ వుండట మేమిటి ? కులం ఓ కులంలో పుడతాము.

పిల్ల : ఏ కులంలో !

తల్లి : ఏడో కులం.

పిల్ల : ఎన్ని కులాలు అన్నీ ?

పిల్ల : నాకు తెరేదే.

తల్లి : ఏ దడిగినా తెలీదంటారు. పిల్ల లకి ఏమీతెలీదు. మీకే తెలిసినట్లు మమ్మల్ని తిడతారేం ? మీకే తెలీకపోతే, మాకు చెప్పేదేమిటి ? మరి తెలీని మాటలన్నీ ఎందుకు మాట్లాడతారు.

తల్లి : ఈ గోల యెందు కంట పెళ్ళికి పోతో.

పిల్ల : పెళ్ళి అంటే యేమిటమ్మా ?

( తల్లి హడలిపోయింది కాని Sudden inspirative తో )

తల్లి : చూడాబోతున్నావుగా !

( అవును. అక్కడే పెళ్ళి మధ్య తక్కిన సంగతులన్నీ అడగ వొచ్చునని పిల్ల ప్రస్తుతం వూరుకుంది. )

తల్లి :- ఇంకా అట్లానేవున్నావేం? నీ ప్రశ్నలూ నువ్వూను పింజారిమల్లే? ఆ బట్టలతోనే వొస్తావా ఏమిటి?

పిల్ల :- పెళ్ళిలో మనకిఉన్న మంచి బట్టలూ నగలూ అందరికీ చూపించు కోవాలికదూ అందుకేనా పెళ్ళి?

తల్లి :- చూపించుకోడానికా ఏం? ఎక్కడన్నా?.... అందానికిగాని.

పిల్ల :- మరివాళ్ళు అనసూయ మొహానికి రంగుపూసుకుంటే మరీ షోకులు చేస్తోంది. అదేం పొయ్యేంకాలం? అన్నావే?

తల్లి : రంగు పూసుకోవడమూ, చీరెకట్టుకోవడమూ వొకటేనా ఏమిటి?

పిల్ల - కాంత జార్జెట్టుచీర కట్టుకుందని తిట్టావే కాంతని?

తల్లి : అవి మర్యాదస్తులు కట్టుకోరు.

పిల్ల : మనం మర్యాదస్తులమా అమ్మా.........(ఊ....) ఏంచేస్తే మర్యాదస్తులు?

తల్లి : (చెలాన్ని మరచిపోయి) ఏదో వొకటి- నోరుమూసుకో.

పిల్ల ; మర్యాదస్తులు పెళ్ళికి పట్టుచీరెలు కట్టుకొని వెడతారా?

తల్లి : అవును. మామూలు చీరెతో వెడితే బీదవాళ్ళనుకుంటారు. (Too late తను చేసిన పొరబాటు గ్రహించింది.)

పిల్ల : బీదవాళ్ళు మర్యాదస్తులు కారుకదూ! వాళ్ళకి పట్టుచీరెలు వుండవుగా? బీదవాళ్ళని పెళ్ళికి రానీరుకదూ?

తల్లి : బంధువుల్ని పిలుస్తారు. (మనం బంధువులమా అనే ప్రశ్న వినబడుతో) స్నేహితుల్నికూడా....

పిల్ల : బీదవాళ్ళతో స్నేహం చేసుకోరుకదూ?

తల్లి : చేసుకోరు.

పిల్ల ; బీదవాళ్లు చెడ్డవాళ్ళు, దుర్మార్గులు.

తల్లి : ఎందుకు?

పిల్ల : దుర్మార్గులతో స్నేహం చేసుకోకూడదుగా, (తల్లి logic చదువుకో లేదు.)

తల్లి : అదికాదు ...

పిల్ల : ఐతే నన్ను కాపింతో ఆడుకోనియ్యవేం?

తల్లి : అట్లాంటి వాళ్ళకి చెడు అలవాట్లుంటాయి,

పిల్ల : ఎట్లాంటి వాళ్ళకి ?

తల్లి : కాసింల్లాంటి వాళ్ళకి

పిల్ల : సాయేబులకా!

తల్లి : కాదు.

పిల్ల : బీదవాళ్ళకా!

తల్లి : (గతిలేక) ఊఁ

పిల్ల : మనం బీదవాళ్ళమైతే మనకీ చెడుఅలవాట్లు వొస్తాయి....ఎక్కడ వుంటాయో అవి?.... ...చెడుఅలవాట్లంటే ఏమిటమ్మా!

తల్లి : బూతులు మాట్లా....
(నాలిక కొరుక్కుంది.)

పిల్ల : బూతులంటే ఏమిటమ్మా!

తల్లి : పో- మొహం కడుక్కురా ఇంక ప్రశ్నలు చాల్లే.

పిల్ల : (వెళ్ళక) బూతులంటే ఏమిటమ్మా ! ('పాడుమాటలూ' ఇట్లాంటి జవాబులు యోచించింది. కాని లాభం లేదని తెలుసు.)

తల్లి : నాకు తెలీదు.

పిల్ల : మరి వాళ్ళు బూతులు మాట్లాడతారని నీ కెట్లా తెలుస్తుంది అమ్మా!

తల్లి : మాట్లాడినప్పుడు తెలుస్తుంది.

పిల్ల : ఆ 'చెలం' అన్నీ బూతులు రాస్తాడు అంటావే, రాజేశ్వరమ్మ గారితో. ఏం రాస్తాడమ్మా!

తల్లి : చిన్నపిల్లకి నీ కెందుకు, పో.

పిల్ల : మరి నన్ను నేర్చుకో వొద్దంటావుగా!

తల్లి : నువ్వు నేర్చుకో వొద్దు. చిన్నపిల్లవి అన్నాను.

పిల్ల : మరి బూతులు పెద్దవాళ్ళే నేర్చుకోవాలా! నే నెన్నాళ్ళకి పెద్దదాన్నవుతాను ? ( గొప్ప అపాయం స్ఫురించింది తల్లికి. )

తల్లి : ఆ! ఇట్లా నుంచుంటే నిన్ను తీసుకెళ్ళకుండా వెడతాను.

పిల్ల : మరి వాళ్ళు మీ పిల్ల రాలేదేం అంటే, అవాళమల్లే 'జరంగా ఉంది' అంటావా! (జ్ఞాపకం తెచ్చుకుంటో) నేను ఆడుకుని వొచ్చేప్పటికి వాళ్ళు 'మీపిల్లకి జరం లేదే జరమని చెప్పారేం ?' అని అడగరేం ?

తల్లి : మర్యాదస్తులు గనక ! (మళ్ళీ మొదలు రామ, రామ, అనుకుంది. కాని మన పిల్ల తెలివైంది, చిలక కాదు.)

పిల్ల : మర్యాదస్తులు నిజం అడగరు .... అబద్ధాల్ని నమ్మకపోయినా నమ్మినట్టే చూస్తో వుంటారు.

తల్లి : నీకుమల్లే ప్రశ్న లడగరు ....

పిల్ల : అమ్మా నువ్వు లోలకులు పెట్టుకోవేం ?

తల్లి : ఛీ ! ఇన్నేళ్ళొచ్చి ఇంకా లోలకులు పెట్టుకోవలసిందే !

పిల్ల : ఎన్నేళ్ళొచ్చినప్పుడు పెట్టుకోవాలి అమ్మా !

తల్లి : చిన్న వాళ్ళు. —

పిల్ల : మరి 'ఇంత చిన్నదానివి నీ కప్పుడే లోలకులు ఏమిటి ?' అన్నావే !

తల్లి : అంటే .... కొంచెం పెద్దవాళ్ళు ....

పిల్ల : నువ్వు మరీ పెద్దదానివా ! నువ్వు పెట్టుకుంటే చాలాబావుంటావు.

తల్లి ; ఛీ ! అందరూ నవ్వరూ....

పిల్ల : మరి నాన్న అందరినీ నవ్విస్తాడే !

తల్లి : నాన్న మొగవారు. (అనితప్పించుకుంది. రాబోయే ఆపద ఎరుగను)

పిల్ల : మొగవాళ్ళని చూపి అందరూ నవ్వితే మంచిదా ?

తల్లి ; ఏదో చెద్దా.

పిల్ల : మరి ముగ్గురు పిల్లలను పెట్టుకొని 'రాజామణి' లోలకులు పెట్టుకుందే !

తల్లి : దానికేం సిగ్గులేని ముండ—

పిల్ల : మరి సిగ్గులేని ముండ .... అనకూడదన్నావే నన్ను ! ... ఓ! చిన్నవాళ్ళు అనకూడదు కదూ! చెప్పేవు మరిచిపోయినాను.... మరి రాజామణి వొస్తే, రండి,రండి ఎన్నాళ్ళకిరావడం అన్నావే!

తల్లి : అది మర్యాద.

పిల్ల : మర్యాద అంటే దొంగవేషాలా అమ్మా!

తల్లి : నీకు తెలీదులే ....

పిల్ల : అమ్మా లోలకులు పెట్టుకుంటే నేం ?

తల్లి : మొదటికి వొచ్చావూ! మర్యాద కలవాళ్ళు .... కాదు .... పతివ్రతలు పెట్టుకోరు.

పిల్ల: పతివ్రతలు మర్యాద కలవాళ్ళు కారా ?

తల్లి : అట్లా అనలేదు నేను.

పిల్ల : మరి ఎట్లా అన్నావు అమ్మా !

తల్లి : ఎట్లాగో ఓలాగు — వూరుకుందూ నీ పుణ్యం.

పిల్ల : మరి చంద్రమతి లోలకులు పెట్టుకుంటే !

తల్లి : ఏం చంద్రమతి !

పిల్ల : సినిమాలో చంద్రమతి !

తల్లి : అది భోగంది.

పిల్ల : ఏమిటి, హరిశ్చంద్రుడు భోగందాన్ని పెళ్ళి చేసుకున్నాడా! అది భోగం పతివ్రతా!

తల్లి : అది సినిమా.

పిల్ల : సినిమాలో అన్నీ అబద్ధాలా! మరి అబద్ధాలు చూడ్డానికి వెడతారేం అమ్మా ; చెడిపోతారుగా !

తల్లి : నేను చెప్పలేనే.

పిల్ల : భోగంది అంటే ఎవరమ్మా .

తల్లి : మొగుడులేందాన్ని భోగంది అంటారు.

పిల్ల : అమ్మమ్మ భోగందేనా?

తల్లి : అసలు పెళ్ళికాదు భోగంవాళ్ళకి.

పిల్ల : నాకు పెళ్ళి కాకపోతే-

తల్లి : ఛీ! ఎందుకుకాదు?

పిల్ల : మా పంతులమ్మ భోగందా?

తల్లి : ఛీ అట్లా అనకు, భోగంవాళ్ళు పనిచెయ్యరు.

పిల్ల : వాళ్ళకి ఎందుకు కాదూ?

తల్లి : వాళ్ళే చేసుకోరు.

పిల్ల : ఎందుకు చేసుకోరు?

తల్లి : వాళ్ళకులం అది.

పిల్ల : మరి పిల్లలెట్లాఅమ్మా!

తల్లి : పో. నీకా సంగతులన్నీ ఎందుకు?

పిల్ల : మరి ఎనిమిదేళ్ళొచ్చాయి ఈ మాత్రం తెలీదా అని నువ్వేగా అంటావు.

తల్లి : ఇట్లాంటి సంగతులా ?

పిల్ల : ఎట్లాంటి సంగతులు?

తల్లి : ఏదో వొకటిలే.

పిల్ల : నువ్వేగా చెప్పావు.

తల్లి : ఏం చెప్పాను!

పిల్ల : అమ్మా, నాకో పాపాయిపుడితే బావుంటుందంటే— పెళ్ళికాంది పిల్లలెట్లా పుడుతారు అన్నావే!

తల్లి : అవునులే, రా, జడవేస్తాను.

పిల్ల : జడవొద్దు. ఇట్లానే వస్తాను.

తల్లి : ఛీ, ఛీ అట్లానా! అందరూ చక్కగా దువ్వుకుని వొస్తారు,

పిల్ల : నీ పిల్ల అని నన్ను చూపించుకోడం నీకు సిగ్గుగా వుంటుంది. పోనీ నేను బీదవాళ్ళ పెళ్ళికి వెడతానులే. వాళ్ళు హాయిగా దువ్వుకోకుండా....

తల్లి : ఛీ, నీకేం ఖర్మం ?

పిల్ల : నేను బీదదాన్ని కాదూ ....

తల్లి : నువ్వెందుకు బీదదానివి?

పిల్ల : నాకేంవున్నాయి? అన్నీ మీవేగా:

తల్లి : సీసీసీ,

పిల్ల : మరి నా కానీని నేను కోతిమనిషికి ఇస్తే! నన్నాట్లా తిట్లారే ? నాదిగా ఆ కానీ——

తల్లి చిన్నపిల్లవి నీకేం తెలుసు?

పిల్ల : ఏమైనా మనం బీదవాళ్ళం కాకూడదు. బీదవాళ్ళు వెధవలు. మర్యాదస్తులు కారు. వాళ్ళతో ఆడుకోకూడదు. వాళ్ళకి అన్నీ చెడ్డ అలవాట్లు. బీదవాళ్ళంటే డబ్బులేనివాళ్ళు కాదూ? మనకి డబ్బు లేకపోతే మనమూ బీదవాళ్ళమైపోతాము. డబ్బు జాగర్తగా దాచుకోవాలి- బాగాసంపాయించి దాచుకోవాలి. డబ్బులేకపోయినా బీదగా కనబడకూడదు. అందుకనే మంచి బట్టలు అవీ వేసుకుని తల దువ్వుకుని పోవాలి. పెళ్ళిలో అక్కడా బీదవాళ్ళం కాము అని చూపుకోడానికి మంచి బట్టలుకొని దాచుకోవాలి.

అవును. అమ్మా, "మీ పిల్ల ఏదీ?" అంటే 'అది నీదది' అను. వూరుకుంటారు ...నిజంగా నన్ను తీసుకువెళ్ళాలని వుందాఅమ్మా ....నేను మంచిబట్టలు వేసుకోకపోతే. తీసికెడతావా!.... ఏ చీరె మల్లే.... కాసుల పేరు మల్లె ——నన్నూ షోకుచేసి చూపించుకోడానికి తీసుకు పోతున్నావు—— (ఏడుస్తోంది)

తల్లి : ఛీ. అట్లా అంటావేమిటి........ నువ్వు లేకపోతే నాకేంతోస్తుంది ——ఏడవకు.... కళ్ళు వాస్తాయి. అందరూ——

(చప్పున వూరుకుంది. సాధారణ స్త్రీలకన్న తెలివికలది కనక.)

# పుట్టిన పండుగ

(చిన్న కుర్రాడికి తలంటిపోసి చిక్కు తీస్తోంది తల్లి. ఆపిల్లాడు గోలకెత్తుతున్నాడు. ఆ పిల్లాడి అక్కవచ్చింది.)

అక్క: పండగలంటే నాకు కోపంగా వుంది. పాడుపండగలు ఈ పుట్టిన పండగ ఒకటి. ఎందుకు పుట్టామో.

తల్లి : ఇంతలో ఏ మొచ్చిందే నీకు!

అక్క: ప్రతి పండుగకీ, ఈ తలంటి, కళ్ళలో కుంకుడు పులుసు, ఈ జుట్టు పీకడం, కొత్తబట్టలు వెయ్యటం. వాటిని ఆటల్లో మాపితే తన్నటం, చూడు తమ్ముడు జుట్టుని పీకి ఎట్లా ఏడిపిస్తున్నావో!

తల్లి : కాకపోతే మురికి తలతో —

అక్క: ఎవరికోసం ఈ పుట్టిన పండుగ! మా కోసమా, మీ కోసమా!

తల్లి : మీ కోసమే.

అక్క: మాకొద్దు. మానెయ్యి.

తల్లి : అందరు పిల్లలూ చేసుకోటం లేదూ? మీరే దిగివొచ్చారా?

అక్క: ఎక్కడనుండి దిగివచ్చామమ్మా మేము? ఎట్లా దిగివొచ్చాము?

తల్లి : దేముడి దగ్గర నుంచి, ఎన్నిసార్లు చెప్పాలి?

అక్క: దేముడి దగ్గర హాయిగా వుండేవాళ్ళం ఎందుకు దిగివొచ్చాము?

తల్లి : దేవుడు పంపిస్తే?

అక్క: ఎందుకు పంపించాడు? దేముడికి మామీద కోపమా?

తల్లి : మా కోసం?

అక్క: మీకోసం మమ్మల్ని బాధ పడమన్నావా? ఎందుకు?

తల్లి : మేం పడటం లేదా మీ వల్ల?

అక్క: అదే అంటున్నా. మావల్ల మీకూ, మీవల్ల మాకూ ఈ బాధ లెందుకు? పోనీ మేం రాకపోతే నేం?

తల్లి : అది దేవుడి ఇష్టం.

అక్క: బాధ ఇష్టమా దేముడికి? ఏనాడ రత్రికి పది మంది పిల్లల్ని ఎందుకు పంపాడు? వొద్దని ఏడుస్తుంటే?

తల్లి : దేముడి దయ.

అక్క: అదేం దయ? మరి దేముడి దయకి బుద్ధిలేదా?

తల్లి : దేముడి సంగతి మనకి తెలీదు.

అక్క: రా రా తమ్ముడూ, ఇంక పోదాం. ఇవాళ రాజాగారి ఇంటికి వెడదా మనుకున్నాం. అమ్మా, అమ్మా రాజామణిగారికి పిల్లల్ని పంపలేదేం దేముడు?

తల్లి : మనకి ఆ సంగతులు తెలీవు అని చెప్పలేదూ?

అక్క: దేవుణ్ణి అడక్కపోయినావా?

తల్లి : దేవుణ్ణి అడగట మేమిటే? దేవుడు కనపడడు.

అక్క: మరి మమ్మల్ని మీకు ఇచ్చేప్పుడన్నా కనపడలేదా?

తల్లి : ఉహూ.

అక్క: ఎవరూ కనపడలేదూ?

తల్లి : లేదు.

అక్క: అయితే దేముడు పంపించాడని ఎట్లా తెలుసు?

తల్లి : (తడుముకుంటో) దేముడు పంపకపోతే ఎట్లా వొస్తావేం?

అక్క: (ఆలోచిస్తో) నాకు తెలీదే, ఎవరు పంపించినట్టు? నేను వొచ్చి నప్పుడు ఎంత వున్నాను?

తల్లి : చాలా చిన్న పాపాయి.

అక్క: నీ పక్కలో వున్నానా తెల్లారి లేచి చూస్తే?

తల్లి : (బతికాను దేముడా అనుకొని) అవును.

అక్క: ఆవులకి అట్లా కాదే? మన ఆవుకి ——

తల్లి : (హడలిపోయి త్వరగా) ఆవులకి వేరు.

అక్క: కాంతమ్మగారు నెప్పులు పడుతున్నారని మీరు అందరూ వెళ్లారే, మర్నాడు ప్రొద్దున్న —

తల్లి : పొండే, ఇంకవాలు ప్రశ్నలు. పోయి ఆడుకోండి.

అక్క: కాదమ్మా! అప్పుడు డాక్టరువచ్చి పిల్లని బైటికి ....

తల్లి : ఆ సంగతు లన్నీ మీ కెందుకు, చిన్నవాళ్ళకి, పొండి.

అక్క: మరి దేవుడు పంపిస్తా డన్నావే?

తల్లి : దేవుడు పంపిస్తేనే, డాక్టరు—

అక్క: బోడి శీతమ్మ కడుపులో పిల్ల తిరుగుతోందంటే! అమ్మా విను మరి, కొందరికి....

తల్లి : పోతారా, తన్ననా? (తన్నబోయింది. పిల్లలు బైటికి పరుగెత్తు కొని వెళ్ళారు.)

అక్క: (బైట కిటికీలోంచి) అమ్మా, నాకు సరిగా చెబుతావా? అన్నయ్యని అడగనా?

తల్లి : అన్నయ్య మొహం - వాడికేం తెలుసు?

అక్క: తెలీకేం? అన్ని సంగతులు బళ్ళో పుస్తకాలలో వుంటాయట. అన్నయ్య రానీ.

తల్లి : ఏమిటో ఏడు, అన్నయ్యని అడగకు.

అక్క: బోడివాళ్ళకి పిల్లలు — అమ్మా, పిల్ల పుట్టిందంటారే! ఎట్టా పుడుతుంది?

తల్లి : (విధిలేక) పొట్టలోంచి.

అక్క: అవునులే, ఎట్లా బయటికి వొస్తుంది?

తల్లి : బొడ్డులోంచి.

అక్క: అందుకా బొడ్డు? నాకు పుడతారా?

తల్లి : పెద్దయినాక.

అక్క : చిన్నపిల్లలకి చిన్న బొమ్మలంత పాపాయిలు పుట్టకూడదు? దేవుడు పుట్టించడా.

తల్లి : మీరు పెంచలేరని.

అక్క: ఏ కిస్తానుగా పెంచడానికి!

తల్లి : నా కిదేపని, మీరు చాలరూ?

అక్క: ఇంక అక్కర్లేదా? దేవుడు పీ పొట్టలో పెడితే? మరి మొగుడు లేనివాళ్ళకి పిల్లల్ని పొట్టలో పెట్టడేం?

తల్లి : ఏమో, నాకు తెలీదే, వాళ్ళకి నాన్న వుండడని.

అక్క: నాన్న చచ్చిపోతే?

తల్లి : అప్పుడేం చేస్తాం?

అక్క: ఎందుకు చంపుతా డమ్మా?

తల్లి : జబ్బు వొస్తే చచ్చిపోతారు.

అక్క: దేవుడు కాదన్నమాట చంపేది.

తల్లి : (గతిలేక) కాదు.

అక్క: మరి ఆ నారాయణగారు 'దేవుడా, నా కొడుకుని తీసుకుపోయినావా?' అని ఏడ్చారేం?

తల్లి : వాళ్ళట్లా అనుకున్నారు.

అక్క: మరి మరి .... వెంకటరత్నంగారి, శీతాబాయికి మొగుడు లేడు కదా —

తల్లి : నేను చెప్పలేనే, నన్ను వొదిలి పోదూ.

# వినాయక చవితి

కుర్రవాడు: నాన్నా వినాయకుడుకూడా దేవుడేనా !

నాన్న: ఎందుకా సందేహం ?

కుర్ర : ఏమిటో ఆ తొండం, ఆ బొజ్జా, చూస్తే నవ్వుగా వుంటుంది.

నాన్న: అట్లా నవ్వకూడదు. కధ తెలుసుగా నీకు, యేనుగు తల యెట్లా వొచ్చిందో.

కుర్ర : తెలుసులే. ఆపిండిబొమ్మ యింత పెద్దదిగా యెదిగిందా ! దేవుళ్ళు కూడా యెదుగుతారా ?

నాన్న: ఆ.

కుర్ర : ఎంత యెదుగుతారు; ముసలివాళ్ళవుతారా ?

(తండ్రికీ సందేహం వొచ్చింది. యెన్నడూ ఆసంగతి ఆలోచించలేదు.)

నాన్న: ముసలితనం లేదు వాళ్ళకి.

కుర్ర : అయితే, యెదిగి యెదిగి యేమౌతారూ వూరికే యెత్తుగా యెదగట మేనా, పెరుగుట విరుగుట కొరకే. చచ్చిపోతారా ?

నాన్న: వాళ్ళకి చావులేదు.

కుర్ర : యెదగడానికి బాగా తినాలి కదా, వాళ్ళూతింటారా ?

నాన్న: వాళ్ళేదో అమృతం తాగుతారంటారు.

కుర్ర : అమృతంతాగి యెదుగుతారన్న మాట. అమృతమంటే పండుతుందా ? అది యెట్లాదొరుకుతుంది ? దాన్నితింటారా, తాగుతారా ?

నాన్న: తెలీదురా.

కుర్ర : అసలు ఈ దేవుళ్ళ సంగతులు యెవరికి తెలుసు ? యెట్లాతెలుసు ?

నాన్న: పూర్వం ఋషులు పురాణాల్లో రాశారు. దేవుళ్ళు వాళ్ళకి చెప్పారు గావును.

కుర్ర: యేం తినకపోతే, అంతనోహ తొండం దేనికి వినాయకుడికి?

నాన్న: పూరికే ఆకారానికి.

కుర్ర: ఈ బొమ్మలేనా, అసలు వినాయకుడు వుంటాడా?

నాన్న: వుండకేం?

కుర్ర: మనం నైవేద్యం పెడితే వుండ్రాళ్ళు తింటాడా?

నాన్న: తినకేం?

కుర్ర: అమృతంతప్ప మరేం తినడన్నావు?

నాన్న: మన నైవేద్యాలు తింటారు.

కుర్ర: సయించినా సయించక పోయినా, పొట్టనిండినా, మనంబెట్టినవన్నీ తినాలిసిందేకదూ! యెన్ని వుండ్రాళ్ళు యెందరో పెడతారుకాదా.

నాన్న: తినరు.

కుర్ర: అదేమిటి నాన్నా, ఇవాళ అట్లా చెబుతావు? ఒకసారి ఒకటి అంటావు; ఇంకోసారి ఇంకోటి అంటావు.

నాన్న: మరి నువ్వు వేసే ప్రశ్న లెట్లావున్నాయి.

కుర్ర: నాకు తెలీకేకదా నిన్ను అడిగేది: నా ప్రశ్నలు యెట్లా వున్నాయి? సరిగానే అడిగానే! వినాయకుడే తింటాడా? అయితే ఉండ్రాళ్లు అన్నీ అట్లాగే వుంటాయే!

నాన్న: రుచిచూస్తాడు.

కుర్ర: ఉండ్రాళ్ళకు రుచి యేముంది? యెవరు తినేది? ఈ బొమ్మా! కైలాసంలో వినాయకుడా, ఈబొమ్మ తించే మనకెందుకు; అసలు వినాయకుడు తినాలి గాని!

నాన్న: నువ్విక్కడ నైవేద్యంపెడితే అక్కడ వినాయకుడికి చేరుతుంది!

కుర్రా: యెట్లా చేరుతుంది నాన్నా! అన్నీ యిట్లాంటివి చెపుతావు?

నాన్న: యేమో చేరుతుంది అంటారు,

కుర్రా : ఆ వినాయకుడికి తెలుస్తుందా,..యెవరెవరు యెంత నైవేద్యం పెడుతున్నారో !

నాన్న: అంతటా వున్నాడన్నానుగా, అన్నీ చూస్తాడు.

కుర్ర : సరిగా చెప్పునాన్నా ! వినాయకుడు అంతటా వున్నాడా, కైలాసం లోనా ? అతనికి పొట్టా, తొండం వున్నాయికదా ! అంతటా ఎట్లా వుంటాడు ?

నాన్న: వినాయకుడంటే తెలీడానికి ఓ రూపం చూపించారు అంతే, అతనికి శరీరంలేదు.

కుర్ర : లేకపోతే ఉండ్రాళ్ళు ఎట్లా తింటాడేం ?

నాన్న: ఏమోరా, నన్ను చంపకు అవన్నీ పెట్టినవాళ్ళనడుగు.

కుర్ర : ఎవరు పెట్టారు.

నాన్న: ఎవరో పెద్దలు.

కుర్ర : వాళ్ళెక్కడ వుంటారు ?

నాన్న: చచ్చిపోయినారు.

కుర్ర : వాళ్ళకి తెలుసా ?

నాన్న: ఆ.

కుర్ర : వాళ్ళకి తెలుసునవి నీ కెట్లా తెలుసు ?

నాన్న: ఏమోరా, అంతరూ చేస్తున్నారు.

కుర్ర : కొందరు చెయ్యరే ?

నాన్న : వాళ్ళ ఇష్టం.

కుర్ర : మన ఇష్టంకాదా ? తెల్లారకట్టే చలిలో నిద్రలేపి, తలంట్పొయ్యమన్నారా ఆ పెద్దలు ? అన్నారో లేదో నీకెట్లా తెలుసు ?

నాన్న: ఏమో, అందరూ....

కుర్ర : అందరూ సిగరెట్లు కాలుస్తారు నువ్వుకాల్చవే ?

నాన్న: వాళ్ళుకాదు, మంచివాళ్ళు.

కుర్ర : సిగరెట్లు కాల్చేవాళ్ళు మంచివాళ్ళు కాదా ?
నాన్న: కాదు.
కుర్ర : చిన్నాన్న....
నాన్న: మంచివాడే కాని ఆ సిగరెట్లు....
కుర్ర : కాల్చేవాళ్ళు మంచివాళ్ళు కాదన్నావే !
నాన్న: అది మంచిపని కాదు.
కుర్ర : చెడ్డపని చేసేవాళ్ళు చెడ్డవాళ్లు కాదా ?
నాన్న: కాదు.
కుర్ర : మన పిల్లిని కొడితే, నన్ను చెడ్డవాడందే అమ్మ !
నాన్న: అమ్మకి తెలీదు.
కుర్ర: మరి నన్ను అమ్మమాట వినమంటావే.
నాన్న: అవన్నీ ఎందుకురా, వినాయకుడి సంగతి మాట్లాడుతో.
కుర్ర : సరే తమ్ముడి బారసాలకి పసుపుముద్దని చేసి విఘ్నేశ్వరుడన్నారే! ఆ ముద్దకూడా వినాయకుడేనా ?
నాన్న: పసుపు శుభం. అందుకని....
కుర్ర : శుభమంటే —
నాన్న : మంచి చేస్తుంది.
కుర్ర : ఎవరికి ?
నాన్న: మనకి.
కుర్ర : ఏం మంచి ?
నాన్న : అన్నీ.
కుర్ర : ఏంచేస్తే....
నాన్న: పసుపుని వాడితే.
కుర్ర : ఎట్లా ?
నాన్న: ఏమోరా, పో.

కుర్ర : అయితే పసుపుని నువ్వే పొడవేం ?
నాన్న: ఆడవాళ్లు.
కుర్ర : మొగవాళ్ళకి శుభం వొద్దా ?
నాన్న: వాళ్ళకిపేరు.
కుర్ర : ఏంపేరు ?
నాన్న: నేను చెప్పలేనురా.
కుర్ర : సరే శుభమైతే.
నాన్న: దాంట్లో వినాయకుడు వుంటాడని.
కుర్ర : పసువులోనా ?
నాన్న: ఊఁ,
కుర్ర : పసుపులో ఎట్లావుంటాడు నాన్నా- మరీవి ?
నాన్న: ఏమోగా.
కుర్ర : ఇంకా ఏమన్నా వున్నాయా శుభమైనవి ?
నాన్న: వున్నాయి.
కుర్ర : వాటిల్లోకూడా వుంటాడా ?
నాన్న: వేరే దేవతలు వుంటారు.
కుర్ర : మట్టితో చేస్తారే వినాయకుణ్ణి ! మట్టిలో వుంటాడా ?
నాన్న: ఊఁ,
కుర్ర : మట్టికూడా శుభమా ?
నాన్న: శుభ్రమైనది
కుర్ర : అయితే పసుపు కొనడమెందుకు ?
నాన్న: నాకు తెలీదు.
కుర్ర : నువ్వుకొంటో తెలీదంటావేం ? నేనేదన్నా తెలీకండా కొన్నానంటే
వూరుకుంటావా ? నాకు బావుందన్నా వొప్పుకోరే !
నాన్న: చిన్నవాడివి.

కుర్ర : పెద్దవాళ్ళు అసలు తెలీకండానే కొంటారే అన్నీ! మీరే మాకు ఇట్లాంటి బుద్ధిలేని వన్నీ నేర్పేది. శుభమైన వాటిల్లోనేనా వినాయకుడు వుండేది? దేవుడు అన్నిట్లోనూ వుంటా డంటారుగా?

నాన్న: వుంటాడు.

కుర్ర : మరి అన్నిటినీ పూజచెయ్యరే?

నాన్న: ఏవో కొన్నిటివి ఏరుకున్నారు పూజకి.

కుర్ర : నేను ఇంకోటి ఏరుకుంటే.

నాన్న: ఏరుకో.

కుర్ర : అయితే నేను కుక్కపిల్లని ఏరుకున్నాను.

నాన్న: ఛీ. కుక్క పిల్లా!

కుర్ర : దాంటో దేవుడు లేడా?

నాన్న: వున్నాడులే, కాని అది మురికి.

కుర్ర : నేను శుభ్రంగా వుంచుతాను. మన అమ్మమ్మ ఎంత మురికి—

నాన్న: అట్లా అనకూడదు, పెద్దవాళ్ళని.

కుర్ర : ఎందుకు అనకూడదు? తను అంత మురికిగావుండి, నన్ను—

నాన్న: పెద్దవాళ్ళు.

కుర్ర : అయితే—

నాన్న: వాళ్ళని అనకూడదు.

కుర్ర : ఎందుకు?

నాన్న: తప్పు.

కుర్ర : ఎందుకుతప్పు? ఈ తప్పులన్నీ ఇన్నితప్పులు, నీకెట్లా తెలిశాయి నాన్నా! ఎవరు పెట్టారు?

నాన్న: ఏమోగా, అవన్నీ ఎందుకు-వినాయకుడి సంగతి మాట్లాడు.

కుర్ర : ఏమిటో, మాట్లాడితే చిన్నపిల్లలకి ఏమీ తెలీదంటారు. పెద్దవాళ్ళకే తెలీదు. మాకుతెలీదని వూరుకుంటాము, మీరు తెలుసునని మమ్మల్ని దబాయించి, అబద్ధాలు చెప్తారు.

నాన్న: నేనబద్ధాలు చెప్పానా!

కుర్ర: అమ్మ చెపుతుంది. నువ్వయినా ఒక్కదానికీ సరిగా చెప్పవుకదా! మరి వినాయకుడు అన్నిట్లో వుంటే, మరి యెక్కడో కైలాసంలో వున్నాడంటారేం?

నాన్న: అక్కడా, యిక్కడా, యెక్కడా ఉన్నారు.

కుర్ర: అయితే కైలాసంలో వున్నారని అనడ మెందుకు, ఇక్కడే వున్నవాళ్ళని?

నాన్న: అక్కడ కనపడతారేమో!

కుర్ర: ఎవరికి?

నాన్న: అక్కడి ఋషులకీ, దేవతలకీ.

కుర్ర: వాళ్ళకి ఇక్కడా కనపడతారుగా!

నాన్న: ఇక్కడ కనపడరు.

కుర్ర: అయితే ఇక్కడ వున్నట్లు చూపిందెవరు?

నాన్న: నాకు తెలీదురా.

కుర్ర: వినాయకుడికి ఆకలి లేకపోతే, ఉండ్రాళ్ళు పెట్టడ మెందుకు?

నాన్న: మనభక్తి చూపడానికి.

కుర్ర: ఆకులూ, పువ్వులూ చాలవా! పోనీ నాకు అరిసెలు ఇష్టం. అవి పెడితేనేం?

నాన్న: నీ ఇష్టమా!

కుర్ర: ఎవరి ఇష్టం?

నాన్న: వినాయకుడి ఇష్టం.

కుర్ర: ఆకలి లేనివాడికి ఇష్టమేమిటి?

నాన్న: కాదు. ఋషులు అట్లా పెట్టమన్నారు.

కుర్ర: అంటే ఋషులకి ఇష్టమన్నమాట ఉండ్రాళ్ళు అవీ. మనం భక్తి నెందుకు చూపడం? నాకేం భక్తి లేదే!

నాన్న: నమస్కారంపెట్టి పూజచేస్తే భక్తి వున్నట్టే.

కుర్ర: దేవుడు అనుకుంటాడా, భక్తి వున్నట్టేనని.

నాన్న: ఊఁ.

కుర్ర: దేవుడు తెలుసుకోలేడా ?

నాన్న: నమస్కారం పెడుతోవుంటే భక్తి అదే వొస్తుంది.

కుర్ర: అన్నయ్య వాళ్ళ హెడ్మాష్టరుకి ఐదేళ్ళమట్టి నమస్కారం చేస్తాడా ? ఒక రవ్వ భక్తి రాలేదు అన్నయ్యకు.

నాన్న: దేవుళ్ళ సంగతివేరు.

కుర్ర: ఇన్నేళ్ళమట్టి నమస్కారం పెడుతున్నావా, నీకేం భక్తి కన పడదే దేవుడు మీద ?

నాన్న: లేకేం ?

కుర్ర. మరిదేవుణ్ణి తిట్టావు ఎన్నోసార్లు, నీకు ఏదో జీతంసరిగా రాక పోయి నప్పుడు.

నాన్న: అది నాబుద్ధి తక్కువ.

కుర్ర: నువ్వు బుద్ధి తక్కువ వాడివా ? మరి నన్నెందుకు తిడతావు బుద్ధి లేదని !

నాన్న: వూరికే మాటవరస కన్నాను. నీకన్న బుద్ధి గలవాడినే. దేవుడు ముందు బుద్ధి తక్కువవాణ్ణి.

కుర్ర: ఇన్నేళ్ళు పూజలు చేస్తే, ఏ మొచ్చింది ?

నాన్న: మనకి తెలీదు. మనం చేసే పాపాలు క్షమిస్తాడు. మనకి మంచి చేస్తాడు ఈశ్వరుడు.

కుర్ర: పూజలంటే ఇష్టమా ఈశ్వరుడికి ?

నాన్న: ఊఁ.

కుర్ర: చాలా బడాయివాడా ? మన వూరు ఛైర్మను మల్లే.

నాన్న: కాదు. పూజలు చెయ్యడం మన ధర్మం.

కుర్ర : ఎందుప ?

నాన్న: మరి నిన్ను పుట్టించాడా ?

కుర్ర : పుట్టిస్తే నాకేం ? పుట్టించ వొద్దనూ.

నాన్న: పోనీ, పీల్చడానికి గాలి, తాగడానికి నీళ్ళు —

కుర్ర : ఇవన్నీ పెట్టకపోతే తను పుట్టించినవాళ్ళు చచ్చిపోతారు. నాకోసం పెట్టాడా ? ఇంతమంది పూజలు చేస్తోవుంటే అన్నీ లెక్కలు పెడుతో రాసుకుంటో కూచుంటాడా, ఎవరెన్ని నమస్కారాలు పెట్టారో, ఎన్ని పువ్వులు వేశారో ?

నాన్న: దేవుడికి తెలుస్తాయి ఇవన్నీ.

కుర్ర : పూజ చెయ్యకపోతే కోపం వస్తుందా ఈశ్వరుడికి ?

నాన్న: ఆ, మన ధర్మం మనం చెయ్యటం లేదని.

కుర్ర : ఎందుకు మనధర్మం, పూజ చెయ్యడం ? చెప్పావుగా, పోనీతే తురకవాళ్లు వినాయకుడిని పూజ చెయ్యరుకదా, వాళ్ళమీదకోపమేనా?

నాన్న: వాళ్ళదేవుణ్ణి వాళ్ళు పూజచేస్తారు.

కుర్రా : మరి వినాయకుడికి కోపంరాదా ?

నాన్న: తురకాళ్ళుచేస్తే ఇష్టంలేదు.

కుర్రా : ఎందుకో.

నాన్న: వాళ్ళు తురకాళ్ళు గనక.

కుర్ర : వాళ్ళని వాళ్ళ దేవుడు పుట్టించాడా ?

నాన్న: (అనుమానంగా) అంతే.

కుర్ర : అయితే వాళ్ళని వేరే లోకంలో పుట్టించుకోక, మనదేవుడిలోకంలో ఎందుకు పుట్టించాడు ? వాళ్ళదేవుడికి లోకాలు చెయ్యడం తెలీదా ?

నాన్న: (ఇంకగతిలేక) అందరు దేవుళ్ళూ ఒకటే-ఇవన్నీ పేర్లు.

కుర్ర : అయితే నేను తురకవాళ్ళ దేవుణ్ణి....

నాన్న: వీల్లేదు, నువ్వు తురకవాడివి కాదుగా !

కుర్ర : అసలు అతను తురకవాడు ఎట్లా ఐనాడు? దేవుడు చెప్పాడా, తురక వాడని? ఎట్లా తెలుస్తుంది?

నాన్న: అదో మతం.

కుర్ర : మతమంటే?

నాన్న: ఇప్పుడప్పుడే అవన్నీ తెలీవురా నీకు.

కుర్ర : నీకు తెలీవు. ఇంతాక చాలా దేవుళ్ళన్నావు; ఇప్పుడు ఒక్కడే నంటావు. ఒక్కడే ఐతే వినాయకుడు వున్నాడా లేడా?

నాన్న: ఇవన్నీ దేవుడికి పేర్లు. చదువు కావలిస్తే వినాయకుడు అని పూజ చేస్తాము. ధనం కావలిస్తే లక్ష్మి అని——

కుర్ర : చదువు కావలిస్తే లక్ష్మీదేవిని అడగకూడదా?

నాన్న : ఉహూ.

కుర్ర : తురకవాళ్ళు వినాయకుడికినిపూజచెయ్యరు. వాళ్ళకి చదువు వస్తోందే!

నాన్న: వాళ్ళదేవుడు ఇస్తాడు.

కుర్ర : వాళ్ళకి ఎంతమంది-దేవుళ్ళు?

నాన్న: ఒక్కడే.

కుర్ర : అన్నంతనే ఇస్తాడా.

నాన్న: ఆ.

కుర్ర : మనదేవుడేనా ఇన్ని దేవుళ్ళు! వాళ్ళది సులభంకాదూ? మరి సుశీలా వాళ్ళ ఇంటో అసలు ఏపూజలూ చెయ్యరే....వాళ్ళకి డబ్బువుంది....

నాన్న: పూర్వ జన్మంలో చేసివుంటారు.

కుర్ర : మరి ఈ పూజలు వొచ్చే జన్మకా, ఈ జన్మకా?

నాన్న: రెంటికీ.

కుర్ర : సుందరం ఎన్నో పూజలు చేస్తాడు. వాడికి చదువురాదు.....

నాన్న: వాడి ఖర్మం.

కుర్ర: ఖర్మమంటే?

నాన్న: నీ కిప్పుడు తెలీదు.

కుర్ర: వాడికి వినాయకుడు చదువు నియ్యడేం? వాడిఖర్మం అట్లావుంటే దేవుడు ఇయ్యడా?

నాన్న: వొచ్చే జన్మలో ఇస్తాడు.

కుర్ర: వొచ్చే జన్మలో కూడా వాడి ఖర్మ అట్లాగే వుంటే ...

నాన్న: నీకిప్పుడప్పుడే తెలీవురా?

కుర్ర: నీకు తెలుసా పోనీ.

నాన్న: (సందేహంగా) ఆ.

కుర్ర: అయితే చెప్పు: తెలుస్తుందో తెలీదో చూస్తాను.

నాన్న: నేను చెప్పలేనురా? ఇంక పో.

అక్క: అమ్మా పిల్లలం యేమడిగినా, అబద్ధాలు చెప్తారేం?

తల్లి: యేం అబద్ధాలు చెప్పాము?

అక్క: ఇందాకణ్ణించి అన్నీ అబద్ధాలే కదా? దేముడు పిల్లల్ని ఇవ్వ డమూ అదీ, యింకా అడిగితే తెలీదంటారు, అంతా తెలిసే. నువ్వు నాన్నతో మాటాడేప్పుడు వినలేదా? మొగుడులేని శీతా బాయికి పిల్ల పుట్టడానికని వాడెవడో పోస్టుఅతను, ఏంచేశాడో.... ఆమాటలే మేమంటే, బూతులు మాటాడతామని తంతారు ...మన దాసీ లక్ష్మిని నాన్న తిడతాడే, ఆమాటలకి అర్ధమేమిటి?

తల్లి: ఏం మాటలే?

అక్క: ఏం మాటలా! చెప్పనా? మాకు రావనుకున్నారా, మేముఅంటే తంతారని తెలీనట్లు వూరుకుంటాము. మేము అబద్ధాలు చెపితే బాగా కొడతారు. ఏదన్నా అడిగితేచాలు తంతామంటారు. ఇంతకీ మాకన్న బలం వుందికదా అని, మీరు అబద్ధాలు చెప్పవొచ్చు, బూతులు మాటాడవొచ్చు.

తల్లి : మీరన్నా బాగుపడతారేమో నని తంతాము.

అక్క: మీకు మళ్లేయెదగ కండానా ?

తల్లి : ఊం.

అక్క: మిమ్మల్ని అబద్ధాలు చెప్పి కొట్టిపెంచారు కదా, ఏం బాగుపడ్డారు మీరు ? పోనీ ఇది చెప్పు, మరి నిజంచెపుతావా అప్పుడన్నా.... తమ్ముడి పుట్టినరోజు ఇవాళని యెట్లాతెలుస్తుంది ? రేపు యెందుకు కాకూడదూ ?

తల్లి : ( పుట్టుక విషయం వొదిలి పోయింది గదా అని సంతోషంతో ) తమ్ముడు ఒకిరోజున పుట్టానా....

తమ్ముడు: రేపు ఇవాళ యెందుకు కాదూ ?

అక్క: పోరా పిచ్చిముండా ? రేపు ఇవాళ యెట్లా అవుతుంది ?

తమ్ము: యెందుకు కాకూడదూ, రేపంటే ఏమిటి ఇవాళ అంటే ఏమిటి?

అక్క: నువ్వు చెప్పవే అమ్మా, వాడితో ఏమిటి.

తల్లి : ( నవ్వుతో ) చూశావా ప్రశ్నలు ? జవాబు చెప్పు తమ్ముడికి. తమ్ముడు ఒక రోజున పుట్టాడా: ఆరోజు మళ్ళీ వొచ్చిందన్న మాట.

అక్క: అసలు ఆరోజులు యెక్కణ్ణుంచి వస్తాయమ్మా ?

తల్లి : రోజులు రావడమేమిటే ?

అక్క: మళ్ళీ వొచ్చిందన్నావు ?

తల్లి : ఆ తిథీ నక్షత్రం వొచ్చాయన్నమాట.

అక్క: ఆ తిథీ నక్షత్రం యెక్కణ్ణించి వొచ్చాయి ? యెక్కడవుంటాయి అవీ ?

తల్లి : సోమవారం అవీ రావూ అట్లా.

అక్క: అదే నేనడిగేది. ఆ సోమవారం యెక్కణ్నించి వొస్తుందని.

తల్లి : రాదు. అట్లాపేర్లు పెట్టుకున్నారు.

అక్క: తిథీ నక్షత్రం అంటే ఏమిటి ?

తల్లి : నక్షత్రం తెలీదా నీకు. చూడలేదా.

అక్క: ఆకాశంలో నేనా ! అదెట్లా వొస్తుంది ?

తల్లి : పేర్లు అంతే....

అక్క: ఆ తిథీ నక్షత్రమే వొచ్చాయని ఎట్లా తెలుస్తుంది ?

తల్లి : పంచాంగాలవాళ్ళకి తెలుస్తుంది.

అక్క: వాళ్ళకి ఎట్లా తెలుస్తుంది ?

తల్లి : పుట్టి సంవత్సరం ఇవాళిటికి అయిందన్నమాట.

అక్క: సంవత్సరం అంటే ?

తల్లి : మూడువందల అరవైఅయిదు రోజులు ఒక సంవత్సరం.

అక్క: అన్ని రోజులు ఎందుకు ?

తల్లి : అట్లా పెట్టుకున్నారు.

అక్క: ఎవరు ?

తల్లి : అందరూనూ.

అక్క: నువ్వూనా ?

తల్లి : ఆ.

అక్క: అన్ని ఎందుకు పెట్టావు ? ఒక పది రోజులే పెట్టకూడదూ ?

తల్లి : పది రోజులకోసారి పుట్టినపండగా !

అక్క: నేను పెట్టానా ఆ రోజుల్ని నేను పెట్టలేదే ?

తల్లి : పెద్దవాళ్ళు పెడతారు.

అక్క: పిల్లలెందుకు పెట్టరూ ?

తల్లి : వాళ్ళకి ఇంకా సరిగా తెలీదు.

అక్క: పెద్దవాళ్ళకి తెలుసా ? మేము ఏమడిగినా, తెలీదు అంటారు. ఏం తెలుసు ? పైగా చెప్పేవన్నీ అబద్ధాలు. పిల్లలు అబద్ధాలు

చెపితే కొడతారు, మీరు ఏనో్న అబద్ధాలు చెపుతారు, మిమ్మల్ని ఎవరు కొడతారు ?

తల్లి : నేనేం అబద్ధాలు చెప్పానే ?

అక్క: అదుగో మళ్ళీ అబద్ధం : పిల్లలు పుట్టడం సంగతి అడిగితే....

తల్లి : అట్లాంటివి అడిగితే చావనా ?

అక్క: ఎట్లాంటివి అడిగాను ? మీరు మాత్రం మమ్మల్ని ఎట్లాంటివి అడుగుతారు ? నిజంచెపితే కొడతారు, అందుకని అబద్ధం చెపుతాము.

తల్లి : అప్పుడు రెండు తప్పులవుతాయి.

అక్క: అబద్ధం చెపితే, మీకు తెలీదుగా ! ఎప్పుడోగాని తెలీదు, పైగా అన్నీ తెలుసునంటారు. రెండు తప్పులు మావైతే, మీ తప్పులు కొక మిమ్మల్ని కొట్టడంకూడాను. తమ్ముడు ఎప్పుడు పుట్టాడు ?

తల్లి : అయిదేళ్ళ కిందట.

అక్క: అదికాదు. ఏదో తిధినక్షత్రం అన్నావే.

తల్లి : మాఘశుద్ధ ఏకాదశినాడు—

అక్క: అంటే.

తల్లి : ఆ రోజుపేరు, ప్రతిరోజుకీ ఓ పేరు వుంటుంది, మళ్ళాఇవాళ మాఘ శుద్ధ ఏకాదశి.

అక్క: అదే ఆ సంగతే ఆ పంచాంగంవాళ్ళకి ఎట్లాతెలుస్తుందీ. అని అడుగుతున్నాను.

తల్లి : పేర్లువుంటాయిగా, ఒక రోజు తర్వాత ఒకటిరాస్తారు.

అక్క: ఆ రోజు తరవాత రోజు ఎట్లా వొస్తుంది -

తల్లి : అది తెలీదా, సూర్యుడు వెళ్ళిపోతే, చీకటి అవుతుందా, మళ్ళీ తెల్లారదూ, అప్పుడు కొత్తరోజు.

అక్క: సూర్యుడు ఎక్కడికి పోతాడు ?

తల్లి : ఆకాశంకిందికి పోతాడు.

అక్క: పోయి.

తల్లి : మళ్ళీ పొద్దున్న వొస్తాడు.

అక్క: రాత్రంతా పాపం ఎక్కడ కూచుంటాడూ అని.

తల్లి : ఎక్కడో వుంటాడు మనకేం తెలుస్తుంది ?

అక్క: మళ్ళీ ఎప్పుడు రావాలో ఎట్లా తెలుస్తుంది ఆ సూర్యుడికీ?

తల్లి : ఆరు గంటలకి వొస్తాడు.

అక్క: గడియారం వుంటుందా అక్కడ ?

తల్లి : గడియారం అక్కర్లేకుండానే తెలుస్తుంది.

అక్క: ఎట్లా తెలుస్తుందేం ?

తల్లి : నీకు తెలీటంలా తెల్లారిందని ?

అక్క: సూర్యుడు వొస్తాడు కనక. అమ్మా, సూర్యుడు రాకపోతే మనకి రోజులు ఎట్లా తెలుస్తాయి ?

తల్లి : తెలీవు.

అక్క: అప్పుడు అంతా ఒకరోజే కదూ ?

తల్లి : అవును.

అక్క: ఇప్పుడూ ఇదంతా ఒకరోజేమోనమ్మా ? సూర్యుడు రెండుసార్లు వొస్తే, రెండురోజు లవుతుంది, ఒకవేళ రాకపోతే, కొత్తరోజే రాదు. అప్పుడు మనం పక్కమీదనించి లేవం. మనకి ఆకలి వెయ్యదు.

తల్లి : హాయిగా మొగం కడుక్కోక్కం.

అక్క: బడికి పోనక్కర్లేదు. ఈ సూర్యుడి మూలానే ఇవన్నీ.

తమ్ముడు: సూర్యుడు చచ్చిపోడా ?

అక్క: సూర్యుణ్ణి ఎవరన్నా ఎత్తుకుపోతే! ఒకవేళ బాగా తిడితే సిగ్గేసి రాడేమో! ఆకాశంలోంచి పడిపోడా.

తల్లి : పడదు పట్టుకుని వుంటాడు.

తమ్ము: చేతులు నెప్పికాదూ ?

అక్క: చేతులు లేవురా. పిచ్చివాడా ! అమ్మా, సూర్యుడు ఎట్లా జరుగుతాడో! అటువేపు, కాళ్ళు వుంటాయా?

తల్లి : నాకు తెలీదే.

అక్క: సరేలే, అనిమాత్రం నీకు తెలిసి చెప్పావా ఏమిటి! పిల్లలేకదా. అని నీనోటికి వొచ్చినవి చెపుతావు. అన్నీ అబద్ధాలు, రారా తమ్ముడూ పోదాం.

# డబ్బు

కుర్ర : నాన్నా, మనము మోటారుకారు కొనకూడదూ !

నాన్న: కారు ఎంత ఖరీదో తెలుసా, పదివేల రూపాయలు ఈ రోజుల్లో.

కుర్ర : మనకి పదివేల రూపాయలు లేవా ?

నాన్న: లేవు, ఎక్కడివి ?

కుర్ర : కార్లు కొన్నవాళ్ళకి ఎక్కడివి ?

నాన్న: వాళ్ళు సంపాయించు కుంటారు.

కుర్ర : నువ్వెందుకు సంపాయించుకోవు ?

నాన్న: నాకు చేతకాదు.

కుర్రే : చేతకాకపోతే నేర్చుకోరాదూ ?

నాన్న : ఎట్లా ?

కుర్ర . మరి నన్ను నేర్చుకోమంటావే, చేతకానివన్నీ.

నాన్న : ఇది నేర్చుకుంటే వొచ్చేదికాదు.

కుర్ర : వాళ్ళకెట్లా వొచ్చింది ?

నాన్న: వాళ్ళకా తెలివి వుంది.

కుర్ర : నీ కెందుకు లేదు ?

నాన్న: దేవుడు ఇయ్యలేదు.

కుర్ర : ఎందుకు ఇయ్యలేదు ?

నాన్న: ఏమో !

కుర్ర : నాకు లెఖ్ఖల్లో దేవుడు తెలివి నియ్యలేదు. మార్కులు తక్కువ వొస్తే కొడతావేం ?

నాన్న: రావడానికి.

కుర్ర : నిన్నూ కొట్టేవాడుంటే నీకు డబ్బు చేసుకునే తెలివి వొస్తుందేమో ? నీకెంత జీతం ?

నాన్న: మూడువందల వరకై.

కుర్ర: ఎవరిస్తారు?

నాన్న: కంపెనీవాళ్ళు.

కుర్ర: అంతే ఎందుకిస్తారు? ఎక్కువ ఇయ్యరే?

నాన్న: నేను చేసేపనికి అంతే.

కుర్ర: ఎక్కువజీతం పనులు లేవా?

నాన్న: ఉన్నాయి.

కుర్ర: అవి నీ కెందుకు ఇయ్యరు? నీకు చేతకాదా?

నాన్న: చాతనౌను, కాని ఇయ్యరు.

కుర్రా: వాళ్ళకెందు కిచ్చారు?

నాన్న: వాళ్ళకి అనుభవం తెలివి ఎక్కువనుకుంటారు.

కుర్రా: ఎందుకనుకుంటారు?

నాన్న: నాకేం తెలుసు?

కుర్ర: అడగరాదూ వాళ్ళని!

నాన్న: అడిగినా లాభంలేదు.

కుర్ర: ఎవరు ఎప్పుడు మాట్లాడినా, డబ్బులేదు, డబ్బులేదు అంటారు, ఎక్కడనించి వొస్తుంది డబ్బు.

నాన్న: కష్టపడి పనిచేస్తే వొస్తుంది.

కుర్ర: నువ్వు కష్టపడి పనిచెయ్యవా?

నాన్న: చేస్తాను.

కుర్ర: మరి నీకు రాదేం? ఇంకా కష్టపడు వొస్తుంది.

నాన్న: ఇంక నాచాతకాదు. లాభమూలేదు.

కుర్ర: పెద్దవాళ్ళకి లాభంలేదుగావును. కాని చిన్నవాళ్ళని మాత్రం కొడతారు ఇంకా కష్టపడు, ఇంకా కష్టపడు, అని—

నాన్న: అవును చిన్నవాళ్ళకి వోపిక ఎక్కువ.

కుర్ర : ఎక్కణ్ణించి వొస్తుంది డబ్బు ?

నాన్న: ప్రభుత్వంవారు తయారు చేస్తారు.

కుర్ర : అందిరికీ సరిపడేట్టు, ఇంకా ఎక్కువ తయారు చెయ్యరా ?

నాన్న: అందరికీ చాలదు.

కుర్ర : ఎట్లా తయారు చేస్తారు ? డబ్బు అంటే రూపాయలూ అవేగా ।

నాన్న: నోట్లుకూడా, అచ్చుకొడతారు.

కుర్ర : ఇంకా కాయితాలు అచ్చుకొట్టరాదూ ?

నాన్న: అవసరమున్నవి కొడుతూనే వున్నారు.

కుర్ర : ఎవరికి అవసరం ?

నాన్న: ప్రభుత్వానికి.

కుర్ర : వాళ్ళకివాళ్ళు అచ్చుకొట్టుకుంటే మనకెట్లా వొస్తుంది ?

నాన్న: ప్రభుత్వానికి పనిచేసేవాళ్ళకీ ఇస్తారు, వాళ్ళు తక్కిన పనివాళ్ళకి ఇస్తారు.

కుర్ర : అందరికీ సరిపడేటంత ఇవ్వకూడదూ ? మనకి కారుకొనుక్కోడానికి పదివేలు అచ్చుకొట్టి ఇయ్యకూడదూ ? కొందరు వాళ్లనడిగి తెచ్చుకుని కార్లు కొనుక్కుంటారు, నీకు వాళ్లనడగడం చాతకాదు. నీ మొహం చూస్తే వాళ్ళివ్వరు.

నాన్న: అదేమిటి ?

కుర్ర: అమ్మ అందిగా నన్నుమొన్న నా మొహంచూస్తేనే ఎవరికీ ఏమీ ఇయ్యబుద్ధి పుట్టదని. ప్రభుత్వమంటే ఎవరు ?

నాన్న: కొందరు గొప్పవాళ్లు.

కుర్ర : వాళ్ళు గొప్పవాళ్ళెట్లా ఐనారు ?

నాన్న: ప్రజల విశ్వాసం వల్ల.

కుర్ర : నీమీదరాకూడదా, విశ్వాసం ? నువ్వూ తెచ్చుకో, అప్పుడు నువ్వు బోలెడు నోట్లు అచ్చుకొట్టించుకుని, నీకో కారు, నాకో కారు, అమ్మకో కారు, కొనవొచ్చు. అవును, అన్నినోట్లూ వాళ్ళే తీసుకుంటే,

ఈ బీదవాళ్ళకి ఎట్లా మిగులుతాయి? ప్రజలు వాళ్ళని నమ్మినందుకు వాళ్లకి కార్లూ, మేడలూ. వాళ్లని నమ్మి గొప్పవాళ్ళనిచేసిన బీదలకి తిండికూడా లేదు. అంతేనా ?

నాన్న: అంతకన్న ఏంచేస్తారు ?

కుర్ర : ఎందుకు పూరుకుంటారు తన్నరే.

నాన్న: తంతే ప్రభుత్వం వుండదు.

కుర్ర : వుండకపోతే—

నాన్న: ఈ పరిపాలన అంతా ఎవరు చేస్తారు?

కుర్ర : డబ్బు అంతా తామే తీసుకోకుండా పరిపాలించేవా రుండరా ?

నాన్న: వుండరు.

కుర్ర : నువ్వూ అంతేనా ?

నాన్న: ఇప్పుడేగా నన్ను నాలుగుకార్లు కొనమన్నావు ?

కుర్ర : అవును, మన స్వాములవార్ని ప్రభుత్వంచేస్తే? ఆయన డబ్బు అనవసరంగా—

నాన్న: ఆయన చెయ్యరు. ఆయన వొప్పుకున్నా ఆయనకి చాతకాదు.

కుర్ర : వాళ్ళ కెట్లా చాతనయింది ? ఈయనకి నేర్పితే రాదా ?

నాన్న: ప్రజలకి ఆయనమీద విశ్వాసం రాదు.

కుర్ర : డబ్బంతా దాచుకునే వాళ్లమీదతప్ప ప్రజలకి విశ్వాసం రాదా ? ఒక వేళ డబ్బు దాచుకోనివాళ్లకి ప్రభుత్వం పనిచెయ్యడం చాతకాదేమో! పోనీ వాళ్ళు తీసుకున్నంత తీసుకుని, ఇంకా నోట్లువేసి అందరికీ ఇవ్వరాదా ? అప్పుడు అందరికీ తిండీ కార్లూ వుంటాయిగా ?

నాన్న: అందరికీనా, అట్లా వొప్పుకోరు.

కుర్ర : ఎందుకు ?

నాన్న: అట్లా వొప్పుకుంటే, అందరికీ వుంటాయి. ఇంక గొప్పవారి అధి కృత ఏముంది ?

కుర్ర : అందుకని చాలామందిని బీదవాళ్ళుగా వుంచుతారా?

నాన్న: అంతే, నీ చొక్కాలూ, నీ బొమ్మలూ, పుస్తకాలూ, మన పాకలి కుర్రాడుతో పంచుకుంటావా?.... ఏం తెలుస్తోందా?

కుర్ర : ఊఁ....పంచుకోను. కాని అందరికీ మొదటనించీ సమానంగావుంటే, నాకేకావాలని, నాకేవుండాలనీ దాచుకోను.

నాన్న: వాళ్ళూ అంతే. వీలైతే దాచుకుంటారు, వీలు లేనప్పుడు పంచుకుంటారు విధిలేక.

కుర్ర : పోనీ, అన్నీ చవకగా చెయ్యకూడదూ? అన్నిటికీ ఖరీదులు హెచ్చించడం ఎందుకు? ఎవరాపని చేసేది-ప్రభుత్వమేనా?

నాన్న: ప్రభుత్వంకాదు. అదే ఎక్కుతుంది, ఆ వస్తువ తక్కువై, అవసరం ఎక్కువైనకొద్దీ....

కుర్ర : మొన్న మా క్లాసులో కామరాజులేడూ, రాజయ్య కొడుకు అతను పుస్తకం కొనుక్కోలేదు. టీచరు అడిగితే డబ్బులేదు, అంటే టీచరు కొట్టాడు వాణ్ణి. వాడెట్లా ఏడ్చాడని! రాత్రులు తిండితినరట వాళ్లు. పోనీ అట్లాంటివాళ్ళకన్నా డబ్బు ఇవ్వరు.

నాన్న: అట్లాంటివాళ్ళకి మన డబ్బు పంచిపెడితే నీ కెట్లా వుంటుంది? నీకు నెయ్యీ పెరుగూ వుండవనుకో —

కుర్ర : వాళ్ళకేం. వాళ్ళు ఎన్నినోట్లన్నా అచ్చు వెయ్య వచ్చుగా.

నాన్న: వూరికే, నీకు అర్థ మయ్యేందుకు అన్నాను. వాళ్లా వెయ్యడానికి వీల్లేదు. వాళ్ళకీ జీతాలే.

కుర్ర : ఎవరిస్తారు?

నాన్న: వాళ్లల్లోవాళ్ళే నోట్లు ఎక్కువ అచ్చువేస్తే, డబ్బు చవకై వస్తువులు ఇప్పటికన్న ప్రియమౌతాయి.

కుర్ర : అసలీడబ్బు అనేదిలేకపోతే బావుంటుంది.

నాన్న: ఎట్లా కొనుక్కుంటావు? దేంతో.

కుర్ర : కొనుక్కోడ మెందుకు ? ఎవరికి కావలసినవి వాళ్ళకి ఇస్తేసరి, ప్రభుత్వం ?

నాన్న: నీకు నెయ్యి అక్కర్లేదు. కాఫీ అక్కర్లేదు. మాంసంకూడా అక్కర్లేదంటే వొప్పుకుంటావా !

కుర్ర : ఆ. అందరికీ సుఖంగా వుండేట్టుఇస్తే నేను వొప్పుకుంటాను.

నాన్న: కావి అందరూ అలా వొప్పుకోరు.

కుర్ర : వొప్పుకోని వాళ్ళను తంతేసరి.

నాన్న: కమ్యూనిస్టువై పోతున్నావే ?

కుర్ర : అంటే....

నాన్న: నీకుమల్లే మాట్లాడేవాడన్నమాట.

కుర్ర : అదే మంచి సంగతి, ఇప్పుడు చాలా అన్యాయం.... నువ్వూ కమ్యూనిస్టువైపో.

నాన్న: వాళ్ళు దేవుడు లేడంటారు.

కుర్ర : అంటేఏం ? దేవుడికేమన్నా ఇబ్బందా ? ఏమీలేదు. అంతకావలసిన దేవుడు అందరికీ కావలసినవన్నీ ఏర్పాటు చెయ్యడేం ?

నాన్న: ఏమోరా, నాకవన్నీ తెలీవు. వెళ్ళు.

BCD

TPL A123B175

BC

## మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | TPLA123B175 |
| పుస్తకం పేరు | బిడ్డల శిక్షణ |
| తారీఖు | 29/10/24 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 181 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | CI, BCI |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Aswini |
| పేజీలు విడదీసినది | Jhasin |
| స్కాన్ చేసినది | Hema |
| పరీక్ష చేసినది | KASIMBI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |